# క్రాంతి

## లోపలి పేజీల్లో.....

లోక్‌సత్తా .... 6
ఇంటర్వ్యూ ....11
కొసావో గుణపాఠాలు ....20
ఆచరణ ....30
మహిళా రిజర్వేషన్ ....46
ఉమేష్‌చంద్ర హతం ....54

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 23 సంచిక : 5 సెప్టెంబర్-అక్టోబర్ 1999 వెల : ఐదు రూపాయలు

# చైనా విప్లవ విజయపు 50వ వార్షికోత్సవాన్ని జరపండి!!

యాభై ఏళ్ళ క్రితం, 1949 అక్టోబర్ 1న కామ్రేడ్ మావోసెటుంగ్ చైనా ప్రజా రిపబ్లిక్ ఆవిర్భావం గురించి ప్రకటించాడు. దీంతో మానవజాతిలో మూడింట ఒకవంతు దోపిడీ, పీడనల శృంఖలాలను తెంచుకుని విముక్తి పొంది స్వేచ్ఛా ప్రపంచంలోకి ప్రవేశించింది. కమ్యూనిస్టు ప్రణాళిక రచింప బడిన తర్వాత కేవలం వంద సంవత్సరాల లోపే భూమ్మీది అతిపెద్ద భాగంలో నూతన సమాజానికి సంబంధించిన మార్క్స్ స్వప్నం ఒక సజీవ వాస్తవికతగా మారింది. మానవ చరిత్రలో ఏ ఒక్క సిద్ధాంతమూ మార్క్సిజం అంత వేగంగా, సంపూర్ణంగా సమాజాన్ని మార్చింది లేదు. యూరప్‌లో జన్మించిన అది, నేల నలుచెరగులకూ వ్యాపించి చైనా వంటి అత్యంత వెనుకబడిన దేశాన్ని సైతం విముక్తి గావించింది.

ఆ సందర్భంలో మావో 'చైనా ప్రజలు లేచి నిలబడినార' ని ప్రకటించాడు. 2000 సం॥ల భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగా; ఒక శతాబ్ది వలస దోపిడీ, చోరీలకు వ్యతిరేకంగా; అమానుష పీడన, దోపిడీలకు వ్యతిరేకంగా 'లేచి నిలబడినారు' పాతదీ, లేక కొత్తదీ అయిన ఏ రకమైన నియంతృత్వానికీ ఇకేమాత్రం తలొగ్గని ఆత్మాభిమానం గల ప్రజలుగా 'లేచి నిలబడ్డారు'. మానవ సహనం, త్యాగం, అజేయమైన సాహస గుణాలకు సంబంధించి చైనా విప్లవం ఒక ఐతిహాసిక మహాకావ్యం. చరిత్రార్థమైన లాంగ్‌మార్చే ఒక మహత్తర మానవకృషికి సంబంధించిన సాహస కృత్యం. ఈ లాంగ్‌మార్చ్‌లోనే దారిద్ర్య పీడితులైన రైతాంగం, కార్మికుల సైన్యం ప్రతిదశలోనూ తనకంటే పదిరెట్ల ప్రమాణంతో కూడి సాయుధ బలసంపన్నమైన శత్రు బలగాలతో పోరాడుతూ పర్వతాల మీదుగా, పచ్చిగడ్డి మొలవని ఊసరక్షేత్రాల మీదుగా 12,500 కి.మీ. పెను దూరం పయనించింది. దారి పొడవునా విప్లవ బీజాలను నాటుతూ యేనాన్ పర్వతాలలో తన ప్రధాన కేంద్రాన్ని ఏర్పరుస్తూ పాత సమాజ గర్భంలో నూతన సమాజ పిండం పాదుకున్నది. ఇక్కడే ఈ యేనాన్ పర్వతాల్లోని ఒక గుహా ముఖంలో నిర్మించిన గదిలోనే మావో ఈనాటికీ విశ్వమంతటా విప్లవకారులకు మార్గదర్శిలా పనిచేస్తున్న పరమ ప్రామాణిక రచనలను రాసినాడు.



1938 మే నెలలో, యేనాన్‌లోని ఒక గుహలో నివాసం వుంటూ 'దీర్ఘకాలిక యుద్ధం' రాస్తున్న మావో

సామ్రాజ్య వాదానికి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా శక్తివంతమైన ప్రజాస్వామిక విప్లవోద్యమం మధ్యలో చైనా కమ్యూనిస్టు పార్టీ పుట్టింది. యుద్ధ ప్రభువులను కూలదోసి చైనా రిపబ్లిక్‌ను ఏర్పర్చడానికి పదే పదే ప్రయత్నాలు చేసిన సన్‌యట్‌సేన్‌తో జతగూడి, మే నాలుగు ఉద్యమం (1919)లో విద్యార్థులు రగిలించిన దేశవ్యాప్త తిరుగుబాటు భూస్వామ్య విధానాన్ని కూలదోసేందుకు కొమింటాంగ్-కమ్యూనిస్టు ఉమ్మడి పోరాటానికి సానుకూల అవకాశాలను సృష్టించింది. ఉత్తర దండయాత్ర వైఫల్యం తర్వాత



**1949 లో నాన్కింగ్‌ను ఆక్రమించిన తర్వాత ప్రజావిముక్తి సైన్యాలతో ముచ్చటిస్తున్న ప్రజలు**

కొమింటాంగ్ విప్లవానికి విద్రోహం చేయటంతో, పట్టణ సార్వత్రిక తిరుగుబాటు ఎత్తుగడలు అనేకసార్లు పరాజయాలు పొందడంతో మావో వెనుకబడిన దేశాల్లోని విప్లవ క్రమంలో నూతన సూక్ష్మ అవగాహనలను రూపొందించాల్సి వచ్చింది. చైనా విప్లవంలో రష్యన్ పంథాను యాంత్రికంగా చొప్పించటానికి ప్రయత్నించిన వెనుకటి విఫల అనుభవాల నుంచే ప్రపంచాన్ని క్రక్కదిలించివేసిన అతని 'నూతన ప్రజాస్వామికం', 'దీర్ఘకాలిక ప్రజాయుద్ధం' భావనలు పుట్టుకొచ్చాయి.

తన 'నూతన ప్రజాస్వామికం' భావనలో మావో రెండంచెల విప్లవం గురించిన లెనిన్ భావనకు మరింత శాస్త్రీయ రూపాన్ని అందించాడు. దీంట్లో మొట్టమొదటిసారిగా మావో, 1917కి ముందటి భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవాలన్నీ పాత బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో భాగమని; 1917 తర్వాత అవి ప్రపంచ సోషలిస్ట్ విప్లవంలో భాగమని వీటిలో మొదటి దశ విప్లవానికి జాతీయ బూర్జువాలు నాయకత్వం వహించగా, రెండో దశకు చెందిన విప్లవాన్ని కార్మికవర్గమే నడిపి తీరాలని ప్రకటించాడు. బూర్జువావర్గం ఇపుడు రెండు శిబిరాలుగా చీలిపోయిందని వాటిలో దళారీ బూర్జువా వర్గం విప్లవానికి లక్ష్యమని, ఇక జాతీయ బూర్జువావర్గం విప్లవానికి మిత్రపక్షం అని ప్రకటించాడు. రైతాంగం ప్రధానశక్తిగా, కార్మికవర్గం చోదకశక్తిగా వుంటూ నాలుగు వర్గాల ఐక్యతపై విప్లవాన్ని నిర్మించాలని మావో ప్రకటించాడు. ఈ సిద్ధాంతం 1917 అనంతర శకంలో రెండంచెల విప్లవం గురించిన మార్క్సిస్టు అవగాహనలో ఒక ముందంజకు తోడ్పడింది.

వెనుకబడిన దేశాల విప్లవాలన్నింటికీ నేటికీ వర్తించే ఒక నూతన మార్గాన్ని తన 'దీర్ఘకాలిక ప్రజాయుద్ధం' భావనలో మావో రూపొందించాడు. రైతాంగం పాత్రను నిరాకరించి రష్యా మార్గంలో పట్టణ సార్వత్రిక తిరుగుబాటు ద్వారా విప్లవాన్ని సృష్టించాలని చూసిన పలు వామపక్ష పంథాలకు వ్యతిరేకంగా పోరాడుతూ మావో, గ్రామీణ ప్రాంతంలో స్థావర ప్రాంతాలను ఏర్పర్చి, దశలవారీగా పట్టణాలను చుట్టు ముట్టడానికి సంబంధించిన రైతాంగ గెరిల్లా యుద్ధతంత్ర వ్యూహాన్ని అభివృద్ధి పరిచాడు.

ఈ యుద్ధంలో మొదట కొమింటాంగ్ ప్రగతి నిరోధకులకు వ్యతిరేకంగా, తర్వాత జపాన్ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా పోరాడుతూ మావో 'ప్రజాయుద్ధ' శాస్త్రాన్ని అభివృద్ధి చేశాడు. మొట్ట మొదటిసారిగా అంతర్జాతీయ కార్మిక వర్గానికి మిలిట్రీ సిద్ధాంతాన్ని అందించాడు. ప్రజాబాహుళ్యం కేవలం సాయుధులు అవటమేగాక రెగ్యులర్ సైన్యం, ప్రజా మిలీషియాలతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తూ సైనికంగా సమీకృతులు కావాలని మావో తన ప్రజాయుద్ధ భావనలో చెప్పాడు. ''ప్రజారాసులలో ప్రచార నిర్వహణకు, వారిని సమీకరించేందుకు, సాయుధం చేసేందుకు విప్లవ రాజ్యాధికారాన్ని స్థాపించటంలో వారికి తోడ్పడేందుకు ''ఎర్రసైన్యం పోరాడుతుందని మావో చెప్పాడు. ఈ పుస్తకంలో మావో గెరిల్లాయుద్ధ సూత్రాలను, చలనయుద్ధ తంత్రాన్ని, స్థావర యుద్ధతంత్రంతో దాని సంబంధాలను అభివృద్ధి చేశాడు. అంతే కాక యుద్ధాన్ని ఎలా నిర్వహించాలనే అంశంపై అత్యంత సూక్ష్మ అంశాలను అతడు చర్చించాడు. అవి ఈ నాటికీ దీక్షాపరుడైన ఏ విప్లవయోధుడి కైనా (సీరియస్ రివల్యూషనరీ) అవసరమైన సైనిక నియమావళిగా వుంటున్నాయి.

కొంతమంది మార్క్సిస్టులనబడిన వారు చిత్రించినట్లుగా విడుపులేని (నాన్‌స్టాప్) యుద్ధంలో పోరాడుతున్నపుడు మావో కేవలం ఒక రైతాంగ గెరిల్లా నాయకుడు మాత్రమే కాదు. అన్నిటికంటే ముఖ్యంగా అతడొక మార్గదర్శకుడైన కమ్యూనిస్టుగా వుండేవాడు. మార్క్సిస్ట్ తత్వశాస్త్రంలో అతని ప్రగాఢమైన అవగాహనలోనే కాదు, ఒక నూతన తరహా కార్మికవర్గ పార్టీని నిర్మించడంలో అతడి ప్రధాన తోడ్పాటులో కూడా ఇది రుజువయింది.

విరుద్ధాంశాల ఐక్యత, ఘర్షణలకు సంబంధించిన లెనిన్ సిద్ధాంతాన్ని తన 'వైరుధ్యాలు' వ్యాసంలో మావో మరింతగా అభివృద్ధి చేశాడు. 'ఆచరణ' అనే తన మరొక ప్రధాన రచనలో జ్ఞాన సిద్ధాంతంపై మార్క్సిస్ట్ అవగాహనను సైతం వృద్ధి చేశాడు. అంతకంటే ముఖ్యంగా మొత్తం విధానాన్ని, కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్ని, బూర్జువా దృక్పథం నుండి మనల్ని మనం నిరంతరం

నూతనంగా మలుచుకోవలసిన అవసరాన్ని మావో ప్రధానరంగం మీదికి తెచ్చాడు. 'ప్రజలకు సేవచేయండి', 'ప్రజాపంథా' అనే అతడి భావనలు; నిస్వార్ధపరత్వం, నిరాడంబరత్వం, నమ్రత, ఇతరుల పట్ల పట్టింపులకు సంబంధించిన కమ్యూనిస్ట్ స్ఫూర్తిని సాధించటం వంటివి అతడి రచనలన్నింటా పరుచుకుని వుంటాయి.

కార్మికవర్గ పార్టీ సమస్యకు సంబంధించి దాన్ని ఒక చలనం లేని ఏకశిలా సదృశమైన అంశంగా కాక ఏ ఇతర దృగంశం (ఫినామినా) మాదిరే, విరుద్ధాంశాల ఐక్యత, పోరాటంలోంచి (అంటే, కార్మికవర్గ దృక్పధానికి, బూర్జువావర్గ దృక్పధానికి మధ్య పోరాటం లోంచి) అభివృద్ధి చెందే చలనశీలమైన అంగంగా మావో చూశాడు. అవకాశవాద, రివిజనిస్టు ధోరణులకు, పంథాలకు వ్యతిరేకంగా రెండు పంథాలమధ్యపోరాటాన్ని నడపటం ద్వారా పార్టీ యొక్క కార్మికవర్గ విప్లవ స్వభావాన్ని పరిరక్షించడమెలా అనే అవగాహనను; విమర్శ-స్వీయవిమర్శ ద్వారా దిద్దుబాటు ఉద్యమాల ద్వారా పార్టీ సభ్యులను సైద్ధాంతికంగా నూతనంగా మలుచుకోవటం అనే సూత్రాన్ని మావో అభివృద్ధి చేశాడు. నేడు, ఇప్పటికే కొనసాగుతున్న లెనినిస్ట్ పార్టీ సూత్రాలకు పై సూత్రాలను జతచేయకుండా తాను ఎదగటం, వృద్ధి చెందటం ఏ కార్మికవర్గ పార్టీకైనా కష్టం.


తాచాయ్‌లో వరద నివారణ కోసం నదీప్రవాహాన్ని మరల్చుతున్న రైతాంగం, కార్మికులు

కాబట్టి, చైనా విప్లవ విజయక్రమంలో మార్క్సిజానికి సంబంధించిన మరింత అభివృద్ధి చెందిన శాస్త్రం మావో సేటుంగ్ ఆలోచనా విధానం లేక మావోయిజం రూపంలో రూపు దిద్దుకోవటాన్ని మనం చూడగలం. ప్రత్యేకించి ఇది రష్యన్ విప్లవానికిలాగే చైనా విప్లవానికి కూడా తనదైన చారిత్రక ప్రాధాన్యతను కల్పించింది. అయితే 1949లోని విజయంతో విప్లవం ముగిసి పోలేదు. కాగా అది నూతన రూపంలో కొనసాగింది. ఇక్కడే చైనా అనుభవానికి, దానికి మావో తోడ్పాటుకు విశ్లేషించి మునుపటి దశలోకంటే మరింత ప్రాధాన్యత వుంది. దేశ విముక్తికి కాస్త ముందుగా మావో ఇలా చెప్పాడు. ''దేశవ్యాప్త విజయాన్ని సాధించటం 10వేల మైళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో తొలిమెట్టు మాత్రమే''. అతడి మాటలు రుజువయినాయి.... సోషలిజాన్ని నిర్మించే క్రమంలో వర్గపోరాటం విప్లవానికి మునుపటి దశలోని వర్గపోరాటమంత తీవ్రంగానూ, నిర్దాక్షిణ్యంగానూ వుంటుందని రుజువయింది.

సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాల పాత పాలనను ధ్వంసం చేసి నూతన ప్రజాస్వామిక నిర్మాణం, ఆర్థిక వ్యవస్థలను దాని స్థానంలోకి తెస్తూనే యుద్ధంవల్ల ధ్వంసమయిన ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించటమే నూతన కమ్యూనిస్ట్ ప్రభుత్వం ముందున్న కర్తవ్యం. తదుపరి దశలో సోషలిజంకి క్రమక్రమానుగతంగా పరివర్తన జరగాలి. చివరగా కమ్యూనిజం వచ్చేంతవరకూ సోషలిస్ట్ వ్యవస్థ నిరంతరం సంఘటితం కావడం అవసరం. ఈ మొత్తం దశ పొడవునా కార్మికవర్గం నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించటమనే దీనర్థం. గ్రామీణ ప్రాంతంలో భూసంస్కరణల ద్వారా, ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యంలోని పరిశ్రమల పునరుద్ధరణ ద్వారా 1953 నాటికి ఆర్థిక వ్యవస్థ పట్టాలమీద నడవసాగింది. వ్యవసాయ సమిష్టీకరణ ద్వారా ప్రైవేట్ పరిశ్రమ వాణిజ్యాలను క్రమానుగతంగా ప్రభుత్వ ఆజమాయిషీలోకి, లేక పాక్షిక యాజమాన్యంలోకి తేవటం ద్వారా 1956 నాటికి ఉత్పత్తి సాధనాలు సోషలిస్ట్ యాజమాన్యంలోకి మారటం ప్రధానంగా పూర్తయింది. గ్రామీణ ప్రాంతంలో కమ్యూన్ల ఏర్పాటు ద్వారా, పరిశ్రమలను కార్మికుల ఆజమాయిషీలోకి తీసుకు రావటం ద్వారా బూర్జువావర్గ హక్కుని పరిమితం చేయటం ద్వారా 1958 ప్రారంభం నుండి సోషలిస్ట్ వ్యవస్థను సంఘటిత పర్చే క్రమం మొదలయింది.

ఈ మార్పుకి సంబంధించిన మొత్తం క్రమాన్ని చేపట్టేందుకుగానూ తీవ్రమైన వర్గ పోరాటం జరిగింది. ఒకటి: పాత సమాజ అవశేషాలకు వ్యతిరేకంగా; రెండు: అలుముకు పోయిన, చిన్న సరకుల ఉత్పత్తి ద్వారా పుట్టుకొచ్చిన నూతన బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా; మూడు: పాత భావాలకు, అలవాట్లకు, ఆచారాలకు, పాత సంస్కృతికి, అదే విధంగా నూతన ప్రజాస్వామిక దశలో ఆర్థిక వ్యవస్థ 'సుస్థిరత'కి పిలుపిచ్చి, సోషలిజంకి పరివర్తనను వ్యతిరేకించిన పార్టీలోని రివిజనిస్టు భావాలకు వ్యతిరేకంగా వర్గపోరాటం తీవ్రంగా జరిగింది. ఈ క్రమంలోనే కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించటానికి సంబంధించిన తన వివరణాత్మకమైన విశదీకరణ తోపాటు మార్క్సిస్ట్ సిద్ధాంతాభివృద్ధికి కూడా మావో ఎంతో దోహదం చేశాడు.

అలా చేస్తూ మావో 'సోవియట్ ఆర్థిక వ్యవస్థపై విమర్శ'ను రచించి, సోషలిజంలో అభివృద్ధి సూత్రాలను మరింత శాస్త్రీయంగా విడమర్చి చెప్పాడు. పునాదికి, వుపరితలానికి మధ్య గతితార్కిక సంబంధాన్ని, పునాదిని మార్చటంలో ఉపరితలానికున్న ముఖ్య పాత్రను మరింత దృఢంగా ముందుకు తెచ్చాడు. సోషలిస్ట్ నిర్మాణ దశ పొడవునా ప్రధాన వైరుధ్యం స్వభావాన్ని గురించి వివరించాడు. ''రెండు కాళ్ళపై నడక''కి సంబంధించిన, ''వ్యవసాయాన్ని పునాదిగానూ, పరిశ్రమను ప్రధానాంశంగానూ'' తీసుకోవడానికి సంబంధించిన ఆర్థిక సూత్రాన్ని రూపొందించాడు. సాంకేతిక జ్ఞానాన్ని రైతాంగం వద్దకు తీసుకుని పోయేందుకు, 'పెరడు'లో ఇనుము, ఉక్కులను కరగించడానికిగాను 'గొప్ప ముందంజ'ను ప్రవేశపెట్టాడు. వీటన్నింటికీ మించి చారిత్రాత్మకమైన కార్మికవర్గ మహా సాంస్కృతిక విప్లవంలో కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించడానికి సంబంధించిన పద్ధతిని అతడు ఆవిష్కరించాడు.

సోషలిస్ట్ నిర్మాణ సూత్రాలను రూపొందించడంలో కార్మికవర్గానికి బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యమే ఈ దశ పొడవునా ప్రధాన వైరుధ్యంగా వుంటుందని మావో చెప్పాడు; ''వర్గ పోరాటమే

కీలకమైన అనుసంధానాంశమని ప్రతిదీ దానిపైనే ఆధారపడి వుంటుందని'' చెప్పాడు. వెనుకబడిన ఉత్పత్తి శక్తులకు, పురోగమించిన ఉత్పత్తి సంబంధాలకు మధ్యనే ప్రధాన వైరుధ్య ముందన్న లీషావ్‌చీ ఉత్పత్తిశక్తుల సిద్ధాంతంపై మావో దాడి చేశాడు. కమ్యూనిస్టు పార్టీలోనే అధికారంలో వున్న పెట్టుబడిదారీ మార్గీయుల రూపంలోని నూతన బూర్జువావర్గ కేంద్రాలపై అతడు కేంద్రీకరించాడు. కార్మికవర్గానికి, రైతాంగానికి మధ్య, పట్టణాలకు, గ్రామీణ ప్రాంతాలకు మధ్య; మానసిక, శారీరక శ్రమలకు మధ్య వున్న మూడు ప్రముఖ వైరుధ్యాలను పరిష్కరించే క్రమాన్ని సూచించాడు. బూర్జువా హక్కుని పరిమితం చేయడానికి, 'విలువ సూత్రాన్ని' రద్దు చేయడానికి తదితర అంశాల పరిష్కారానికిగాను పద్ధతులను అతడు రూపొందించాడు.

ఉపరితలంలో ఈ విప్లవాన్ని తీసుకువచ్చేందుకుగానూ మావో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని రూపొందించాడు. సాంస్కృతిక విప్లవ లక్ష్యాలను వివరిస్తూ మావో ఇలా చెప్పాడు. పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా పోరాడటమనేది ప్రధాన కర్తవ్యమే కాని అది ఏ రకంగానూ లక్ష్యం కాదు. ప్రాపంచిక దృక్పథంకి సంబంధించిన సమస్యను పరిష్కరించడమే లక్ష్యం. అది రివిజనిజం పునాదులను కూకటివేళ్ళతో సహా పెకిలించి వేయడానికి సంబంధించిన సమస్య....ప్రజలు తమను తాము విద్యావంతం చేసుకొని తీరాలని తమను తామే విముక్తి చేసుకోవాలని ప్రాపంచిక దృష్టిని వారిపై రుద్దకూడదని కేంద్రకమిటీ పదే పదే చెబుతూ వచ్చింది. ఆంతరంగిక కారణాలే ప్రధానమైనప్పటికీ భావజాలాన్ని మార్చడానికి అంతరంగిక కారణాల ద్వారా బాహ్య కారణాలు పనిచేయాల్సిన అవసరముంది. అయితే ప్రాపంచిక దృక్పథాన్నే మార్చకపోయి వున్నట్లయితే సాంస్కృతిక విప్లవంలో ఏ విజయం వుండేది? ప్రాపంచిక దృష్టిని మార్చినట్లయితే నేటి 2000 మంది పెట్టుబడిదారీ మార్గీయులు రేపటికి 4000 మంది అవుతారు''.

మహత్తర సాంస్కృతిక విప్లవ కాలంలో మావో చేసిన వివిధ నినాదాలు ఈ లక్ష్యాన్నే ప్రతిబింబించాయి. ''విప్లవాన్ని గ్రహించండి-ఉత్పత్తిని పెంచండి'' అనే ఆయన పిలుపు విప్లవానికి ఉత్పత్తికి మధ్య, చైతన్యానికి పదార్థానికి మధ్య, ఉపరితలానికి ఆర్థిక పునాదికి మధ్య గల సంబంధాన్ని గతితార్కికంగా చర్చించింది. 'రాజకీయాలను ఆధిపత్యంలో వుంచండి', 'వర్గపోరాటాన్ని ఎన్నడూ మర్చి పోవద్దు' అనే నినాదం ద్వారా ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు ఉత్పత్తి సంబంధాల అభివృద్ధికి మధ్య తగినంత సమతుల్యతను కొనసాగించ డానికి మావో ప్రయత్నించాడు. మరింత లోతుల్లోకి పోయి బూర్జువా దృక్పథాన్ని దాని పునాదులనుంచే పెకిలించివేసే ప్రయత్నంలో భాగంగా ''స్వార్థంతో పోరాడండి, రివిజనిజాన్ని తిరస్కరించండి'' అని మావో ఇచ్చిన పిలుపు పోరాటం -విమర్శ-పరివర్తనల కోసం ప్రజా ఉద్యమంతో కూడుకుని వుండింది.

సోషలిస్టు నిర్మాణ సూత్రాలను అవగాహన చేసుకునేందుకుగాను మావో అందించిన మహత్తర కానుకలు ఇవే. ఈ రంగంలో మావో అందించిన ఈ సంపదలను అర్థం చేసుకోకుండా ఏ కమ్యూనిస్టు కూడా భవిష్యత్తులో సోషలిస్ట్ నిర్మాణం గురించి పథకాలు వేయలేడు.

అంతిమంగా, చైనాలోనే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడటానికి మావోనే నాయకత్వం వహించాడు. మహనీయుడు లెనిన్ గడ్డపై నుండి కృశ్చేవ్ తన రివిజనిస్టు చెత్తకు నారు పోసినపుడు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని కల్లోలంలో ముంచెత్తినపుడు, గొప్ప సైద్ధాంతిక సమరానికి మావో, చైనా కమ్యూనిస్టు పార్టీయే నాయకత్వం వహించారు. అది రెండో ఇంటర్నేషనల్‌కి వ్యతిరేకంగా లెనిన్ చేసిన మహత్తర పోరాట సంప్రదాయంలో జరిగిన బిగి సడలని పోరాటం. ఈ 'గొప్ప చర్చ' ద్వారా విద్రోహుల నుంచి మార్క్సిజం-లెనినిజాన్ని మావో సమర్థించటమేకాదు, 'ఆధునిక రివిజనిజం'తో పరిపూర్ణంగా తెగతెంపులు చేసుకోవడానికి, నిజమైన మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీలను ఏర్పర్చడానికి ప్రపంచవ్యాప్తంగా వున్న అంతర్జాతీయ కమ్యూనిస్టు శక్తులను అతడు కూడగట్టాడు. మార్క్సిస్టు లక్ష్యం కోసం మావో అందించిన ఈ పరమ ప్రామాణిక సంపద, రకరకాల రివిజనిస్టుల నెదుర్కొనేందుకుగాను సాటిలేని ఆయుధమైంది.

డెంగ్ రివిజనిస్టులు చైనా విప్లవాన్ని తిరగదోడినప్పటికీ, ప్రధానంగా తన ప్రయాణక్రమంలో అది మార్క్సిజం-లెనినిజాన్ని ఒక నూతన ఉన్నతదశకు అంటే-మావోసేటుంగ్ ఆలోచనా విధానానికి లేక మావోయిజం దశకి అభివృద్ధి చేసిన కారణంగా చైనా విప్లవానికి చారిత్రక ప్రాధాన్యత వుంది. తత్వశాస్త్రంలో, రాజకీయ అర్థశాస్త్రంలో, శాస్త్రీయ సోషలిజంలో, కార్మికవర్గ ఎత్తుగడలలో, పార్టీ నిర్మాణంలో, సైనిక శాస్త్రంలో, చివరకు నూతన మానవుడిని సృష్టించేందుకై జరిగిన భారీ ప్రయత్నంలో ఇలా ప్రతి వాస్తవ రంగంలోనూ మావో మార్క్సిస్ట్ శాస్త్రాన్ని అభివృద్ధి చేశాడు.

ఈరోజు భారతదేశంలో మావోయిస్టులమని చెప్పుకుంటున్న వారు చాలామందే వున్నారు. కాని తమ దైనందిన ఆచరణలో ఈ సూత్రాలను వారు అన్వయించటం లేదు. మావో నామజపం చేయటం విప్లవానికి సర్వరోగ నివారిణి కాదు. దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు దానిని ఆచరణలో అన్వయించటమే అసలు విషయం. తమ నిత్య ఆచరణలో, ప్రజాయుద్ధాన్ని ప్రారంభించేందుకుగాను అవసరమైన కనీస కర్తవ్యాలను సైతం తోసిపుచ్చేవారున్నారు. పార్లమెంటరీవాద బురదగుంటను కావలించుకున్న ఇతరులూ వున్నారు. సాయుధ పోరాటాన్ని నిరవధికంగా వాయిదా వేసినవారున్నారు. మావోయిస్టు సూక్తుల తరహా సూత్రీకరణలను పిడివాద రొడ్డకొట్టుడు పద్ధతిలో వల్లె వేయటం ద్వారా ''ఎర్రజెండాను వ్యతిరేకించేందుకు ఎర్రజెండానే పట్టుకుని వూపుతున్నవారూ'' వున్నారు. అయితే బూటకపు మార్క్సిజం నుండి నిజమైన మార్క్సిజాన్ని ఎలా వేరుచేయాలో ప్రత్యేకించి ''సాంస్కృతిక విప్లవం'' ద్వారా మావో మనకు బోధించి వున్నాడు.

మహత్తర చైనా విప్లవ చారిత్రక విజయానికి సంబంధించిన ఈ 50వ వార్షికోత్సవం సందర్భంగా ఈ విప్లవం సాధించిన ఉజ్వల విజయాలను ప్రచారం చేద్దాం. దేశవ్యాప్తంగా మావోయిజంని ప్రచారం చేయడానికి విస్తృత కేంపెయిన్‌ని చేపట్టి, మన దైనందిన ఆచరణలో దాన్ని నిర్దిష్టంగా అన్వయించటమెలాగో నేర్చుకుందాం. ❑

**పత్రికా ప్రకటన**

# తెలంగాణా ప్రజలు కోరుకుంటున్నది వర్గదోపిడీ, నియంతృత్వాల నుండి విముక్తినే!

"నిషేధించి ఇన్నాళ్లయిన తరువాత కూడా ఉత్తర తెలంగాణాలో పీపుల్స్‌వార్ ఉనికి కనిపించని వినిపించని ప్రదేశంగానీ సందర్భంగానీ వుండదు. పీపుల్స్‌వార్‌కి సంబంధించినంతవరకు ఆ నిషేధం ఎంత నిరర్థకమో అక్కడ ఏ గ్రామంలోనైనా రెండు రోజులు గడిపితే అర్థమవుతుంది", "చట్టబద్ధమైన రాజకీయ స్రవంతుల కంటే చట్టం నిషేధించిన స్రవంతులకే ప్రజలలో ప్రభావం ఎక్కువ" అంటూ స్పష్టంగానే ఒక వాస్తవాన్ని చెబుతున్నాడు బాలగోపాల్ [ఆగస్టు 8-14 1999 ప్రజాతంత్ర వారపత్రిక 'నిగాహ్' కాలమ్‌లో]. నిషేధిత పీపుల్స్‌వార్ పార్టీకి దాని రాజకీయాలకి ప్రజల్లో అంత గాఢమైన ప్రభావం ఎందుకుంటోంది? అవి నిజంగా ప్రజల ఆకాంక్షలకి ప్రాతినిధ్యం వహించే రాజకీయాలు గనుకనే! ప్రజల్లో ఈ రాజకీయాల స్థానం దృఢమైనది, నిలకడైనది, అభివృద్ధి చెందే స్వభావం కలది. కనుకనే నిషేధాలు నిర్బంధాలు ఈ ప్రజారాజకీయాల్ని నిలవరించలేవు. కాదనలేని ఈ నిజాన్ని బాలగోపాల్ సైతం ఔనని అంగీకరిస్తాడుగాని, తానంగీకరించే నిజాన్ని సైతం అతడు చూసే తీరు, చెప్పే తీరులో నిజాయితీ లేమి కనబడుతోంది. పీపుల్స్‌వార్ పైన నిషేధం ప్రకటిత ఫలితాన్ని[అంటే వార్ కార్యకలాపాలు కట్టడికావడం]ఇవ్వలేదంటాడు. ఇంకోపక్క ఈ నిషేధం పేరుతో వివిధ సమస్యలపై ఉద్యమించే ప్రజలు, ప్రజాసంఘాలు, విలేఖర్లు పోలీసుల వేధింపులకి గురవుతున్నారని అంటాడు. ప్రజలతో ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలతో పీపుల్స్‌వార్ రాజకీయాలకి సన్నిహిత సంబంధం వుంటున్న కారణంగానే ప్రజల ప్రజస్వామిక హక్కులపై ఆందోళనలపై ప్రభుత్వం నిఘా నిర్బంధాల్ని పెంచుతోంది. పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని అమలు చేయడంలో భాగమే ఇదని బాలగోపాల్‌కి తెలీందేమీ కాదు, కాని దీన్ని ఒప్పుకోవడానికి ఇబ్బంది పడుతూ, దీన్నుంచి తప్పుకోడానికే ప్రజాసంఘాల ప్రజా ఉద్యమాలపైనే గాక ఇతర రాజకీయ పార్టీలపై సైతం ఈ నిషేధపు వేటు పడుతున్నట్టుగా చెబుతున్నాడు. పదవీ అధికారాల్లో వుండేవారు రాజకీయ ప్రత్యర్థులపైన దాడులు చేయించడం సాధారణ విషయమే! అసాధారణంగా వీటిని నిషేధాలకి ఆపాదించాల్సిన అవసరం లేదు.

పాలకుల మూర్ఖత్వం పర్యవసానంగానే పీపుల్స్‌వార్‌పై నిషేధం విధించబడినట్టు, ఈ మూర్ఖచర్యని ఆసరాగా చేసుకుని పాలకుల ఇష్టానికి భిన్నంగా పోలీసులు ఈ నిషేధాన్ని తమ స్వార్థ ప్రయోజనాలకోసం, తమ బలాన్ని పెంచుకోవడం కోసం దుర్వినియోగ పరుస్తుండటమే అసలు సమస్య అన్నట్టు బాలగోపాల్ నిషేధ, నిర్బంధాల తీవ్రతని వాటి వెనుకుండే దోపిడీ పాలకవర్గాల ఫాసిస్టు అణచివేత స్వభావాన్ని, వర్గప్రయోజనాలని మరుగుపరచే లేక కనీసం తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తున్నాడు. ప్రజా విప్లవోద్యమం పదునెక్కుతూ, పాలకుల బూటకపు ప్రజాస్వామ్యం ముసుగులు చిరిగిపోయి వారి ఫాసిస్టు వికృత రూపాలు బయటపడిపోతూండటంతో ప్రజల్లో పెరిగే ఆగ్రహావేశాల్ని అదుపు చేయడానికి, తమ వర్గ ప్రయోజనాలని రక్షించుకోవడానికి పాలకవర్గాలు తమ సాయుధ బలగాలకి సర్వాధికారాలు కట్టబెట్టేసి ప్రజలమీదికి ఉసిగొల్పుతాయి. ఇది చారిత్రక వాస్తవం. ఇప్పుడిక్కడ జరుగుతున్నది అదే! నిన్నటివరకు నక్సలైట్ల సమస్య కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని అది సాంఘిక ఆర్థిక రాజకీయ సమస్య కూడా అని రాగాలాపన చేస్తూ వచ్చిన పాలకపార్టీలు, ప్రభుత్వాలు ఈరోజు ఒక్కసారిగా పల్లవి మార్చేసి అది కేవలం శాంతి భద్రతల సమస్యే అని తెగేసి చెబుతుండటం యాదృచ్ఛికం కాదు. అంచేత ఈ నిషేధం, నిర్బంధాలని బాలగోపాల్ చెబుతున్నంతటి తేలికగా పీపుల్స్‌వార్ పార్టీ, పీడిత ప్రజలు చూడటం లేదు! విస్తృతమవుతున్న విప్లవోద్యమంపై విరుచుకుపడుతున్న ఫాసిస్టు అణచివేత వికృత వ్యక్తీకరణలుగానే వాటిని అర్థం చేసుకుంటున్నారు. వాటిని ఆ రకంగానే ఎదుర్కొంటున్నారు.

వాస్తవ పరిస్థితుల్ని ఇలా అర్థం చేసుకోడానికి చూడ్డానికి ఇష్టపడని బాలగోపాల్, ఏడాదికేడాది రొటీన్‌గా నిషేధం కొనసాగిపోతున్నా ఎలాంటి "సంచలనం" కానరావటంలేదని, ప్రజల సంగతలా వుంచి పీపుల్స్‌వార్ పార్టీయే దీన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని అంటున్నాడు. కొంతమంది పెటీబూర్జువాలను ఉత్సాహపరచగల సంచలనాలైతే కనబడకపోవచ్చు గాని, ప్రజలు, పీపుల్స్‌వార్ పార్టీ నిషేధాన్ని పట్టించుకోలేదనడం సరికాదు. తెలంగాణాలో నిషేధం నీరుకారిపోతున్న తీరే ఇందుకు నిదర్శనం! దీనర్థం, చట్టపర నిషేధం అలా కొనసాగిపోయినా ఫరవాలేదని చెప్పడం ఎంతమాత్రం కాదు. ఈ నిషేధం అంటూ లేకపోతే ఇంకా ఎన్నోరెట్లుగా ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచే కార్యక్రమాలు, మరింత పెద్ద ఎత్తున ప్రజా సమీకరణలు సాధ్యమై వుండేవి, మరింత విస్తృత స్థాయిలో ప్రజావుద్యమాలు నిర్వహించబడేవి. నిషేధం వీటికి పెద్ద ఆటంకమే, నిషేధం రద్దు ఉద్యమ పురోగమనానికి అవసరమే! కాని, నిషేధంతో నీరసపడిపోయి, చేయగలిగేది లేదని చేతులు ముడుచుకు కూర్చోవడం తగదు. తెలంగాణ ప్రజల విప్లవ పోరాట సాంప్రదాయాల్ని ఆదర్శంగా చేసుకొని తెగువతో ముందుకుపోతూ నిషేధాన్ని మరింత నిర్వీర్యపరచడమే కర్తవ్యంగా స్వీకరించాలి. గతంలో ప్రజాస్వామ్య హక్కులకి, చైతన్యానికి ఎంతో దూరంగా వుంటూండిన ఉత్తర తెలంగాణా ప్రజలు నేడు విప్లవ చైతన్యంతో నిషేధాన్ని ధిక్కరించే క్రమంలోనే మెరుగైన ప్రజాస్వామ్యాన్ని సాధించుకుంటున్నారు. ప్రభుత్వ నిషేధానికి ఇదే సరైన సమాధానం! ఇది వర్గ విప్లవ పురోగమన క్రమం!

నిషేధాలతో తమ రాజకీయ స్వేచ్ఛను హరించేసినందుకు ప్రతీకారంగా ఇతర రాజకీయ పార్టీల స్వేచ్ఛను హరించేసే హక్కు తమకుందని చెబుతూ పీపుల్స్‌వార్ ఎన్నికల బహిష్కరణ నినాదంతో పాలక రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలపై భౌతికదాడులకి తలపడుతూ వారి రాజకీయ స్వేచ్ఛని 'నిషేధిస్తోందని' బాలగోపాల్ ఆరోపిస్తున్నాడు. పీపుల్స్‌వార్ ఎన్నికల బహిష్కరణ పిలుపునందుకొని ప్రజలు పాలకపార్టీల ప్రచార కార్యక్రమాలని అడ్డుకుంటూ రావడమనేది వార్ పార్టీపై ప్రభుత్వం విధించిన నిషేధంతో ప్రారంభమైంది కాదు. అంతకు చాలాకాలం ముందునుంచి సాగుతూ వచ్చినదే! అలాగే దోపిడివర్గ పార్టీల రాజకీయాలని ప్రజలు అడ్డుకోవడాన్ని, తిప్పికొట్టడాన్ని పాలకవర్గ పార్టీలపైన పీపుల్స్‌వార్ చేస్తున్న భౌతికదాడులుగా చిత్రిస్తున్నాడు. ఆ పార్టీల రాజకీయ స్వేచ్ఛను హరిస్తున్నట్లుగా నమ్మింపజూస్తున్నాడు. దోపిడీ వర్గాలకు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా తెలంగాణ

*(తరువాయి 10వ పేజీలో...)*

**లోక్‌సత్తా**

# ప్రజలకి దూరం, భారం అయిపోయి — జబ్బుపడి పోయిన ఎన్నికల వ్యవస్థని డా॥ జయప్రకాశ్ నారాయణ్ చిట్కా వైద్యాలు నయం చేయలేవు!

'లోక్‌సత్తా' స్థాపకుడు, మాజీ ఐ.ఏ.ఎస్. అధికారి అయిన డా॥ జయప్రకాశ్ నారాయణ్ గడచిన మూడు నాలుగు మాసాలనుంచి ఎన్నికల సంస్కరణలపై ఒక ప్రచార ఉద్యమాన్నే కొనసాగిస్తున్నాడు. గడచిన లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 'ఎన్నికలపై నిఘా' అనే కార్యక్రమాన్ని కూడా జయప్రకాశ్ నాయకత్వంలోని లోక్‌సత్తా చేపట్టింది. లోక్‌సత్తా పేరుమీద పత్రికల్లో, టీ.వీ.లలో అనేక ప్రకటనలు ఇంటర్వ్యూలు ఇస్తుండటమేగాక వివిధ పత్రికల్లో అనేక వ్యాసాలు సైతం జయప్రకాష్ రాస్తున్నాడు. పత్రికలు, టీ.వీ.లు జయప్రకాశ్ లోకసత్తా ప్రచారానికి చెప్పుకోదగ్గ ప్రాధాన్యతనే ఇస్తున్నాయి. ముఖ్యంగా 'ఈనాడు', 'ఈటీవీ' జయప్రకాశ్‌కి ఎక్కువ ప్రచార అవకాశాలు ఇస్తున్నాయి.

## జయప్రకాశ్ ఎన్నికల సంస్కరణోద్యమ నేపథ్యం

దేశంలోకాని, రాష్ట్రంలోకాని ఏ కారణం లేకుండా, ఏ ప్రయోజనం ఆశించకుండా ఏ సంస్థా ఏ ఉద్యమం ప్రారంభం కావు. సమాజంలో తలెత్తే పరిస్థితుల్లోంచి, ప్రజలు ఎదుర్కొనే సమస్యల్లోంచి వివిధ ప్రజా ఉద్యమాలు తలెత్తుతూ వుంటాయి. తలెత్తే ఉద్యమాలన్నీ ప్రజా ఉద్యమాలే, అంటే ప్రజలకి అవసరం, ప్రయోజనకరం అయిన ఉద్యమాలే అని భావించలేము. ప్రజా ఉద్యమాలని అడ్డుకునే లేక పక్కతోవలు పట్టించే ఉద్యమాలు సైతం వుంటుంటాయి. ఇవి కూడా ప్రజలు, ప్రజల అభిప్రాయాలు, ప్రజల ప్రయోజనాలు పేరుమీదనే కొనసాగుతుంటాయి. ప్రజలు కోరుకునే, ప్రజలకు అవసరమైన ప్రజా వుద్యమాలు చురుగ్గాను, బలంగాను కొనసాగుతున్న పరిస్థితుల్లోనే- కుల, మత వైషమ్యాలతో ప్రజల్ని చీల్చే అభివృద్ధి నిరోధక ప్రతీఘాతుక వుద్యమాలుగాని, 'దారి మళ్లింపు' స్వభావంతో కూడిన రకరకాల సంస్కరణోద్యమాలు గాని తలెత్తుతూ వుంటాయి.

ఎన్నెన్నో ఎన్నికలు జరుగుతున్నాయి, ఏకపార్టీ ప్రభుత్వాలు, సంకీర్ణ ప్రభుత్వాలు, స్థిర ప్రభుత్వాలు, అస్థిర ప్రభుత్వాలు-ఇలా ఎన్నెన్నో వింతలు, విడ్డూరాలు, మార్పులు జరుగుతూనే వున్నాయి. మారనిదల్లా ప్రజల దారుణ పరిస్థితే! ఎన్ని ఎన్నికలు జరిగినా, రకరకాల పార్టీలతో ఎన్నెన్ని ప్రభుత్వాలు మారినా; ప్రజల మౌలిక సమస్యలైన కూడు, గుడ్డ, గూడు, విద్య, వైద్యం, ఉపాధిలాంటివి మెరుగవలేదు, సరికదా రోజురోజుకీ అవి జనసామాన్యానికి దూరం అయి పోతున్నాయి, ఖరీదైపోతున్నాయి. ప్రజల మౌలిక సమస్యల సంగతలా వుంచి సాధారణ సమస్యలకి కూడా ఎన్నికలు పరిష్కారాలు చూపలేక పోతున్నాయి. అందుకే ఈ ఎన్నికలతోగాని ఈ ఎన్నికల ద్వారా జరిగే ప్రభుత్వాల మార్పులతోగాని, పనిలేకుండా ప్రజలు అనునిత్యం అనేక సమస్యలపై పోరాడాల్సి వస్తోంది. ప్రజల బ్రతుకుల్లో ఒక భాగమైపోయిన ఈ పోరాటాలు, ఈ ఎన్నికలని వెక్కిరిస్తున్నాయనే చెప్పాలి! అనునిత్యం సాగే అనేకనేక ప్రజాపోరాటాలు ఈ ఎన్నికల వ్యవస్థ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనాలు! కనుకనే ఈ ఎన్నికల ద్వారా తమకి ఒరిగేదేమీ లేదనే సాధారణ అభిప్రాయం ఈ రోజు ఎక్కువమంది ప్రజల్లో ఏర్పడి పోయింది. దేశం మొత్తం ప్రజానీకంలో ఏర్పడిన సాధారణ అభిప్రాయమే ఇది. కాగా మన రాష్ట్ర ప్రజల్లో ఈ భావం మరింత బలంగా వుందనే చెప్పాలి.

ప్రజల అవసరాలు, అభిప్రాయాలు, ప్రయోజనాలతో ఎలాంటి ప్రమేయం లేని ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా వుండటం సాధ్యం కాదు. ఈ ఎన్నికల్లో ప్రజలకుందని చెపుతున్న 'ఓటుహక్కు' అనే దానికి ప్రజాస్వామ్య స్వభావమే లేదు, ఉండగల అవకాశం లేదు. ఈ ఎన్నికలలో ప్రజల పాత్ర, భాగస్వామ్యం అనేది నామమాత్రమే! జరిగేదంతా ప్రజల పేరుపై తంతే! లేని ప్రజాస్వామ్యాన్ని ఉన్నట్లు భ్రమింపజేయాల్సిన ఇబ్బందికరమైన అవసరం పాలకవర్గాలకి, వారి పార్టీలకి, ప్రభుత్వాలకి వుంది. ఈ ఇబ్బందిని అధిగమించడానికే ఈ ఎన్నికల తంతు. కనుకనే-ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగడంతో పనిలేకుండా 'ఎలాగోలా ఎన్నికలు జరగడమే ప్రజాస్వామ్యం' అని నమ్మించ ప్రయత్నిస్తున్నారు. అయితే ఎలాగోలాగ ఈ ఎన్నికల తంతు నిర్వహించడం కూడా పాలకవర్గాలకి తలకి మించిన పనైపోతోంది. గడచిన ఎన్నికల్ని నిర్వహించడానికి గతంలో ఎప్పుడూ జరగని విధంగా ఎన్నికల కమీషన్‌కి పూర్తి నెలదినాలు అవసరమయ్యాయి. ఏమంటే సాయుధ బలగాల సరఫరా సాధ్యం కాకపోవడం. అంటే తగినన్ని సాయుధ బలగాల పహారా లేకుండా ఎన్నికలు జరగగల పరిస్థితి లేదు. ప్రజాస్వామ్యానికి పెద్ద నిదర్శనంగా చెప్పుకుంటున్న ఈ ఎన్నికల పట్ల ప్రజలలో అసంతృప్తి నిరసన అనేవి పెరిగిపోతుండటం పాలకవర్గాలని వారి పార్టీలని ప్రభుత్వాలని బాగా కలవరపెడుతున్న విషయం.

50 సంవత్సరాల 'స్వతంత్ర' పాలనలో 13సార్లు పార్లమెంటు ఎన్నికలని, 10సార్లు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలని చూసిన రాష్ట్ర ప్రజలు ఈ రాజకీయ పార్టీలన్నీ ఒక తానులో గుడ్డలేనని, తోడు దొంగలేననే బలమైన అభిప్రాయానికి వచ్చేసారు. అట్టడుగు ప్రజల్లోనే గాక మధ్య తరగతి ప్రజల్లో సైతం చాలామందిలో ఇదే అభిప్రాయం ఏర్పడి పోయింది. దీనికితోడు రాష్ట్రంలో మన పార్టీ నాయకత్వాన సాగుతున్న విప్లవోద్యమ ప్రభావం కూడా ప్రజలపై బలమైన ముద్రనే వేసుకుంటోంది. ఈ ఎన్నికల బూటకత్వాన్ని బహిర్గత పరుస్తూ వీటిని బహిష్కరిస్తూ మనం నిర్వహిస్తున్న కష్టభరితమైన వుద్యమాల ప్రభావం సైతం రాష్ట్ర ప్రజలపై బాగానే వుంటుంది. వర్గ విప్లవోద్యమం మరింత బలంగా వుంటున్న తెలంగాణాలో ఈ ప్రభావం మరింత ఎక్కువ. అక్కడి ప్రజలు ఈ ఎన్నికలని అపహాస్యం చేస్తూ, బహిష్కరిస్తూ పెద్ద ఎత్తునే ఉద్యమిస్తున్నారు. ఎన్నికలపట్ల ప్రజలలో సహజంగాను సాధారణంగాను ఏర్పడివున్న నిరసన

తిరస్కారాలకి మనం అందిస్తున్న తిరుగుబాటు చైతన్యం తెలంగాణాలో నిర్దిష్ట రూపాన్ని తీసుకొని ప్రజలు ఎన్నికలని బహిష్కరించడమనేది రాష్ట్రంలోని పాలకవర్గాలకి, వారి రాజకీయ పార్టీలకి కంపరం పుట్టిస్తోంది. తెలంగాణా నమూనా రేపు రాష్ట్ర వ్యాపిత, దేశ వ్యాపిత ధోరణిగా వ్యాపించగలదనే భయం వారిని పట్టుకుంది. ఇది కేవలం మన ఉద్యమకృషికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. వాస్తవ భౌతిక పరిస్థితి ఇందుకనుకూలంగా వుంది. మన ఉద్యమం బలంగా లేని చోట్ల అది స్పష్టంగా బలంగా వ్యక్తం కావడం లేదు. మనం బలంగా వున్నచోట్ల అదొక ఉద్యమరూపంగానే వ్యక్తమవుతోంది. కనుకనే పాలకవర్గ పార్టీలకి మన 'ఎన్నికల బహిష్కరణ' నినాదంపై అంత కలవరపాటు. ఉద్యమ తెలంగాణా ప్రాంతంలో ఎన్నికల నిర్వహణ పూర్తిగా పోలీసులకే అప్పజెప్పేయడం, పోలీసులు తుపాకులు చూపెట్టి, ప్రజల్ని భయపెట్టి పోలింగు బూతులకు నడిపించడం, ఓటు వెయ్యకపోతే కరెంటు, బస్సు, నీరు లాంటి వాటిని ఆపేస్తామనడం, ఉద్యమం నుంచి వెనుకడుగేసిన మాజీలని మానవ కవచాలుగా వాడుకుంటూ మరీ ఎన్నికలు నిర్వహించి ప్రజలు మన బహిష్కరణ నినాదాన్ని వ్యతిరేకించారని చాటుకోవడం. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలోకంటే తెలంగాణాలో ఎన్నికల నిర్వహణకి ప్రభుత్వం, పోలీసులు ఇంతటి ప్రాధాన్యత, పట్టుదలలను ఎందుకు ప్రదర్శిస్తున్నారు? విప్లవాభిమానులుగా విప్లవోద్యమంలో వుంటున్నప్పటికీ ప్రజలు ఎన్నికలమీద ఆశ, ఆశక్తుల్ని కోల్పోలేదు అని నమ్మించడానికి, చాటుకోడానికి! తెలంగాణాలో ప్రజలు కేవలం ఓటు వేస్తే చాలదు, వారు ఓటు వేసినట్టుగా పోలీసుల ఎదుట రుజువుపరచుకోవలసి వుంటుంది, అదీ అక్కడ 'ఎన్నికల ప్రజాస్వామ్యం' అమలవుతున్న తీరు.

ప్రజాస్వామ్య ప్రక్రియగా చెలామణి అవుతున్న ఈ ఎన్నికల తంతుని ఇంత నిర్బంధపూరితంగా, నిస్సిగ్గుగా, పోలీసు పహారా కింద తుపాకి మడమల నీడలో జరపడం, పాలకవర్గాలకి సిగ్గుచేటైన విషయమే! పీపుల్స్‌వార్‌ని అణచేయడం పేరుతో ఇప్పటికి తెలంగాణాలో ఈ తీరు అమలవుతున్నది. రేపిక రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకి, దేశం వివిధ ప్రాంతాలకి ఇది ప్రాకితే ఏం చేయాలి? ఇవ్వాల్టి తెలంగాణాలో లాగానే రేపిక మిగతాచోట్ల కూడా ప్రజల తలలకి తుపాకి గురిపెట్టి పోలింగ్‌బూత్‌లకి నడిపించడం సాధ్యమా? అసాధ్యమా? అనేది కాదు ప్రశ్న. ఎన్నికల ప్రజాస్వామ్యానికుందని భావిస్తున్న నామమాత్రపు ముసుగు కూడా చిరిగిపోతుంది, అదే అసలు సమస్య!

కనుక కేవల నిర్బంధ ప్రయోగంతోనేగాక ఎన్నికలపట్ల ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తి, అసహనాలని తగ్గిస్తూ ఎన్నికల వ్యవస్థపట్ల కొత్తగా కొంత విశ్వాసాన్ని ఆసక్తిని కలిగించాల్సిన అవసరం పాలకవర్గాలకి పాలకవర్గ రాజకీయ పార్టీలకి ఏర్పడుతూంది. ఈ అవసరం మరింత మరింత ఎక్కువవుతోంది. అయితే ప్రజాస్వామ్య పరిరక్షణకి ఎన్నికలే శరణ్యం అంటూ, ప్రజలు ఎన్నికలపట్ల ఆసక్తితో వుండాలని రాజకీయ పార్టీలు, వారి ప్రచార సాధనాలు చేసే బోధనలతో ప్రజలు విసుగు చెందిపోయారు, విరక్తి చెందిపోయారు. కనుక ఎన్నికల ఔన్నత్యాన్ని కొత్త తీరులో బోధిస్తూ, ప్రజల్ని ఆకర్షించి ఎన్నికల వ్యవస్థని నిలబెట్టడానికి కొత్త ముఖాలు, కొత్త గొంతులు అవసరమయ్యాయి.

ప్రధాన ఎన్నికల కమీషనర్ హోదాలో రాజకీయ పార్టీలన్నింటిపై విరుచుకుపడుతూ ఎన్నికల సంస్కరణలు అంటూ ఎంతో హడావిడి చేసిన నిన్నటి శేషన్; రాజకీయ పార్టీలని, ఎన్నికల్లో వారి తీరుతెన్నులని వేడివేడిగా విమర్శిస్తూ, భ్రష్టుపట్టిపోయిన నేటి ఎన్నికల వ్యవస్థని సంస్కరించాలని రకరకాల చిట్కా వైద్యాలను సూచిస్తున్న నేటి డా॥ జయప్రకాశ్-ఎన్నికల వ్యవస్థ పట్ల ప్రజల్లో తిరిగి ఉత్సాహం, ఆసక్తి కలిగించాలనే లక్ష్యాలతో రంగంమీదికి వచ్చినవాళ్ళే!

ఎన్నికల వ్యవస్థ భ్రష్టుపట్టిన మాట నిజమేగాని దీన్ని బాగుచేయవచ్చునని నమ్మించబూనుకున్నాడు జయప్రకాశ్! కనుక ఎన్నికలపట్ల అనాసక్తత అవిశ్వాసం తగదని, పైగా రెట్టించిన ఉత్సాహంతో పట్టుదలతో ఎన్నికల్లో పాల్గొనాలని బోధిస్తున్నాడు. ఎవరికీ ఓటు వేయదలచక పోయినా బూతులోకి పోయి ఓటు మురగబెట్టి రావాలని నచ్చజెబుతున్నాడు. ఎన్నికల సంస్కరణ పేరుతో లోక్‌సత్తా జయప్రకాశ్ చేసిన రంగప్రవేశానికి వెనకుండే నేపథ్యం ఇది.

నేటి ఎన్నికల వ్యవస్థ ఎంత కుళ్లిపోయిందో జయప్రకాశ్ మాటల్లోనే చూద్దాం.

''దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా దుర్మార్గులు నీతి పాఠాలను వల్లించడం; ప్రజలమధ్య కుల, మత, పార్టీ, వర్గ వైరుధ్యాలని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం; చివరిరోజు డబ్బు ధారాళంగా పంచడం; సారాయి పోయించడం; గూండాలను పెట్టి ప్రత్యర్థులు ఓట్లు వేయకుండా నిలవరించడం; బూత్‌లను ఆక్రమించుకొని దొంగ ఓట్లు వేయించడం; యథేచ్ఛగా రిగ్గింగు చేయించడం-ఇదీ ఎన్నికల పేరున జరిగే మోసం..''

''అసలు పార్టీల మధ్య తేడాలు అంతరించిపోయాయి...పార్టీలు కేవలం ఎన్నికల గుర్తులకు, డబ్బులు వసూలు చేయడానికి, అధికారం పంచుకోవడానికి పరిమితం అయిపోయినాయి. మరో విధంగా ప్రజాధనం దోచుకోవడం పదవులు చేపట్టి పెత్తనం చెలాయించడం తప్ప ప్రధాన పార్టీలకు వేరే పరమార్థం లేదు. అందుకే గూండాలకు, నేర చరితులకు, అవినీతిపరులకు ప్రధాన పార్టీలు పెద్ద పీట వేసాయి. అంటే మంచి పాలన తమ లక్ష్యం కాదని; ప్రజల సంక్షేమం తమ ధ్యేయం కానేకాదని; ఏదో ఒక విధంగా గూండాల ద్వారా ప్రజలను భయభ్రాంతులను చేయడం; అధికారం కైవశం చేసుకోవడం మాత్రమే తమ సంకల్పమని పార్టీలు చెప్పకనే చెబుతున్నాయి.....''

''ఈ పోరాటంలో (ఎన్నికలు) ఎవరు గెలిచినా ప్రజలు ఓడిపోతున్నారు. అందుకే లోపభూయిష్ట వ్యవస్థలో ఎన్నికల వలన మంచి ఫలితాలు వస్తాయన్న ఆశ అడుగంటింది....''

నిజానికి జయప్రకాశ్ లేవనెత్తుతున్న ఇవన్నీ ప్రజలకి తెలీనివి కావు. నిత్యం ప్రజల్లో చర్చించబడుతున్నవే! జయప్రకాశ్ చర్చలో కొత్త విషయం అల్లా ఏమంటే ఎన్నికల సంస్కరణలు అంటూ చేస్తున్న నిర్దిష్టమైన సూచనలు, ప్రతిపాదనలు, సలహాలు అనేవే! కనుక వాటి మంచి చెడుల్ని పరిశీలిద్దాం.

## గొంగళిలో తింటూ.....

ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక తీరుతెన్నులు, పార్టీ ఫిరాయించ

కుండా కట్టుదిట్టమైన చట్టం చేయడం; ఓట్ల వేటలో జనాకర్షకమైన సబ్సిడీలు, సంక్షేమాల వాగ్దానాలను ఇవ్వకుండా నిలకడైన అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణల ద్వారానే ప్రజల్ని కూడగట్టడం; నేరచరితుల్ని నేర స్వభావుల్ని రాజకీయాలకి దూరంగా వుంచడం-అనేవి జయప్రకాశ్ ప్రతిపాదిస్తున్న సంస్కరణ అంశాలు. ఇవిగాక ఫోటో గుర్తింపు కార్డులివ్వాలని; ఎన్నికల జాబితాలు సక్రమంగా వుండాలని, అవినీతిపరులకు టిక్కెట్లివ్వరాదని, పార్టీలలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం నెలకొల్పాలని, ఎన్నికలో ధన ప్రభావాన్ని అరికట్టాలని కొన్ని సలహాలు సూచనలు చేసాడు. అవినీతి గురించి కూడా జయప్రకాశ్ అనిర్దిష్టంగా పెద్దమాటలే మాట్లాడినా అవినీతి అంటే ఏమిటి? అనే ప్రశ్న జోలికే అతడు పోకపోవడం గమనార్హం! వీటిలో అతని ప్రధాన కేంద్రీకరణ అంతా నేరచరితులు, నేరస్వభావులు చుట్టూతానే వుంది.

నేరచరితులు నేర స్వభావులు అనే దానికి సంబంధించి జయప్రకాశ్ రెండు విషయాలలో ప్రజల్ని గందరగోళ పెడుతున్నాడు. ఒకటి 'నేరం' అనే దానికి అతడు ఇస్తున్న నిర్వచనం, చెబుతున్న అర్థం. ఇక రెండోది ఏమంటే కొంతమంది ముద్రపడ్డ 'నేరస్థులు' (గూండాలు, హంతకులు లాంటి వారు) పార్టీల్లోకి చేరడం, వారికి ప్రధానపార్టీలవారు పెద్ద పీటలు వేయడం అనే దానివల్లనే పార్టీలు వాటి రాజకీయాలు నేరమయం అయిపోతున్నట్టు జయప్రకాశ్ చెబుతున్నాడు-అంటే ఇలాంటి నేరస్థులు పార్టీలలోకి చేరడం ఇప్పుడే ప్రారంభమైందా? ఎప్పుడు ప్రారంభమైంది? బయటనుంచి నేరస్థుల ప్రవేశానికి ముందు ఆయా పార్టీలు స్వచ్ఛంగా వుండేవా? ఎప్పుడున్నాయి? పార్టీలలో వుంటూనే నేరస్థులుగా తయారైన వారు లేరని జయప్రకాశ్ భావిస్తున్నాడా? ఒక పార్టీలో ఒక క్రమంలో ఏ కొంతమందో నేరస్థులుగా పరిణమిస్తే, అలాంటి వారిని ఇకాపార్టీ దూరంగా వుంచకపోతే ఆ పార్టీని తప్పు పట్టడమనేది ఒక విషయం. కాగా, నేరస్థులుగా ముద్రపడ్డవారినే పార్టీలోకి ఆహ్వానించడం అంటే ఆ పార్టీ పునాదే నేర పునాది కాకపోతే ఇదెలా జరుగుతుంది? ఎందుకు జరుగుతుంది? 'నేరం' అనేదానికి జయప్రకాశ్ ఇస్తున్న పరమ సంకుచితమైన అర్థంలో చూసినా కూడా (పోలీసు కేసు రికార్డుల్లోకి ఎక్కడం అనేదే 'నేరం' అనేదానికి ప్రమాణం, సాక్ష్యం అనే అర్థంలో కూడా) బయటనుంచి ముద్రవేసుకున్న నేరస్థులు చేరడానికి ముందే అనేక మంది నేరస్థులతో కూడిన పార్టీలు కావా అవి? 'నేరం' అనేదానికి పోలీసు కేసు రికార్డులే ప్రమాణమా? 'సచ్ఛీలత' గురించి కూడా జయప్రకాశ్ మాట్లాడుతున్నాడు. కాని 'నేరం' అనే దానికి ఇస్తున్నట్టుగా ఈ 'సచ్ఛీలత' అనే దానికి అతడు ఎలాంటి కొలబద్దని ఇవ్వటం లేదు. అంటే అతడిస్తున్న కొలబద్దతో కొలిచి నేరస్థుల్ని వేరుచేయగా మిగిలిన వారంతా సచ్ఛీలురే అనుకోవాలా? ఈ నేరస్థ పార్టీలలో ప్రధాన నేరస్థులుగా వుండే అధినేతల ముఖాలకి 'సచ్ఛీలత' ముసుగు తొడగటానికి పనికొచ్చే అర్థాలు, నిర్వచనాలే ఇవి. ప్రధాన పాలక ప్రతిపక్షాలకి చెందిన మొదటి తరగతి నాయకులనేవారు ఎలాంటి కేసుల్లోనూ పోలీసు రికార్డులకి ఎక్కనే ఎక్కరని, అన్ని సందర్భాలలోనూ అట్టడుగునుండే వారి అనుచరగణమే నేరస్థులుగా నమోదవుతుంటారని, కాస్త పేరున్న నాయకులు పోలీసు రికార్డులకి ఎక్కినా వారిపై ఎలాంటి చర్యలు ఉండవని జయప్రకాశ్‌కి తెలీని విషయాలు కావు. ప్రతిపక్ష స్థానంలో వుంటూ పోలీసు కేసుల్లో చిక్కుకున్న వారు తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క కలంపోటు ఆదేశంతో తమపైని కేసులన్నింటినీ ఎత్తివేయించేసుకున్న చరిత్రలు ఈ ప్రధాన పార్టీలన్నింటికీ వున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం 500 మంది తన పార్టీ వారిపై వుండే పోలీసు కేసుల్ని మూకుమ్మడిగా ఎత్తించేసిందే! మంత్రిస్థానంలో వుండే కోడెల శివప్రసాదరావు స్వయానా తన ఆసుపత్రినే బాంబుల తయారీకి ఉపయోగించాడే! జరిగిన ప్రమాదంలో చనిపోయిన ఆ నలుగురు అనామకులే నేరస్థులనుకోవాలా? వారు బతికుంటే పోలీసు రికార్డులకెక్కేది వారే కదా! వారు చనిపోయారు కనుక కేసులో ఎవరిని ఇరికించాలన్న ఇరకాటంలో పోలీసులు పడిపోయిన తీరు రాష్ట్ర ప్రజలంతా ఇంతింత కళ్ళు చేసుకు చూసారు కదా? ఇందులో ప్రధాన నేరస్థుడు కోడెలే అని ప్రజలంతా కోడై కూసినా అతడు పోలీసు రికార్డులకి ఎక్కలేదెందుకని? నిరపరాధి , సచ్ఛీలుడు కనుకేనా?

ప్రత్యర్థుల్ని భయకంపితుల్ని చేయడానికి ఓటర్లని నిరోధించడానికి పాల్పడే భుజ బల ప్రదర్శనలు, బూతు రిగ్గింగులు, బాంబుల బంతులాటలు నేర చర్యలే, ప్రజాకంటక చర్యలే! కాని అవి చేస్తున్న వారా? లేక చేయిస్తున్న వారా? ఎవరు ప్రధాన నేరస్థులు అనేదే ప్రశ్న! ఈ ప్రశ్నని జయప్రకాశ్ అలవోకగా తప్పించేస్తున్నాడు. ఏమంటే ఈ ప్రశ్న వేసుకుంటే, ఈ పార్టీలనే ప్రధానంగా బోనెక్కించాలి. పార్టీలు అంటే జడపదార్థాలు కావు. వాటిని నడిపే నాయకులు, అవి అనుసరించే విధానాలు ఈ పార్టీలు, పార్టీల నాయకులు, ఈ పార్టీల విధానాలు ఇవన్నీ నేరపూరితంగా వుంటున్నాయి, ప్రజా వ్యతిరేకంగా వుంటున్నాయి. ప్రజల్ని వంచించి, ప్రలోభపెట్టి, చీల్చి, రెచ్చగొట్టి, మెడలు వంచి తమకే ఓట్లు వేయించుకొనే యావలో, అధికారాన్ని చేపట్టాలనే ఉన్మాదంలో అవి నేరపూరితంగానే తప్ప ప్రజాస్వామ్య యుతంగా వుండవు, వుండలేవు. అవి ప్రజలకి దూరం అయి పోయినాయి. ఎన్నికల సమయం వచ్చేప్పటికి ఎలాగోలాగ ఓట్లు వేయించుకోడానికి ప్రజల్లోకి రావడం తప్ప ఇకాతరువాత ప్రజల్ని, వారి సమస్యల్ని, అవసరాల్ని కాదని బడా బాబుల కాళ్ళొత్తుతూ, వారి సేవలు చేస్తూ వారందించే భారీ ముడుపుల్ని మెక్కుతూ, ప్రజల పేరుమీద అమలయ్యే పథకాలు కార్యక్రమాల నిధుల నుంచి కూడా కావలసినంత దోచుకు వెనకేసుకుంటూ తమ ఆస్థులు పెంచుకు పోవడమే ఈ పార్టీల పని. ఎవరధికారంలోకి వచ్చినా చేస్తున్నదిదే, ప్రజలు చూస్తున్నదిదే! ఆస్థులు పోగేసుకోడానికి-అధికారానికి మధ్య వుండే అవినాభావ సంబంధం అంటూ తెగిపోతే అసలీ గొడవలేవీ ఉండవన్న సంగతి జయప్రకాశ్ గుర్తించాలి. కోట్లకొలదీ మంచినీళ్ళలా ఎన్నికల్లో ఖర్చు ఎందుకు పెడుతున్నారు? అధికారంలోకి వస్తే అంతకు అనేక రెట్లు సంపాదించుకోగలమనే ధీమాతోనే కదా! పార్టీ అందించే భారీ నిధులేగాక అందుకనేక రెట్లు ఖర్చు పెట్టగల వాళ్లనే పార్టీలెందుకు అభ్యర్థులుగా నిర్ణయిస్తుంటాయి? ధనబలం, కండబలం వుండే గెలుపు గుర్రాలనే ఎందుకెంచుకుంటాయి? అంటే పార్టీగా అధికారాన్ని అందుకోవాలి. అరకొర మినహాయింపులనేవి వుంటే, ఉండొచ్చు! కాని, గెలిచిన శాసన సభ్యులు, ప్రత్యేకించి అధికార పార్టీకి చెందిన శాసనసభ్యులు, మంత్రులు తమ పూర్వపు స్వంత ఆస్థులతో పోలిస్తే అధమపక్షం పదిరెట్లుగా ఆర్జించుకున్నారనేది నిజం కాదా? శాసనసభా స్పీకర్‌కి అందించిన ఆస్థుల వివరాలు నిజమేనని ప్రజలెవరయినా అనుకుంటున్నారా? లేదు, నవ్వుకుంటున్నారు- అధినేత చంద్రబాబు

ఆస్థి ప్రకటన అన్నింటికి మించిన నవ్వు పుట్టించే విషయం. అసలీ ఆస్థుల పోగువేత అనేదే అసలైన సిసలైన నేరమని, నేరమూలమని, నేర కేంద్రమని జయప్రకాశ్‌కి తెలీదా? ఈ ఆస్థుల పోగువేత అనేది ప్రజల ప్రయోజనాలని పణంగా పెడుతూ, ప్రజల పేరుపై సాగేదే కదా! ఎలాగోలాగ గెలవడం-అధికారంలోకి పోవడం-ఆస్థులు పోగేసుకోవడం-అనే వాటితో ఈ ఎన్నికలకి సంబంధం లేకపోతే ఇవి ఈ తీరులో వుండాల్సిన పనిలేదే! జయప్రకాశ్ చెబుతున్న నేరాలపట్టీ అప్పుడు కనబడదు. కనుక ఈ పార్టీలు, వాటి అధినాయకత్వాలు ఈ పార్టీల ప్రభుత్వాల విధానాలు ఇవన్నీ నేరమయం, ప్రజావ్యతిరేకం! ఈ వాస్తవాన్ని మరుగుపరచేసే తీరులో ఎన్నికల్లో రిగ్గింగులకి, బూత్‌ల ఆక్రమణకి, బాంబు బెదిరింపులకి పాల్పడే వారివల్లనే, పార్టీలలోకి కొత్తగా చేరుతున్న కొంతమంది నేరచరిత్ర వున్న వారి వల్లనే రాజకీయ పార్టీలు రాజకీయాలు కళంకితమవుతున్నట్టుగా ఆరోపించడం అర్థం లేని విషయం. పోతే ఎన్నికల్లో ప్రత్యక్షంగా కనబడే కొన్ని నేరాల గురించి ఇంతగా ఆవేశపడిపోతున్న, ఇంత చర్చ చేస్తున్న జయప్రకాశ్ పెద్ద పెద్ద పరోక్ష నేరాలను మాటవరుసగా తుడిచి పారేస్తున్నాడు. ఎన్నికలు, ఓట్లు ప్రస్తావన లేకుండానే ఎన్నికలు, ఓట్లే లక్ష్యంగా సాగే మత మారణకాండలు, కుల చిచ్చులు పెద్ద నేర చర్యలు. పార్లమెంటులో 1989కి ముందు కేవలం రెండే రెండు సీట్లతో వుండే బి.జె.పి., మతోన్మాద జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టే ఉద్యమాల తోనే ఓట్ల బలం పెంచుకుంది తప్ప గొప్పదైన తన ఆర్థిక రాజకీయ విధానాలతో ప్రజల్ని పరవశింపజేసి కాదనేది అందరికీ తెలిసిందే! మతావేశాల రుచి, ఎన్నికల్లో అధికారంలోకి రావడంలో వాటి పాత్ర ఎరిగున్నది కనుకనే తానధికారంలో వుంటే సరి లేకుంటే ఆయోధ్యలో రామాలయ నిర్మాణం, కాశీ, మధురల్లో ఆలయాల నిర్మాణం, 370 అధికరణం రద్దు అనే వాటిని తన అమ్ములపొదిలో పెట్టుకుని బెదిరిస్తూనే వుంది. ఇందులోని నేర రాజకీయాల్ని జయప్రకాశ్ చూడడు! కోట్లాది రూపాయల ఏలేరు కుంభకోణాన్ని ఏట్లో కలిపేసిన; ఈనాడు రామోజీరావు ఫిల్మ్‌సిటీ నిర్మాణానికి వందలాది మందిని ఇళ్ళనుంచి తరిమేసిన, మరెంతోమంది రైతుల్ని వారి భూములనుంచి తరిమికొట్టిన చంద్రబాబు ప్రభుత్వం నేరాలు జయప్రకాశ్‌కి నేరాలుగా కనిపించవు! ఇలాంటి తీవ్రమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ నేరాల గురించి పట్టించుకోకుండా, రిగ్గింగులు, బ్యాలెట్ పెట్టెలు ఎత్తుకు పోవడాలే ఘోర నేర చర్యలుగా చూపెట్టడమంటే- బందిపోట్ల నుంచి దృష్టిని జేబు దొంగలవేపు మళ్లించే ప్రయత్నమే!

ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికనేది ఆయా అభ్యర్థులుండే ప్రాంతాలలోని వారి వారి పార్టీల కార్యకర్తలు, అక్కడి స్థానిక ప్రజల అభిప్రాయాల మేరకు జరగాలి తప్ప పార్టీ అధినాయకుల ఇష్టాఇష్టాలపై జరగరాదని జయప్రకాశ్ సలహా ఇస్తున్నాడు. ప్రజల అవసరాల్లోంచి, అభిప్రాయాల్లోంచి పుట్టే పార్టీలకిది సాధ్యం తప్ప; బడా భూస్వాములు, బడా వ్యాపార్లు, కాంట్రాక్టర్లు, దళారులు లాంటి దోపిడీవర్గాల ప్రయోజనాల్లోనే పురుడు పోసుకున్న ఈ పార్టీలకిది సాధ్యం కాదు. తమ వెనుకుండి చక్రాలు తిప్పే బడాబాబులకి తప్ప ఈ పార్టీలు ప్రజలకి జవాబుదారీ తనం వహించేవి కావు. కనుక జయప్రకాష్ వల్లిస్తున్న ఈ ప్రజాస్వామ్యయుతమైన తీరు ఈ పార్టీల ఒంటికి నప్పనిది అని అతడు గుర్తించాలి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి మరిన్ని నట్లూ, మరలు బిగించాలని ఒక పార్టీపై నెగ్గిన ఏ అభ్యర్థి అయినా పార్టీ ఫిరాయిస్తే ఆటోమేటిగ్గా అతడి సభ్యత్వం కూడా రద్దయిపోయే తీరులో చట్టాన్ని సవరించాలని జయప్రకాశ్ ప్రతిపాదిస్తున్నాడు-పదవీ అధికారాలని వుంచుకోవడం పంచుకోవడం దగ్గరే తప్ప ఇతరత్రా ఇంకే తేడాపాడాలు లేని ఈ పార్టీల మధ్య జరిగే ఫిరాయింపులు అనేవి చాలా సహజం. కాగా, ఇకీనాడు మరింత అవసరం అయి కూర్చున్నాయి. ఏమంటే ఏ పార్టీ ప్రభుత్వానికి స్థిరత్వం లేకుండా పోయింది. కనబడే స్థిరత్వమంతా సాపేక్షం, తాత్కాలికమే! అత్తెసరు బలంతో తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి అధికార స్థానంలోని పార్టీ ప్రభుత్వాలు ప్రతిపక్షాల నుంచి ఫిరాయింపులు కోరుతాయి. భారీ ముడుపుల్ని ఎరజూపుతాయి, భారీస్థాయిలో అమ్మకాలు కొనుగోళ్ళు సాగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరెప్పుడు ఏ స్థానాల్లోకి పోతారో చెప్పలేని స్థితి. కనుకనే ఫిరాయింపుల్ని ఎవరూ ఆపలేరు, ఆపరు. చట్టమనేది ఆఘోరించినా దానికి చిల్లులు పెట్టుకపోవడమెలాగో ఆలోచిస్తారు. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజీవ్‌గాంధీ హయాంలో జరిగిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అనేది ఒకరూ ఇద్దరుగా చీలడాన్ని అడ్డుకొని ఒక బృందంగా చీలిపోయే అవకాశాలని కల్పించింది. ఎందుకని అప్పటికి కేంద్రంలో స్థిర మెజారిటీతో వుంటుండిన రాజీవ్ ప్రభుత్వానికి తాము అధికారంలో లేని రాష్ట్రాలలోని ప్రతిపక్ష ప్రభుత్వాల్ని అస్థిరపర్చి కూలగొట్టడం అవసరమనిపించింది. అధికారంలో వుండే ఏ పార్టీ ప్రభుత్వమైనా అనుసరించేది ఈ ధర్మ సూత్రాన్నే! ఈ రోజుకి స్థిరంగా వుంటున్న ఎన్.డి.ఏ. సంకీర్ణ ప్రభుత్వం కూడా వివిధ రాష్ట్రాలలోని కాంగ్రెస్ ప్రభుత్వాల్ని కూల్చడానికి దీన్ని ప్రయోగించదనే భరోసా లేదు. నిజానికీతీరు మేఘాలయలో ఇప్పటికే ప్రారంభమైంది.

ఇక ఫోటో గుర్తింపు కార్డులిచ్చేస్తే, ఎన్నికల జాబితాల్లో అవకతవకలు సరిచేసేస్తే ఎన్నికల అక్రమాలు సమసిపోతాయనుకోవడం కేవలం భ్రమ! ఎన్నెన్ని చేసినా 'శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు' లాగా వీటన్నింటికీ చిల్లులు పెట్టుకుపోవడమెలాగో తెలీని తెలివి తక్కువ వారు కారు ఈ పార్టీల వారు. అసలు ఎలాంటి అక్రమాలకి పాల్పడాల్సిన అవసరం లేని పరిస్థితుల్లో ఈ ఎన్నికలు ఎందుకు సాగడం లేదో ఆలోచించకుండా-ఓటికుండకి అతుకులు పెట్టే తీరులో పరిష్కారాలని చర్చించడం పరమ వ్యర్థ ప్రయత్నం.

మరి జయప్రకాశ్ ఇంత నిష్ప్రయోజనకరం, ఇంత ఆచరణ సాధ్యంకాని వాటిని గూర్చి ఇంత చర్చ ఎందుకని చేస్తున్నాడు? ఇందుకు కారణం లేకపోలేదు. ఎన్నికల వ్యవస్థ మూలాన్ని ఆయన తప్పుపట్టదలచలేదు, అలానే రాజకీయ పార్టీలని సైతం ఆయన నేరం మోపదలచలేదు. ఎటొచ్చీ కొంతమంది 'నేరస్థులు' వల్లనే ఈ పార్టీలు, ఈ ఎన్నికల వ్యవస్థ భ్రష్టు పట్టిపోతున్నాయి. కనుక ఆ 'నేరస్థుల్ని' దూరం చేసేస్తే అంతా చక్కబడి పోతుంది. ఇందుకు తాను సూచించే చిట్కా వైద్యాలు సరిపోతాయని ఈ డాక్టరుగారు నమ్మబలుకుతున్నాడు. ''గొంగళీ మంచిదే-అందులో పెట్టుకున్న అన్నమూ మంచిదే! ఎటొచ్చీ గొంతుకి అడ్డుపడుతున్న వెంట్రుకలే సమస్యగా వున్నాయి'' అన్నట్టుగా వుంది డా॥ జయప్రకాశ్ ఎన్నికల సంస్కరణోద్యమం.

## ప్రపంచబ్యాంకు గొంతుకు వంత పాడుతున్న జయప్రకాశ్

ఓట్లు రాబట్టించుకునే సంకుచిత లక్ష్యంతో రకరకాలైన జనాకర్షక సంక్షేమ పథకాలని ఆశ్రయించడమనేది నిలకడైన అభివృద్ధికి పెద్ద ఆటంకమైపోతుందని జయప్రకాశ్ వాపోతున్నాడు. అభివృద్ధి కార్యక్రమాలకి సంక్షేమ పథకాలు సబ్సిడీలు ఆటంకం అనే వాదనే పెద్ద దగాకోరు వాదన. 'మండకి బెల్లం రాసినట్టు' పేదలకు విదిలించే సబ్సిడీలు సంక్షేమాలతోనే ప్రభుత్వ ఖజానా కన్నం పడిపోతుందని చెప్పడం; వేరొకప్రక్క బడా పారిశ్రామికవేత్తలు, బడా వ్యాపార వాణిజ్య వర్గాలు ఎగవేసే వందల కోట్ల రూపాయిల పన్నుల్ని పట్టించుకోకపోవడం పెద్ద వంచన. సామాన్య ప్రజల మెడలు వంచి మరీ వసూలు చేసే పరోక్షపన్నులే అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన ఆదాయవనరుగా వుంటున్నాయి తప్ప బడా బాబుల నుంచి వసూలు చేయాల్సిన ప్రత్యక్ష పన్నులు కానేకావు. మన కేంద్ర ప్రభుత్వంలో ఇవి ఏనాడూ 17 శాతాన్ని మించలేదు. మన రాష్ట్ర ప్రభుత్వంలో ఇంకా తక్కువ, ఏనాడూ 10శాతాన్ని మించలేదు. పోతే, ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై కేంద్ర ప్రభుత్వం ఏనాడూ 15శాతంకి మించి ఖర్చు చేయలేదు. మన రాష్ట్రంలో ఈ ఖర్చు ఏనాడూ 10 శాతానికి మించలేదు. అంటే ప్రజల గోళ్ళూడదీసి వసూలు చేసే పన్నులు 85-90 శాతం కాగా ప్రజలకిచ్చే సబ్సిడీలు, సంక్షేమాలపై చేస్తున్న ఖర్చు 10-15 శాతం మాత్రమే! ఈ వాస్తవాన్ని మరుగుపరుస్తూ సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అభివృద్ధికి ఆటంకం అని ఈసడించడం ప్రపంచబ్యాంకుకి సంతోషం కలిగించే ప్రజా వ్యతిరేక వైఖరి! ఇక అమలయ్యే అరకొర సంక్షేమ పథకాలు కూడా ఓట్లు కొల్లగొట్టడం కోసం ఎన్నికలముందే ఆర్భాటంగా ప్రారంభం కావడం ఎన్నికలయ్యాక అవి ఎగిరిపోవడం రాష్ట్ర ప్రజల స్వానుభవమే! అధికారంలోకి రావడానికి సంక్షేమ పథకాల ఊరింపులు, అధికార అందలాలెక్కిపోయాక ప్రజల నడ్డిమీద 'సంస్కరణల' వాతలు, అధిక పన్నుల వడ్డింపులు, అధిక ధరల చురకలు-ఇది అన్ని పార్టీల ప్రభుత్వాలకి ఆనవాయితీ అయిపోయింది. పళ్ల బిగువున పట్టివుంచి, ఎన్నికలు ముగిసీ ముగియడంతోనే ఫలితాల ప్రకటనతో సంబంధం లేకుండానే కేంద్రంలోని ఆపద్ధర్మ ప్రభుత్వ హోదాలోనే ప్రజాకంటక బి.జె.పి. సంకీర్ణ ప్రభుత్వం డీజిల్ ధరని ఒక్కసారి 40శాతం పెంచేసింది. నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశం వేపు పరుగులు తీస్తున్నాయి. ఎన్నికలయ్యేంత దాకా ధరల నియంత్రణ అంటూ కళ్లాలు వేసిన చంద్రబాబు ప్రభుత్వం పగ్గాలొదిలేసింది, అవి పరుగెడుతున్నాయి. ఇప్పుడిక చంద్రబాబు ప్రభుత్వం తిరిగి 'సంస్కరణల' గొంతు సవరిస్తున్నాది. కేంద్రంలో వాజ్‌పాయ్ కూడా ప్రధానిగా ప్రమాణం చేసిన మరుక్షణమే 'కఠిన నిర్ణయాలు తప్పవు' (అంటే ప్రపంచబ్యాంకుకి దాసోహం కావడం) అని ప్రకటించాడు. చంద్రబాబు, వాజ్‌పేయిలని ప్రపంచబ్యాంకు ఎంతో మెచ్చుకుంటుంది. జయప్రకాశ్ మరీ మెచ్చుకుంటాడు- ఏమంటే వీరంతా గొప్ప 'సంస్కరణ'వాదులు!

## సంస్కరణలు కాదు, సమూలమైన మార్పు అవసరం

ఈ ఎన్నికల వ్యవస్థ ఎంత ఘోరంగా అఘోరిస్తోందో జయప్రకాశ్ వాడిగాను, వేడిగాను చెబుతున్నాడు. కానిలా ఎందుకు అఘోరిస్తోంది? అని మూలాల్లోకి పోయి కారణాలు వెదికి పట్టుకోడానికి బదులు దీన్ని చక్కదిద్దేయడానికి 'సంస్కరణలు' అంటూ ఆతృత ప్రదర్శిం చేస్తున్నారు. ప్రజల అవసరాలు, ఆలోచనలు,అభిప్రాయాలు, ఆవేదనలు ప్రాతిపదికగా నడుస్తున్న రాజకీయాలు కావు ఈ ఎన్నికల రాజకీయాలు. ప్రజలను దోచుకు తినే పిడికెడు భూస్వామ్య, ధనస్వామ్య, దళారీ వర్గాల ప్రయోజనాల ప్రాతిపదికగానే సాగుతున్న రాజకీయ విన్యాసాలివి. కానీ ఇవి ప్రజల పేరుమీదనే చెలామణి అవుతున్నాయి. ఇలా 'చెలామణి' చేయించే ప్రక్రియే ఈ ఎన్నికల ప్రక్రియ! ఇందులో పిడికెడు దోపిడీవర్గాల ప్రయోజనాలు వారి పాత్రే తప్ప ప్రజల ప్రయోజనాలు లేవు, ప్రజల పాత్రా వుండదు. కాని, వున్నట్టుగా చిత్రించడం, చూపెట్టడం పాలకవర్గాలకి అవసరం. ఈ అవసరరీత్యా సాగుతున్న తంతే ఈ ఎన్నికలు. ఈ ఎన్నికల వ్యవస్థ అతుకులతో సంస్కరించబడేది కాదు, సమూలంగా మార్చబడాల్సిందే! అందుకు సామాజిక విప్లవమే శరణ్యం. ఇలాంటి విప్లవం అవసరం లేదని చెబుతూ ఎన్నికల వ్యవస్థపై ఆశలు ఒదులుకోరాదని బోధించడమే జయప్రకాశ్ ఉద్యమలక్ష్యం! ఇలాంటి ఆశలు నెరవేరగల పరిస్థితులు కావివి. నిన్నటి శేషన్ లాగానే నేటి జయప్రకాశ్ సైతం భంగపడక తప్పదు! ❑

---

*(5వ పేజీ తరువాయి...)*

పీడిత ప్రజలు జరుపుతున్న పోరాటాన్ని పాలకుల నిషేధంతో సమకడుతున్నాడు. తెలంగాణా ప్రజలు "నిషేధాల" నుండి విముక్తిని కోరుకుంటున్నట్టుగా చూపెట్టడం ద్వారా నిజానికి పాలకుల నిషేధానికే బలాన్ని చేకూర్చుతున్నాడు. తన నైజాన్ని కప్పిపుచ్చుకోవడానికే మరో అబద్ధపు ప్రచారానికి పూనుకొంటున్నాడు. అదేమంటే-తనపై విధించిన నిషేధానికి విరుగుడుగా, ప్రతీకారంగా ఇతర రాజకీయ పార్టీల రాజకీయ స్వేచ్ఛని పీపుల్స్‌వార్ నిరోధిస్తోందనడం. పీపుల్స్‌వార్‌ని రాజకీయంగా భ్రష్టు పట్టించడానికుద్దేశించిన తప్పుడు ఆరోపణే ఇది. పీపుల్స్‌వార్ ఎన్నికల బహిష్కరణ విధానంపైన, కార్యక్రమాలపైన బాలగోపాల్ చేస్తున్న అపభ్రంశపు వ్యాఖ్య ఇది.

పీపుల్స్‌వార్‌పై ప్రభుత్వం విధించిన నిషేధం-ఇతర రాజకీయ పార్టీల రాజకీయ స్వేచ్ఛపై పీపుల్స్‌వార్ విధిస్తున్నట్లుగా బాలగోపాల్ భావిస్తున్న నిషేధం-ఈ రెండింటి నుంచి తెలంగాణా విముక్తి కావాలని బాలగోపాల్ తన వ్యాసంలో కోరాడు. తెలంగాణాలోని విశాల జనబాహుళ్యం ఆకాంక్షలు అభిప్రాయాలతో సంబంధంలేని కోరిక ఇది. బాలగోపాల్ లాంటి కొందరు ఉదారవాద మేధావుల కోరిక తప్ప ఇది తెలంగాణ జనసామాన్యం అభిప్రాయం కాదు, అవసరం కాదు. తెలంగాణా ప్రజలు కోరుతున్నది పాలకవర్గాల దోపిడీ నియంతృత్వాల నుంచి విముక్తినే తప్ప బాలగోపాల్ చెబుతున్నలాంటి విముక్తిని కాదు!

**రామకృష్ణ**
**ఆంధ్రరాష్ట్రకమిటీ ప్రతినిధి**
**సి.పి.ఐ.(యం-యల్)[పీపుల్స్‌వార్]**

❑

**ఇంటర్వ్యూ**

# ''ఒక సంవత్సరం పాటు మేం నిగ్రహం పాటించాం.... అయితే యం.సి.సి. దాన్ని మా పార్టీ బలహీనతగా భావించింది''

## సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] బీహార్ రాష్ట్రకమిటీ కార్యదర్శితో ఇంటర్వ్యూ

*బీహార్ రక్తమోడుస్తూనే వుంది. రణవీర్‌సేన, ఇతర ప్రైవేట్ సైన్యాల పాశవిక దాడులవల్లే గాదు, యం.సి.సి. దాడులు సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ప్రతిదాడుల కారణంగా కూడా బీహార్ రక్తసిక్తమవుతున్నది. 1999 జూలై 31 నాటికి ముగిసిన ఐదు వారాల మధ్య కాలంలోనే యం.సి.సి., పీపుల్స్‌వార్‌ల ఘర్షణల్లో 20 మంది ప్రజలు మరణించారని వార్త. వీరిలో 14 మంది పీపుల్స్‌వార్‌కి చెందగా ఆరుగురు యం.సి.సి.కి సంబంధించినవారు. సి.పి.ఐ (యం-యల్) [పీపుల్స్‌వార్] బీహార్ రాష్ట్రకమిటీ కార్యదర్శి, కేంద్రకమిటీ సభ్యుడూ అయిన కా॥ శ్రావణ్ 1999 ఆగస్ట్ మొదటి వారంలో జరిపిన ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఎట్టకేలకు ఏకపక్షంగా నిగ్రహం పాటించిన సంవత్సర కాలం తర్వాత బీహార్‌లో పార్టీ ఎదురుదాడి చేయాలని తీసుకున్న నిర్ణయంవల్ల యం.సి.సి.కి కూడా ఎదురుదెబ్బలు తగిలాయని చెప్పాడు. పీపుల్స్‌వార్ పాటించిన నిగ్రహాన్ని బలహీనతగా యం.సి.సి. భావించటం నిజంగా దురదృష్టకరమని కా॥ శ్రావణ్ వివరించాడు. జెహనాబాద్, పలమావులలో (అప్పటి పి.యు. ఇప్పటి పీపుల్స్‌వార్ పార్టీ ప్రధాన ఏరియాలు) పీపుల్స్‌వార్ సాయుధ దళాలను, ప్రజాసంఘాల కార్యకర్తలను, సానుభూతిపరులను సైతం తుడిచిపెట్టడాన్ని యం.సి.సి. కొనసాగిస్తోంది.*

*బీహార్‌లోని ప్రస్తుత విషాదానికి పరిష్కారమేమిటి? ప్రస్తుత సంఘటనలను బట్టి ఎవరయినా సమీప భవిష్యత్తులో రాష్ట్రంలో మరిన్ని విషాద సంఘటనలను, అంధకారాన్నే చూడగలరు. మునుపటి పి.యు., పీపుల్స్‌వార్‌ల విలీనం, సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]ల ఆవిర్భావం తర్వాత దాదాపు సంవత్సర కాలంగా యం.సి.సి. నాయకత్వం తలబిరుసు తనాన్ని, మొండితనాన్ని అవలంభించింది. విలీనంపట్ల సంపూర్ణ వ్యతిరేకతను ప్రదర్శించింది. బీహార్ సమస్యపై చర్చలకు వచ్చేందుకు తిరస్కరించింది. పీపుల్స్‌వార్‌కి సంప్రదాయంగా బలమైన ప్రాంతాలలో బీభత్సకరమైన, కిరాతకమైన కేంపెయిన్‌ని మొదలెట్టి, ఇళ్ళను ధ్వంసం చేసి, ఆస్థిని కొల్లగొట్టి, పీపుల్స్‌వార్ సానుభూతిపరులను కొట్టి, చంపి, ప్రత్యేకించి పీపుల్స్‌వార్ ఆర్గనైజర్లను, దళాలను తుడిచిపెట్టడంపై కేంద్రీకరించటం ద్వారా వాతావరణాన్ని విషపూరితం చేసింది. కా॥ శ్రావణ్ ''పీపుల్స్‌మార్చ్''కి ఇచ్చిన ఇంటర్వ్యూ దీన్నంతా పూసగుచ్చినట్లు తెలుపుతుంది.*

*ఈ ఇంటర్వ్యూ క్రమంలో యం.సి.సి.కి సంబంధించి ఇంతవరకు మరుగునున్న పలు సత్యాలు-అంటే పలామూ, జెహనాబాద్, ఇతర పీపుల్స్‌వార్ ఏరియాలలో దుర్మార్గులైన ప్రజావ్యతిరేక శక్తులపై అది ఆధారపడటం; పీపుల్స్‌వార్‌తో ముడిపడి వున్నారని అనుమానమొచ్చిన వారినల్లా హెచ్చరిస్తూ, నిర్మూలిస్తున్న దాని పాశవికమైన కేంపెయిన్; యం.సి.సి. దళాల భయంకరమైన, కిరాతక హత్యలు, దాడులు, అప్పటి పి.యు., పి.డబ్ల్యు.లకు నూతనంగా ఐక్యమయిన పీపుల్స్‌వార్‌కి వ్యతిరేకంగా దాని అసత్య ప్రచారం, బీహార్ సమస్య పరిష్కారానికి పి.డబ్ల్యు.తో చర్చలకు మొండిగా వ్యతిరేకించటం వంటి పలు సత్యాలు వెలుగులోనికొచ్చాయి. ఆ ఇంటర్వ్యూను ఇక్కడ అందిస్తున్నాం.*

**ప్రశ్న: అక్టోబర్ 98 లో 'పీపుల్స్‌వార్' 'పత్రికకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అప్పటి పి.యు. కార్యదర్శి కా॥ ప్రసాద్ 'పి.యు., పి.డబ్ల్యు.ల విలీనంతో, యం.సి.సి.తో ఘర్షణలకు ప్రాతిపదిక సన్నగిల్లి పోయిందన్న ఆశాభావం వ్యక్తపర్చాడు. అయితే గత సం॥ర కాలంగా జరిగిన సంఘటనలు సరిగ్గా అందుకు వ్యతిరేక దశకు పోయాయి. పరిస్థితి పట్ల మీ అంచనాలో ఎక్కడ తప్పు జరిగింది?**

**జవాబు:** పి.యు., పి.డబ్ల్యు.ల విలీనం, నూతన కేంద్రకమిటీ [ప్రొవిజనల్], సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]ల ఆవిర్భావ క్రమంలో ఘర్షణలు ఆగిపోతాయని మేం నిజాయితీగా ఆశించినామన్నది వాస్తవం. మా ఆశాభావం రెండు అంశాలపై ఆధారపడింది. ఒకటి: యం.సి.సి.కి అప్పటి పి.డబ్ల్యు.కి మధ్య సంబంధాలు అంతవరకు మంచిగా, కామ్రేడ్లీగానే వుండినాయి; వారి మధ్య 1995 మే నెలలోని విలీన చర్చల వైఫల్యంతో పనిలేకుండా ద్వైపాక్షిక అంశాలకు సంబంధించి వారు క్రమబద్ధంగా చర్చలు జరుపుతూ వచ్చారు. చివరకు కొన్నిసార్లు ఉమ్మడి కార్యాచరణను సైతం నిర్వహించారు. రెండు: ప్రతీకార చర్యలను ఆపివేయడానికి నూతన కేంద్రకమిటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. ''యం.సి.సి. కేడర్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినప్పటికీ రెచ్చిపోవద్దు''ని నూతన కేంద్రకమిటీ పార్టీ కేడర్లను కోరింది. కేవలం మాటల్లోనే కాదు చేతల్లో కూడా యం.సి.సి. ఎడతెగని కిరాతక దాడులు చేసినప్పటికీ మా కేడర్లు యం.సి.సి.ని ఎదురుదెబ్బ తీయటంపై నిగ్రహం పాటించారు. అయితే యం.సి.సి.ని దాడులు కొనసాగించకుండా నిరోధిస్తాయని అప్పటి మా కార్యదర్శి భావించిన ఈ రెండు అంశాలూ భ్రమలే అని తేలిపోయాయి. యం.సి.సి.పై అవి ఏ ప్రభావం కల్గించలేక పోయాయి.

**ప్రశ్న: మరి మీరు ఎక్కడ తప్పటడుగు వేశారు?**

**జవాబు:** మేం ఎల్లప్పుడూ యం.సి.సి. సానుకూల పక్షాన్నే చూసి దాని వ్యతిరేకాంశాలను నిర్లక్ష్యం చేశాం. అప్పటి పి.యు., పీపుల్స్‌వార్‌లు రెండూ, ప్రత్యేకించి పీపుల్స్‌వార్ ఎప్పుడుకూడా యం.సి.సి.లోని వ్యతిరేక అంశాలను సొంత కేడర్‌కి సైతం

నివేదించలేదు. బహిరంగ సైద్ధాంతిక చర్చను నిర్వహించటం గురించి కూడా మాట్లాడలేదు. యం.సి.సి. మరోవైపున పి.యుకే కాక పీపుల్స్‌వార్‌కి కూడా వ్యతిరేకంగా అసత్యాలను, అపవాదులను తన కేడర్‌లో చొప్పించటం ద్వారా కేడర్లను మానసికంగా సిద్ధం చేసేసింది.

**ప్రశ్న: ఏ విధంగా.....**

**జవాబు:** పీపుల్స్‌వార్ పార్లమెంటరీ ఎన్నికలలో పాల్గొనడానికి పోతోందని చెప్పడం వంటి అసత్యాల ద్వారా అది కేడర్‌ని సిద్ధం చేసింది. వారు పీపుల్స్‌వార్‌కి సంబంధించినంతవరకూ 1996 ప్రారంభం నుండీ, ఇలా చెబుతూరాగా పి.యు.కి సంబంధించి నంతవరకూ అంతకు ముందునుండే చెబుతూ వచ్చారు. నక్సల్బరీ 30 సం॥ల సందర్భంగా బహిరంగ జీవితంలోకి రావడానికి పీపుల్స్‌వార్ నాయకత్వం రంగం సిద్ధం చేస్తోందన్న పచ్చి అబద్ధాన్ని, ఇటువంటి నానా చెత్తను వారు వ్యాపింపజేశారు. స్పష్టమైన ఈ అబద్ధాలను యం.సి.సి. పార్టీ కేడర్లు ఏదో ఒకరోజు గమనించగలరనే మేం ఆశిస్తున్నాం. నూతనంగా విలీనమైన పీపుల్స్‌వార్‌పై యం.సి.సి. తన దాడులను కొనసాగించడానికిగల కారణాలలో బహుశా ఈ భీతి కూడా ఒకటి కావచ్చు. గ్రూప్ మనస్తత్వాన్ని పెంచి పోషించటం, ఇతరులను ద్వేషించటం అన్నవి కొంత కాలం వరకైనా వారి క్యాడర్‌ను నిజాన్ని గ్రహించడం నుండి అడ్డుకోగలవని వారు భావిస్తున్నారు.

**ప్రశ్న: యం.సి.సి.పై రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినప్పటికీ రెచ్చిపోకూడదన్న మీ ఏకపక్ష నిర్ణయం ఘర్షణపట్ల యం.సి.సి. వైఖరిపై ఏ సానుకూల ప్రభావాన్నయినా కల్గించిందా?**

**జవాబు:** మేమలాగే భావించినాం. అయితే దురదృష్టవశాత్తు నాయకత్వంలో ఎలాంటి పునరాలోచనకి అది దారితీయలేదు. ప్రజలముందు విప్లవకారుల ప్రతిష్ట దిగజారినా ఫరవాలేదు. విప్లవ శ్రేణులలో అది గందరగోళాన్ని, నైతిక స్థైర్యానికి ముప్పును కలిగించినా ఫరవాలేదు; ఫ్యూడల్ శక్తులకు, రణవీర్‌సేనకు, ప్రభుత్వ సాయుధ బలగాలకు విప్లవోద్యమంపై తమ దాడులలో సహకరించినా ఫరవాలేదు; లిబరేషన్ గ్రూప్‌లాంటి రివిజనిస్టు శక్తులకు అది మరింతగా జీవం పోసినా ఫరవాలేదు; కాని ఎన్ని ప్రాణాలను ఫణంగా పెట్టి అయినా సరే తమ ''సామ్రాజ్యాన్ని'' విస్తృత పరచుకోవడానికే వారు మానసికంగా సంసిద్ధమయినారు. అయితే మా ఏకపక్ష శాంతి చర్చల పట్ల యం.సి.సి. సానుకూలంగా వ్యవహరిస్తుందన్న తప్పుడు అంచనాలోనే మా తప్పు వుంది. ఏమయినప్పటికీ దీన్ని మా పార్టీ బలహీనతగా తీసుకుని యం.సి.సి. మరింత పాశవికంగా, మునుపటికంటే పెద్ద ఎత్తున తన దాడులను తీవ్రతరం చేయడానికి సావకాశంగా తీసుకుంది.

**ప్రశ్న: యం.సి.సి. హంతక దాడులకు వ్యతిరేకంగా ప్రతీకార చర్యలను చేపట్టకూడదన్న మీ విధానం ఫలితంగా మీరు తీవ్రమైన నష్టాలకు గురైనారన్న విషయాన్ని దృష్టిలో వుంచుకుంటే, గతాన్ని గురించిన అవగాహనలో విధానమే తప్పని మీరు భావిస్తున్నారా?**

**జవాబు:** లేదు. నష్టాలవల్ల మేం దెబ్బతిన్నప్పటికీ, యం.సి.సి. చర్యలకు రెచ్చిపోరాదని, ప్రతీకార చర్యలను చేపట్టరాదంటూ, 98 ఆగస్ట్‌లో విలీనమైన వెంటనే మా కేంద్రకమిటీ తీసుకున్న విధానం ప్రాథమికంగానే సరైందని మేం భావిస్తున్నాం. అటువంటి విధానాన్ని చేపట్టడం ద్వారా మాత్రమే మేం యం.సి.సి. పట్ల మరింత వాస్తవ అంచనాకి రాగలిగాం. అయితే మా వైపు నుండి ఒక లోపముంది. గత సం॥రం మధ్యలో కేంద్రకమిటీ [ప్రొవిజనల్] తొలి సమావేశంలో తీసుకున్న పై నిర్ణయాన్ని గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయలేక పోయాం.

ఇంతేకాక, ఏదయినా మంచిని సాధించడానికిగాను ఎవరయినా త్యాగానికి సిద్ధపడాల్సి వుంటుంది. దాదాపు ఒక సం॥రం పాటు మాకు మేమే నిగ్రహం పాటించటం ద్వారా బీహార్‌లో సమస్య శాంతి యుత పరిష్కారానికి రంగాన్ని సిద్ధం చేయడానికి మేం ప్రయత్నించాం. యం.సి.సి. సానుకూలంగా స్పందించలేదన్న వాస్తవానికి మా త్యాగాలు వృధా అయినాయని అర్థం కాదు. భారత విప్లవోద్యమ ప్రయోజనాలలో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రయోజనా లలో, మా వర్గ మరియు పీడిత ప్రజారాసుల ప్రయోజనాలలో మా త్యాగానికి సంబంధించిన అనుభవముంది. భారతదేశంలోని, ప్రపంచంలోని విప్లవ శక్తులన్నింటికీ అది వాస్తవాన్ని విస్తృతంగా అర్థం చేయించగలదని మేం భావిస్తున్నాం. యం.సి.సి. క్యాడర్లకు పునరాలోచించేందుకు అది తోడ్పడగలుగుతుందని మేం నమ్ముతున్నాం. ఘర్షణలకు సంబంధించి వారిని ఇపుడు అంధ కారంలో వుంచినప్పటికీ యం.సి.సి. నాయకత్వం వ్యాపింపజేసిన అసత్యాలు, అపవాదుల కట్టుకథల ద్వారా వారిలో మా పట్ల తీవ్రమైన ద్వేషాన్ని చొప్పించినప్పటికీ వారిలోని నిజాయితీపరులు పునరాలోచించగలరనీ, వారి నాయకత్వం చేపట్టిన రక్తసిక్తమైన మిలటరీ క్యాంపెయిన్‌కి వ్యతిరేకంగా బయటకొస్తారని మేం భావిస్తున్నాం.

**ప్రశ్న: గత సంవత్సర కాలంగా మీ వైపునుండి ఎలాంటి ప్రతీకార చర్యలూ లేవా?**

**జవాబు :** ఈ సంవత్సరం జూన్ వరకు మా కామ్రేడ్లు దాడి చేసిన, అది కూడా ప్రతీకార చర్యకు సంబంధించిన రెండు సంఘటనలున్నాయి. పైని రెండు సంఘటనలలో ఒకటి కేంద్రకమిటీ నిర్ణయం మా క్యాడర్‌కు చేరక ముందు జరిగింది. వాస్తవానికి యం.సి.సి. మొండి వైఖరి బట్టి చూస్తే సి.సి. నిర్ణయంలోని విజ్ఞతపట్ల మా కిందిస్థాయి కేడర్లు నిత్యం ప్రశ్నిస్తూ వచ్చారు. మా నిర్ణయం చెవిటివాడి ముందు శంఖం వూదిన చందాన వుందని కొంతమంది భావించారు. అయినా వారు కేంద్రకమిటీ నిర్ణయంలోని రాజకీయ ప్రాధాన్యతను అర్థం చేసుకుని దాన్ని అమలుపర్చారు.

**ప్రశ్న: ప్రతీకారం తీర్చుకొనేందుకు మీరు ఎప్పుడు నిర్ణయించుకున్నారు. దాని ఫలితాలేమిటి?**

**జవాబు:** ఇప్పటికీ ప్రతీకారానికై తీసుకున్న నిర్ణయం కేవలం అప్రధానమైనట్టిదే. అది కేవలం మా ఆత్మరక్షణకు ఉద్దేశించినట్టిది. 99 ఏప్రిల్ సమావేశంలో నిర్ణయం జరిగి బీహార్ రాష్ట్రకమిటీకి జూన్‌లో దాన్ని తెలియపర్చారు. గత అయిదు వారాలుగా మా దళాలు ఆరుగురు యం.సి.సి. కార్యకర్తలను వారి సాయుధ దాడికి ప్రతీకారంలో భాగంగా తుదముట్టించి ఎదురుదెబ్బ తీశాయి.

మా తక్షణ వునికే ప్రమాదంలో పడినందువల్ల ఈ పరిమిత ప్రతీకార చర్యనయినా తీసుకోవటం జరిగిందని మీరు దృష్టిలో వుంచుకోవాలి. పలాము, జెహనాబాద్‌లలోని మా సాంప్రదాయిక ఏరియాలలోకి యం.సి.సి. 90 నుంచి 100 మంది సభ్యులతో కూడిన సాయుధ బృందాలను పంపిస్తోంది. ఈ ఏరియాలలో ఇంతకాలంగా యం.సి.సి.కి ఏ సంస్థకూడా వుండింది లేదు. మా ఏరియాల నుండి మమ్మల్ని తుడిచిపెట్టడానికిగానూ వీరు కొద్దిమంది దిగజారిన ప్రజావ్యతిరేక శక్తులపై ఆధారపడుతున్నారు. వీరిలో కొందరు మా పార్టీ నుండి బహిష్కరింపబడినవారు కాగా, మరికొందరు భూస్వాముల ప్రైవేట్ సేనలకు చెందిన వారు. ఈ సంఘటనల వివరాలను 1999 ఏప్రిల్‌లో మా బీహార్ రాష్ట్రకమిటీ రూపొందించిన పుస్తకంలో మీరు చూడవచ్చు. (కా॥ శ్రావణ్ హిందీలోని ఆ పుస్తకం కాపీని అప్పగించాడు). ఈ రోజు మా పరిస్థితి నాలుగ్గోడల మధ్య బంధించి వుంచిన పిల్లి చందాన వుంది. తప్పుకోవడానికి దారే లేదు. తిరగబడు లేదా చావు....ఇలాంటి నేపధ్యంలోనే మా వునికిని నిలబెట్టుకోడానికై కొన్ని ప్రతీకార చర్యలు చేపడుతున్నాం.

అదే సమయంలో యం.సి.సి. నాయకత్వాన్ని వారి పాశవిక దాడులను ఆపి చర్చలకు రమ్మని మేం విజ్ఞప్తి చేస్తున్నాం. పరిమితమైన ప్రతీకార చర్య మినహా నూతన కేంద్రకమిటీ తీసుకున్న మా మునుపటి నిర్ణయంలో మౌలికంగా మార్పేమీ లేదు. ద్వైపాక్షిక సమావేశాలకు తేదీలను నిర్ణయిస్తూ మేం వుత్తరం మీద వుత్తరం రాస్తూ వచ్చాం (గత సంవత్సరంలోనే డజను ఉత్తరాలు అలా పంపాం) కానీ యం.సి.సి. నాయకత్వం గత సంవత్సర కాలంగా చర్చలను ఉద్దేశ్యపూర్వకంగా దాటవేస్తూ వస్తోంది. శాంతియుతమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అది అనుకోవటం లేదన్నది స్పష్టమయింది. చర్చలపై తనకు విముఖత లేదని అది అంటోంది కాని అది కేవలం ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే. వారిని చర్చల్లోకి తీసుకుని రావడానికి సమస్యను రాజకీయంగా పరిష్కరించుకోవడానికి ఇప్పటికీ మేం ప్రయత్నిస్తున్నాం.

**ప్రశ్న: వివాదాన్ని పరిష్కరించడానికి మూడో పార్టీ జోక్యాన్ని మీరు సూచిస్తున్నారా?**

**జవాబు:** నిజానికి రెండు పక్షాల ఆకాంక్ష, నిజాయితీ మాత్రమే సమస్యను పరిష్కరించగలదు. యం.సి.సి.తో చర్చలకు కూర్చోవటం ద్వారా సమస్య పరిష్కరించేందుకు మేం మా సంసిద్ధతను చూపివున్నాం. కాని ఆ పార్టీ శాంతియుత పరిష్కారం కోసం లేదు. మూడో పార్టీ సమక్షంలో చర్చలకు కూర్చోవడానికి అది సిద్ధమయినట్లయితే మాకభ్యంతరం లేదు.

వాస్తవంగా, ఏదైనా ఒక నిజనిర్ధారణ కమిటి నేరుగా పోరాట ప్రాంతానికి పోయి సంఘటనల వెనుక వాస్తవాలను పరిశోధించాలని మేం యం.సి.సి.కి మా బహిరంగ అభ్యర్థనలో సూచించాం. బాధ్యతాయుత పౌరులతో కూడిన బృందమేదయినా సంఘటనలను పరిశీలించినట్లయితే సత్యాన్ని కనుగొనటం ఏమంత కష్టం కాదు. అటువంటి విచారణ మొట్టమొదటగా హంతక దాడులను రేపెట్టిందెవరో, నిజం మాట్లాడుతున్నదెవరో, అసత్యాలను, అపవాదులను వెదజల్లుతున్నదెవరో ప్రపంచానికి రుజువు చేయగలదు. మా పాత అనుభవమేమిటంటే యం.సి.సి. లాంఛనంగా ఇలాంటి విచారణలను అంగీకరించినప్పటికీ, చివరి క్షణంలో అది వెనుకగు వేస్తుందన్నదే. 1997 నవంబర్‌లో మునుపటి పి.యు., యం.సి.సి.ల కేంద్రకమిటీల ప్రతినిధుల ద్వైపాక్షిక సమావేశంలో విచారణా బృందాన్ని పంపడానికి అది అంగీకరించిన తర్వాత ఇలాగే చేసింది. వారితో సంబంధంలో వున్న కొద్దిమంది ప్రగతి నిరోధక శక్తులను కనుగొనేందుకు ప్రజాకోర్టులను ఏర్పర్చాలనే నిర్ణయాలకు కూడా ఇదే గతి పట్టింది. నిజాన్ని ఎదుర్కోవాలంటే వారికి భయం. నిజ నిర్ధారణ బృందం ఏర్పాటుకు వారు అంగీకరించేలా ఎవరయినా కృషిచేసినట్లయితే మేం నిజంగా సంతోషిస్తాం, నిజాలను వెలికి తీయడానికి మాచేతయినంత సహకారాన్ని అందిస్తాం.

## ఘర్షణల చరిత్రపై:

**ప్రశ్న: పి.యు., పీపుల్స్‌వార్‌ల విలీనానికి ముందు యం.సి.సి., అప్పటి పి.యు.ల మధ్య ఘర్షణల చరిత్ర గురించి మీరు క్లుప్తంగా చెప్పగలరా?**

**జవాబు:** గత సంవత్సరం ఏప్రిల్‌లో మా బీహార్ రాష్ట్రకమిటీ రూపొందించిన పుస్తకంలో అది వివరంగా వుంది. దాన్ని క్లుప్తంగా తిరిగి చెప్పడానికి ప్రయత్నిస్తా.

బీహార్‌లో మేం ప్రవేశించినపుడు 1979-80లో జెహనాబాద్ లోని సికారియా గ్రామం నుండి మా పనిని మొదలెట్టాం. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత వున్నందున మేం పలామును కూడా పనికి సంబంధించి పర్‌స్పెక్టివ్ ఏరియాగా ఎంచుకున్నాం. అప్పట్లో కా॥ అమూల్యసేన్, కన్హయ్య చటర్జీ, షోమ్ వంటి రాజకీయ పరిపక్వత కలిగిన నాయకుల ఆధ్వర్యంలో వున్న యం.సి.సి.తో మాకు మంచి సంబంధాలే వుండేవి. ప్రస్తుత యుగ స్వభావానికి సంబంధించిన సమస్య, సి.పి.ఐ. (యం-యల్) ఆవిర్భావం, దళారీ నిరంకుశ బూర్జువావర్గ స్వభావం, ప్రజాసంఘం, ప్రజా ఉద్యమ స్వభావం తదితర సైద్ధాంతిక-రాజకీయ విభేదాలు కొన్ని మినహా అప్పట్లో మాకు యం.సి.సి.తో మంచి సంబంధాలే వుండేవి. రెండు పార్టీల మధ్య రెగ్యులర్‌గా సమావేశాలుండేవి. మా అనుభవాలను మార్పిడి చేసుకునేవారం. చివరకు టెక్నికల్ విషయాలలో సైతం పరస్పరం సహకరించుకునే వారం. 1987 వరకూ అటువంటి సంబంధాలు కొనసాగినాయి.

1987లో దలాల్‌చక్-బఘురా సంఘటనపై పి.యు. విమర్శించడం యం.సి.సి. నాయకత్వాన్ని ఆగ్రహపర్చింది. ఈ సంఘటనలో స్త్రీలూ, పిల్లలతో సహా 52 మంది రాజపుత్రులు యం.సి.సి.చే చంపబడినారు. దీనిని భారత విప్లవానికి ఒక నమూనాగా, మార్గంగా చిత్రించే ప్రయత్నం జరిగింది. పి.యు. తన సౌహార్ద్ర పూర్వకమైన విమర్శను యం.సి.సి. ముందుంచి ''ఎంచుకుని మాత్రమే దాడి చేయాల్సి వుండెనని, మూకుమ్మడిగా ప్రజలను చంపకూడదని, అది విప్లవకారులు వేరుపడి పోవడానికి మాత్రమే దారితీస్తుందని'' సూచించింది. అలాంటి సంఘటనలు ఒక్కోసారి పొరపాటుగా జరగవచ్చు. అలాంటి సందర్భాలలో

విప్లవపార్టీ ఆత్మవిమర్శ చేసుకోవాలి. అలాంటి సంఘటనలను ఉత్తమ నమూనాలుగా చూపించడానికి ప్రయత్నించకూడదు. ఒక సంవత్సరం తర్వాత ఈ సౌహార్ద్ర పూర్వకమైన విమర్శే పి.యు. స్థానిక పత్రికైన 'లాల్‌నిషాన్'లో ప్రచురించబడింది. దీంతో రాజకీయంగా మాపట్ల యం.సి.సి. వైఖరి మారింది. అది పి.యు.ని రివిజనిస్ట్‌గా గుర్తించటం మొదలెట్టి విశ్వాసాన్ని కోల్పోయింది. అప్పటినుండి దాని సొంత ప్రయోజనాల రీత్యా చేసినదయినప్పటికీ యం.సి.సి. ఏ విధమైన విమర్శను కూడా ఎన్నడూ సహించదని తేలిపోయింది. దాని నాయకత్వం అత్యంత నిరంకుశమైనట్టిది. విమర్శను రాజకీయంగా స్వీకరించలేదు. ఒకసారి పి.యు. పట్ల దాని రాజకీయ వైఖరిలో మార్పువచ్చాక రెండు పార్టీల మధ్య నెలకొన్న ప్రతి విభేదాన్ని సైనిక పరంగా పరిష్కరించుకోడానికే అది ప్రయత్నించింది. ప్రస్తుత విషాదం కూడా అందుకే మొదలయింది.

**ప్రశ్న: మీ మధ్య ఘర్షణలకు యం.సి.సి. రెండు ప్రధాన కారణాలను ఎత్తి చూపుతోంది. ఏరియా విభజనపై ఉమ్మడి ఒప్పందాన్ని మొట్టమొదటగా పి.యు. పార్టీయే ఉల్లంఘించిందని, 1990లో సత్యనారాయణ్ సింగ్‌ను చంపటం ద్వారా యం.సి.సి.పై పి.యు.నే మొదటి దాడి జరిపిందన్నది దాని ఆరోపణ. ఈ ఆరోపణ వెనుక సత్యముందా?**

**జవాబు:** యం.సి.సి. నాయకత్వం చూపించిన రెండు కారణాలు కేవలం నవ్వు తెప్పిస్తాయంతే. వారు మొత్తంగా అబద్ధాలాడుతున్నారని మేమనటం లేదు. కానీ వారివి అర్థసత్యాలు మాత్రమే. అంతకంటే ముఖ్యంగా మాకు వ్యతిరేకంగా వారి దాడిని సమర్థించుకోడానికి మాత్రమే ఇపుడు సాకులు వెతుక్కుంటున్నారు. మీకర్థం చేయించడానికి నేను చరిత్ర లోతుల్లోకి పోవాల్సి వుంటుంది.

సాంకేతికంగా చెప్పాలంటే మొట్టమొదట అతిక్రమణ పి.యు. పక్షం నుంచే జరిగిందని మేం అంగీకరిస్తాం. 1982లో పలాము రీజియన్‌లోని నవీనగర్ (ఔరంగాబాద్) కోసం మా మధ్య మొట్టమొదటి విభజన చోటు చేసుకుంది. ఔరంగాబాద్-దాల్‌టోన్ గంజ్ రోడ్‌కి పశ్చిమంగా పి.యు. తన కార్యాచరణను పరిమితం చేసుకోగా యం.సి.సి. అదే రోడ్డుకు తూర్పుముఖం వేపుకు పరిమితమయింది. తర్వాత మగధ్ రీజియన్ కోసం ఏరియా విభజన జరిగింది. మగధ రీజియన్‌లో రెండు పక్షాల మధ్య ఆమోదింపబడిన సరిహద్దుల వైపుకు పి.యు. ఆధ్వర్యంలోని సాయుధ రైతాంగ వుద్యమం శరవేగంగా వ్యాపించింది. తకారి-కుర్తా సరిహద్దుకు ఆవలివైపున యం.సి.సి.కి ఏ నిర్మాణం లేకపోగా ఆ ఏరియాలోకి 'లిబరేషన్ గ్రూప్ శరవేగంగా పురోగమించింది. తర్వాత ఏరియా పునర్విభజనకు పి.యు. ప్రతిపాదించగా యం.సి.సి. అంగీకరించింది. కొత్తగా సరిహద్దులు నిర్ణయించుకున్నాము. రెండుపక్షాల నుండి ఏరియా అతిక్రమణకు సంబంధించిన కొన్ని సందర్భాలున్నప్పటికీ 1989 వరకూ ఈ ఒప్పందం సమర్థంగానే కొనసాగింది.

పి.యు. ద్వారా మొట్టమొదటి ఉల్లంఘన 1981-83లో ఔరంగాబాద్-ఛతర్‌పూర్ ఏరియాలో జరిగింది. ఉమ్మడి ఒప్పందం ప్రకారం సాంకేతికంగా యం.సి.సి. పరిధిలో వుండిన రైల్వేలైన్‌కి తూర్పు ప్రాంతంలో పి.యు. కొన్ని సంబంధాలు పట్టుకుంది. ఆ సమయంలో అక్కడ యం.సి.సి.కి నిర్మాణం లేనందువల్ల ఈ సంబంధాలను మేం ఆర్గనైజ్ చేయటానికి మొదలెట్టాం. ఇది రెండు పార్టీల మధ్య ఎలాంటి ఉద్రిక్తతలనూ పెంచలేదు. ఏదేమైనా పి.యు. స్వయంవిమర్శ చేసుకున్నది. రెండు పక్షాలూ నూతన సరిహద్దుపై ఒప్పందానికొచ్చాయి. ఆ విధంగా 1983 నాటికే సమస్య సానుకూలంగా పరిష్కారమైపోయింది. కాని పి.యు. చేసిన ఏరియా అతిక్రమణను యం.సి.సి. దశాబ్దం తర్వాత అతిక్రమించింది పి.యు.నే అంటూ పెడబొబ్బలు పెడుతూ సాంప్రదాయకంగా మా బలమైన ప్రాంతాల్లోకి సైతం విధి విరామం లేకుండా చొచ్చుకుని పోతోంది. పి.యు. నుండి ఏరియాలోని అత్యధిక భాగాన్ని చేజిక్కించుకోవాలని యం.సి.సి. సంస్థాగత నిర్ణయాన్ని తీసుకుంది. దీన్ని సాధించడానికి యం.సి.సి. తన సాయుధ శక్తినంతటినీ సమీకరిస్తోంది.

**ప్రశ్న: ఘర్షణలకు సంబంధించి యం.సి.సి. ఎత్తిచూపుతున్న రెండో ప్రధాన కారణం గురించి చెబుతారా?**

**జవాబు:** అది మరింతగా అపవాదాలతో కూడుకున్నది. మొదటగా, యం.సి.సి.పై తొలి దాడిని మేమే మొదలెట్టామన్నది నిజం కాదు. సత్యనారాయణ్‌ను నిర్మూలించేందుకు ముందు మా ఇద్దరు కామ్రేడ్లను (ఛతర్‌పూర్‌లోని బద్వారాకు చెందిన రామ్‌విలాస్ భుయా, మానికాలోని బర్వాహికి చెందిన మహేందర్ ఆర్యాన్) యం.సి.సి. 1988, 1989 లలో చంపివేసింది. వారు మొదటగా చేసిన ఈ రెండు హత్యల పట్ల మౌనం వహిస్తుండగా, సత్యనారాయణ్ విషయాన్ని చివరికి కేంద్రస్థాయిలో ఒక సమస్యగా లేవనెత్తారు. కాని 1990లో మేం సత్యనారాయణ్‌ను అతడు యం.సి.సి. కార్యకర్త అయినందుకుగాక వర్గ శత్రువు అయినందుకే చంపాం. జెహానాబాద్ జిల్లా కార్పి బ్లాక్‌లోని చౌహార్ ప్రాంత వాసి అయిన సత్యనారాయణ్ అనందఘుర్ ఎస్టేట్ భూస్వామి చంద్రమౌళిశర్మకు పేరుమోసిన తొత్తుగా వుండేవాడు. పోలీస్ ఏజెంట్‌గా పనిచేసి పలు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నాడు.

1975-76 లోనే ఆ ఏరియాలో సి.పి.ఐ. వునికిలో వున్నపుడు ఒక అమ్మాయితో చెడ్డగా వ్యవహరించినందుకే సత్యనారాయణ అతడి దాయాది ఇద్దరూ ప్రజా పంచాయితీలో శిక్షింపబడినారు. మా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు భూస్వామి చంద్రమౌళి శర్మ భూమిని స్వాధీనం చేసుకున్నపుడు సత్యనారాయణ నమ్మినబంటులా వ్యవహరించి ఆ భూమిలోని కొంత భాగాన్ని పలువురు వ్యక్తులకు అమ్మటానికి తలపెట్టాడు. భూస్వామి రైఫిల్‌ని మా దళం స్వాధీన పర్చుకోడానికి వెళ్లినపుడు సత్యనారాయణ భూస్వామికి దన్నుగా ముందుకొచ్చాడు. తన లైసెన్సు వున్న తుపాకితో కాల్పులను కూడా మొదలెట్టాడు. మరో సందర్భంలో అతడు ఇద్దరు లంపెన్‌లతో కలిసి పి.యు. స్థానిక ఆర్గనైజర్ కా॥ కమలేష్‌ని పట్టుకుని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారమిచ్చాడు. అయితే పోలీసులు రావటానికి ముందే ప్రజలు అతడిని విడిపించారు. అప్పుడు సత్యనారాయణ్ పి.యు. మద్దతుదార్ల పేర్లను పోలీసులకిచ్చాడు. పి.యు. ఆర్గనైజర్ రామానంద యాదవ్ తండ్రిని కొట్టేందుకు కూడా పోలీసులను పురికొల్పి, పార్టీకోసం పనిచేయటం నుండి కొడుకును ఆపకపోతే తీవ్ర పరిణామా లుంటాయని హెచ్చరించాడు. తన ఇంటిముందున్న బంజరు

భూమిని ఆక్రమించి అక్కడ ఇళ్ళు కట్టకుండా అడ్డుకున్నాడు. 1983లో అతడు గ్రామంలోని ఒక రైతు కుటుంబంపై కాల్పులు జరిపి రైతు కొడుకును గాయపర్చాడు. గతంలో సత్యనారాయణ కొంతకాలంపాటు 'లిబరేషన్'లో వుండినాడు. అయితే ఆ గ్రూపు ప్రభావం క్షీణించటంతో తన గూండాయిజాన్ని కొనసాగించేందుకు యం.సి.సి.లోకి గెంతేశాడు. ఎందుకంటే యం.సి.సి. పలుకుబడి ఇంకా పెద్దది.

సత్యనారాయణ నిర్మూలించబడాల్సిన విషపాము అని మేం ఎప్పట్నుంచో చెబుతూ వచ్చాం. ఏమయినప్పటికీ మా ఒకే ఒక్క స్వయంవిమర్శ ఏదంటే...అతడు 'యం.సి.సి. మనిషి' గా ఉండేవాడు కాబట్టి ఆ సందర్భంలో మేం అతడిని చంపకుండా వుండాల్సింది. సత్యనారాయణ్‌ని తమ 'అమరుడి'గా యం.సి.సి ప్రకటిస్తూ వున్నందున, మా ఏరియాలలో యం.సి.సి.కి సామాజిక పునాదిగా వున్న శక్తుల స్వభావాన్ని అంచనా వేసే విషయాన్ని ప్రజలకే వదిలి పెడుతున్నాం. సరే....1990లో సత్యనారాయణను చంపటం ద్వారా మేం తప్పు చేశామని వారు భావిస్తున్నట్లయితే అది గత కొన్ని సంవత్సరాలుగా డజన్లకొద్దీ మా కామ్రేడ్లను చంపేందుకు కారణంగా ఎలా వుంటుంది? నిజానికి సత్యనారాయణ్ హత్య తర్వాత అప్పటి పి.యు. పలుసార్లు యం.సి.సి.తో జరిపిన ద్వైపాక్షిక సమావేశాలలో ఆ సమస్య పరిష్కారమయిందనే మేం భావించాం. ఈ రోజు అది పి.యు.ను తుడిచిపెట్టేందుకుగాను కుంటిసాకుగా మాత్రమే వుంది. సత్యనారాయణ్ భూతం అతడు మరణించిన పలు సంవత్సరాల అనంతరం యం.సి.సి. వద్దకు వున్నట్లుండి వచ్చింది. ఇప్పుడు వారు అతడిని చంపిన 'నేరస్తుల'పై ప్రతీకారం చేర్చుకుంటున్నారు మరి!

**ప్రశ్న: యం.సి.సి.కి పి.యు.కి మధ్య ఘర్షణలను తప్పించటానికి ఇంతకుముందు జరిగిన ప్రయత్నాలేమిటి?**

**జవాబు:** కేంద్ర, రాష్ట్ర, రీజియనల్ స్థాయిలో పలు సమావేశాలు జరిగాయి. 1995 జనవరిలో జరిగిన కేంద్రస్థాయి సమావేశంలో ఒక ప్రవర్తనా నియమావళిని కూడా ఏర్పర్చటం జరిగింది. కొన్ని చెదరు మదురు సంఘటనలు మినహాయిస్తే, రెండు పక్షాలూ ప్రవర్తనా నియమావళికి కట్టుబడిన కారణంగా మొత్తంమీద పరిస్థితి మెరుగుపడిందని 95 ఆగస్ట్ సమావేశం నిర్ధారించింది. అయితే ఈ సమావేశం తర్వాత కేవలం మూడు నెలల స్వల్పకాలంలో మూడు విభిన్న సంఘటనలలో యం.సి.సి. దాడిచేసి ఒక కమాండర్‌తో సహా ముగ్గురు పి.యు. కామ్రేడ్స్‌ను చంపివేసింది.

1996 ఆగస్ట్‌లో మరొక రాష్ట్రస్థాయి సమావేశం, 1996 డిసెంబర్‌లో కేంద్రస్థాయి సమావేశం జరిగి ఘర్షణలు నివారించేందుకు తిరిగి నిర్ణయాలు తీసుకోవటం జరిగింది. 96 డిసెంబర్ సమావేశంలో రెండుపక్షాలూ ఆమోదించిన మార్గదర్శక సూత్రాలు విధించిన షరతులేవంటే...రెండు వైపులనుండీ క్యాడర్లపై సానుభూతిపరులపై బెదిరింపులు, దాడులను వెంటనే ఆపివేయాలి. ఒకరి ఏరియాలో చేపట్టిన పోరాటాలలో మరొకరు జోక్యం చేసుకోకూడదు. ప్రారంభం నుండి కూడా ఒక పార్టీ ప్రగతి నిరోధకులుగా, భూస్వాములుగా, లంపెన్లుగా ఆరోపించిన వారిని మరొక పార్టీ ప్రోత్సహించకూడదు. ఒక పార్టీ నుండి బహిష్కరింప బడిన వ్యక్తిని మరొక పార్టీ చేర్చుకోవాలనుకున్నపుడు ఇరుపార్టీలూ పరస్పరం సంప్రదించుకోవాలి. ఆ వ్యక్తిపై ఆరోపణలు ఉన్నట్లయితే ఆ రెండోపార్టీ ఆ వ్యక్తితో ఎలాంటి సంబంధాన్ని పెట్టుకో కూడదు...వగైరాలు.

అయితే హాస్యాస్పదంగా, పై మార్గదర్శక సూత్రాలను రూపొందించుకున్న ఈ సమావేశం (96 డిసెంబర్) తర్వాతే మాకు వ్యతిరేకంగా యం.సి.సి. దాడులు మొదలయినాయి. 96 ఆగస్ట్, డిసెంబర్ సమావేశాల్లో మాపై బలవంతంగా మోపేందుకు ప్రయత్నించిన వారి ఏరియా విభజన పథకాన్ని మేం ఆమోదించక పోవటమే దానికి కారణం. యం.సి.సి. ప్రతిపాదనను ఆమోదించట మంటే పి.యు.కి ఆత్మహత్యా సదృశ్యమే అవుతుంది. ఎందుకంటే ఆ పథకం ప్రకారం పలామూలోని పి.యు. పని ప్రాంతంలోని 60 శాతాన్ని మధ్య బీహార్‌లోని 40 శాతం పని ప్రాంతాన్ని యం.సి.సి.కి వదిలేయాల్సి వుంది. పి.యు. శవాలమీద తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలని వారనుకున్నారు. వాస్తవానికి శాసనం లాంటి ఈ ప్రతిపాదనకు పి.యు. అంగీకరించక పోవటంతో యం.సి.సి.లోని 'పెద్దన్న' రెచ్చిపోయాడు. అందుకని పాశవిక బలంతో ఏరియా నుండి మా దళాలను పారద్రోలాలని అది నిశ్చయించింది. 96 డిసెంబర్ సమావేశంలో ఏర్పర్చుకున్న మార్గదర్శక సూత్రాలు ప్రజల్లో వాడుకోవడానికే అయినందువల్ల, వాస్తవానికి అప్పటినుండే యం.సి.సి. తాను నిర్దేశించుకున్న ఏరియా పునర్విభజన పథకానికి అనుగుణంగా పి.యు. పనిచేస్తున్న ఏరియాలో అత్యధిక భాగంలో నుండి పి.యు. దళాలను నిర్మూలించాలని నిర్ణయించుకున్నందు వల్లనే 97లో హంతక దాడులు పెరుగుతూ వచ్చాయి.

96 డిసెంబర్ 30న చిల్‌హో (ఛత్రపూర్)లో మా మద్దతుదారుడైన లల్లూసింగ్ చంపబడ్డాడు. 1997 మార్చి 22న మా దళం ఒక షెల్టర్‌లో విశ్రాంతి తీసుకుంటూండినపుడు యం.సి.సి. దళాలు దాడిచేసి కమాండర్ హరీందర్‌తో సహా మా కామ్రేడ్స్ ముగ్గురిని చంపేశాయి. ఆయుధాలన్నింటినీ కొల్లగొట్టారు. వెనువెంటనే మార్చి 29న వారు మా దళాన్ని చర్చలకోసం భండారియా (గర్వా)లోని బధ్వార్ గ్రామానికి ఆహ్వానించి వున్నట్లుండి దళాన్ని లొంగదీసుకుని ఆయుధాలన్నింటినీ తీసుకుని పోయారు. నిరంతరం పెరుగుతున్న యం.సి.సి. దాడుల కారణంగా మా బీహార్ రాష్ట్రకమిటీ 97 జూలై నాటి సమావేశంలో ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

**ప్రశ్న: పి.యు., యం.సి.సి.ల మధ్య తదుపరి చర్చలు జరిగినాయా?**

**జవాబు :** ఆ... అవును కేంద్రస్థాయిలో అటువంటి చిట్టచివరి సమావేశం 97 నవంబర్‌లో జరిగింది. ఒక కేంద్ర పరిశీలక బృందాన్ని ఏర్పర్చి, 1998 ప్రారంభం నుండి సంఘటనలపై విచారణ జరిపించాలని ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. అయితే ఈ సమావేశం జరిగిన వెంటనే యం.సి.సి. ఒక వుత్తరం రాసింది. దాంట్లో అంతవరకు ఆమోదించిన నిర్ణయాలన్నింటినీ తిరగదోడారు. కేంద్ర పరిశీలక బృందం గురించిన ప్రతిపాదనను చెత్తబుట్టలోకి విసిరేశారు. నిర్ణయాలు తీసుకోవటం, వాటిని

అధిగమించటం లేదా తిరగదోడటం, ఆ తరువాత ఎదుటిపక్షమే నిర్ణయాలను అతిక్రమించిందని ప్రచారానికి లంకించుకోవటం లేదా అటువంటి నిర్ణయాలేవీ లేవని చాలా తేలిగ్గా ప్రకటించేయటం...ఇదీ యం.సి.సి. వరస. (ఒప్పందాలు నోటిమాటలుగా వున్నపుడు చాలా తరచుగా ఇలా జరుగుతుంటుంది) ప్రజల్ని గందరగోళ పర్చేందుకుగానూ దొంగే 'దొంగ దొంగ' అని ఎలుగెత్తి అరిచిన విషయాన్ని వారు మనకు గుర్తుకు తెస్తారు.

సారాంశంలో, మొదట్లో, యం.సి.సి. దృష్టిలో ద్వైపాక్షిక చర్చలంటే దాని కేంద్ర పథకానికనుగుణంగా తన ఏరియాలను మరింతగా విస్తరించుకోవడానికి సాధనం మాత్రమే. ఏరియా విభజనకు సంబంధించిన వారి ప్రతిపాదన ఆమోదించబడనపుడు (పి.యు. ఏరియాలను స్వాధీనం చేసుకోవడమే దాని అసలైన అర్థం) వారు మొత్తంగా చర్చలనే నిలిపివేశారు. బీభత్సపూరితమైన కేంపెయిన్‌ని వారు మొదలెట్టారు.

రెండోది. అప్పటి పి.యు.తో ద్వైపాక్షిక చర్చల సమయంలో యం.సి.సి. ఎల్లప్పుడూ పెద్దన్న తత్వాన్నే ప్రదర్శిస్తూ వచ్చింది. ఎజెండాను, తేదీలను సైతం అది తన ఇష్టానుసారంగా మార్చేసేది. సమావేశాల స్థాయి కేంద్ర, రాష్ట్ర, లేక రీజియనల్...ఏ స్థాయిలో వుండాలన్న విషయం కూడా ఏకపక్షంగా వారే నిర్ధారించేవారు. ఉదా॥కు ఒక సమావేశం కేంద్రకమిటీ సభ్యుల ప్రాతినిధ్యంతో కూడి వున్నప్పటికీ తన ప్రయోజనాలకు అది సరిపోయేటట్లుగా వున్న సందర్భంలో యం.సి.సి. దాన్ని రాష్ట్రస్థాయి సమావేశంగానే పిలిచేది. ఇకపోతే, రెండుపక్షాలూ ఆమోదించిన నిర్ణయాలూ, మార్గదర్శక సూత్రాలూ, ప్రవర్తనా నియమావళి వంటి వాటిని యం.సి.సి. ఎన్నడూ లెక్కపెట్టేది కాదు, గౌరవించేదీ కాదు.

**ప్రశ్న: సాంప్రదాయకంగా మీకు పట్టున్న ప్రాంతాల్లో కూడా యం.సి.సి. దళాలు ప్రవేశిస్తూ వస్తున్నాయని, దాడులు నిర్వహిస్తున్నాయనీ మీరంటున్నారు గదా! కొద్దివేరకయినా అక్కడ వారికి సామాజిక పునాది లేకుండా ఇదెలా సాధ్యం?**

**జవాబు:** ప్రధానంగా నేను తడమాలనుకున్న ప్రశ్నే ఇది. సాధారణంగా చెప్పాలంటే, దాని బలమైన ప్రాంతాలతో సహా ఒక విప్లవపార్టీ ప్రభావంలో వున్న ప్రతి గ్రామంలోనూ కొంతమంది వ్యక్తులు పార్టీతో తమకున్న జగడాలను తేల్చుకోవడానికై తగిన అవకాశం కోసం ఎదురుచూస్తూ వుండటం సాధ్యమే. ఇలాంటి వ్యక్తులు భూస్వాములు కావచ్చు వీరి భూముల్ని ప్రజలు పార్టీ ఆధ్వర్యంలో ఆక్రమించుకుని వుంటారు; ప్రజాకోర్టులో శిక్షింపబడిన బందిపోట్లు కావచ్చు. చిల్లర దొంగతనం అత్యాచారం, అమ్మాయిలను వేధించటం, లేక రౌడీయిజంకు గానూ జరిమానా కట్టేలా ఒప్పించబడిన లంపెన్లు కూడా కావచ్చు లేక వారు పోలీస్ ఏజెంట్లు కూడా కావచ్చు. దీనికి తోడుగా నిధుల దుర్వినియోగం, స్త్రీలపట్ల దుష్ప్రవర్తన లేక ఇతర దుశ్చర్యలు వంటి పలు కారణాలవల్ల పార్టీ నుండి బహిష్కరింపబడిన వారూ వున్నారు. పార్టీపట్లా, విప్లవంపట్ల చెడ్డ తలంపు కల్గివున్న ఈ ప్రజా వ్యతిరేక దిగజారుడు శక్తులంతా వారికి మేలు కల్గించే ఏ పార్టీలోకి అయినాసరే సులభంగా లంఘించగలరు. మా ఏరియాలలో యం.సి.సి.కి సామాజిక పునాది నేర్పర్చినది ప్రధానంగా ఈ తరహా వ్యక్తులే.

ఈ తరహా వ్యక్తులపై ఆధారపడి యం.సి.సి. కోయిల్-కైమూర్, మగధ రెండు రీజియన్లలోనూ 'పి.యు. బాధిత వ్యక్తులు' పేరుతో పి.యు.కి వ్యతిరేకంగా పలు కరపత్రాలు వేసింది. ఏరియాలోని భూస్వామ్య ప్రైవేట్ సేనలకు ప్రధాన మద్దతుదార్లుగా పదే పదే పనిచేసింది ఈ శక్తులే. ఏ ఇతర ప్రత్యామ్నాయమూ లేనందువల్ల ప్రజాధికారం ముందు లొంగిపోయిన ఈ శక్తులను తమ పార్టీలోకి లేక ప్రజాసంఘాలలోకి తీసుకుని లేక కేవలం రక్షణ కల్పించటం ద్వారా యం.సి.సి. వారికి తిరిగి జీవం పోసింది. ప్రజాశక్తివల్ల మూగబోయిన కిసాన్ సంఘ్ క్రిష్ణ చేతన పరిషత్, లోరిక్‌సేన, సన్‌లైట్ సేన వగైరాల వంటి భూస్వామ్య సేనలకు చెందిన వారు యం.సి.సి. మద్ధతుతో తిరిగి పుంజుకున్నారు.

ఉదా॥కు మల్బారియా వూచకోతలో పేరొందిన శేష్‌మణి నేడు యం.సి.సి కిరీటంలో కలికితురాయి. సన్‌లైట్‌సేన బందిపోటు యం.ఐ.ఎ. వినోద్‌సింగ్ సోదరుడైన విశ్వనాథ్‌సింగ్ (విశ్రాంపూర్ లోని ఓబారాకి చెందినవాడు); కిసాన్ సంఘ్ అధ్యక్షుడు రామ్‌దయాళ్ యాదవ్ విశ్రాంపూర్‌కి చెందిన ముక్కా యాదవ్ తదితరులు యం.సి.సి.కి బలమైన మద్ధతుదారులు.

ఇలాంటి సామాజిక పునాదితో యం.సి.సి. ఏడెనిమిదేళ్ళ క్రితం మా ఏరియాలలోకి ప్రవేశించినప్పటి నుండి ఏ భూస్వామికీ, ప్రైవేట్ సేనలకు లేక రాజ్యానికి వ్యతిరేకంగా ఏ పోరాటాన్ని (ఒకటి, రెండు మినహాయిస్తే) అది చేపట్టలేదు. యం.సి.సి. తుపాకులు ఎల్లప్పుడూ పి.యు. కేడర్‌కి లేక పి.యు.ని బలపర్చిన ప్రజలకు వ్యతిరేకంగానే గురిపెట్టి వుండేవి. అది మిత్రులను వర్గ శత్రువులుగా, వర్గ శత్రువులను మిత్రులుగా మార్చివేసింది. యం.సి.సి. చేపట్టిన ఈ నూతన ''భారత విప్లవ వ్యూహం'' దాన్ని ఎక్కడికి తీసుకెళుతుంది? ఈ లంపెన్లపై, భూస్వామ్య శక్తులపై ఆధారపడిన యం.సి.సి. తలపెట్టిన పాశవికదాడిలో కొద్దిమంది కేడర్లనూ, నాయకత్వాన్ని మేం నష్టపోయి వుండవచ్చుగాక. అయితే దాని సొంత భవిష్యత్తు ఎలా వుండబోతుంది? దాని వర్గశత్రువులే దాని రక్షణ పునాదిగా మారుతున్నపుడు దాని ఆయుధ బలాధిక్యత దాని విప్లవ స్వభావాన్ని నిలబెట్టగలదా? ఈ విషయమై తీవ్రంగా ఆలోచించమని యం.సి.సి.ని అభ్యర్థిస్తున్నాం.

**ప్రశ్న: ఆచరణలో యం.సి.సి. పంథాకి సంబంధించి పై వర్గ పొందికలో ఈ మార్పులో వున్న రాజకీయ ప్రభావం ఏమిటి?**

**జవాబు:** దీనిగురించే మేం భయపడ్తున్నాం. ఒక కమ్యూనిస్టు చేయగూడని పనులను వారు చేస్తున్నారు. అవేమిటంటే? పీడిత ప్రజలపై దాడులు డెమా (పాంకీ), సిల్దిలియా (మనాటు), గులాబిటోలా (అధారి) వంటి సంఘటనలు మచ్చుకు కొన్ని; దేవగన్, ఛాంపి, జెల్వారా, రత్నాగ్ తదితర ప్రాంతాల్లో దళాలపై దాడులు; ముషాహరిలో కా॥ శత్రుఘున్ సింగ్, కుర్తాలో కా॥ బైరాజు, భన్‌రువాలో జయానందన్ యాదవ్, విశ్రాంపూర్‌లో దేవ్‌లాల్‌పాల్ తెస్లిగంజ్‌లో దుఖి ఉరావన్ తదితర ప్రజాసంఘాల నాయకులను చంపటం; ఇప్పటికే మా పార్టీ సానుభూతిపరులను 50 మందిని వారు చంపేశారు. బెలోరాలో, విశ్రాంపూర్‌లోని రత్నాగ్‌లో, కుర్దాలోని కడిలా తదితరచోట్ల ప్రజా పంచాయితీలపై, బహిరంగ సభలపై

సాయుధ దాడులు; జెహానాబాద్‌లోని సెవనాన్, పాంకిలోని జెథీరా, కస్మార్, విశ్రామ్‌పూర్‌లోని ఘూసిదాగ్, ఛత్రపూర్‌లోని కాలాపహాడ్, జాప్లాలోని బరేలీ, పొఖారిల తదితర సంఘటనలలో లాగా పార్టీ ఆర్గనైజర్ల, ప్రజాసంఘ నాయకుల ఇండ్లను నాశనం చేయటం, లేక తగులబెట్టడం, వారి ఆస్తులను లూటీ చేయటం. మా ఆర్గనైజర్ల, కార్యకర్తల కుటుంబ సభ్యులను కొట్టడం వగైరా వగైరాలు... భూస్వాముల సేనలు లేక ప్రభుత్వ ఫాసిస్ట్ సాయుధ బలగాలు మాత్రమే ఇలాంటి పాశవిక చర్యలకు పాల్పడతాయని ఎవరయినా ఊహించగలరు.

ఈ సంఘటనలలోని కొన్ని నిజంగా భయానకమైనట్టివి, మధ్యయుగాల అనాగరికత్వాన్ని అవి గుర్తుకు తెప్పిస్తాయి. ఉదా॥ మా యం.కె.యస్.పి. ఆర్గనైజర్ దేవ్‌లాల్‌పాల్ చంపబడిన తీరును చూస్తే అది ఏ మనిషినయినా అవమానంతో తలదించుకునేలా చేస్తుంది. దేవ్‌లాల్ గొంతును పలుచోట్ల కోసేసారు. అతడి పొట్టను చీరేశారు. బీజాలను కత్తిరించారు. పేగులను వెలికితీసి ముఖంమీద పరిచారు. అతని మృతదేహాన్ని ఈడ్చి ప్రధాన రహదారిపై వదిలారు. ఇలాంటి పనిని ఎవరయినా ఎలా చేయగలరు? చేసి ఇంకా తాము కమ్యూనిస్టులుగా ఎలా చెప్పుకోగలరు? (దీనిని వర్ణిస్తున్నపుడు కా॥ శ్రావణ్ ముఖంలో ద్వేషంకన్నా బాధ, విషాదమే కనిపించాయి). ఒక నెల తర్వాత 98 అక్టోబర్ 25న జరిగిన మరో సంఘటనలో రత్నాగ్‌కి చెందిన ఆ గ్రామంలోనే అయిదుగురు మా దళసభ్యులను చంపివేసి వారి శవాలను కొంతదూరం ఈడ్చి వారి ముఖాలను రూపులేకుండా చెడగొట్టేశారు. 99 మార్చి 13న ఔరంగాబాద్ జిల్లాలోని సొంత వూరైన అమరపుర గ్రామంలో వైద్యం చేయించుకుంటున్న కా॥ సత్యేంద్ర (కపిల్‌దార్ పాల్)ని చంపి తల నరికి పొట్టను ముక్కలు ముక్కలుగా చీరేశారు. ఇతడు కోయిల్-కైమూర్ రీజియన్ దక్షిణ జోనల్ కమిటీ సభ్యుడు. పోతే యం.కె.యస్.పి. ఆర్గనైజర్ యుగేశ్వర్ రాణాని చంపిన సంఘటననే తీసుకోండి. పలాములోని సొంత గ్రామమైన గాడ్గోమా నుండి అతనిని తీసుకుపోయి రెండురోజులు చిత్రహింసలు పెట్టి తరువాత చంపేశారు. అతడి తలను శరీరం నుండి వేరుచేసి తీసుకుపోయారు.

ఈ కిరాతకమైన, అమానుషమైన చర్యలు ఏ నాగరిక మానవుడినైనా విన్నంతనే భయకంపితుడిని చేస్తాయి. చివరకు వర్గశత్రువులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అవకాశమున్న సందర్భాలలో సైతం ఒక కమ్యూనిస్టు ఇలాంటి పనిని చేయబోడు. అత్యంత విద్వేషపూరితమైన, లేక శాడిస్టు బీజాలు నాటబడిన వారు మాత్రమే ఇలాంటి ప్రతీకార చర్యల నుండి సంతోషాన్ని పొందగలరు. మా ఏరియాలలో యం.సి.సి. నేరస్థ, లంపెన్ స్వభావం తీవ్రస్థాయికి చేరుకున్నదని ఈ చర్యలు చూపుతున్నాయి.

పోతే, మూడు హృదయ విదారక సంఘటనల ద్వారా మా ఏరియాలో యం.సి.సి. ప్రజా వ్యతిరేక స్వభావం అత్యంత స్పష్టంగా బయటపడింది. మొదటిదైనా 'డెమా' సంఘటనలో భూస్వామి భూమినాక్రమించిన నేరానికిగానూ భూమిలేని ప్రజలపై దాడిచేసి ఒక మహిళతో సహా ముగ్గురిని చంపేసింది. ప్రజలు ఆక్రమించిన భూమిని కొన్నవారివైపే యం.సి.సి. నిలిచింది. రెండోది నిరుపేదలైన మాస్జీకుల ప్రజల చూరిళ్ళను దహనం చేసిన గులాబిటోలా సంఘటన. దీంట్లో శాసన సభ్యుడైన అతారి రాజేంద్రయాదవ్ సంబంధీకులైన స్థానిక దోపిడీదారుల పక్షాన యం.సి.సి. నిలిచింది. మూడోది పలాము జిల్లాలోని సిల్దిలియాపై దాడి సంఘటన. ఇది ప్రాథమికంగా దళిత, వెనుకబడ్డ కులాలకు సంబంధించిన పేద, మధ్యతరగతి రైతులతో కూడుకున్న గ్రామం.

ఈ ఉదా॥లు యం.సి.సి. మారుతున్న వర్గ స్వభావాన్ని, దాని పంథా, అవగాహనల్లో తీవ్ర పెడధోరణులను, దాని పెరుగుతున్న దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తాయి.

**ప్రశ్న: మీ పార్టీ కూడా తవు సానుభూతిపరులను, కేడర్లను పలువురిని చంపివేసిందని యం.సి.సి. చెబుతోంది కదా....**

**జవాబు :** 1990లలోని సత్యనారాయణ్ మొదలుకుని మేం చంపినవాళ్ళలో చాలామంది వర్గశత్రువులే. కిసాన్‌సంఘ్ అధ్యక్షుడూ, బరియాపూర్, తీస్కోర్ వూచకోతలకు సంబంధించిన ప్రధాన నిందితుడూ అయిన మీరాపూర్ (పాట్నా) రామ్‌దయాళ్ ముఖియా, (యం.సి.సి.కి చెందిన ఈ గట్టి మద్దతుదారుడి కొడుకు ఇపుడు వారి దళాల్లో చేరాడు) వంటి దుర్మార్గ భూస్వాములూ, ప్రగతి నిరోధకులూ వున్నారు. ఇక 400 ఎకరాల భూస్వామి ఇఫియార్‌ఖాన్ వున్నాడు. మేమతడిని ఖతం చేసి యం.సి.సి.కి ఒక 'అమరుడి'ని చేసిపెట్టాం; జెహానాబాద్ మాలిచక్ గ్రామానికి చెందిన బుధుయాదవ్ జెహానాబాద్‌లోని అప్రతిష్టాపరుడైన బందిపోటు రామానంద్ యాదవ్‌కి సన్నిహిత సహచరుడు. అతడి ప్రజా వ్యతిరేక, పార్టీ వ్యతిరేక చర్యలను పలు సంవత్సరాలపాటు భరించిన తర్వాత 1995లో మేం అతడిని చంపినాం. చివరకు ఇతడు పోలీసులతో పాటు మా దళంపై కాల్పులు జరిపాడు. అతడిప్పుడు యం.సి.సి. 'లాల్‌పతాక' పత్రికలో (99 జనవరి-ఫిబ్రవరి) దాని అమరుల జాబితాలో చోటు సంపాదించుకున్నాడు. స్థానిక పీడకులైన జీనందన్ శర్మ, అతడి తమ్ముడు బైద్యనాద శర్మలను మా దళాలు ఖతం చేశాయి. ఆ సమయానికి జీనందన్ యం.సి.సి.లో చేరాడని కూడా మాకు తెలియదు. ఇక కిసాన్‌సంఘ్‌గా పిలవబడే ప్రైవేట్‌సేన కార్యకర్త సుశీల్ కుమార్, ముఖ్దుంపూర్‌కి చెందిన బందిపోటు బుటామ్ యాదవ్ వున్నారు. మేమతడిని చంపినపుడు సి.పి.ఐ., యం.సి.సి. రెండూ అతడు తమ అమరుడని ప్రకటించాయి!! ఆ తర్వాత దుర్మార్గపు బందిపోటూ, ఏరియాలో రౌడీ అయిన సాధూపాశ్వాన్ కొడుకు జంగ్‌బహదూర్ పాశ్వాన్ వంటి పలువురు ఇతరులూ వున్నారు.

మా లక్ష్యాలను ఎంచుకోవటంలో మేం ఎల్లప్పుడూ జాగ్రత్తగానే వున్నాం. దుర్మార్గులైన వర్గ శత్రువులను లేక పోలీసు ఏజెంట్లను మాత్రమే మేం సాధారణంగా ఎంచుకున్నాం. దురదృష్టవశాత్తూ వీరిలో కొందరు యం.సి.సి.కి చెందినవారు. యం.సి.సి. సృష్టించిన పి.యు. వ్యతిరేక మనోద్వేగం, వున్మాదంలాగా కాక యం.సి.సి.తో అతడికి/ఆమెకి సంబంధమున్న కారణం మాత్రంగా ఏ ఒక్కరినీ మేం చంపలేదని ఘంటాపథంగా చెప్పగలం. దీన్ని ఎవరయినా పరిశీలించవచ్చు. మేం చంపిన వారి జాబితా మొత్తం ఇక్కడుంది. (అతడు 30 మందిలో వున్న జాబితాను చూపించాడు.) మరొక

హాస్యాస్పదమైన విషయమేమంటే మేం ఎవరిని చంపినా సరే, వారితో తనకెలాంటి సంబంధం లేకున్నా యం.సి.సి. వారిని తమ పార్టీ కామ్రేడ్‌గా, సానుభూతిపరుడిగా నిర్ధారించటం మొదలెట్టింది. ఏదేమైనా వారి అమరుల జాబితాలోని ముగ్గురు వాస్తవానికి బతికే వున్నారు. యం.సి.సి వ్యాపింపజేసిన అబద్ధాలు ఇవీ.

**ప్రశ్న: ఇంతకువముందు ఏరియాల పనివిభజనకి సంబంధించి యం.సి.సి.తో అప్పటి పి.యు. ఒక ఒప్పందానికి వచ్చింది. విప్లవకారుల మధ్య ప్రాంతాల పని విభజన సిద్ధాంతాన్ని నూతన కేంద్రకమిటీ (ప్రొవిజనల్) ఆమోదిస్తుందా?**

**జవాబు:** నేనింతకు ముందే చెప్పినట్లు యం.సి.సి. తీసుకువచ్చిన ఏరియా విభజన ప్రతిపాదనను అప్పటి పి.యు. ఆమోదించింది. ప్రధానంగా మా అనుభవ రాహిత్యం కారణంగానే మేమలా చేశాం ఆచరణలో అది పనిచేయలేదు. రాజకీయంగా కూడా అలా చేయటం విప్లవకారులకు సరైంది కాదు. ప్రతి పార్టీ కూడా ఒక నిర్దిష్ట ఏరియాలో లేక రీజియన్‌లో మాత్రమే పనిచేయవలసి వుంటుందనే దానర్థం.

ఆంధ్రప్రదేశ్‌లో జనశక్తి గ్రూప్‌తో అప్పటి పి.యు. అనుభవాన్ని తీసుకుంటే 'జనశక్తి ఏరియా'లలోకి పి.డబ్ల్యు. ప్రవేశిస్తే తీవ్ర పరిణామాలుంటాయని పి.డబ్ల్యు.ని జనశక్తి బెదిరించగా, (జనశక్తి తమవిగా ప్రకటించుకున్న ఏరియాలలోకి ప్రవేశించిన పి.డబ్ల్యు. కేడర్లపై జనశక్తి కొన్ని సాయుధ దాడులను సైతం నిర్వహించింది). మరోవైపున పీపుల్స్‌వార్ ఉమ్మడి సమస్యలపై కలిసి పనిచేయాలని ఒక ఏరియాను ఏ విప్లవ గ్రూప్ అయినా ఒకప్పటి ఫ్యూడల్ జమీందారుల్లాగా తమ 'జాగీరు'గా ప్రకటించటం తప్పని, ఏ పార్టీ విధానం, పంథా సరైందో ప్రజలే నిర్ణయించాల్సి వుందని జనశక్తికి నచ్చచెప్పడానికి ప్రయత్నించింది.

యం.సి.సి. కూడా ఇదే రీతిలోనే వ్యవహరిస్తోంది. వారి ప్రతిపాదనలను మేం ఆమోదిస్తే అపుడు మేం వారికి 'మంచి బాలురు'గా కనిపిస్తాం లేదంటే మేం వారికి రాక్షసుల్లాగే కనిపిస్తామన్నమాట.

ఆంధ్రలో, బీహార్‌లో మా అనుభవాలను కేంద్రకమిటీ (పొవిజనల్) సమీక్షించి, దేశాన్ని భూస్వామ్య జాగీర్లుగా విభజించడం చందాన ఏరియా పని విభజనను డిమాండ్ చేయటం ఏ విప్లవ పార్టీకైనా రాజకీయంగా సరైందని కాదని అభిప్రాయపడింది.

భారతదేశంలో పలు పార్టీలు కొన్ని రాష్ట్రాలలో ఒకే ఏరియాలలోనే పనిచేస్తున్నాయి. ప్రజల డిమాండ్లపై ఉద్యమాన్ని ఉమ్మడిగా నడిపేందుకై ఉమ్మడి కార్యాచరణ కమిటీలను, ఫోరమ్‌లను ఏర్పర్చేవిధంగానే ఒకే ఏరియాలో పనిచేస్తున్న వివిధ విప్లవ పార్టీల విధానం వుండాలి. ఈ విధానం నిజానికి వివిధ కమ్యూనిస్టు విప్లవ పార్టీలు సన్నిహితం కావడానికి విభేదాలను సౌహార్ద్రపూరితంగా పరిష్కరించుకోవడానికి సహకరిస్తుంది. యం.సి.సి. పార్టీ కేంద్రకమిటీ, ఆ పార్టీ బీహార్ రాష్ట్రకమిటీ ముందు మేం దీన్ని ప్రతిపాదించాం కానీ, వారు నిర్ద్వంద్వంగా దాన్ని తిరస్కరించారు. వారు బీహార్ సమస్య శాశ్వత పరిష్కారంగా ఏరియా విభజనకై పట్టూ విడుపూ లేకుండా మొండిగా ప్రయత్నించారు. (ఇది కూడా వారి సొంత షరతులపైనే అనుకోండి).

**ప్రశ్న: మా చివరి ప్రశ్న...బహుశా దాన్ని మీరు ఊహించగలరనుకోండి...బీహార్‌లోని ప్రస్తుత విషాదాన్ని పరిష్కరించేందు కోసం గల అవకాశాలేమిటి?**

**జవాబు :** ( కా॥ శ్రావణ్ నిస్సహాయంగా తన చేతులను ఊపాడు) అది మొత్తంగా యం.సి.సి చేతుల్లోనే వుంది. నేను వాస్తవాలను, కటిక సత్యాలను, ప్రస్తుత బీభత్స భరితమైన క్యాంపెయిన్‌ని ప్రారంభించడంలో యం.సి.సి. వైఖరిని, పథకాలను మీకు వివరించాను. వారు ఘర్షణలను ఆపడానికి నిర్ణయించి చర్చలకు వస్తే సమస్య పరిష్కారమవుతుంది. అయితే మరింత ఆందోళన కల్గించే పరిణామమేమంటే లంపెన్లు, దిగజారిన వ్యక్తులు, ఫ్యూడల్ శక్తులు యం.సి.సి. పక్షంలో చేరటమే. యం.సి.సి. నాయకత్వం తక్షణం పరిష్కార చర్యలను తీసుకోకుండా వీరి చేతుల్లోనే చిక్కుకుపోతే అటువంటప్పుడు వారిని సంపూర్ణంగా దిగజారిపోవడం నుండి ఎవ్వరూ ఆపలేరు.

ఇవన్నీ వున్నప్పటికీ మొత్తంగా చూస్తే యం.సి.సి. ఇప్పటికీ తన విప్లవకర స్వభావాన్ని నిలుపుకొంటూన్నదని మేం భావిస్తున్నాం. అయితే దాని దుష్టశక్తులను అది స్వయంగా ప్రక్షాళన చేయకపోతే, ప్రత్యేకించి జెహనాబాద్, పలామూలలోని మాకు సాంప్రదాయకంగా బలమైన ప్రాంతాలలో, దాని ఆచరణలోంచి పుట్టుకొస్తున్న వర్గ మిలాఖత్తు ధోరణుల నుండి అది బయటపడకపోతే తన విప్లవ స్వభావాన్ని అది కోల్పోవచ్చని మేం భావిస్తున్నాం. తన గాలింపు చర్యలను అది తక్షణం నిలిపివేయాలి. మా ఏరియాలలో యల్.యమ్.జి., యస్.యల్.ఆర్.లతో కూడిన ప్రత్యేక సాయుధ దళాలను ఉపసంహరించుకోవాలి. యం.సి.సి. చేస్తున్నటువంటి వెంటాడి నిర్మూలించే తరహా సాయుధ చర్యలను ప్రభుత్వ సాయుధ బలగాలు సైతం చేపట్టలేదు. నేను భయపడుతున్నట్లు ఇదే కొనసాగినట్లయితే సంఘర్షణ పరిష్కారానికిగల అవకాశాలు సన్నగిల్లుతాయి. యం.సి.సి. మద్ధతుగల వర్గ శత్రువుల దాడుల నుండి మా వర్గం, ప్రజల రక్షణకోసం, మా సొంత మనుగడ కోసం మేం కూడా ఎదురు పోరాటం చేయాల్సి వుంటుంది.

అయితే మేం పూర్తిగా విశ్వాసాన్ని కోల్పోలేదు. ఇప్పటికైనా యం.సి.సి. నాయకత్వం వివేచనతో వ్యవహరిస్తుందని భావిస్తాం. యం.సి.సి.కి సుసంపన్నమైన విప్లవ సంప్రదాయముంది. వర్గ మిలాఖత్తు బురదగుంటలోకి, తోటి విప్లవకారులకు వ్యతిరేకంగా పాశవిక భయానక క్యాంపెయిన్‌లోకి ఇక వెలికిరాలేనంతగా కూరుకుపోవడాన్ని సహించని నిజాయితీగల వివేచనగల దాని కేడర్లు వున్నారు. తన వామపక్ష వాగాడంబరం, మితవాద రివిజనిస్టు ఆచరణల ద్వారా మాకు వ్యతిరేకంగా అబద్ధాలు, అపనిందలతో యం.సి.సి. నాయకత్వం తన కేడర్లను, ప్రజారాశులను దీర్ఘకాలం మోసగించలేదని కూడా మాకు తెలుసు. రక్తపాతాన్ని ఆపేందుకు చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి వారి నాయకత్వంపై ఒత్తిడి పెరుగుతుందని మేం ఆశిస్తున్నాం.

**ప్రశ్న: కేడర్‌కి, ప్రజలకి మీ పిలుపేమిటి?**

**జవాబు :** ఫ్యూడల్ శక్తులకు, భూస్వాముల దుర్మార్గపు రణవీర్‌సేనకు, ఇతర ప్రైవేట్ సేనలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలని ప్రభుత్వ సాయుధ బలగాలతో మరింత

సమర్థవంతంగా పోరాడేలా మా గెరిల్లా బలగాలను సన్నద్ధం చేయాలని మా కేంద్రకమిటీ, బీహార్ రాష్ట్రకమిటీ నిర్ణయించాయి. నడుస్తున్న ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసి విస్తృత పరచడమే దీని పుద్దేశం. ఇది మా పనికి సంబంధించిన ప్రధాన దిశ. ఇటీవలి వార్తా పత్రికల రిపోర్టుల నుండి మీరు సేకరించినట్లుగానే మేం ప్రగతి నిరోధక రణవీర్‌సేనకు చెందిన కొంతమంది దుష్టశక్తులను ఖతం చేయడమేగాదు, రెండు ప్రధాన ఆంబుష్‌లలో కేంద్ర పారామిలటరీ బలగాలకు చెందిన తొమ్మండుగురుతో సహా 11 మంది పోలీసులను నిర్మూలించాం. పోలీస్ ఏజెంట్లకు, దుష్టులైన వర్గ శత్రువులకు, పాలకవర్గ పార్టీల నేతలకు వ్యతిరేకంగా కొన్ని చర్యలు కూడా చేపట్టినాం.

అదే సమయంలో మేం యం.సి.సి. సాయుధ దాడిని ప్రతిఘటించమని, మా ఏరియాలలోకి యం.సి.సి. హంతక ముఠాలు సాయుధంగా మరింతగా జొరబడటాన్ని ఆపాలని, అవసరమైతే ఎదురుదెబ్బ తీయాలని మా కేడర్లకు పిలుపిచ్చినాం. ఏదేమైనా యం.సి.సితో మా ఘర్షణ సైద్ధాంతిక, రాజకీయ రంగంలోనే వుంటుందన్నదే మా విశ్వాసం, నమ్మకం. మమ్మల్ని నిర్మూలించడమనే తన ఏకైక కార్యక్రమాన్ని వదులుకొని పునాది వర్గాల ప్రయోజనాల కోసం పనిచేయాలన్న లక్ష్యంతో మా ఏరియాల్లో పనిచేయాలని యం.సి.సి. నిర్ణయించుకున్నట్లయితే మేం అందుకు అభ్యంతర పెట్టం. వారితో కలసి పనిచేసి వర్గ శత్రువులకు వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాటాలను చేపట్టడం అంటే మాకూ ఆనందదాయకమే. మొత్తంగా భారతీయ, ప్రపంచ విప్లవ ప్రయోజనాలకై మరింత విశాలంగా పునరాలోచించాలని రణవీర్‌సేన, 'లిబరేషన్' రివిజనిస్టుల గురించి, భారతీయ రాజ్యం పెంచుతున్న దాడుల గురించి ఆలోచించమని మేం యం.సి.సి.కి పిలుపిస్తున్నాం. మాతో కలిసి పుమ్మడిగా వర్గ శత్రువులకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రమ్మని వారికి మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

పాశవిక దాడిని ఆపివేయడానికి, బీహార్‌లో సమస్య పరిష్కారానికి చర్చలకై ముందుకు రావాలని యం.సి.సి.పై ఒత్తిడి తీసుకురావడానికై విప్లవ శక్తులూ, విప్లవ శ్రేయోభిలాషులూ, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే పౌరులందరికీ మేం పిలుపిస్తున్నాం. ❑

# సి.పి.ఐ.(యం-యల్)[పీపుల్స్‌వార్]పై యం.సి.సి. చేసిన దాడులు-కొన్ని ఉదాహరణలు

నూతనంగా ఐక్యమయిన సి.పి.ఐ. (యం-యల్)[పీపుల్స్‌వార్]కి వ్యతిరేకంగా యం.సి.సి. దాడులకు సంబంధించిన కొన్ని సంఘటనలను కింద వివరిస్తున్నాము. 1999 ఏప్రిల్ నెలలో సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్] బీహార్ రాష్ట్రకమిటీ విడుదల చేసిన ఒక పుస్తకం నుండి వీటిని తీసుకున్నాం. ఈ సం॥రం మార్చి నెల చివరి వరకు అంటే 7 నెలల కాలంలో జరిగిన సంఘటనలను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

1. 30-8-98: మఘూరి బజార్‌లో యం.సి.సి. రక్షణ పొందిన హంతకులు కొశాట్‌కి చెందిన కా॥ పవన్ సిన్హాను పట్టపగలే కాల్చిచంపారు.

2. 25-9-98: పాలమావు జిల్లా విశ్రాంపూర్ బ్లాక్‌లోని కుర్కుట గ్రామంలో పీపుల్స్‌వార్ దళం ప్రచారం చేస్తున్నదని వార్తలు విన్న యం.సి.సి. పెద్ద సంఖ్యలో సాయుధ బలగాన్ని కూడగట్టి దళాన్ని చుట్టుముట్టింది కానీ దళం తప్పించుకుంది.

3. 26-9-98: యం.కె.ఎస్.పి. (మజ్దూర్ కిసాన్ సంగ్రామ్ పరిషత్) ఏరియా కమిటీ సభ్యుడు కా॥ దేవలాల్ పాల్‌ని విశ్రాంపూర్ బ్లాక్ రత్నాగ్ గ్రామం నుండి పట్టుకెళ్ళి అత్యంత అనాగరిక తరహాలో చంపివేశారు.

4. 26-9-98: విశ్రాంపూర్ బ్లాక్ పొఖారీ గ్రామంపై దాడిచేసి పీపుల్స్‌వార్ మద్దతుదారుడైన కా॥ సురేందర్ మల్లా ఆస్తిని కొల్లగొట్టి పార్టీకి సంబంధించిన రెండు రైఫిళ్ళను, ఇతర వస్తువులను తీసుకుపోయారు.

5. 12-10-98: ఛత్రపూర్ నుండి వస్తున్న బస్సును యం.సి.సి. సాయుధ దళం ఆపి దాంట్లో ప్రయాణిస్తున్న యం.కె.యస్.పి. ఏరియా కమిటీ సభ్యుడు పారిఖా యాదవ్‌పై దాడిచేసింది. దళం కొంత దూరం వెంబడించి అతడిపై కాల్పులు మొదలెట్టిన తర్వాత అతడు కొద్దిలో తప్పించుకున్నాడు. 15 రోజుల తర్వాత అతడి ఇంటిని తగులబెట్టేశారు.

6. 16-10-98: యం.సి.సి. దళం జాప్లాలోని (పలామూ) సికారి గ్రామం నుండి కాలాపహాడ్ దాకా పీపుల్స్‌వార్ దళాన్ని వెన్నాడి దాడిచేసింది. కానీ ఎదురు కాల్పులు జరపడం ద్వారా పీపుల్స్‌వార్ దళం తప్పించుకుంది.

7. 19-10-98: విశ్రాంపూర్ తాత్కాలిక దళ కమాండర్ కా॥ అమలేష్ ఇంటిని ఘాసిదాగ్ గ్రామంలోని అతడి సోదరుల ఇళ్ళన్నింటినీ తగులబెట్టారు. వారి సంపదను మొత్తంగా కొల్లగొట్టారు.

8. 23-10-98: జాప్లా (పలామూ) లోని లావయా గ్రామానికి చెందిన యం.కె.యస్.పి. ఆర్గనైజర్ సోనాసింగ్ ఇంటిని కూలదోసి తగులబెట్టేశారు.

9. 25-10-98: రత్నాగ్ గ్రామంలో కా॥ దేవలాల్ పాల్ సంస్మరణార్థం జరుగుతున్న సంతాపసభపై దాడిచేసి పీపుల్స్‌వార్‌కి చెందిన ఐదుమంది కామ్రేడ్స్‌ని చంపారు.

10. 3-11-98: యం.కె.యస్.పి. స్థానిక ఆర్గనైజర్ జగనందన్ యాదవ్‌ని మదుబన్ (పాట్నా) లో చంపివేశారు.

11. 16-11-98: యం.కె.యస్.పి. ఆర్గనైజర్ యుగేశ్వర్ రాణాను గడ్‌గోమా (పలామూ)లోని అతడి సొంత గ్రామం నుండి పట్టుకెళ్ళి రెండు రోజుల పాటు క్రూరంగా చిత్రహింసలు పెట్టి చంపేశారు. మొండెం నుండి తలను వేరుచేసి పట్టుకెళ్ళిపోయారు.

**అంతర్జాతీయం**

# కొసావో అందిస్తున్న పాఠాలు

యుగోస్లేవియాపై అమెరికా నాయకత్వంలోని 'నాటో' జరిపిన దాడి, ముఖ్యమైన పాశ్చాత్యదేశాల మధ్య కొసావో ముక్కలు ముక్కలుగా అయిపోయిన తీరు-ప్రచ్ఛన్న యుద్ధానంతర శకంలో పెరిగిపోతున్న అమెరికా దురాక్రమణపూరిత పాత్రలో ఒకమార్పుని స్పష్టపరుస్తున్నది. కొత్త నాటో సూక్తిముక్తావళి (చార్టర్) దీనికి అధికార యుతమైన నైతికతని ప్రసాదించేస్తుంది. ప్రచ్ఛన్న యుద్ధానంతర పరిస్థితుల్లో తగ్గుతూ వచ్చిన అమెరికా రక్షణ వ్యయం, గడచిన రెండు సంవత్సరాలుగా అడ్డంతిరిగి పెరిగిపోతుండే తీరు 21వ శతాబ్ది దిశాగమనమంతా యుద్ధాలు, తీవ్ర విధ్వంసాలతో కూడినదిగానే వుంటుందనడానికి ఒక నిదర్శనంగా కనపడుతుంది.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే ఎలాంటి పరిస్థితులుండేవో అలాంటి దారుణ పరిస్థితుల్లోకి వినాశకరమైన బాంబు దాడులతో సెర్బియాని నెట్టేసారు. జరిగిన నష్టం 100 బిలియన్ డాలర్లుగా అంచనా; దాని తలసరి ఆదాయం 30శాతం పడిపోయింది, పరిశ్రమలన్నీ బాంబుదాడుల్లో నాశనం అయిపోయి నందువలన 5 లక్షల మంది నిరుద్యోగులై నిరాశ్రయులైపోయారు; సెర్బియాలో రెండు వంతుల భాగానికి విద్యుత్ అనేదే లేకుండా పోయింది; 33 బ్రిడ్జీలు, 3 చమురుశుద్ధి కర్మాగారాలు, టీ.వి., రేడియో ప్రసార కేంద్రాలు, కేంద్ర బెల్‌గ్రేడ్ నగరంలోని చాలా ప్రాంతాలు, మంచినీటి సరఫరా వనరులు-ఇలాంటివింకెన్నో విపరీత బాంబుదాడుల వలన సర్వనాశనమై అస్థిత్వంలోనే లేకుండా పోయాయి; ఎరువులు, రసాయన పరిశ్రమలపై జరిగిన బాంబుదాడుల పర్యవసానంగా పర్యావరణం అతిదారుణంగా దెబ్బతిని పోయింది; ఫలితంగా లక్షమంది ప్రజలాప్రాంతాలను విడచిపెట్టాల్సి వచ్చింది. వీటన్నింటికితోడు వేలాదిమంది పౌరులు 'పొరపాటు' బాంబుదాడులకి బలై మరణించారు.

ఒక్క కొసావోలోనే, అమెరికా అంచనాల ప్రకారమే, సగానికి సగం ఇళ్ళు ధ్వంసమైపోగా, 70శాతం ఇళ్ళు బాగా దెబ్బతినిపోయాయి-ఈ

---

12. 25-11-98: కర్ణా (ముషహరి, పాట్నా) గ్రామంలో యం.కె.యస్.పి. మద్దతుదారయిన రామకపూర్ శర్మను చంపివేశారు.

13. 4-12-98: పీపుల్స్‌వార్ రాష్ట్రస్థాయి కేడర్ కా॥ పవన్ ఇంటిని సెవనాన్ (జెహనాబాద్) గ్రామంలో విధ్వంసం చేశారు. ఇంటిలోని వస్తువులన్నింటినీ కొల్లగొట్టారు. పవన్ దాయాది సోదరుడి రెండు కాళ్ళనూ విరగ్గొట్టారు.

14. 8-12-98: పాంకీ (పలాము జిల్లా) లోని కస్మర్ గ్రామంలో పీపుల్స్‌వార్ దళ కమాండర్, పార్టీ ఆర్గనైజర్ల ఇండ్లను తగులబెట్టారు. మొత్తం ఇండ్లలోని వస్తువులను, పశువులను తీసుకుపోయారు.

15. 24-12-98: ఔరంగాబాద్ గోహ్‌లోని ధవహి గ్రామానికి చెందిన పీపుల్స్‌వార్ కార్యకర్త హలిన్ మియాన్‌ని తీవ్రంగా కొట్టారు. గడ్డపారతో అతడి కాళ్ళు చేతులను విరగ్గొట్టారు.

16. డిసెంబర్-98: నవాడా జిల్లా పవామ్ గ్రామానికి చెందిన నిరుపేద రిక్షా కార్మికుడు లోవా చౌదురిని అతడు పీపుల్స్‌వార్‌కి పనిచేస్తున్నాడని అనుమానంతో యం.సి.సి. దళం కాల్చి చంపింది.

17. 28-12-98: భండారియా గ్రామంలోని కా॥ ఖుదీసింగ్ (పీపుల్స్‌వార్ దళ కమాండర్) ఇంటిని కూలగొట్టి ఆస్థిని కొల్లగొట్టారు.

18. 5-1-99: జెహనాబాద్‌లోని కుర్థాలో కా॥ పప్పుయాదవ్, సోదరుడి ఇండ్లను డైనమైట్లతో పేల్చివేసి, వారికి సంబంధించిన వస్తువులన్నింటినీ కొల్లగొట్టారు.

19. 11-1-99: యం.కె.యస్.పి. జోనల్ కార్యదర్శి కా॥ బిరాజును (పప్పూ) కుదిలా (కుర్థా, జెహనాబాద్)లో చంపేశారు.

20. 17-1-99: పలామూ జిల్లా మనాతులోని సిల్దిలియా గ్రామంనుండి పీపుల్స్‌వార్‌కి సంబంధించిన డజనుమందికి పైగా మద్దతుదారులను కిడ్నాప్‌చేసి వారిని తీవ్రంగా కొట్టారు. వారి ఇండ్లలోని కొన్ని వస్తువులను తీసుకెళ్ళిపోయారు. స్త్రీలను సైతం కొట్టారు. ఒక బాలిక చేతిని విరగ్గొట్టారు, ప్రజలకు చెందిన ఐదు ఆయుధాలను కొల్లగొట్టారు.

21. 31-1-99: విశ్రాంపూర్‌లోని కర్కట గ్రామానికి చెందిన గ్రామస్థాయి నాయకుడు మాన్‌దేవ్‌ని పట్టుకుని ఒక రోజంతా చేతులు విరిచి కట్టి వుంచారు. కాని ప్రజలు ప్రతిఘటించడంతో వదిలి పెట్టారు. గ్రామం నుండి సింగిల్ బ్యారెల్ తుపాకిని తీసుకెళ్ళారు. పీపుల్స్‌వార్‌తో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని బెదిరించారు.

22. 19-2-99: బరోలి (జాప్లా)లోని యం.కె.యస్.పి. ఆర్గనైజర్ ఉమేష్‌సింగ్ ఇంటిని ధ్వంసం చేసి మొత్తం ఆస్తిని కొల్లగొట్టారు.

23. 13-3-99: ఔరంగాబాద్‌లోని అతడి సొంత గ్రామమైన అమర్‌పూర్‌లో తీవ్ర అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న కోయిల్-కైమూర్ రీజియన్ దక్షిణ జోనల్ కమిటీ సభ్యుడు కా॥ సత్యేంద్రను చంపేశారు.

24. 20-3-99: విశ్రాంపూర్‌లోని బెల్వార్ గ్రామంలో బహిరంగ సభలో ప్రసంగిస్తున్న పీపుల్స్‌వార్ దళంపై దాడి చేశారు. ఈ దాడిలో కా॥ రామశేష్, మరో ఇద్దరు అమరులు కాగా ఒక కామ్రేడ్ గాయపడినాడు. యం.సి.సి. దళాలు 6 ఆయుధాలను కూడా పట్టుకెళ్ళి పోయాయి. కా॥ రామ్‌శేష్ (అవధేష్, సుధీర్‌సింగ్) కోయిల్-కైమూర్ ఉత్తర జోనల్ కమిటీ సభ్యుడు. ❑

వినాశనం చాలామట్టుక్కి సెర్బ్‌దళాల చేతుల్లోనే జరిగినా, నాటో 'పొరపాటు' బాంబుదాడులవల్ల జరిగిన వినాశనం కూడా తక్కువేమీ కాదు.

ఈ దారుణ విధ్వంసం ఇలా వుండగా, 'శాంతి పునరుద్ధరణ' బృందం వారి అంచనాల ప్రకారం 79 రోజులపాటు నిరంతరాయంగా జరిగిన బాంబుదాడుల పర్యవసానంగా జరిగిన నష్టం సుమారుగా 100 బిలియన్ డాలర్లు వుండగలదని అంచనా. -ఇంకా 5లక్షల మంది నిర్వాశితుల నిర్వహణావ్యయం, వారి పునరావాస కార్యక్రమాల వ్యయం సుమారుగా 30 బిలియన్ డాలర్లని ఇంకా వీటికి కలపాల్సివుంది. కాగా, శాంతి పరిరక్షణ బలగాలు 50,000 మంది నిర్వహణావ్యయం, (ఇది సం॥రానికి 15 బిలియన్ డాలర్లని అంచనా) అమెరికా పాలనాధికార్ల పటాలం ఖర్చు- సామ్రాజ్యవాదం తలపడిన ఈ 'పరిమిత' యుద్ధ (ఏమంటే అధికారయుతంగా 'యుద్ధం' అనేది ప్రకటించ బడలేదు) విధ్వంశం అపారంగా, అతిఘోరంగా వుంది. దీనికి తోడు వేలాది ప్రజల జీవిత బలిదానాలు, వీరిలో హెచ్చుమంది సాధారణ పౌరులే; హృదయవిదారక స్థితిలో, చేతన కోల్పోయిన లక్షలాది కుటుంబాల సర్వవిధ్వంసక స్థితి; వందలాది పోరాటకారులపై సాగిన అమానుష చిత్రహింసలు, ఊచకోతలు - రెండవ ప్రపంచ యుద్ధం తరువాత యూరోపులో విచలితుల్ని చేసే అతిపెద్ద విషాదం ఇదే!

ఈ యుద్ధంనుంచి పాఠాలు తీసుకోబోయే ముందు అసలీ యుద్ధం ఎలా ముగిసిందో చూద్దాం!

## నాటో ఒప్పందం

ఈ యుద్ధ విరమణ కోసంగాను, రష్యా దళారీతనంతో జి-8 దేశాలు ప్రతిపాదించిన చివరి ఒప్పందం నాటో షరతులకి (డిమాండ్లకి) పూర్తిగా తలొగ్గేయడమే! నాటో సైనికాధి కార్లు ఆదేశించిన ఒప్పంద పత్రంపై రష్యా బుద్ధిగా సంతకం చేసింది. నిజం చెప్పాలంటే బాంబింగ్ ప్రారంభానికి ముందు (నాటో చేత) రామ్‌బౌల్లిన్ శాంతి చర్చల సందర్భంగా సమస్య పరిష్కారం కోసంగాను సంతకం చేయాలని ప్రతిపాదించబడిన ప్రతిపాదనకంటే కూడా యుగోస్లేవియాకి ఈఒప్పందం మరింత అవమానకరం! ఈ ఒప్పందం ఒక్క యుగోస్లేవియాకే వ్యతిరేకం కాదు, ఇది కె.ఎల్.ఏ.కి, అలానే కొసావో ప్రజల ప్రయోజనాలకి సైతం వ్యతిరేకమైనది. ఇది నాటో కూటమిలోని సామ్రాజ్యవాదశక్తులకు మాత్రమే ప్రయోజన కరమైంది-ఏమంటే నాటో కూటమిలో ఐదు పెద్ద దేశాలు (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ) కొసావోని తమ మధ్య ముక్కలు చేసుకు వాటాలేసుకున్నాయి, అక్కడి పరిపాలనాపరమైన అదుపుని కొసావో ప్రజలకిగాక సామ్రాజ్యవాద పాలనాధికార్లకి అప్పగించారు. ఈ తీరులో, వాస్తవానికి ఇక్కడ జరిగింది ఏమిటంటే- ఈ ఒప్పందం అనేది, అత్యంత కీలకమైన వ్యూహాత్మక ప్రాంతంలో వుంటున్న కొసావోని, పాశ్చాత్య సామ్రాజ్యవాదుల రక్షిత ప్రాంతంగా మార్చేసింది. దీనివలన ఇకపై నాటో తూర్పు, మధ్య యూరప్ దేశాలలోనే గాక అపార చమురు సంపదలు కలిగుండే మధ్య ఆసియా దేశాలలో సైతం తన నిఘాని, అదుపుని (పోలీసింగ్) మరింత పకడ్బందీగా, మరింత సజావుగా నిర్వహించగలుగుతుంది.

ఈ ఒప్పందాన్ని ఆమూలాగ్రం ఆమోదించేసిన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి దీన్ని గూర్చి ఏమందంటే-,

ఒకటి- బలప్రయోగపు హక్కుని అందించే ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని సెక్షన్ 7 ప్రకారంగా (నిర్బంధ ప్రయోగ సెక్షన్) కొసావోలో నియమించబడే ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక బలగాలు పనిచేస్తాయి. ఐక్యరాజ్యసమితి చార్టర్ సెక్షన్ 6కి భిన్నంగా సెక్షన్ 7 ప్రయోగంతో జరిగేదేమంటే-ఇది ఏదేని ప్రత్యేక దేశంపై తన బలగాలని రుద్దడానికి సమితికి అధికారాల్ని దత్తం చేస్తుంది, ఆ ఫలానాదేశంపై సమితికి అపారమైన అధికారాలొచ్చేస్తాయి. ఇందుకు భిన్నంగా సెక్షన్ 6 ప్రకారం అయితే సమితి బలగాలను యుగోస్లేవియా ప్రభుత్వం ఆహ్వానించాల్సి వుంటుంది, అలా వచ్చే బలగాలకి పరిమితాధికారాలు మాత్రమే వుంటాయి. ఇక ఇప్పుడు కొసావోలో తిష్టవేసేసుకున్న అమెరికా-ఇక బెల్‌గ్రేడ్ ఎప్పుడైతే తనకు సరిగ్గా సహకరించడం లేదని నిర్ణయిస్తుందో, ఉత్తరక్షణంలో అది యుగోస్లేవియాపై బాంబుల వర్షం కురిపిస్తుంది.

రెండు - మెసడోనియా, అంగోలాలలో తిష్ట వేసేసుకున్న తీరులోనే ఇక్కడ సైతం సమితి బలగాలు నిరవధికంగా తిష్టవేసు కుంటాయి, ఫలాన తేదీతో వీటి గడువు ముగుస్తుందనేదేమీ లేదు. ఈ ముందు జాగ్రత్త ఎందుకంటే-ఫలానా తేదీతో వీటి గడువు ముగుస్తుందనేది పేర్కొంటే, అప్పుడిక జరగాల్సిన ప్రతి పొడిగింపు సమితి భద్రతామండలి సభ్యదేశాలు ఐదింటిచేత ఆమోదముద్ర పొందుతుండాలి. ఈ బాదరబందీ లేకుండా నిరవధికంగా వుంచడం సౌకర్యం కదా? ఈ ఒప్పందంలో సమితి బలగాలు ఫలానా తేదీ వరకు వుంటాయనే గడువేదీ పేర్కొనకపోవడం ద్వారా ఇక్కడసైతం ఇరాక్‌లో తలెత్తిన లాంటి పరిస్థితే ఉత్పన్నం కాగల అవకాశాలు పుష్కళంగా వున్నాయి-ఇక్కడ బలగాల్ని ఎత్తేయాలనే ప్రతిపాదనను అమెరికా బ్రిటన్‌లు తమ వీటో అధికారంతో అడ్డుకున్నాయి.

మూడు-'సమైక్య ఆదేశ చట్రం' క్రింద (అండర్ యూనిఫైడ్ కమాండ్ స్ట్రక్చర్), 'మౌలికంగా నాటోలో భాగంగా అక్కడ నియోగించబడిన సమితి శాంతిపరిరక్షక బలగాలు పనిచేస్తాయని ఒప్పందం చెబుతోంది. నాటో ఆదేశాలతో అని చెప్పకుండా (నిజానికీబలగాలు పనిచేసేది నాటో ఆదేశాల మేరకే) అస్పష్టంగా చెప్పడం ద్వారా నాటో దొడ్డి తోవలో తన ఆదేశాలు అక్కడ అమలు చేయించే దానికి అవకాశాల్వివడమే తప్ప ఇది వేరు కాదు. ఒకప్రక్క, అక్కడి యంత్రాంగాన్నంతటినీ నాటో పర్యవేక్షణకి, అదుపుకి, ఆదేశాలకి అప్పజెప్పేస్తూనే, ఇంకోప్రక్క రష్యా అక్కడ బలగాలలో తన ప్రత్యేక కమేండ్‌ని తాను కలిగుంటుందని చెప్పడం పెద్ద వంచన. రష్యా నాయకత్వం ఈ నయవంచనతో అటు కొసావో ప్రజల్ని, ఇటు తమదేశ ప్రజల్ని వంచిస్తున్నారనే చెప్పాలి.

నాలుగు-ఈ ఒప్పందం ఇంకా ఏమని చెబుతుందంటే, మిలోసెవిక్‌ని మరి కొందరినీ యుద్ధ నేరస్థులుగా చేసేసిన 'అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ ఆఫ్ ది ఫార్మర్ యుగోస్లేవియా' (ఐ.సి.టి.వై.)తో అంతమందీ సహకరించాల్సి వుంటుందట! ఈ ట్రిబ్యునల్ ఈ 'తీర్పు' ఎలా చెప్పిందీ? బ్రిటీష్ గూఢచారి వర్గాలందించిన 'సాక్ష్యం' ఆధారంగానట! యుద్ధ సూత్రాలను నాటో తీవ్రంగా ధిక్కరించిందనే ఆరోపణపై ఐ.సి.టి.వై. ప్రధాన

ప్రాసిక్యూటర్, కెనడాకి చెందిన లూయిస్ ఆర్బర్ పరిశీలనకు తిరస్కరించాడు.

ఐదు-కొసావోను యుగోస్లేవియాలో అంతర్భాగంగానే ఈ ఒప్పందం గుర్తిస్తుంది. (తగినంత స్వయంపాలనాధికారాన్ని కొసావోకి ఇస్తూ); అంతేకాదు, కొసావో స్వాతంత్ర్య సమస్యని నిర్ణయించడానికి వీలుగా భవిష్యత్తులోనైనా 'రిఫరెండమ్' పిలుపుకి ఈ ఒప్పందంలో చోటు లేదు. అయితే ఇలాంటి నిర్ణయం రామ్‌బొలెటిన్ శాంతిచర్చల సందర్భంగా జరిగింది, కానిది ఇప్పుడు తెరమరుగైపోయింది. కె.ఎల్.ఏ.ని తక్షణంగా నిస్సైనికీకరించాలని కూడా ఈ ఒప్పందం పిలుపునిచ్చింది. ఈ రెండు కోర్కెలను (షరతులను- డిమాండ్స్) ముందు కె.ఎల్.ఏ. తిరస్కరించింది, కానైతే తరువాత ఇదే కె.ఎల్.ఏ. దీనికంగీకరిస్తూ నాటోతో ఒడంబడిక చేసుకుంది.

చివరగా సమితి భద్రతామండలి సహాయంతో కొసావోలో మధ్యంతర పాలనాయంత్రాంగాన్ని స్థాపించాలని కూడా ఈ ఒప్పందం చెబుతోంది. ఇదెందుకంట? ''అక్కడ నివాసముండే వారందరికీ శాంతియుత సాధారణ పరిస్థితుల కల్పనకి హామీ పడడానికి'' అని చెప్పుకుంది. ఈ ఒప్పందంపై సంతకాలు జరిగీ జరగడంతోనే ఇక అమెరికా కొసావోలో వేలాదిగా తన సహాయక కార్యకర్తలని, పాలనాధికార్లని, పోలీసుల్ని, వారికి మద్దత్తుగా మరికొంత సిబ్బందినీ దించే సన్నాహాలు ముమ్మరం చేసింది. ''కొసావోలో సమితి మధ్యంతర కర్తవ్యం'' (యు.ఎన్.యం. ఐ.కె.) అనే ఈ ఆపరేషన్ సంవత్సరాల తరబడి కొనసాగుతుందని, దీనిపై బిలియన్ల కొద్దీ డబ్బు ఖర్చుకాగలదని అంచనా! ఇరాక్‌లో లాగానే, ఇలా ఖర్చయ్యే భారీ వ్యయంలో చాలాభాగం యుగోస్లేవియా ప్రజలనుంచే పిండబడుతుందనేది నిస్సందేహం.

ఈ ఒప్పందంలోని చివరి రెండు అంశాలూ నిజానికి కొసావో ప్రజల విముక్తి పోరాటపు సారాన్ని తిరస్కరించేవిగానే వున్నాయి. ఇప్పుడు చివరికి జరిగిందల్లా ఏమిటీ అంటే-నిన్నటిదాకా రష్యా వెన్నుదన్ను కలిగుండే యుగోస్లేవియా జాతీయ దురహంకారులకు ఖైదీలుగా వుంటూండిన కొసావో ప్రజలు, ఇకిప్పుడు కొసావో నాటో రక్షిత ప్రాంతంగా మారిపోవడంతో, వారంతా పాశ్చాత్య సామ్రాజ్యవాదులకు ఖైదీలుగా మారిపోయారు.

పైగా ఇంకేం జరిగిందంటే-యుగోస్లేవియాలో నాటో చేపట్టిన ఈ శాంతిస్థాపనా క్రమం అంతా, నాటో అధిపతుల అహంకారాన్ని చాటేదిగాను, రష్యాపట్లనేగాక ఐక్యరాజ్యసమితి పట్ల కూడా నాటో అధిపతులకుండే ధిక్కార ధోరణిని చాటేదిగానే నిలిచింది.

జి-8 దేశాల దాడి విరమణ ప్రతిపాదనలపై కొసావో అధ్యక్షుడు మిలోసెవిక్ సంతకం చేసిన తరువాత కూడా నాటో తన బాంబింగ్ ఆపకుండా కొనసాగించింది. సెర్బ్ సైనిక దళాలు కొసావో నుంచి ఉపసంహరించుకు వెళ్లడానికి సంబంధించిన నిర్ణయం కోసం, ఇరుపక్షాల సైనికాధికార్ల మధ్య చర్చలు కొనసాగుతున్నంత కాలమూ బాంబింగ్ జరుగుతూనే వుంది. ఈ సందర్భంగా జరిగిన చర్చలలో నిజానికి బ్రిటీష్ సైనికాధికార్లు కొసావో సైనికుల తలలకి తుపాకీ మొనలుంచి మరీ వారి చేత ఒప్పందపు షరతులంగీకరింపజేసారు. వారు చెప్పిన ప్రకారంగా సెర్బులు సంతకం చేసేసిన వెంటనే-ఇంక బాంబింగ్ అనేది నిరంతరాయంగా గాక అప్పుడప్పుడు జరుగుతూనే వుంది. (బాంబింగ్ పూర్తిగా నిలచిపోవడమనేది జూన్ 20న మాత్రమే-అంటే సెర్బ్ దళాలన్నీ కొసావో విడచివెళ్లిన తరువాతనే, అనేది గమనార్హం!) -ఇకా ఉత్తరక్షణమే సమితిద్వారా జి-8 దేశాల ప్రతిపాదనలు దూసుకొచ్చేసాయి.

ఈ కొసావో కథన క్రమమంతటిలోనూ సమితి పోషించిన పాత్ర గతంలో ఏ సందర్భంలోనూ కానంత జాలిగొలిపేదిగాను, పరమ అసంగతమైనదిగాను రుజువవుతూ వచ్చింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి పట్ల నాటో ఎంతటి ధిక్కార ధోరణితో వ్యవహరించిందంటే -కొసావోలో సమితి తరపున నియమించనున్న అంతర్జాతీయ శాంతి పరిరక్షక దళానికి బ్రిటీష్ సైనికాధికారి కమాండర్‌గా వుంటాడని, ఈ అంతర్జాతీయ శాంతి పరిరక్షక దళాలలో సింహభాగం నాటో కూటమికి చెందినవారుగానే వుంటారనే రెండు అంశాలు, నిజానికి సమితి తీర్మానాలుగా ప్రకటించబడకముందే,నాటో తానుగానే సదరు రెండు అంశాలని ప్రకటించింది. ఇకప్పుడు దానికి సమితి డూడూ బసవన్నలా తలూపింది. సమితిలో ఈ తీర్మానం చేయించడం నాటో దొరలకి ఏమీకాదు. అయినా వారు ఆ లాంఛనానికి ఎలాంటి గౌరవమివ్వకుండా ప్రకటించేసారు. నిజానికి కొసావో సమస్యపై జి-8 దేశాల మధ్య చర్చలు జరుగుతుండిన సందర్భంగానే (బాన్ నగరంలో) బ్రిటీష్ విదేశాంగ కార్యదర్శి రాబిన్‌కుక్ చైనా తదితర సమితి సభ్యదేశాలపట్ల తనకుండే వలసవాద ధిక్కార ధోరణిని వెళ్ళగక్కాడు, జి-8 దేశాలు రూపొందించిన తీర్మానంపై సమితి భద్రతామండలి సభ్యదేశాలు తలవంచుకుని రబ్బర్ స్టేంపుల్లా సంతకం చేయాల్సిందేనని దురహంకారంగా ప్రకటించాడు, రాబిన్‌కుక్.

రష్యా చైనాల గర్జనలను త్రోసిరాజంటూ తీర్మానం14-0 ఓట్లతో నెగ్గిపోయింది, చైనా గైర్ హాజరైంది. రష్యా నాటో అధిపతుల ఒత్తిడికి పూర్తిగా దాసోహమనగా, చైనా దృఢంగా తన 'వీటో' హక్కుని, అధికారాన్ని వినియోగించ ప్రయత్నించనే లేదు. ఆ రకంగా, అంతర్జాతీయ బందిపోటుగిరీకి చట్టబద్ధత అందించేయడం అయింది. అంతర్జాతీయ చట్టం అనేది బాంబుదెబ్బతో సమాధిలోకి నెట్టబడింది. నాటో ఆదేశించిన తీర్మానంపై ఐక్యరాజ్యసమితి తన రబ్బర్‌స్టాంప్ ముద్ర వేయడంతో, అది సామ్రాజ్యవాద యుద్ధోన్మత్తతకి తన ఆమోదాన్ని అందించడమేగాక, తన మరణ శాసనంపై తానే సంతకం చేసేసుకుంది....ఇక దాని అస్థిత్వానికి ఎలాంటి అర్థం, విలువ లేకుండాపోయాయి. ఇకపై అమలుకానున్న దంతా ఆటవిక చట్టమే! ఇక సామ్రాజ్యవాదులు 'టెర్రరిజం' అని, అదని, ఇదని ఫిర్యాదులు చేయాల్సిన అవసరమే వుండదు. ప్రపంచం, ప్రజలు ఎలా వుండాలో వారే చెబుతారు. ప్రపంచ ప్రజలంతా తదనుగుణంగానే నడుచుకోవాలి!

## ఈ కొసావో ఘర్షణనుంచి పొందగల పాఠాలేమిటి?

### ఒకటవ పాఠం: ప్రపంచ మానవాళికి అమెరికన్ సామ్రాజ్యవాదం అత్యంత ప్రమాదకరం

యుగోస్లేవియాలోని యుద్ధం (ఇరాక్‌లోలాగానే) అమెరికా సామ్రాజ్యవాదానికి సంబంధించిన ఒక కొత్త బరితెగింపు ధోరణిని సూచిస్తోంది, మునుపింతటి బరితెగింపుతో లేదు, ఇండో చైనాలో

తిన్న ఓటమి తరువాత, అలానే సోవియట్ యూనియన్‌లో సమాంతరంగా మరొక సామ్రాజ్యవాద అగ్రరాజ్యం అస్థిత్వంలో వుంటూండిన కాలంలో అది కొంత అణకువగా తగ్గి వుండేది. ప్రపంచ సామ్రాజ్యవాదులు ఇప్పటికింకా పరస్పరంగా పోటీకి దిగిపోయే శిబిరాలుగా విడిపోని కారణంగాను, అమెరికాని సవాల్ చేసే ఏ శక్తీ లేని కారణంగాను-దేశ దేశాల్ని, ప్రజల్ని కబళించేసే అమెరికన్ ఏలుబడి, ప్రపంచ వినాశకరదిశలో విర్రవీగిపోతోంది. ఎడతెగని బాంబుల వర్షంతో, విచక్షణారహితమైన ఆంక్షల అస్త్రాలతో, ఇరాక్‌లో పదిలక్షల ప్రజలను హత్య చేసింది. కాగా, నేటి యుగోస్లేవియా వినాశనంతో దేశదేశాలనీ తన ఆజ్ఞలకి దాసోహమవ్వాలనే హెచ్చరికలు అందించదలచింది. లేదంటే విధ్వంసం, వినాశనం తప్పదని ప్రపంచదేశాలకి హెచ్చరించదలచింది. యూరోప్ నడిబొడ్డులోని ఒక దేశమే ఇంతటి నగ్నంగా, నిస్సహాయంగా నిలువుదోపిడీకి గురైపోయిందంటే, ఇక ఇతర మూడవ ప్రపంచదేశాల గూర్చి చెప్పాల్సిందేముంటుంది?!

ఇది ఒక నూతన తరహా యుద్ధానికి ప్రారంభం కూడా, ఇందులో దాడికి తలపడే దురాక్రమణదారులు తక్కువ ప్రమాదాన్ని (రిస్కుని) ఎదుర్కొనేట్టు దీని వ్యూహం వుంటుంది. ఇక్కడ వారు తమ 'శత్రువు' తో తలపడరు, అందుకు బదులు వెనుకటి చీకటి యుగాల్లోకి తోసేసే తీరులో మొత్తం దేశాన్నంతటినీ బాంబులతో దద్దరిల్లజేస్తారు- ఇకా తరువాత ఆంక్షలతో నులిపేస్తారు, ఊపిరాడనివ్వరు. ఈ హైటెక్ యుద్ధం (దీన్నే శస్త్రచికిత్సా యుద్ధతంత్రం-సర్జికల్ వార్‌ఫేర్ -అంటున్నారు) పాశవికత్వంలో హిట్లర్ మాఫియా ముఠాల్ని మరపింపజేసేదిగా వుంటుంది. హిట్లర్ కాలంలోని గ్యాస్ చాంబర్లతో చంపడం మొరటైన పద్ధతి, అంతకు మించిన క్రూరత్వం ఇవాళ 'సర్జికల్'గా (శస్త్రచికిత్సా నైపుణ్యంతో) ప్రజలందరినీ పస్తులకి, రోగాలకి, పర్యావరణ వినాశానికి గురిచేస్తూ మనుషులపై బాంబులు వేయలేదంటూనే, మనుషుల్ని చంపలేదంటూనే, లక్షలాదిగా మనుషుల్ని చంపేసే అమానుష యుద్ధక్రీడ ఇది. నాటి మొరటైన గోబెల్ ప్రచార పద్ధతి స్థానే ఈరోజు ప్రసార సాధనాలపై గుత్తాధిపత్యంతో అనేకరెట్లు అబద్ధ ప్రచారం, విషప్రచారం సాగుతోంది, నాటి హిట్లర్‌కి తెలీని అబద్ధాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలు, ద్వేషాగ్నిని రెచ్చగొట్టే తీరులన్నీ ఈ ఆధునిక హిట్లర్లు అనుసరిస్తున్నారు-అయితే ఈ నైచ్యాలని, ఈ కుట్రల్ని, ఈ కుతంత్రాలని-వీటన్నింటినీ చక్కటి అలంకారాలతో, దట్టమైన మేకప్‌తో, ఇంటింటికీ వెలిసిన టీ.వీ.ల ద్వారా దిట్టంగా ప్రచారం చేస్తుంటారు.

ఈ యుద్ధం నుంచి తీసుకోవాల్సిన మొట్టమొదటి పాఠం ఏమంటే-ప్రపంచమంతటిపై విరుచుకుపడి విర్రవీగిపోతున్న ఈ క్రూర మృగాన్ని ఎలాగైనా నిలవరించాలి. బలప్రయోగంతో ప్రపంచదేశాల మెడలువంచి 'ఇష్టపూర్వకంగానే' అణచివేయబడడానికి వారిచేత అంగీకరింపజేసేయడం (తూర్పుఆసియాలో జరిగినట్లుగా) లేదంటే బలప్రయోగంతో తొక్కి పట్టడం (ఇరాక్, యుగోస్లేవియా తరహాలో). ఈ 'గాడ్జిల్లా' క్రూరమృగాన్ని దాని తోవలో మనం అడ్డగించకపోతే, దేశం తరువాత దేశం నాశనం కాక తప్పదు, భూగోళంలో చాలాభాగాన్ని యుద్ధజ్వాలలు కమ్ముకోక తప్పదు. ఎలాంటి మెప్పుకోలు ప్రయత్నాలు, బుజ్జగింపులు, సానునయ ప్రయత్నాలు దీని దూకుడుని ఆపజాలవు, దీనికి ముకతాడు వేయజాలవు. దాన్ని మోదకపోతే అది కిందపడే ప్రశ్నే లేదు.

శక్తి సంపన్నమైన దాని యుద్ధయంత్రాంగాన్ని చూసి నిరాశా నిస్పృహలకి గురైపోతే, ఓటమి తత్వాన్ని ప్రదర్శించేస్తే దాని ఆకలి ఇంకా పెరిగిపోతుంది. 'చరిత్ర అంతం' అనే మానసిక జబ్బు, స్వచ్ఛంధ సంస్థల (ఎన్.జి.ఓ.) నిస్సార సానునయ ధోరణి, వినిమయ సంస్కృతి మత్తులో జోగిపోయి ఉలుకూపలుకూ మరచిపోయిన మధ్యతరగతి ప్రజానీకం-దాని దురాశను మరింతగా ప్రోత్సహిస్తూ, దాని దాడులని సానుకూల పరుస్తున్నాయి. కానైతే, ఒక చిన్న వియత్నాం ప్రపంచంలోనే బలసంపన్నమైన యుద్ధ యంత్రాంగాన్ని ఓడించ గలిగింది-అంటే ప్రజలు మేల్కొని తెగిస్తే, తిరగబడితే ఆ దురహంకారపు బూరను పగులగొట్ట పెట్టగలరు. ప్రజాయుద్ధం ముందు దాని హైటెక్ ఆయుధ సంపత్తి అంతా దిగదుడుపే అవుతుంది.

యుగోస్లేవియాలో జరిగిన ఈ సామ్రాజ్యవాద యుద్ధంలో కూడా నాటో బలగాలు ఓటమి అంచుకి చేరాయి. ఆ యుద్ధమే మరో నెలదినాలు సాగివున్నట్లయితే, నాటో శిబిరంలో కలకలం రేగేది! ఆ సమయానికి అది భూతల సైన్యాలని రంగంలోకి దింపకపోయి వుంటే, శరణార్ధ శిబిరాల్లో పరిస్థితులు అదుపు తప్పేవి, ఇకప్పుడు నిష్ప్రయోజనకరమైన, విచక్షణారహితమైన బాంబు దాడులతో వేలాది అమాయక ప్రజల్ని అమానుషంగా పొట్టన పెట్టుకున్న ఈ రాక్షసి ప్రపంచ ప్రజలలో తీవ్రంగా అప్రతిష్టపాలై వుండేది నాటో. దాంతోపాటు, శరణార్ధ శిబిరాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులతో వారిలో తీవ్ర అసంతృప్తి అసహనాలు గూడుకట్టుకుంటూ వచ్చాయి, కనుక చలికాలం ప్రారంభం కాకముందే శరణార్ధుల్ని ఖాళీ చేయించి వారి వారి ప్రాంతాలకు తిరిగి పంపించాల్సిన అత్యవసర స్థితిరీత్యా యుద్ధాన్ని త్వరగా ముగించుకోవాల్సిన స్థితిని నాటో ఎదుర్కొంది. ఒకవేళ పదాతిదళాల్నిగాని పంపివుంటే, నాటో కూటమి చీలిపోయి వుండేది. వారు తీవ్ర నష్టాలు ఎదుర్కొని వుండేవారు. అలాంటి చావులు సామ్రాజ్యవాదుల మధ్యనే తీవ్ర అస్థిమితానికి దారితీసి వుండేవి.

ఇలాంటి విపత్కర పరిస్థితులో-నాటోకి చేయందించి రష్యా ఆదుకుంది.

## రెండవ పాఠం: కోరలూడిన రష్యా సామ్రాజ్యవాద భల్లూకం

ఇలాంటి ఆపత్సమయంలో (నాటోకి) పాశ్చాత్య దేశాలకు మరి అనుకూలురైన ఎల్సిన్ తొత్తులు, మరింత దురాక్రమణ స్వభావంతో దూకుడుగా వుండే రష్యన్ సామ్రాజ్యవాద ముఠా పదవీచ్యుతుల్ని చేసి లొంగుబాటుకి సంబంధించిన (కొసావో లొంగుబాటు, తమ లొంగుబాటు) బేరసారాల నిర్వహణ బాధ్యతను చెర్నోమిర్దిన్‌కి అప్పగించారు. ప్రిమకోవ్ నాయకత్వంలోని ముఠా నాటో దాడిని ఎదిరిస్తూ ఊడపొడిచేసించేమీ లేదు, వారు కరిచేదానికంటే అరిచే పనిలో తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. అయితే వారి అరపులు వృధా కాలేదు, అవి ఆ తరువాత జాలిగొలిపే కూతలుగా మారి, పెంపుడు కుక్కపిల్లలా ముద్దుముద్దు కూతలతో తోకాడిస్తూ కొద్దిపాటి డాలర్ల

కోసం అమ్ముడుపోడానికి బేరాలు సాగించింది.

జి-8 దేశాల ఒప్పందం ద్వారా జరిగిపోయిన అమ్మకం, దానికి ఐక్యరాజ్య సమితిలో రష్యా తన ఆమోదముద్ర వేసేయడం అనేవి సుస్పష్టం. కాగా ప్రిష్టినా విమానాశ్రయాన్ని 200 మంది రష్యన్ ప్యారాట్రూపర్స్‌తో స్వాధీన పరచుకోవడమనేది ఒక నాటకీయ పరిణామం మాత్రమే. తానేదో స్వతంత్రతని కలిగుంటున్నట్లుగా భ్రమింపచేయడానికి రష్యా చేసిన ప్రయత్నమే యిది. రష్యాలో వున్న కోపాగ్నిని చల్లార్చటానికి, సెర్బ్ దళాలపై తాము విజయం సాధించామని భ్రమింప చేయడం కోసమే ఈ 'స్టంట్' అంతా.

ఏమైనప్పటికీ, ఈ మొత్తం క్రమమంతటిలోను రష్యాగాని, సెర్బులుగాని పెట్టిన ఏ ఒక్క కోర్కెనూ నాటో అంగీకరించలేదు. కొసావోలోని స్మారక కట్టడాలకు రక్షణగాను, స్థానిక సెర్బ్ పౌరులకి అండగాను నామమాత్రపు సెర్బ్‌దళాలు కొసావోలో వుండటానికి అనుమతించాలని వారు కోరారు-కానైతే జూన్ 20 నాటికి అక్కడుండే సైన్యము, పారా మిలటరీ బలగాలతో పాటు మొత్తం పోలీసు బలగం కూడా ఖాళీ చేయాల్సి వచ్చింది. నాటో ఆజ్ఞల క్రింద ఉండ నిరాకరిస్తూ రష్యా తన అదుపులో ఒక ప్రత్యేక శాంతి పరిరక్షక మండలం వుండాలని కోరుకుంది. అయితే హెల్‌సింకి వద్ద రష్యా అమెరికాల మధ్య కుదిరిన ఒడంబడిక ప్రకారం రష్యా కోరిన స్వతంత్ర మండలం నిరాకరించబడింది, రష్యా సైనిక బలగాలు సైతం అమెరికా, ఫ్రాన్సు, జర్మనీలకి చెందిన వివిధ మండలాల మధ్య సర్దివేయబడ్డారు. వాస్తవంలో ఈ'శాంతిపరిరక్షక దళాలు' (ఇవి సమితివిగా చెప్పబడుతాయి) పై నిజమైన అదుపాజ్ఞలన్నీ నాటోవే! ఎందుకంటే అక్కడ నియోగించబడిన 50,000 మంది సమితి దళాలలో 37,000 మంది నాటో సైనికులే! అక్కడి రష్యా సైనిక బలగాలు నాటో బలగాలకి తోకలా పడుండాల్సినవే.

ఇక చివరిగా జరిగిందేమంటే- జి-8 దేశాల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఎల్సిన్ ప్రదర్శించిన స్వామిభక్తికి ప్రతిఫలంగా, రష్యా ఆర్థిక వ్యవస్థని ఆదుకోడానికి, భారీ ఆర్థిక సహాయాన్ని పొందగలిగింది. దీనికి ప్రతిగా ఎల్సిన్ ''స్టార్-3'' రాయభారాలు కొనసాగింపుకి అంగీకరించాడు. అంతేకాదు, యుగోస్లేవియాలో తిరిగి 'పూర్తి ప్రజాస్వామ్యం' పునరుద్ధరించ బడిపోయిందనే ప్రకటనపై సంతకం చేసేసాడు. మిలోసెవిక్ పదవిలో కొనసాగినంత కాలం, సెర్బియాకు పశ్చిమదేశాల నుంచి ఎలాంటి సహాయం వుండబోదని, ఈ 'పూర్తి ప్రజాస్వామ్యం' ప్రకటన చెప్పినప్పటికీ, ఎల్సిన్ దానిపై సంతకం పెట్టేసాడు.

కనుక గ్రహించాల్సిన రెండ పాఠం ఏమంటే-కుప్పలు తెప్పలు ఆయుధాలతో నిండిన ఆయుధాగారాలు కలిగి ఉంటున్నప్పటికీ, పూర్తిగా దివాళాతీసిన తన ఆర్థిక వ్యవస్థ దుస్థితి రీత్యాను, పాశ్చాత్య పెట్టుబడులపై తాను మరింతగా ఆధారపడిపోవాల్సి వస్తున్న స్థితి రీత్యాను, రష్యా తాను సైతం ఒక సామ్రాజ్యవాదశక్తిగా దృఢంగా నిలదొక్కుకోగల స్థితిలో లేదు. బూర్జువా వ్యవస్థలో 'పెట్టుబడి' అనేది ప్రాథమికం- ఆయుధశక్తి అనేది పెట్టుబడి ఆధిపత్యానికి ఒక హామీగా నిలబడేది మాత్రమే. కనుక రష్యాలో 'పెట్టుబడి' అనేది కుప్పగూలిపోయిన తరువాత, ఇక దాని ఆయుధశక్తి అనేది దాని బేరమాడే శక్తిని పరిమితం చేసేసింది. రష్యా తన స్వంత కాళ్ళపై నిలబడగలిగేలా ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవం పొందకపోయినట్లయితే, (అమెరికా లేక జర్మనీ పెట్టుబడులద్వారా కాదు) రష్యా కేవలం కోరలూడిన భల్లూకంగా పడుండక తప్పదు.

## మూడవ పాఠం: చైనా కపట నటన

తన స్వంత బూర్జువా స్వార్ధ ప్రయోజనాల సాధనకి కొసావో సమస్యని, సంక్షోభాన్ని ఉపయోగించుకోవాలనే చైనా ఆశించింది. వేలాది సెర్బు, కొసావో ప్రజల బలి దానాలతో తన విదేశీ వాణిజ్యాన్ని పెంచడం, విదేశీ పెట్టుబడుల్ని పెంచుకోవడం, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ) తన ప్రవేశాన్ని సుగమం చేసుకోవడం కోసం చైనా బేరసారాలాడింది. ఆఖరికి బెల్‌గ్రేడ్‌లోని తన దేశ రాయబార కార్యాలయంపై జరిగిన నాటో బాంబుదాడిని, అందులో చనిపోయిన ముగ్గురు పౌరుల (కార్యాలయ సిబ్బంది) చావుల్ని (నిజానికిది చైనాపై యుద్ధ ప్రకటన లాంటి చర్యే!) కూడా, చైనా నూతన బూర్జువా పాలకులు పశ్చిమదేశాల నుంచి మరికొన్ని రొట్టె ముక్కలు పొందడానికే ఉపయోగించుకున్నారు.

ఐక్యరాజ్యసమితిలో కొసావో సమస్య చుట్టూతా చైనా ప్రదర్శిస్తూ వచ్చిన వైఖరి, దాని చర్యల నేపథ్యంలో చూసినపుడు, దాని పశ్చిమదేశాల వ్యతిరేక వాగాడంబరత, దాని మాటల తీవ్రత కేవలం కపట నాటకం అని తేటతెల్లమవుతుంది.

చైనా రాయభార కార్యాలయంపై జరిగిన దాడిని 'తీవ్రంగా ఖండించాలని సమితి భద్రతా మండలిలో పట్టు పట్టిన చైనా, చివరికి ఆ దాడి ''తీవ్ర బాధాకరం'' అంటూ చేసిన ప్రకటనతో సంతృప్తిపడిపోయి దానికి తలూపేసింది. ఇక జి-8 దేశాల తీర్మానం పట్ల ఇది ప్రదర్శించిన వైఖరి మరింత దారుణం! ప్రారంభంలో సదరు తీర్మానాన్ని తీవ్రంగా ఖండించిన చైనా, చివరికి అది సమితి భద్రతామండలి ముందుకి చర్చకొచ్చినపుడు దానికి వ్యతిరేకంగా ఓటు చేయకుండా గైర్‌హాజరై తప్పుకుంది. ఈ తీర్మానం ఆమోదించ బడకుండా అడ్డగించగల శక్తి తనకున్నప్పటికీ (భద్రతా మండలిలో చైనా ఒక శాశ్వత సభ్యదేశం కనుక) అందుకనువుగా సదరు తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఓటు చేయడానికి అది ఒప్పుకోలేదు. అంటే ఇంకోలా చెప్పాలంటే, సదరు తీర్మానం అలా ఆ తీరులో ఆమోదించబడి పోవడానికి అనుమతించేయడం ద్వారా, చైనా సైతం నాటో దాడిలో పాలు పంచేసుకుంది.

కనుక మనమిక్కడ గ్రహించాల్సిన మూడోపాఠం ఏమంటే- సోషలిస్టు ముసుగు తగిలించుకుని వుంటున్నా, చైనా ఒక నిఖార్సయిన పెట్టుబడిదారీ దేశంగానే వుంటూ, తన స్వప్రయోజనాల కోసం ఇతర దేశాల ప్రయోజనాల్ని బలి తీసుకుంటూనే వుంటుంది. బూర్జువా రొట్టె ముక్కలో వాటాకోసం అది సూత్రాల్ని, విలువల్ని, న్యాయాన్ని బదులిచ్చేస్తుంది, బలిపెట్టేస్తుంది.

## నాల్గవపాఠం: ఏదో ఒక సామ్రాజ్యవాదంతో అంటకాగడం ద్వారా స్వయం నిర్ణయాధికార సాధన సాధ్యం కాదు

రష్యా మద్దత్తుతో సెర్బ్ దురహంకార్లు కొసావోలోని అల్బేనియా జాతీయుల జీవనాన్ని సర్వనాశనం చేసిన మాట నిజమే! ఇది ఒక

దశాబ్ది కాలంపాటు కొనసాగుతూ, నాటో బాంబుదాడి కాలంలో పరాకాష్టకు చేరింది. నాటో వెలువరించే సామూహిక సమాధుల కథనాలతో కూడిన నివేదికలు అతిశయోక్తులనుకున్నా కూడా, ఆల్బేనియా ప్రజల్ని సామూహికంగా తుడిచిపెట్టేసేందుకు ఉద్దేశించిన సెర్బ్ జాతీయ విధానాన్ని కాదనలేం! అక్కడ గ్రామాలకి గ్రామాలనే తుడిచిపెట్టేయడం, అక్కడి ప్రజానీకంలో సగభాగాన్ని శరణార్థులుగా మార్చేయడం, ప్రజలపై సాగిన చిత్రహింసలు, సామూహిక వధలు, మహిళలపై అత్యాచారాల్లాంటి దుష్కృత్యాల్ని చూడకుండా వుండలేం, వాటిని క్షమించేయలేం. కనుక నాటోదాడిని ఖండిస్తాం, అయితే సెర్బుల క్రూరకృత్యాల్ని విస్మరించలేం. అంతేకాదు, సెర్బ్ ముష్కర మూకకి రష్యా అందించిన వెన్నుదన్ను, నాటో బాంబింగ్ మరుగున కప్పబడి పోయేది కాదు, రష్యా నేరం తక్కువైపోదు.

అయితే పాశ్చాత్య సామ్రాజ్యవాదంపై ఆధారపడిపోయి రష్యా అండతో సాగే సెర్బ్ దురహంకారంతో పోరాడజాలం. కొసావో ప్రజల జాతీయ కాంక్షలన్నింటినీ నాటో తెగనమ్మేయడాన్ని మనం ఒకప్రక్క చూడగలుగుతూనే వున్నాం; అంతేకాదు అది కె.ఎల్.ఏ.కి వెన్నుపోటు పొడిచేసింది; స్వాతంత్ర్యం కోసం రిఫరెండం నిర్వహించబడాలనే దాని కోర్కెను తిరస్కరించింది; అక్కడి పోరాటకారుల్ని తక్షణంగా నిరాయుధం చేసే కర్తవ్యాన్ని నాటో నెత్తినెత్తుకుంది, అంటే కొసావోలో ప్రస్తుత మేర్పడిన నూతన చట్రంలో ప్రజలకెలాంటి పాత్రా లేదు- అక్కడిప్పుడు సెర్బ్ పాలనాధికారులు, పోలీసులు వుండరు, అలానే సెర్బ్ సాయుధ బలగాలన్నీ రద్దయిపోయి వాటి స్థానే నాటో సైనిక బలగాలు ఆక్రమించుకుంటాయి. ఇలాంటి దురాక్రమణకి పాల్పడి తిష్టవేసుకున్న భారీ సైన్యాన్ని నిర్వహించడానికి కొసావో ప్రజలు, అక్కడి అపార సహజ వనరులు వారి చివరి నెత్తుటి బొట్టుకూడా పీల్చబడుతుంది. నాటో (ఐక్య రాజ్యసమితి) ఏలుబడికి తమనితాము బందీ చేసేసుకున్న పాపానికి వారనుభవించాల్సిన ఫలితం ఇది.

కె.ఎల్.ఏ. పోరాటకార్లు తిరిగి ఆయుధాలు అందుకోక తప్పదు. అయితే ఈసారి వారు పాశ్చాత్య శక్తులకి వ్యతిరేకంగా తమ ఆయుధాలనెక్కుపెట్టాల్సి వుంటుంది. కె.ఎల్.ఏ. పూర్వం కలిగుండిన మార్క్సిస్టు వాసనలు కారణంగాను, అది ఇస్లామిక్ సంబంధాలను బలపరుస్తున్న కారణంగాను, దాన్ని పశ్చిమ దేశాధిపతులు ఏనాడూ నమ్మలేదు. అందుకే పాశ్చాత్యులంతా దేశద్రోహి రుఘోవాకి దన్నుగానే నిలిచారు.(ఇతడు చివరిదశలో మిలోసెవిక్‌తో ఒడంబడికకొచ్చి ఇటలీకి వెళ్లాడు, అక్కడ ఇటలీ ప్రధాని నుంచి ఘనస్వాగతాలందుకున్నాడు) కానైతే ఈ రుఘోవా పార్టీ పూర్తిగా ప్రజల నుంచి వేరైపోవడంతో, తప్పనిసరి పరిస్థితుల్లోనే వారు కె.ఎల్.ఏ.తో మంతనాలకి దిగారు. క్రమంగా వారు కె.ఎల్.ఏ.లో చీలికలు సృష్టించడంలో కృతకృత్యులై, దానిలోని ఒకభాగాన్ని విద్రోహ పూరితంగా, సెర్బ్ దళాలకి వ్యతిరేకంగా, తమ చెప్పుచేతుల్లో పనిచేసే పంచమాంగదళంగా మలచుకున్నారు. కె.ఎల్.ఏ. లో ముఠాకక్షల్ని ఇంకా ముదర పెట్టేందుకు నాటో కూటనీతి విధ్వంసులు కొత్తకొత్త చిట్కాలు ప్రయోగిస్తూనే వున్నారు-ఆ రకంగా నిజమైన పోరాట శక్తులన్నింటినీ నాశనం చేయడానికి నాటో సంకల్పించింది. ఇటీవల పాశ్చాత్య సైనిక ప్రముఖులు ఒక ప్రకటన ద్వారా కె.ఎల్.ఏ.పట్ల తమకుండే పూర్తి ధిక్కారణను చాటుకున్నారు. వారేమన్నారంటే, ''విముక్తి పేరుతో పిడికెడు యుద్ధ ప్రభువులు నడుపుతున్న మాఫియా ముఠాగా కె.ఎల్.ఏ. మారిపోయింది''.

కనుక కొసావో ఘర్షణ నుంచి తీసుకోవాల్సిన నాల్గవ పాఠం ఏమంటే-సామ్రాజ్యవాద పక్షాలలో దేనిమీదా కూడా ఆధారపడి ఏ జాతీయ విముక్తి పోరాటమూ పురోగమించలేదు. సామ్రాజ్యవాదుల మధ్యవైరుధ్యాలని ఉపయోగించు కోవడం వేరు, వారిలో ఎవరిమీదో ఒకరిమీద ఆధారపడిపోవడం వేరు. ఏ విముక్తి పోరాటశక్తీ సామ్రాజ్యవాదుల తాఖీదులకి తలొగ్గి ఆయుధ విసర్జన చేయరాదు, నిరాయుధం అయిపోకూడదు, వాళ్లెల్లప్పుడూ యుద్ధంలో చొరవ తమ చేతుల్లో అట్టిపెట్టుకుంటూ వుండాలి. ఈ సామ్రాజ్యవాదశక్తి, లేక ఆ సామ్రాజ్యవాదశక్తి తమ మిత్రపక్షం అనే తీరులో జాతీయ విముక్తి పోరాటకార్లు ఆలోచించకూడదు. విడిపోయే హక్కుతో సహా వివిధ జాతుల స్వయం నిర్ణయాధికార హక్కుని సమర్థిస్తూ దానిచుట్టూ ప్రజల్ని కదిలించే ప్రజాతంత్ర శక్తులు, శ్రామికవర్గ శక్తులే తమ నిజమైన మిత్రులని వారు గ్రహించాలి. సామ్రాజ్యవాదులు వారి అధికార క్రీడలో జాతీయ విముక్తి పోరాటాల్ని పావులుగా వాడుకుంటారు. అంతే, వారి అవసరం తీరాక వెన్నుపోటు పొడుస్తారు. చరిత్ర ఈ సత్యాన్ని పదేపదే రుజువుచేస్తూ వచ్చింది. కొసావోలో దీన్ని మరోసారి చూసాం.

### ఐదవ పాఠం: సామ్రాజ్యవాదాన్ని త్రిప్పికొట్టి జాతులస్వయం నిర్ణయాధికారాన్ని సాధించుకోడానికి ప్రజా ఉద్యమాలే శరణ్యం!

నాటో భయపడేది రష్యాకి కాదు, చైనాకి కాదు-అంతకంటే అధికంగా అది, యుద్ధానికి వ్యతిరేకంగా తమ దేశాలలోను, ప్రపంచంలోని ఇతర దేశాలలోను ఎగిసిపడే ప్రజా ఉద్యమాలను చూసి భయపడుతుంది. నాటో బరితెగింపుదనాన్ని, రష్యా వెన్నుముకలేని తనాన్ని, చైనా కపటనాటకాన్ని మాత్రమే కాదు, ఈ యుద్ధం బహిర్గతపరచింది. సర్దుబాటువాదుల (సానునయవాదుల) దివాళా కోరుతనాన్ని సైతం ఈ యుద్ధం బహిర్గతపరచింది. గడచిన 50 సంవత్సరాల కాలంలో మొదటిసారిగా ఐరోపాశక్తులు వేసిన చేసిన ఈ యుద్ధంలో 'గ్రీన్ పార్టీ' (పార్టీ ఆఫ్ ది గ్రీన్స్) నేరుగానే పాల్గొంది. జర్మన్ ప్రభుత్వంలో ఒక భాగంగా వుంటున్నందున వారు సైతం కొసావోలో జరిగిన జాతి నిర్మూలనా లక్ష్యంతో సాగిన బాంబింగ్‌కి బాధ్యత వహించక తప్పదు.

యుద్ధానికి వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజాఉద్యమాలు అభివృద్ధి నిరోధక ప్రభుత్వాల గుండెలను చెదరగొడుతున్నాయి. గడచిన మేడే ప్రదర్శనలన్నీ తీవ్ర యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలుగానే సాగాయి. ఇటలీలో, మే మధ్యలో, మెక్‌డొనాల్డ్‌కి చెందిన మూడు ప్రాంతాలు (outlets) బాంబుదాడులకి గురయ్యాయి, ఇటలీ నిరసనకార్లు మూడు సైనిక వాహనాల్ని ధ్వంసం చేసేసారు. ఇక గ్రీసులో ఏప్రిల్ 27న నిరసనకారులు ట్రక్కులు, టాంకులు పడవలలోకి ఎక్కించకుండా అడ్డుకున్నారు. ఇక జర్మనీలో ఈ యుద్ధానికి ఆమోదం తెలుపడం కోసం నిర్వహించబడిన 'గ్రీన్స్' పార్టీ మహాసభ సందర్భంగా, బాంబింగ్‌ని సమర్థించిన వారికి హింసాత్మక వ్యతిరేకత వ్యక్తమైంది. వేడిగా ఉద్రిక్తంగా సాగుతుండిన పార్టీ కాంగ్రెస్‌లో బాంబింగ్ వ్యతిరేక నిరసనకారుల పెయింట్ బాంబుల దెబ్బలు ఆర్థికమంత్రి ఫిషర్ రుచిచూసాడు. జర్మనీలో కూడా జి-8 దేశాల సమావేశ స్థలం వద్ద

భారీ ప్రదర్శనలు (యుద్ధ వ్యతిరేక) జరిగాయి, అలానే జి-8 దేశాల సాంవత్సరిక శిఖరాగ్ర సమావేశాలవద్ద సైతం పెద్ద పెద్ద ప్రదర్శనలు జరిగాయి. పోతే, గడచిన దశాబ్ది కాలమంతటిలో ఎప్పుడూ ఎరగనంతటి హింసాయుత ప్రదర్శనలను బ్రిటన్ రుచి చూసింది. వేలాది ప్రదర్శనకారులు లండన్ నగరాన్ని దిగ్బంధించారు. మెక్‌డొనాల్డ్ రెస్టారెంట్‌ని ధ్వంసం చేసి తమ ఆగ్రహాన్ని వెళ్ళగక్కిన తరువాత వారు శాంతించి పోకుండా పోలీసులతో బాహాబాహీ కొట్లాట్లకి దిగారు, ఈ కొట్లాటలు గంటల తరబడిగా కొనసాగాయి. ఈ నిరసనలలో చాలా భాగం యుగోస్లేవియాలోని యుద్ధానికి వ్యతిరేకంగా మాత్రమే గాక ప్రపంచంలో సామ్రాజ్యవాద విధానాలకి వ్యతిరేకంగా కూడా సాగాయి.

ఆ రకంగా ఈ యుద్ధం నుంచి మనం గ్రహించాల్సిన ఐదవ పాఠం ఏమంటే-సామ్రాజ్యవాద దేశాలలోనే ప్రజలనుంచి చెలరేగుతున్న ఈ తీవ్ర నిరసనలు-వీటికి తోడుగా మూడవ ప్రపంచదేశాలలో సాగుతున్న సాయుధ పోరాటాలు-ఇవి సామ్రాజ్యవాదులకి పీడకలలవుతున్నాయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఈ శక్తి మాత్రమే ప్రధానశక్తిగా పనిచేస్తుంది.

ఇక 'మాంటెనిగ్రో'ని అస్థిరపరచి, యుగోస్లేవియాలోని మిలోసెవిక్ ప్రభుత్వాన్ని కూల్చడం, నాటో తదుపరి బాధ్యలుగా వుంటాయి. నాటోకి వ్యతిరేకంగాను, అలానే నాటో రష్యా దన్నుతో వుంటున్న మిలోసెవిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగాను సాగాల్సిన సెర్బుల-కొసావోల ఐక్యపోరాటానికి, విడిపోయే హక్కుతో సహా కొసావో ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కుని గుర్తించడమనేది ప్రారంభ అంశం అవుతుంది. నాటో, మిలోసెవిక్ జాతీయ దురహంకార ప్రభుత్వాలకి వ్యతిరేకంగా సెర్బ్, కొసావో ప్రజలు ఐక్యంగా చేసే పోరాటమే బాల్కన్‌లో శాంతి స్థాపనకు తగిన హామీ కాగలుగుతుంది. ❐

# కామ్రేడ్ పెలిసియానో అరెస్టును ఖండించండి

జూలై 14 ఉదయం పెరూలోని ఫుజిమోరీ ప్రభుత్వం పెరూ కమ్యూనిస్టు పార్టీ (పి.సి.పి.) నేత అయిన కామ్రేడ్ ఫెలిసియానో (ఆస్కార్ రమిరెజ్ డ్యూరాండ్)ని అరెస్టు చేసింది. 1992 సెప్టెంబర్‌లో పెరూ కమ్యూనిస్టు పార్టీ ఛైర్మన్ గొంజాలో అరెస్టు తర్వాత పి.సి.పి. కేంద్రకమిటీ బాధ్యతను కా॥ పెలిసియానో చేపట్టాడు. పెరూలోని మావోయిస్ట్ బలగాలకు ఇది మరొక దెబ్బే అయినప్పటికీ, కా॥ పెలిసియానో స్థానంలోకి వచ్చిన కా॥ ఆర్టిమియో నూతన నాయకత్వం కింద కొనసాగుతున్న పెరూ ప్రజాయుద్ధ క్రమాన్ని అది మార్చలేదు.

తొలుత 1920, 1930లలో కా॥ మారియా టెగుయ్ నేతృత్వంలోని, 1960 తర్వాత ప్రస్తుత ఛైర్మన్ కా॥ గొంజాలో నేతృత్వంలోని పి.సి.పి.కి ఉజ్వలమైన చరిత్ర వుంది. కా॥ గొంజాలో, కొద్దిమంది ఇతర కేంద్రకమిటీ సభ్యుల అరెస్ట్ తర్వాత గత కొన్నేళ్ళుగా ఫుజిమోరీ తొత్తు ప్రభుత్వం, వారి అమెరికా ప్రాయోజిక కర్తలూ, 'పి.సి.పి. పని అయిపోయిందని', 'పి.సి.పి.కి నాయకత్వమే లేదని' అంటూ తమ బాణీలో ప్రచారానికి లంకించుకున్నారు. వారు సాయుధ పోరాట విరమణకి పిలుపిచ్చిన 'శాంతి ఒప్పందపు' కుతంత్రానికి పాల్పడి, 'శాంతి ఒప్పందం' రచయిత సాక్షాత్తూ కా॥ గొంజాలోయే అంటూ ప్రకటించారు. ఈ విధంగా పార్టీ శ్రేణులను పీడిత ప్రజానీకాన్నీ నైతికంగా కుంగదీసేందుకుగానూ పి.సి.పి. నాయకత్వపు ప్రతిష్టను, ప్రత్యేకించి దాని ఛైర్మన్ గొంజాలో ప్రతిష్టను దెబ్బతీసేందుకై యాంకీ సామ్రాజ్యవాదుల (ఉత్తర అమెరికా గుత్తపెట్టుబడిదారుల ముద్దుపేరు-అను) సంరక్షణలోని పెరూ పాలకవర్గాలు ఓ పద్ధతి ప్రకారం విద్రోహ ప్రచారాన్ని మొదలెట్టాయి. ఈ తప్పుడు ప్రకటనను సమర్థించుకునే విషయమై ఫుజిమోరీ ప్రభుత్వం గత ఏడేళ్ళుగా కా॥ గొంజాలోను వ్యక్తిగతంగా ప్రపంచం ముందుకు తీసుకురావడానికి సైతం సాహసించదు. ఈ నగ్నసత్యమొక్కటే, నాయకత్వంపై బురదజల్లి పెరూలోని విప్లవ శ్రేణులలో, ప్రపంచమంతటా గందరగోళాన్ని మొలకెత్తించేందుకు గాను ఇదొక పోలీసు పథకం మాత్రమేనని చెప్పడానికి సాక్ష్యంగా సరిపోతుంది. నిజానికి తన అరెస్టు తర్వాత వెంటనే కోర్టుకు హాజరుపర్చిన ఒకే ఒక సమయంలో ఈ అరెస్టులు 'ప్రయాణంలో మలుపు' మాత్రమేనని కా॥ గొంజాలో ప్రకటించాడు. జైళ్ళలో విద్రోహులుగా మారి తరచుగా టెలివిజన్‌లో చూపించబడి, పత్రికలలో ప్రచారం చేయబడిన పలువురు పి.సి.పి. నాయకులకు ప్రజాయుద్ధ ఉపసంహరణ డిమాండ్‌ని ప్రచారం చేయటానికి, శాంతి చర్చలలో పాల్గొనేందుకుగాను స్వాతంత్రమిస్తూ, ఫుజిమోరి ప్రభుత్వం ఇటువంటి నాయకుల మితవాద అవకాశ పంథాని ప్రచారం చేయటం నిరంతరం కొనసాగిస్తోంది.

అయితే ఫుజిమోరి ప్రభుత్వం, వారి హంతక సాయుధ బలగాలు పన్నుతున్న ఈ జిత్తులన్నింటితో పి.సి.పి. శ్రేణులు, పెరూ ప్రజారాసులు మోసపోరు. కా॥ గొంజాలో, తదితర నాయకుల అరెస్టుల క్రమంలోని 'ప్రయాణంలో మలుపు' తర్వాత, కా॥ ఫెలిసియానో నాయకత్వంలోని పార్టీ తిరిగి నిర్మించబడింది. 1995 చివరి నుండి శత్రు బలగాలకు వ్యతిరేకంగా దాడులకు సైతం దిగింది. యాంకీ సామ్రాజ్యవాదంతో కుమ్మక్కైన ఫాసిస్ట్ ఫుజిమోరీ కీలుబొమ్మ ప్రభుత్వం మొదలెట్టిన క్రూరమైన దాడుల నెదుర్కొంటూ విప్లవోద్యమంలో అది గణనీయ పురోగతిని సాగిస్తోంది.

కా॥ ఫెలిసియానో అరెస్ట్‌ని 'క్రాంతి' పత్రిక తీవ్రంగా ఖండిస్తూ పెరూలో కా॥ గొంజాలో ఇతర రాజకీయ ఖైదీలతో పాటుగా కా॥ ఫెలిసియానోను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది. ❐

# మహిళలకు సంకెళ్ళుగా మారిన ఆదివాసీ సనాతన సంప్రదాయాలను ఛేదించుకొని విప్లవోద్యమంలో జీవించిన కామ్రేడ్ మీనక్క ఒక విప్లవ స్ఫూర్తి!

కాలం చెల్లిన ఆదివాసీ సంప్రదాయాలపై ఒక పోరాటం కామ్రేడ్ మీనక్క జీవితం. మీనక్క ఒక పోరుమహిళ. ఒక విప్లవస్ఫూర్తి. 1987 జూన్‌లో పెళ్ళి బంధనాలను ఛేదించుకొని, అత్తవారింటి నుండి బయల్దేరి నూతన ప్రపంచంలోకి అడుగుపెట్టిన సనాతన గోండు సాంప్రదాయాలపై సవాలు విసిరిన కామ్రేడ్ మీనక్క 26 ఏప్రిల్ 1999 నాడు జారెవాడ వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో శత్రువుతో పోరాడుతూ తను నమ్మిన ఆశయాల కోసం అసువులు బాసింది. ఆ వీరనారికి మా విప్లవ జోహార్లు.

కామ్రేడ్ మీనక్క ఏటపల్లి తాలుక కర్రెం గ్రామంలో30 సంవత్సరాల క్రితం మడావి కుటుంబంలో జన్మించింది. తల్లిదండ్రులు తమ కూతురిని సమ్మక్కగా పిలుచుకునేవారు. పేద ఆదివాసీ కుటుంబంలో పుట్టిన మీనక్కను తల్లిదండ్రులు 18 ఏళ్ళలోపే తమ దగ్గరి బంధువుకు ఇచ్చి వివాహం చేసారు. మీనక్కకు తల్లిదండ్రులు తలపెట్టిన వివాహం అసలే నచ్చలేదు. తనకు ఇష్టం ''లేని'' మగాడితో జీవితాంతం కాపురం చేయడం సహించలేక పోయింది. వివాహ జీవితంతో రాజీ పడలేక జీవితం ఘర్షిస్తున్న రోజుల్లో విప్లవకారుల గూర్చి విన్నది అయితే, ఆమెలో అనేక సందేహాలు!

ఆనాటికే ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు అహిరి మహారాజు విప్లవోద్యమంలోని మహిళలపై విషప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఆంధ్ర సరిహద్దులు దాటి వచ్చిన నక్సలైట్లు ఆదివాసీ గోండు మహిళల కోసమే వచ్చారనీ, వారు లంగలనీ, దొంగలనీ, పరమ బద్మాషులనీ, ఒక మహిళను దళాల్లో సామూహికంగా వాడుకుంటారనీ, ఇలా రకరకాల నీచమైన ఆరోపణలతో ప్రచారదాడిని ఎక్కుపెట్టి వున్నాయి. ఇలాంటి స్థితిలో ఒక రాజగోండు ఆదివాసీ కుటుంబంలో పుట్టి పెరిగి పెళ్ళయిన యువతి ఒంటరిగా తెగించి ఒక నిర్ణయానికి రావడానికి అత్యంత సాహసమే కావాలి. ఇంటివాళ్ళను ఎదిరించాలి! అత్తారింటివారిని ఎదిరించాలి!! తెగపెద్దలను, పెద్దలు కర్కశంగా అమలు చేస్తున్న దుష్టసంప్రదాయాలను ఎదిరించాలి!!! ఆనాటికి ఆ ప్రాంతంలో ఇంకా క్రాంతికారి ఆదివాసీ సంఘాలు ప్రారంభం కాలేదు. విప్లవ గెరిల్లా దళాల్లోనూ మహిళలు అంతంత మాత్రమే. అందులోనూ ఆదివాసీ సాంప్రదాయాలు తెలిసి, అనుభవించి జీవితంలోనుండి అర్థం చేసుకోగలిగిన వారు కాదు ఆ మహిళలు. ఇలాంటి స్థితిలో తమ గ్రామానికి అడపాదడపా వచ్చే దళాన్ని దొరకబుచ్చుకుని వారితో తన సమస్య పరిష్కరించుకోవాలి. తాను దళం వారితో కలిసి వెళ్తానని బహిరంగంగా ప్రవర్తిస్తారోనని, తనకోసం దళం వారిని కాదంటుందో లేదోననే సందిగ్ధం. దళంలోకి భర్తీ కావడానికి ముందు మన మీనక్క సతమతమవుతున్న సమస్యలు  ఇవి. ఏమి షరతులు విధిస్తారోనన్న ఆందోళన!

ఏమైనా సరేనన్న తెగింపుతో చాటుగా దళ మహిళా కామ్రేడ్స్‌తో ముందు తన బాధను వ్యక్తం చేసింది. తన గాధను వినిపించింది. ఏడ్చింది. దళం కాదంటే తన జీవితమే వ్యర్థం అంది. ఒక సామాజిక బాధితురాలిగా తన జీవితాన్ని వారి ముందు పరచింది. మీనక్క జీవితాన్ని కామ్రేడ్స్ అర్థం చేసుకున్నారు. గత జీవితానికి, గత అనుభవాలకు, స్వస్తి చెప్పి సమ్మక్క దళంలో కలిసింది. మీనక్కగా పేరుమార్చుకుంది. అది 1987 సం॥రం.

పెరిమిళి దళంలో సభ్యురాలుగా చేరిన కామ్రేడ్ మీనక్క గెరిల్లా క్రమశిక్షణను పట్టుదలతో నేర్చుకుంది. మితభాషి మీనక్క గెరిల్లాల పరిచయం పెంచుకుని నూతన ప్రపంచాన్ని తెలుసుకోసాగింది. అక్షరం ముక్క నేర్చుకోవడానికి నోచుకోని మీనక్క దళంలో దళసభ్యురాలు నిర్వర్తించవలసిన విధుల్ని సక్రమంగా నిర్వర్తిస్తూనే చదువు కూడా నేర్చుకోగలిగింది. 1989-90 నాటికి పార్టీ సభ్యురాలిగా ఎదిగిన మీనక్క పార్టీ అవసరాల రీత్యా ఎక్కడికి పంపినా వెళ్లగలిగే చైతన్యం పెంచుకుంది. 1989-90 నాటికి పార్టీ సభ్యురాలిగా ఎదిగిన మీనక్క పార్టీ అవసరాల రీత్యా ఎక్కడికి పంపినా వెళ్లగలిగే చైతన్యం పెంచుకుంది. 1989-90 నాటికి టిప్రాగడ్ నుండి బండారా, సాలెకసా, దారెకస, టాండా వరకు సర్వే కోసం వెళ్లిన దళంలో వుండి నూతన అనుభవాలను పార్టీకి అందించగలిగింది.

ఈ క్రమంలో 1991 నాటికి కామ్రేడ్ మీనక్క తోటి గెరిల్లా కామ్రేడ్‌ను వివాహమాడడానికి సిద్ధపడింది. ఎటపల్లి దళ కమాండర్‌ను వివాహమాడి కామ్రేడ్ మీనక్క ఏటపల్లి దళంలో బాధ్యతలు స్వీకరించింది. తిరిగి తాను మళ్లీ వివాహం చేసుకుంటాననీ, వైవాహిక జీవితం అనుభవిస్తాననీ, విప్లవోద్యమంలో అవన్నీ సాధ్యమేనని ఒకనాడు ఊహకు కూడా అందని మీనక్కకు పెళ్లి కావడంతో విప్లవోద్యమంలో మహిళలకు గల అవకాశాలను గూర్చి ఎంతో గర్వించేది. మహిళలపట్ల పురుషులు అసభ్యంగా వ్యవహరిస్తే పార్టీ తీసుకునే  క్రమశిక్షణ చర్యలు మగవారిని సంస్కరించడానికి ఎలా తోడ్పడుతాయో కూడా ఆచరణలో తెలుసుకుని మరింత విశ్వాసంతో విప్లవ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యింది.

గెరిల్లాలు మహిళలు ఎదుర్కొనే సాధారణ గైనిక్ సమస్యలు మీనక్కను తీవ్రంగా ఇబ్బంది పెట్టసాగాయి. చాలాకాలం వాటితో సతమతమవుతూనే గెరిల్లా జీవితాన్ని కొనసాగించింది. ఒకవైపు తీవ్రమైన అనారోగ్యం, మరోవైపు పాశవిక నిర్బంధం, నిజంగా అదొక పరీక్షా కాలమే. అయినా ప్రజలపై, పార్టీ రాజకీయాలపై విశ్వాసం సడలలేదు. పార్టీలో ఒక సీనియర్ కార్యకర్తగా ప్రజలకు ధైర్యం చెప్పడంలో చక్కని ప్రతిభ కనపర్చేది. తన సొంత తమ్ముడు పోలీసుల్లోకి భర్తీ అయ్యిండని తెలిసినప్పుడు, ''రక్తసంబంధం కన్నా వర్గ సంబంధం మిన్న'' అన్న చైతన్యంతో వ్యవహరించిందిగానీ, కుటుంబ ఒత్తిడికి, కుటుంబ సంబంధాలకు తలొగ్గి ప్రజలకు, పార్టీకి దూరం  ఆ తర్వాత పార్టీ అవసరాల రీత్యా తిరిగి పెరిమిలి ప్రాంతానికి బదిలీ అయిన కామ్రేడ్ మీనక్క అంతిమశ్వాస విడిచే వరకు ఆ ప్రాంత ప్రజల మధ్యనే జీవించింది.

శత్రువు విచ్చలవిడిగా నిర్బంధకాండను కొనసాగిస్తూ మహిళలపై అత్యాచారాలు జరిపినపుడు కామ్రేడ్ మీనక్క బాధితుల పక్షం నిల్చి వారికి ఎంతో ధైర్యాన్నిచ్చింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లలో గడ్‌చిరోలి యువతరాన్ని కాల్చి చంపుతుంటే, కన్నబిడ్డలను, వారి సహచరిణిలను అవమానిస్తుంటే, వేధిస్తుంటే వారిని కలిసి వారికి నచ్చచెప్పేది. మహిళా గెరిల్లాలకు ఒక మంచి స్నేహితురాలిగా, ఆప్తురాలుగా, నాయకురాలిగా నిల్చిన మీనక్క తన ఆశలను, ఆశయాలను మనముందు వదిలి వాటికోసం పోరాడుతూ అసువులు బాసింది. మీనక్క బాటలో నిల్చి పోరాడి అమరుల ఆశయాల కొనసాగింపే వారికి మనం చెప్పే నిజమైన నివాళి. ❒

# వివిధ సమస్యలను పార్టీ, సంఘాల నాయకత్వంలో పరిష్కరించుకున్న ప్రజానీకం

## ఈస్ట్ డివిజన్

### ఎ.పి.యఫ్ .డి.సి. రేంజర్‌ను నిలదీసి, కక్ష సాధింపు చర్యలను అరికట్టించుకున్న కాఫీ లేబర్లు

విశాఖ జిల్లా కోరుకొండ దళం ఏరియా గూడెం మండలంలోని ఎ.పి.యఫ్.డి.సి. కాఫీతోటల్లో పర్మినెంట్ లేబర్లుగా పనిచేస్తున్న చాపొడ్డ గ్రామ లేబర్లపై గత కొన్ని నెలలుగా కక్ష సాధింపు చర్య కొనసాగిస్తున్న రేంజర్ మాధవరావుతో విసిగిపోయిన కూలీలు వర్కర్స్ యూనియన్ నాయకత్వం క్రింద సమైక్యంగా నిలదీసి తమపై కక్ష సాధింపు చర్యలను ఎండగడుతూ కొన్ని సౌకర్యాలను సాధించుకున్నారు.

1.పర్మినెంటు లేబరుకు రోజువారీ పని కల్పించకుండా, క్యాంపు లేబరుకు పని ఇవ్వడాన్ని ఆపి, తిరిగి పర్మినెంట్ లేబర్లుకిచ్చే విధంగా;

2. పర్మినెంట్ లేబర్సుకు నెలవారీగా ఇవ్వాల్సిన వేతనం నెలదాటిన తరువాత తనకు ఇష్టం వచ్చినరోజు ఇస్తుండే పద్ధతి కాకుండా ఖచ్చితంగా నెల కాగానే చెల్లించే విధంగా, మరియు రోజువారీ వేతనం 50 రూ॥ల 90 పైసలు ఇవ్వాల్సి వుంటే చిల్లర లేదనే నెపంతో 90 పైసలు ఎగవేసేవాడు. ఆ 90 పైసలు కూడా చెల్లించే విధంగా చేసుకున్నారు. అలాగే పర్మినెంట్ లేబర్లుకాని రెగ్యులర్ లేబర్సుకి వారం వారానికి ఇవ్వాల్సిన బట్వాడా కూడా వారానికి కాకుండా వారందాటిన తరువాత ఇస్తుండేవాడు. అయితే ఇప్పుడు ఖచ్చితంగా వారానికి సంతరోజున బట్వాడా చేసేలా సాధించుకున్నారు.

3. నెలవుదినంగా ప్రకటించిన మేడే రోజున ఇవ్వాల్సిన వేతనాన్ని ఎగవేస్తుండేవాడు. దాన్నికూడా చెల్లించాలని;

4. పర్మినెంట్ లేబర్సు కోసం నిర్మించిన క్వార్టర్సును వారికి కేటాయించకుండా ఏదో సాకు చూపి కాలయాపన చేస్తుండడాన్ని వ్యతిరేకించి తమకే కేటాయించే విధంగా తమ డిమాండ్లను సాధించుకున్నారు.

### ప్రజా వ్యతిరేకి, పెత్తందారైన గ్రామమునసబును గ్రామ బహిష్కరణకు గురిచేసిన ప్రజానీకం

ఇదే జిల్లాలోని కోరుకొండ దళ ఏరియాలోని చింతపల్లి మండలం గిల్లెలబంద గ్రామ మునసబుగా కొర్రా బుడ్డడు గత కొన్ని సం॥రాలు నుండి కొనసాగుతున్నాడు. మునసబు పదవిలో వుండిన వీడు గ్రామ ప్రజల్ని పలు విషయాల్లో బెదిరిస్తూ వుండేవాడు. గ్రామసంఘంలో పనిచేస్తున్నాడని, తన మాట వినడం లేదని తన సొంత కొడుకుకే భూమిలో వాటా ఇవ్వనన్నాడు. ఈ విషయం తన కొడుకు గ్రామ ఏ.ఆర్.సి.యస్. ముందు పెట్టగా సంఘం ప్రజాకోర్టు జరిపి భూమిలో వాటా కొడుకుకివ్మని చెబితే ఎంతకీ ఒప్పుకోక పోవటంతో మునసబుకి ముక్కు నేలకు రాయించి భూమి వాటా ఇప్పించారు. ఇలాంటి సంఘటనల అనంతరం మునసబు గ్రామంలో తన పలుకుబడి, పెత్తనం పనిచేయటం లేదని నెమ్మదిగా పోలీసులతో సంబంధాలు పెట్టుకున్నాడు. ఈ సంబంధాలు ఎంతవరకు పోయాయంటే గ్రామాల్లో రైతులదగ్గర ఉన్న బర్మార్లను పోలీసులు సీజ్ చేసుకొని ఈ మునసబుకు ఇచ్చే స్థాయికి చేరింది. దీంతో మునసబు మళ్ళీ గ్రామంలో ప్రజలపై పెత్తనం చలాయించటం మొదలుపెట్టాడు. ఇదే క్రమంలో ఆ గ్రామం నుండి దళంలోకి రిక్రూట్ కాబడిన వంతాల కొండబాబు కొన్నిరోజులు దళంతో తిరిగి దళంలో ఇమడలేక దళంనుండి బయటకు వెళ్ళిపోయాడు. అయితే తన గ్రామంలో ఉంటే తనకు మునసబు ద్వారా ముప్పు వాటిల్లుతుందనే భయంతో వేరొక దగ్గర బ్రతుకుతున్న కొండబాబు ఆచూకీ తెలుసుకుని మునసబు పోలీసులకు సమాచారం ఇవ్వగా అతనిని పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. ఇలాంటి దురాగతాలతో విసిగిపోయిన ఆ గ్రామ ప్రజలు, అలాగే చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు సమైక్యంగా ప్రజాకోర్టు ఏర్పాటుచేసి మునసబు చేసిన తప్పులను విచారించగా తను చేసిన తప్పులను ఒప్పుకోలేదు. దాంతో ప్రజాకోర్టులో హాజరయిన ప్రజలందరూ గ్రామం నుండి బహిష్కరించాలని తీర్పు చెప్పి దాన్ని అమలుజరిపి మునసబును వెంటనే గ్రామం నుంచి బహిష్కరించారు.

### పోలీసు ఇన్‌ఫార్మర్ రాజారావును కట్టడి చేసిన ప్రజానీకం

విశాఖ జిల్లా గూడెం మండలం జెర్రెల కొత్తూరు గ్రామంలో నివాసముంటున్న రాజారావు పోలీసులతో సంబంధాలు పెట్టుకొని పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి ప్రచారం నిమిత్తం ఆదివాసీ రైతుకూలీ సంఘం ఏరియా కమిటీ అధ్యక్షుడు రావడాన్ని గమనించిన రాజారావు ఊరునుండి మెల్లగా జారుకొని చింతపల్లి పోలీసులకు సమాచారం చేరవేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రాత్రికి రాత్రే వచ్చి ఊరును చుట్టుముట్టి సంఘనాయకుని ఇంట్లో నిద్రిస్తున్న ఏరియాకమిటీ అధ్యక్షున్ని అరెస్టు చేసి పట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సంఘ నాయకత్వం క్రింద ప్రజాకోర్టు ఏర్పాటు చేసి ఇన్‌ఫార్మర్‌గా అనుమానం వున్న రాజారావును నిలదీయగా తానే పోలీసులకు సమాచారం చేరవేసి అరెస్ట్‌కు కారకుడిని అయ్యానని తన తప్పును అంగీకరించడంతో గ్రామస్థులు అతనికి కొన్ని షరతులు విధించారు. అవి 1. గ్రామంనుండి బయటకు పోరాదని, 2. ఇంటిపనీ, పొలంపనీ తప్ప ఇతర ఏ విషయాలు పట్టించుకోరాదని, ఇంకోసారి పోలీసులకు సమాచారం ఇస్తే వదిలేది లేదని' తీవ్రంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

### ప్రేమ పేరుతో మోసగించ ప్రయత్నించిన వ్యక్తిని అడ్డుకున్న గొందుపల్లి గ్రామ ప్రజలు

ఇదే జిల్లాలోని గూడెం మండలం గొందుపెల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన మామకూతుర్ని ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్ళి చేసుకుంటానని హామీఇచ్చి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలం గడచిన తరువాత నీకు నాకు ఎలాంటి సంబంధం లేదని బుకాయిస్తూ మరో మహిళను పెళ్ళి చేసుకోడానికి ప్రయత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ మహిళ వేరొకామెను పెళ్ళి చేసుకోవడాన్ని వ్యతిరేకించగా నేను మరొకరిని పెళ్ళి చేసుకుని

నిన్నుకూడా నా రెండవ భార్యగా ఉంచుకుంటానని మోసగించ బోయాడు. ఈ విషయాన్ని ఆ మహిళ గ్రామ ఆదివాసీ విప్లవ మహిళాసంఘం ముందు చెప్పుకుంది. అతని అక్క సంఘ నాయకురాలు అయినప్పటికీ తోటి మహిళకు జరుగుతున్న అన్యాయాన్ని సరైన పద్ధతిలో పరిష్కరించకుండా, పక్షపాతంగా వ్యవహరించి తన తమ్ముడి పక్షానే మాట్లాడింది. ఈ విషయంలో మహిళాసంఘ నాయకురాలు అనుసరించిన పద్ధతిని వ్యతిరేకిస్తూ గ్రామ ప్రజలు ఆ యువతిని పెళ్ళిచేసుకునే విధంగా సమస్యను పరిష్కరించి ఏ.వి.యం.యస్. నాయకత్వంలో మోసగాడి ఆటకట్టించి వారిద్దరికీ పెళ్ళి జరిపించారు.

### ఇండ్లు కాలిపోయి నిరాశ్రయులైన 8 ఆదివాసీకుటుంబాల ను ఆదుకున్న ప్రజలు

కోరుకొండ దళ ఏరియాలో మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్ పరిధి లోని దాగుడుపల్లి గ్రామంలో రైతులు పోడు వ్యవసాయం సాగుచేసుకోవడానికి పోడులో పెరిగిన తుప్పా, డొంకలను కొట్టి కాల్చుతుండగా గాలి వీచడంతో మంటలు ప్రక్కనే వున్న ఇండ్లను రాజుకొని సుమారు 8 ఇండ్లు కాలిబూడిదయ్యాయి. తిండి గింజలు, కట్టుబట్టలు సర్వం కోల్పోయి, అసలే పోడు వ్యవసాయం ద్వారా అరకొర ఉత్పత్తి చేసుకుంటున్న ఆదివాసీలకు అదికూడా మిగలకుండా పోయింది. దీంతో నిరాశ్రయులైన ఆ ఆదివాసీ కుటుంబాలను ఆదుకోవడానికి గ్రామ ఎ.ఆర్.సి.యస్. నాయకత్వం క్రింద గ్రామంలో బట్టలు, వంట పాత్రలు, తిండి గింజలు పోగుచేసి సహాయం చేశారు. అలాగే ప్రభుత్వం ఇచ్చే సహాయంపై ఆధారపడకుండా చుట్టుప్రక్కల గ్రామాల వారిదగ్గర ఏ.ఆర్.సి.యస్. సభ్యులు సహాయ క్యాంపెయిన్ నిర్వహించి బట్టలు, ధాన్యం సామలు, సోళ్ళు, వంటపాత్రలు సేకరించి ఆ ఆదివాసీ కుటుంబాలకు అందజేశారు.

### ప్రజలు స్వచ్ఛందంగా పార్టీకై సేకరించిన చందా

ఈస్ట్ డివిజన్ కోరుకొండ దళం ఏరియాలో గత కొన్ని సం॥లుగా జరుగుతున్న పోరాటాల్లో పాల్గొంటున్న రైతుకూలీలు, వెదురుకూలీలు, కాఫీ కార్మికులు, తమ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న పార్టీని ఆదుకోవాల్సింది ప్రజలేనన్న విషయాన్ని గ్రహించి పార్టీ చందా, మరియు వర్క్‌డేలలో పాల్గొని ఈ సం॥రం 32,000 రూ॥లు కలెక్టుచేసి పార్టీకిచ్చారు. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న పార్టీకి ఉండే ఆర్థిక వనరుల్ని దెబ్బతీయాలనే శత్రువుపన్నే కుట్రలను వమ్ముచేస్తూ తమవంతు బాధ్యత గుర్తించి పై చందాను ప్రజలు వసూలు చేసారు.

### భగత్‌సింగ్ వర్థంతి జరుపుకున్న ప్రజానీకం

కోరుకొండ దళం ఏరియాలో ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు గ్రామాలైన చెరువూరు, బత్తర్, తర్కపల్లి, సబ్బుపల్లి, గిల్లెలబంద, దిగుజనాభా, ఎగుజనాభా, లబ్దంపల్లి, చీకుపనస, దాకుడుపల్లి, నేరేడుబిల్లి చుట్టూ వున్న గ్రామసంఘాలు కలిసి మార్చి 23 భగత్‌సింగ్ వర్థంతి సందర్భంగా బహిరంగసభ ఏర్పాటు చేశారు. సభ ప్రారంభానికి ముందు విప్లవంలో అమరులైన అమరవీరులకు జోహార్లర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. భగత్‌సింగ్ గురించి గ్రామాల సంఘనాయకులు మాట్లాడారు. తెల్లదొరతనానికి వ్యతిరేకంగా పోరాడి వీరమరణం పొందిన భగత్‌సింగ్ ఆశయాలను నూతన ప్రజాస్వామిక విప్లవం వెలుగులో సాధిస్తామని మాట్లాడారు. దాదాపు మూడుగంటలపాటు జరిగిన ఈ సభలో సుమారు 400 మంది ప్రజలు పాల్గొన్నారు.

అరకు దళ ఏరియాలో ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాడేరు మండలం ఎగువ సంపల్లి గ్రామంలో, చుట్టుప్రక్కల గ్రామాలైన దిగువ సంపల్లి, కొత్తవలస, చావడ్లు గ్రామాల నుండి సుమారు 100 మంది స్త్రీ, పురుషులు కాగడాలు, ఎర్రజెండాలు, బ్యానర్లు చేతబూని ''షహీద్ భగత్‌సింగ్ అమర్‌హై'', భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం'' వంటి నినాదాలతో, ఊరేగింపుగా గ్రామం మధ్యకు చేరుకుని సభ జరిపారు. విప్లవ గీతాలతో వర్థంతి సభ ప్రారంభమయ్యింది. సభలో అరకుదళం పార్టీ సభ్యుడు అధ్యక్షత వహించగా శాక్ మెంబర్, కమాండర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ఒకవైపు విప్లవకారులను చంపుతూ ఇంకోవైపు బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన విప్లవకారుడు భగత్‌సింగ్ వర్థంతి సభను జరుపుతున్నదని ఇదంతా తిరుగుబాటు చేస్తున్న ప్రజానీకాన్ని ముఖ్యంగా యువతరాన్ని విప్లవమార్గం నుండి ప్రక్కతోవ పట్టించడానికి చేస్తున్న మోసాలేనని వీటన్నింటిని త్రిప్పికొడుతూ పీడిత ప్రజలందరూ సాయుధ పోరాటంలో ఏకం కావాలని పిలుపునిచ్చారు. చివరగా ''భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తా మంటూ'' ప్రతినబూనడంతో సభ ముగిసింది. ఏరియాలోని గన్నెల, బాకూరు, బొర్రవద్ద పోస్టర్లు కూడా వేశారు.

### పార్టీ పుట్టినరోజు జరుపుకున్న ప్రజలు

ఏప్రిల్ 22 (లెనిన్ జయంతి) పార్టీ పుట్టినరోజును పురస్కరించుకుని ఏరియాలోని జి.మాడుగుల మండలం బంధవీది, అనంతగిరి మండలం బొర్ర గుహలు, పెదబయలు మండల కేంద్రంలో ''ఏప్రిల్ 22న పార్టీ పుట్టినరోజును జరపండి'', ''బూటకపు పార్లమెంటరీ వ్యవస్థను బహిష్కరించండి'' ''మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి'', గ్రామరాజ్యకమిటీలకే సర్వాధికారాలు'' వంటి విప్లవ నినాదాలతో కూడిన బ్యానర్లతో ప్రచారం చేశారు.

### మేడేను జరుపుకున్న ప్రజలు

మేడే సందర్భంగా అరకు ఏరియాలోని ఒక సెంటర్‌లో చుట్టుప్రక్కన గల 6, 7 గ్రామాల నుండి సుమారు 100 నుండి 150 మంది గ్రామస్థులు హాజరై దళం ఆధ్వర్యంలో మేడే సభను జరుపుకున్నారు. విప్లవగీతాలు, నినాదాల హోరుతో మొదలైన సభ సుమారు రెండుగంటలకు పైగా కొనసాగింది. సభకు ముందు ఎర్రజెండాను ఎగురవేసి కార్మికరాజ్యం కోసం తమ ప్రాణాలను ధారపోసిన అమరులకు రెండు నిముషాలు మౌనం పాటించడం జరిగింది. అనంతరం సభలో అరకుదళం శాక్‌మెంబర్, కమాండర్‌లు 'కార్మికోద్యమం-పార్లమెంటరీ వ్యవస్థ', 'కార్మికోద్యమం-ప్రభుత్వ నిర్బంధకాండ' అనే అంశాలపై మాట్లాడటం జరిగింది. సభ మధ్య మధ్యలో విప్లవగీతాలు, నినాదాల హోరుతో సభ విప్లవోత్తేజంతో కొనసాగింది.

***(తరువాయి 33వ పేజీలో...)***

# ప్రపంచాన్ని గూర్చి తెలుసుకోడానికి, దాన్ని

*(చైనా కమ్యూనిస్టు పార్టీ, లియవోనింగ్ ప్రొవెన్షియల్ కమిటీకి చెందిన లేఖక బృందంచేత వ్రాయబడినది.*

సామాజిక ఆచరణలో మనిషి విషయ పరిజ్ఞానం అనేది ఏ రకంగా ప్రారంభమై అభివృద్ధి అవుతుంది? అనే దానికి సంబంధించి లెనిన్ చెప్పిందేమంటే **''సక్రృత్తు అనుభూతి నుంచి (From living perception) అమూర్త ఆలోచనకి, ఈ అమూర్త ఆలోచననుంచి (లేక ఊహ నుంచి-అను) ఆచరణకి-ఈ విధంగా వుంటుంది సత్యానికి సంబంధించిన, వస్తుగత వాస్తవికతకి సంబంధించిన విషయ పరిజ్ఞాన సముపార్జనకి సంబంధించిన** (ఇంద్రియ జ్ఞాన సముపార్జనకి సంబంధించిన-అను) **గతితార్కిక మార్గం''** ('తర్కానికి సంబంధించిన శాస్త్రీయత' (Science of Logic) అనే హెగెల్ గ్రంథంలోని స్థూలాభిప్రాయం)

ఛైర్మన్ మావో తన 'ఆచరణ' అనే సిద్ధాంత గ్రంథంలో ఇంద్రియ జ్ఞాన సముపార్జనా క్రమంలో) సంభవించే రెండు అంచెలను లేక అంగలను విశ్లేషిస్తూ తద్వారా జ్ఞాన సిద్ధాంతానికి సంబంధించిన గతితర్కాన్ని, భౌతికవాదాన్ని రెంటినీ చక్కగా వివరిస్తూ, విషయ జ్ఞాన సముపార్జనకి సంబంధించిన గతితార్కిక చలనాలపై లెనిన్ చేసిన విశిష్ట ఆలోచనలని మరింతగా అభివృద్ధి పరచాడు. ఛైర్మన్ మావో ఏమని పేర్కొన్నాడంటే ''జ్ఞానం అనేది అనుభవంతో ప్రారంభ మవుతుంది-ఇది జ్ఞాన సిద్ధాంత భౌతికవాదం. **జ్ఞానం అనేది మరింత లోతుగా సముపార్జించుకో బడాల్సి వుంటుంది, జ్ఞానానికి సంబంధించిన అనుభూతి దశ (లేక అనుభవైక దశ-అను) అనేది సహేతుక దశకి చేరుకోగలగాలి-ఇది జ్ఞాన సిద్ధాంత గతితర్కం''.**

వస్తుగత ప్రపంచానికి సంబంధించిన దృగ్గోచరాంశాలు లేక సాదృశాంశాలు మనిషి జ్ఞానేంద్రియాల ద్వారా ఆచరణలో మనిషి మెదడుపైకి ప్రతిఫలన చెంది ఆ రకంగా మనిషికి ఒక ఇంద్రియ జ్ఞానం లేక అనుభూతి జ్ఞానం అనేది ఏర్పడుతుంది-మనిషి విషయ పరిజ్ఞానానికి సంబంధించిన మొదటి అడుగు ఇది. ఆచరణలో పాలు పంచుకోవడాన్ని వ్యతిరేకించడం, అనుభూతి సముపార్జనను లేక ఇంద్రియ జ్ఞాన గ్రహణను వ్యతిరేకించడం అంటే భౌతికవాదాన్ని వ్యతిరేకించడమే! కానిక్కడ గుర్తుంచుకోవాల్సినదేమంటే-ఇంద్రియ జ్ఞానమనేది కేవల దృగ్గోచరాంశాల్ని ప్రతిబింబించేది మాత్రమే, ఈ దృగ్గోచరాంశాలకి సంబంధించిన విడి అంశాలని, విషయాలకి సంబంధించిన బాహ్య సంబంధాలని, ఒక్కొక్కప్పుడు విషయాల సారాంశానికి పూర్తి భిన్నమైన చిత్రాన్ని సైతం-ఈ ఇంద్రియజ్ఞానం అనేది అందించేస్తుంటుంది అని గుర్తించాలి. అందుకే మావో ఏమంటాడంటే **''దృగ్గోచరాంశాల సమస్యని మాత్రమే ఇంద్రియ జ్ఞానం పరిష్కరించగలదు-దాని సారానికి సంబంధించిన సమస్యని పరిష్కరించగలిగేది సిద్ధాంతం మాత్రమే''** కేవలం ఇంద్రియ అనుభవాల ఆధారంగా చేకూర్చుకున్న సమాచారం నుంచే నిర్ధారణలు చేసేస్తే అవి స్వీయాత్మకతకి, ఏకపక్ష ధోరణికి, పైపైన మాత్రమే విషయాన్ని చూసే తీరుకి తప్పక దారితీస్తుంది, అలాంటి నిర్ధారణలు వాస్తవికాంశాలను సవ్యంగాను సంపూర్ణం గాను ప్రతిబింబింప జాలవు. అపభ్రంశపు 'ఆచరణవాదులను' మావో తీవ్రంగా విమర్శిస్తూ చెప్పిందేమంటే **''వారు అనుభవాన్ని గౌరవిస్తారు కాని సిద్ధాంతాన్ని తృణీకరిస్తారు. కనుకనే వారికి ఒక వాస్తవిక క్రమానికంతటికీ సంబంధించిన సమగ్రమైన అభిప్రాయం అంటూ వుండజాలదు; అప్పుడప్పుడూ చేకూరే విజయాలతోను, కనీ కనపడని సత్యాలతోనే వారు సంతృప్తిపడి పోతుంటారు. అటువంటి వారు విప్లవ దర్శకత్వ బాధ్యత వహిస్తే వారు దాన్ని గుడ్డిగా సందుల్లోకి గొందుల్లోకే నడుపుతారు''** కనుక పనిలో అనుభవాలు సంతరించుకున్న కామ్రేడ్లందరూ అనుభవవాద ధోరణులను నిరోధించే, వాటిని అధిగమించే కృషిపై దృష్టి నిలపాలి; అనుభవాన్ని మదింపు చేసుకోడానికి చైతన్య వంతంగా మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని ఉపయోగించడం పై దృష్టి నిలపాలి, దాన్ని సహేతుక జ్ఞానస్థాయికి అభివృద్ధి పరచుకోడంపై శ్రద్ధ వహించాలి''.

ఛైర్మన్ మావో ఇలా పేర్కొన్నాడు **''జ్ఞాన సముపార్జనకి సంబంధించిన వాస్తవ కర్తవ్యం అల్లా ఏమంటే అనుభూతిద్వారా (అనుభవం ద్వారా) ఒక ఆలోచనకు చేరుకోవడం; వస్తుగతాంశాల ఆంతరంగిక వైరుధ్యాలకి సంబంధించిన అవగాహనకు క్రమక్రమంగా చేరుకోవడం; వాటి సూత్రాలు, నియమాలకి సంబంధించి, ఒక క్రమానికి మరో క్రమానికి మధ్య వుండే వాటి ఆంతరంగిక సంబంధాల గురించిన అవగాహనను పెంపొందించుకోవడం అంటే, తార్కిక జ్ఞానానికి చేరుకోవడం''.** శాస్త్రీయమైన అమూర్తీకరణ; సమగ్రత, క్రమబద్ధత అనే వాటిద్వారాను; వస్తుగత ప్రపంచాన్ని మరింత లోతుగాను, నిజంగాను, సంపూర్ణంగాను ప్రతిఫ లింపజేయడం ద్వారాను; వివిధ అంశాల సారాంశాన్ని ప్రధాన వరవడిని ప్రతిఫలింప జేయడంలోను సహేతుక జ్ఞానం అనేది తన లక్షణాల్ని లేక స్వభావాన్ని వ్యక్తపరుస్తుంటుంది. కనుకనే, సహేతుక జ్ఞానం అనేది విషయజ్ఞాన సముపార్జనా క్రమంలోని ఉన్నతదశగాను, అనుభవైక జ్ఞానదశతో పోలిస్తే దాన్నొక ముఖ్యమైన జ్ఞానదశగాను భావించాలి.

అనుభవైక జ్ఞానం నుంచి సహేతుక జ్ఞానానికి అంగ వేయడంలో మాత్రమే జ్ఞానం యొక్క క్రియాశీలత నిభిడీకృతం అవుతుందని కాదు, ఇంతకంటే ముఖ్యమైనదేమంటే-సహేతుక జ్ఞానం నుంచి

# మార్చడానికి సంబంధించిన మార్గదర్శక సూత్రం

## ''ఆచరణపై''- ఒక పరిశీలన

*1971 జూన్ 18 నాటి పెకింగ్ రివ్యూ నెం:25లో (ప్రచురించబడిన వ్యాసం రెండవ మరియు ముగింపు భాగం ఇది)*

విప్లవకర ఆచరణకు అంగ వేయడంలో సైతం అది వ్యక్తమవుతుంటుంది. మొదటి అంగతో పోలిస్తే రెండవ అంగ అనేది మరింత ప్రాముఖ్యత గలది.

ప్రజారాశుల విప్లవాచరణే అభివృద్ధిని నిలుపుతుంది. సరైన జ్ఞానం సైతం ఆచరణలోకి పోయి ఆచరణ అభివృద్ధి క్రమంలో అది సైతం నిరంతరాయంగా అభివృద్ధి కావాల్సి వుంటుంది. ఆచరణకు మార్గదర్శకత్వం వహించేందుకుగాను సరైన జ్ఞానమనేది ఉపయోగించబడకపోతే, అది నిరర్థకమవుతుంది.

సిద్ధాంతం అనేది ఆచరణ నుంచే ఉద్భవిస్తుందనే దాన్ని; విప్లవాచరణకు మార్గదర్శకత్వం వహించడంలో సిద్ధాంత పాత్రని వాంగ్‌మింగ్, లీషావ్‌చీ, యాంగ్‌షియన్ చెన్ తదితరులు నిరాకరించారు. ఆఖరికి వారు-పదార్థమే చైతన్యంగాను చైతన్యమే పదార్థంగాను పరస్పరంగా రూపాంతరం చెంది పరివర్తనకు లోనవుతాయనే మహత్తర సత్యాన్ని ''భావవాదం'' అంటూ బహిరంగంగానే నిందించారు. భావవాద అప్రియారిజం నుంచి ప్రారంభించి-ఆచరణ పునాదిపై సాగే చైతన్యం, పదార్థాల మధ్య అలానే ఆలోచన-అస్థిత్వాల మధ్య అంతస్సంబంధాలని వాటిమధ్య జరిగే పరస్పర పరివర్తనలని సరిగ్గా ఈ ముఠాయే విడదీసింది.

ప్రపంచాన్ని సవ్యంగా తెలుసుకోవడంలోను, దాన్ని మార్చుకోవడంలోనూ విప్లవకర సిద్ధాంతం యొక్క మార్గదర్శక పాత్రని మావో ఈ రచనలో ప్రత్యేకించి నొక్కి చెప్పాడు. అతడు చెప్పిందేమంటే **''మార్క్సిజం దృష్టికోణంలో సిద్ధాంతం ముఖ్యం. 'విప్లవకర సిద్ధాంతం అనేది లేకుండా విప్లవోద్యమం లేదు' అనే లెనిన్ ప్రకటనలో దీని ప్రాముఖ్యత పూర్తిగా వ్యక్తమవుతుంది. కానైతే అది ఆచరణకు మార్గదర్శకత్వం వహించగలుగుతుంది గనుకనే. అందువల్ల మాత్రమే సిద్ధాంత ప్రాముఖ్యతని మార్క్సిజం నొక్కి చెబుతుంది''.** 'శ్రద్ధాసక్తులతో చదువు అధ్యయనాలని సాగించండి-మార్క్సిజాన్ని బాగా ఆకళింపు చేసుకోండి' అనే ఛైర్మన్ మావో బోధనని మనమంతా పాటించాలి. ఇది మనకు చాలా ప్రాధాన్యతగల అంశం, ఏమంటే- మార్క్సిజాన్ని ఆకళింపు చేసుకోవడంలో మనం విఫలమైపోతే మన ఆచరణకి మార్గదర్శకత్వం వహించేందుకు సిద్ధాంతాన్ని ఉపయోగించడంలో మనం కృతకృత్యులం కాలేము. మార్క్సిజాన్ని వాస్తవానికి వ్యతిరేకిస్తూ, దాన్ని సమర్థించే వారుగా తమని తాము చాటుకొనే రాజకీయ మోసగాళ్ళను పసిగట్టజాలం, వారి మోసాన్ని గ్రహించలేం. వాంగ్‌మింగ్, లీషావ్‌చీ వారి తైనాతీలు-సాపేక్షంగా సైద్ధాంతిక స్థాయి తక్కువగా వుండే వారిని తమ మార్క్సిస్టు వేషధారణతో ఏమార్చి మోసగిస్తుంటారు. మనం మార్క్సిస్టు- లెనినిస్టు సిద్ధాంతాన్ని చైతన్యవంతంగా అధ్యయనం చేయకపోతే ఇకప్పుడు మనం నిజం స్థానంలో అబద్ధాన్ని స్వీకరించేస్తాం! విషపూరిత పిచ్చిమొక్కల్ని సువాసనల్ని వెదజల్లే పూలమొక్కలుగా భ్రమించేస్తాం, అలాంటి రాజకీయ వంచకులు అబద్ధాన్ని నిజంలా ప్రదర్శించేప్పుడు మనమీ తప్పిదాలకు పాల్పడిపోతాం.

తన 'ఆచరణ' అనే గ్రంథంలో మావో చెప్పిందేమంటే **''ప్రపంచాన్ని మార్చేందుకుగాను శ్రామికవర్గం, విప్లవ ప్రజానీకం చేసే పోరాటం ఈ క్రింది కర్తవ్యాలను నిర్వహించాల్సి వుంటుంది: వాస్తవిక వస్తుగత ప్రపంచాన్ని మార్చడం అదే సమయంలో తమ స్వీయ ప్రపంచాన్ని సైతం మార్చుకుంటూ తద్వారా వారి ఇంద్రియ జ్ఞాన గ్రహణశక్తిని సైతం మార్చుకోవడం అలానే వస్తుగత-స్వీయాత్మక ప్రపంచాల మధ్య సంబంధాలను మార్చడం''** స్వీయ ప్రపంచాన్ని అలానే వస్తు ప్రపంచాన్ని మార్చడానికి సంబంధించిన గతితర్కాన్ని మావో తన ఈ బోధనలో చాలా లోతుగా వివరించాడు. అలానే ప్రాపంచిక దృక్పథాన్ని చక్కదిద్దుకోడానికవసరమైన దిశానిర్దేశాన్ని సైతం ఈ బోధనలో పొందుపరిచాడు.

ఒకానొక ప్రాపంచిక దృక్పథం నిర్దేశకత్వంలో మనిషి నిర్వహించే చైతన్యపూరితమైన చర్యలద్వారా వస్తుగత ప్రపంచాన్ని మార్చడానికి అతడు చేసే పోరాటం అనేది, పడే తపన అనేది వ్యక్తమవుతుంటుంది. **''ప్రాపంచిక దృక్పథంలోని ఈ మార్పు అనేది ఒక రకంగా మౌలికమైనది''** (''ప్రజల మధ్య వైరుధ్యాలను సవ్యంగా చేపట్టడంపై'').

వస్తుగత ప్రపంచాభివృద్ధి సూత్రానికి అనుగుణంగాను; అలానే విప్లవ పరిస్థితి అభివృద్ధి అవసరాలకు అనుగుణంగాను; అలానే స్వీయాత్మక-వస్తుగత అంశాల మధ్య జ్ఞానం-ఆచరణల మధ్య నిర్దిష్టంగా చారిత్రాత్మక ఐక్యత సాధించేందుకు వీలుగా ఆలోచనలను వాస్తవ ప్రపంచాభివృద్ధి సూత్రానికి అనుగుణంగాను, విప్లవ పరిస్థితి అభివృద్ధికి అనుగుణంగాను నిలిపి వుంచడం అనేదే ప్రాపంచిక దృక్పథాన్ని చక్కదిద్దుకోవడం, మలుచుకోవడం అంటే! ఛైర్మన్ మావో ఏమంటాడంటే **''సోషలిస్టు సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ చక్కదిద్దబడాలి''** (ప్రజలమధ్య వైరుధ్యాలను సవ్యంగా చేపట్టడంపై) దీర్ఘకాల ప్రజాయుద్ధంలో రాటుదేలిన, పరీక్షకు నిలబడిన ప్రముఖ కేడర్లు అలానే జి.పి.సి.ఆర్. నిర్వహణలో ముందుకొచ్చిన కొత్త కేడర్లు, ఉభయులు కూడా తమ తమ ప్రాపంచిక దృక్పథాలను చక్కదిద్దుకోవాల్సిన అవసరం వుంటుంది. ఉన్నతస్థాయి కేడర్లు ఇంకా ఉన్నతోన్నత కర్తవ్యాలను తమ భుజస్కంధాల పైకెత్తుకోవాల్సి వుంటుంది, తద్వారా తమ ప్రాపంచిక దృష్టికోణాన్ని

తీర్చిదిద్దుకోవాల్సి వుంటుంది. ఇలా చక్కదిద్దుకోవడాన్ని, తీర్చిదిద్దుకోవడాన్ని నిరాకరించడమంటే-శ్రామికవర్గ నాయకత్వాన విప్లవం కొనసాగడాన్ని నిరాకరించమే, గతితార్కిక, చారిత్రక భౌతిక వాదాలను నిరాకరించడమే!

వాస్తవ వస్తుగత ప్రపంచాన్ని మార్చడానికి చేసే పోరాటం అనేది స్వీయాత్మక ప్రపంచాన్ని తీర్చిదిద్దుకోవడం అనే దానినుంచి వేరుచేసి వుంచబడజాలదు. అందుకే మార్క్స్ ఏంగెల్స్‌లు ఏమంటారంటే **''విప్లవ కార్యాచరణలో ఒకరు మారడం అనేది పరిస్థితులు మారడంతో కలగలిసే వుంటుంది''** (వ్యక్తి మార్పు పరిస్థితుల మార్పుకి సరిపోలి వుంటుంది-అను) (జర్మన్ భావజాలం). మూడు మహత్తర విప్లవోద్యమాలలో భాగం పంచుకోవడం అనే దానితో అనుసంధానిస్తూ మార్క్సిస్టు-లెనినిస్టు గ్రంధాలని ఛైర్మన్ మావో గ్రంధాలని చైతన్యవంతంగా అధ్యయనం చేస్తూ వాటితో మమేకం అవడంలోనే స్వీయ ప్రపంచాన్ని చక్కదిద్దుకునే మార్గం నిక్షిప్తమై వుంది. మార్క్సిజం-లెనిజం-మావో ఆలోచనా విధానం అనే అస్త్రధారణలో ఆరితేరడం ద్వారానే, చాలాకాలం పాటు కార్మిక రైతాంగ జనబాహుళ్యంలోకి చొచ్చుకుపోయి వుండడం ద్వారానే, వాస్తవ పోరాటాలలోకి దూసుకుపోవడం ద్వారానే, కఠినతరమైన అనుభవాలలో రాటుదేలడం ద్వారానే సాపేక్షంగా మన ఆలోచనలో సమగ్రమైన పరివర్తనని సాధించగలుగుతాం, మన ఆలోచనల్లో మార్పుల్ని తీసుకురాగలుగుతాం, ఆ క్రమంలోనే క్రమానుగతంగా మనం శ్రామికవర్గం వేపు మొగ్గగలుగుతాం, మనం మన వైఖరిని ఆ వర్గానికి అనుకూలంగా మలచగలుగుతాం. ఎవరైనా వాస్తవ పోరాటాలని విడచిపెట్టేస్తే, వాస్తవ పోరాటాలకి దూరమైపోతే, కార్మిక రైతాంగ జనబాహుళ్యానికి దూరమైపోతే-ఇకప్పుడు అలాంటి వారి స్వీయ ప్రపంచం చక్కదిద్దబడటం గూర్చి మాట్లాడటమే అసంగతం అవుతుంది. అది చక్కదిద్దబడే ప్రశ్నే వుండదు.

భావవాద అప్రియోరిజం నుంచి ప్రారంభమై (అప్రియోరిజం అంటే ఒక చర్యని బట్టి దాని ఫలితాన్ని ఊహించి చెప్పే వాదన, ధోరణి. ఉదా-వారు ఉదయం నుంచి ఏకధాటిగా నడుస్తూ వస్తున్నారు కనుక తప్పనిసరిగా బాగా ఆకలితో వుంటారని చెప్పడం-లాంటిది-అను) వాంగ్‌మింగ్, లీషావ్‌చీ వారి తైనాతీలు-విప్లవ కార్యాచరణ క్రమంలో ప్రాపంచిక దృక్పథం చక్కదిద్దుకోబడాల్సిన అవసరాన్ని పనిగట్టుకుని మరీ వ్యతిరేకించారు. ''ఎక్కువగా చూడ్డంద్వారా, మాట్లాడటం ద్వారా'' 'సహజంగానే' శ్రామికవర్గ ప్రాపంచిక దృక్పథాన్ని ఎవరైనా పెంపొందించుకోవచ్చు గదా'' అంటూ వదురుతూ వుండేవారు-ఈ అసంగత వాదన ప్రకారం-మూడు గొప్ప విప్లవోద్యమాలలో-అంటే ఉత్పత్తి కోసం పోరాటం, వర్గ పోరాటం, శాస్త్రీయ ప్రయోగం-అనే మూడు విప్లవోద్యమాలలో ప్రజలు భాగస్వాములు కావాల్సిన అవసరమే లేదు; వారు ప్రజల్లోకి పోవాల్సిన పనే లేదు; 'కన్‌ఫ్యూషియస్ మరియు సున్‌సియన్‌ల బోధనలను' అంకిత భావంతో అధ్యయనం చేస్తున్నంతకాలం; 'రోజుకి మూడుసార్లు ఆత్మావలోకనం చేసుకోవడం' అదీ 'అధ్యయనాలు, పండిత పీఠాల' తెరవెనుకనే-వీటి ద్వారానే ఎవరైనా కూడా 'అద్భుతమైన, రాజకీయంగా పరిణతి చెందిన విప్లవకారులుగా' తమనితాము 'పండించుకోగలరు' అని చెప్పారు. ఇది పరమ అర్థరహితం. ఈ పద్ధతిలో 'విప్లవకారులు' ఏ రకంగా 'పండించబడతారో?!' లీషావ్‌చీ అతడి ముఠా తర్ఫీదులో పెట్టుబడిదారీ పునరుద్ధరణ ధ్యేయంతో కూడిన మేధావుల్ని లేక మేధో కులీనుల్ని ఉత్పత్తిచేసే ప్రక్రియ మాత్రమే ఇది కాగలుగుతుంది.

ఎవరైనా సరే విప్లవమే తన జీవిత సర్వస్వంగా చేసుకునేంత దాకా కూడా అతడు తన ప్రాపంచిక దృక్పథాన్ని నిరంతరాయంగా చక్కదిద్దుకుంటూ మలుచుకుంటూనే వుండాలి, తన జీవిత పర్యంతం దీన్నొక దీర్ఘకాల కర్తవ్యంగానే, చిరకాల దీక్షగానే స్వీకరించాల్సి వుంటుంది. సోషలిస్టు దశలో వర్గపోరాటం అనేది సుదీర్ఘంగా వుండేది గనుక, అది సంక్లిష్టంగాను కష్టనిష్ఠూరంగాను వుంటుంది గనుక-ప్రాపంచిక దృక్పథాన్ని మలచుకునే, చక్కదిద్దుకునే కర్తవ్యం సైతం సుదీర్ఘంగాను, కష్టతరంగాను వుండి తీరుతుంది. కనుక ఇందులో మనం ఏమరపాటుకి లోనైతే; ఈ కర్తవ్య స్వీకారంలోను, దీని నిర్వహణలోను అజాగ్రత్తకి లోనైతే; అలసత్వాన్ని ప్రదర్శిస్తే-బూర్జువా వర్గం చేత మనం మలినపడి పోవడం అనేదాన్ని నిరోధించలేం, రివిజనిస్టు భావాలచేత మలినపడకుండా మనల్ని మనం నిలవరించుకోజాలం-ఫలితంగా మనం మన పట్టు కోల్పోతాం. తీవ్ర తప్పిదాలకు పాల్పడిపోతాం.

మన ప్రాపంచిక దృక్పథాన్ని చక్కదిద్దుకోవడంలో-మన చైతన్యాన్ని పెంచుకోవడం ద్వారా మాత్రమే; విప్లవ సిద్ధాంత అధ్యయనాన్ని పెంచుకుంటూ, విప్లవాచరణను నిరంతరం అంటిపెట్టుకుని వుండటం ద్వారా మాత్రమే; నిరంతర విప్లవ లక్ష్యంతో వుంటూ, విప్లవశక్తితో మనల్ని మనం ఒక అంతర్భాగంగా భావించుకోవడం ద్వారానే-నిరంతరం మారే విప్లవ పరిస్థితికి అనుగుణంగా మనం మన భావాల్ని ఆలోచనలని వుంచగలుగుతాం, తద్వారా సమాజ రథాన్ని పురోగమింప జేయగలుగుతాం.

'ఆచరణ' అనే తన గొప్ప పుస్తకంలో ఛైర్మన్ మావో ఏం చెబుతాడంటే **''సామాజిక పరిణామ క్రమానికి, దాని అభివృద్ధికి సంబంధించిన ఈ చారిత్రక యుగంలో-ప్రపంచాన్ని గూర్చి సరిగ్గా తెలుసుకోవడం దాన్ని మార్చడం అనే బాధ్యతను చరిత్ర, శ్రామికవర్గం మరియు ఆ వర్గ పార్టీ భుజస్కందాలపై వుంచింది''** మావో యొక్క ఈ బోధనను అధ్యయనం చేస్తే-చరిత్ర మనకప్పగించిన కర్తవ్యం ఎంతటి ప్రముఖమైనదో మనం లోతుగా గుర్తించగలుగుతాం, అది చాలా కష్టతరమైనదే అయినా అత్యంత ప్రకాశవంతమైనదని కూడా మనం లోతుగానే అర్థం చేసుకుంటాం. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం మార్గదర్శకత్వంలో, ప్రతిక్షణాన్ని అనుదినాన్ని విప్లవ స్ఫూర్తితో సద్వినియోగపరుస్తూ మనం మన ప్రాపంచిక దృక్పథాన్ని చక్కదిద్దుకునే బృహత్తర కృషి చేస్తూ తద్వారా మరింత సమర్థవంతంగా వాస్తవిక ప్రపంచాన్ని మార్చే కృషి చేస్తూ చైనా విప్లవానికి మరిన్ని గొప్ప కానుకలని అందిస్తాము, అలానే ప్రపంచ విప్లవానికి సైతం విలువైన కానుకలందిస్తూ కమ్యూనిజం అనే మహత్తర లక్ష్యం వేపు విజయవంతంగా పురోగమిస్తాం. ❑

*(29వ పేజీ తరువాయి...)*

## మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం

1999 మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అనంతగిరి మండలం కరివేస్ గ్రామంలో మొత్తం గ్రామస్తులు హాజరై (సుమారు 100 మంది వరకు) కాగడాలను చేతబూని ''అంతర్జాతీయ మహిళా దినోత్సవం వర్ధిల్లాలి'' ''ఆకాశంలో సగం, పోరాటంలో సగం'' వంటి నినాదాలు, ప్లేకార్డులతో గ్రామం చుట్టూతా, ఊరేగింపుతీసి గ్రామం మధ్యలోగల రచ్చబండ వద్ద సభ జరిపారు. మహిళా సమస్యలతో కూడుకున్న గీతాలు మరియు, అమరుల స్మరణతో పాటలు పాడుతూ సభ ప్రారంభమయింది. సభలో అరకుదళ కమాండర్ మాట్లాడుతూ స్త్రీలపై జరుగుతున్న అణచివేతను, ప్రభుత్వం, పోలీసులు కొనసాగిస్తున్న అత్యాచారాలను, సామ్రాజ్యవాదం ఈరోజు మహిళలను మార్కెట్‌లో సరకుగా, సెక్స్ సింబల్స్‌గా ఏవిధంగా వాడుకుంటూందో వివరించాడు. మహిళలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో నిజమైన విముక్తిని సాధించాలంటే ''నూతన ప్రజాస్వామిక విప్లవం''లో భాగమై పోరాడటం ఒక్కటే మార్గమని దానికై మహిళలందరూ పోరాటంలో భాగం కావాలని పిలుపినిస్తూ సభ ముగించారు. మధ్య మధ్యలో విప్లవగీతాలతో సభ విప్లవోత్తేజంతో కొనసాగింది.

## మార్చి 8ని జరుపుకున్న ఆదివాసీ మహిళలు

విశాఖ జిల్లా గూడెం మండలంలోని ఆదివాసీ విప్లవ మహిళాసంఘం ఏరియా కమిటీ పరిధి నుండి 14 గ్రామాలనుండి సుమారు 150 మంది మహిళలు మార్చి 8 సందర్భంగా హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు విప్లవంలో అమరులైన అమరనారులకు జోహార్లర్పిస్తూ రెండు నిముషాలు ఏ.వి.యం.ఎస్. ఏరియా కమిటీ అధ్యక్షురాలు కా॥ సుభద్ర పతాకావిష్కరణ చేసింది. తరువాత మార్చి 8 ప్రాముఖ్యతను వివరించి, ఆదివాసీ సమాజంలో మహిళలపై జరుగుతున్న తెగపెద్దల, పురుషుల పెత్తనం, బలవంతపు పెళ్ళిళ్ళు, ఆదివాసీ సమాజం స్త్రీలపై విధించిన కట్టుబాట్లు తదితర అంశాల గురించి వక్తలు మాట్లాడారు. మాటల మధ్యలో విప్లవ గీతాలను ఆలపించారు.

# ప్రచారం

ప్రజలను రాజకీయంగా చైతన్యవంతం చేయటానికి ఏరియాలలోని సమస్యల మొదలు జాతీయ, అంతర్జాతీయ సమస్యల వరకు, ప్రజలకు అర్థం చేయిస్తూ, ప్రచారం చేయవలసిన అవసరం వుంది. దాన్లో భాగంగా ఉద్దానం ఏరియాలో అనేక విషయాలపై పోస్టర్లు, కరపత్రాలు, పత్రికా ప్రకటనల ద్వారా ప్రచారం చేశారు.

* శ్రీకాకుళం జిల్లా ఉద్దానం దళ ఏరియాలో రోజురోజుకు అభివృద్ధి అవుతున్న ఏరియా ఉద్యమాన్ని దెబ్బతీయటానికి శత్రువు అనేక ఎత్తుగడలను అవలంభిస్తున్నాడు. ఇన్‌ఫార్మర్ మెకానిజం ఏర్పాటు చేసుకోవడంతోపాటు గ్రామంలో వున్న యువకులను శాంతిసంఘాల పేరుతో ఆర్గనైజ్ చేయడం కోసం ప్రయత్నించడమే కాకుండా శాంతిసంఘాల్లో ఆర్గనైజ్ చేయబడిన కొంతమంది యువకులను దళం ఆచూకీ తెలిస్తే వెంటనే చెప్పాలని ఒత్తిడి తెస్తున్నాడు. శత్రువు ఏర్పాటు చేస్తున్న శాంతిసంఘాల్లో ప్రజలు ఎవ్వరూ చేరవద్దని విజ్ఞప్తిచేస్తూ పార్టీ పేరుతో ఏరియా వ్యాప్తంగా పోస్టర్స్ వేయడంతో పాటు, డి.వి.సి. పేరుతో పేపర్ ప్రకటన ఇచ్చారు.

* ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సముద్రంలో వేటాడి తీసుకొచ్చిన రొయ్యలను, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన బడాషావుకార్లు అతి చౌకగా మత్స్యకారులకు రేట్లు చెల్లిస్తూ వేలాది రూ॥లు లాభాలు ఆర్జిస్తున్నారు. అరకొర ఇస్తున్న రేటు కూడా తగిన సమయంలో రైతుకు చెల్లించకుండా మొత్తం సరుకును షావుకార్లు అమ్ముకున్న తర్వాత తమకు ఇష్టం వచ్చినపుడు రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారు. షావుకార్లు చేస్తున్న మోసాలను రైతులకు చెప్పడంతోపాటు వెంటనే రొయ్యలకు గిట్టుబాటు ధర చెల్లించాలనీ, డబ్బులు వెంటనే రైతులకు అప్పజెప్పాలని డిమాండ్‌చేస్తూ పోస్టర్స్, డి.వి.సి. పేరుతో పేపర్ ప్రకటన ఇచ్చారు.

* ప్రజలను పీడించటమే తన ధ్యేయంగా పెట్టుకున్న పాలకవర్గాలు ప్రజల జీవన పరిస్థితులను ఏ మాత్రం దృష్టిలో పెట్టుకోకుండా ప్రజలు కొనుగోలు చేస్తున్న నిత్యావసర వస్తువులు ధరలను ఎప్పటికప్పుడు పెంచుకుంటూపోతూ ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టేస్తున్నారు. బడా షావుకార్లతో కుమ్మక్కయిన పాలకవర్గాలు సృష్టిస్తున్న కృతిమ కొరతలో ఉప్పు, ఉల్లి, మిరపలాంటి వాటి ధరలు ఆకాశానంటాయి. దీనిని నిరసిస్తూ ఆర్.వై.యల్ పేరుతో పేపర్ ప్రకటన ఇవ్వడంతోపాటుగా, ఏరియా వ్యాప్తంగా పోస్టర్స్ వేసి ప్రచారం చేశారు.

* మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ప్రపంచ కమ్యూనిస్టు నాయకుడు కా॥ లెనిన్ జయంతి సందర్భంగా, ఏప్రిల్ 22న సి.పి.ఐ. (యం-యల్) పార్టీ పుట్టిన రోజు సందర్భంగా ఏరియా వ్యాప్తంగా ప్రజలకు పిలుపునిస్తూ, అలాగే విశాఖ పట్టణ కార్యదర్శి కా॥ అంకెల భాస్కరరావు (మధు)ను హత్యచేసి ఎన్‌కౌంటర్ అని కట్టుకథ అల్లిన పోలీసుల. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ, అలాగే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏరియా వ్యాప్తంగా పోస్టర్స్ వేశారు. అలాగే జూలై 28 అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా ఏరియా వ్యాప్తంగా పోస్టర్స్ వేయడంతోపాటు బ్యానర్స్ కట్టి కూడా ప్రచారం చేశారు.

* 13 నెలల బి.జె.పి. పరిపాలనా కాలంలో ప్రజలను ప్రక్కదారి పట్టించడానికి పోఖ్రాన్ అణుపరీక్షలు జరిపి తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవాలని చూసింది. కానీ బి.జె.పి.కి, జయలలితకు మధ్య సంబంధాలు చెడటంతో, అవకాశవాద పొత్తులతో ఏర్పడిన అతుకుల బొంత బి.జె.పి. ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం, జయలలితతో కుమ్మక్కయి బి.జె.పి. ప్రభుత్వాన్ని కూల్చి తాను అధికారానికి రావటానికి తీవ్రంగా

ప్రయత్నించిన వైనాన్ని ప్రజలకు వివరిస్తూ పోస్టర్స్ వేయడం జరిగింది.

✱ ఇదే ఏరియాలోని బెండి గ్రామంవద్ద బంజరుభూమిలో ప్రభుత్వం జీడితోట వేయించింది. గతంలో ప్రజలు ఒకటి, రెండుసార్లు పంటను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఆ తోటను అమ్మటానికి ప్రయత్నం మొదలుపెట్టింది. ఆ జీడితోటను షావుకార్లు ఎవరూ కొనవద్దని హెచ్చరిస్తూ, ప్రజలకు చెందాల్సిన ఆ తోటను సంఘటిత శక్తిద్వారా ప్రజలు ఆక్రమించుకోవాలని ప్రజలకు పిలుపినిస్తూ, ఏరియా వ్యాప్తంగా పోస్టర్లు వేశారు. అలానే పార్టీ పేరుతో పేపరు ప్రకటన ఇచ్చారు. ప్రస్తుతం ఏరియాలో అమలవుతున్న నిర్బంధాన్ని ఆసరాగా చేసుకుని, పలాస బడా వ్యాపారి తంగుడు రమణయ్య పోలీసుల సహకారంతో తోటలోని పంటను స్వాధీనం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. ఇతడిని హెచ్చరిస్తూ పోస్టర్సు వేయడం, పత్రికా ప్రకటన ఇవ్వడం జరిగింది.

✱ ఇదే ఏరియాలో రైతాంగానికి ప్రధాన ఆధారమైన జీడిపంటకు షావుకార్లు తగిన గిట్టుబాటు ధర చెల్లించడం లేదు. రైతుల దగ్గర పంట ఉన్నంతవరకు రేటు తగ్గించి, పంట షావుకార్ల చేతుల్లోకి మారిన తర్వాత రేటు పెంచడం ఆనవాయితీగా మారుతుంది. ఈ విధంగా రైతాంగాన్ని మోసం చేస్తున్న దగాకోరు షావుకార్లను హెచ్చరిస్తూ సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఏప్రిల్ నెలలో పోస్టర్స్ వేసి, పత్రికాముఖంగా ప్రచారం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సి నటువంటి 'ప్రజా ప్రతినిధులైన' మంత్రి శివాజీ, అప్పయ్యదొర, కణితి విశ్వనాధం షావుకార్లతో కుమ్మక్కయి గిట్టుబాటు ధరకోసం పోరాడుతున్న రైతాంగంపై నిర్బంధం ప్రయోగించుతున్నారు. వీరి దోపిడీవర్గ స్వభావాన్ని బహిర్గతపరుస్తూ పై నాలుగు మండలాల్లో ప్రచారం చేశారు.

✱ వజ్రపుకొత్తూరు మండలం పెదవంక గ్రామానికి చెందిన గేదెల క్రిష్ణ అనే వ్యక్తి పిల్లలు లేరనే ఉద్దేశ్యంతో ముగ్గురు స్త్రీలను పెళ్ళాడి వదిలిపెట్టాడు. ఏ భార్యను కూడా చక్కగా చూసుకునే స్వభావం లేకుండా, తాగివచ్చి విపరీతంగా కొట్టేవాడు. దాంతో ఆయనతో కాపురం చేయడం ఇబ్బంది అవడంతో గ్రామ పెద్దల దగ్గర తన సమస్య చెప్పుకున్న అతడి భార్య శాంతమ్మ ఫిర్యాదుమేరకు గ్రామ పెద్దలు క్రిష్ణను పిలిపించి తీర్పుచెప్పారు. అప్పటినుండి వీడు జనశక్తి వాళ్ళతో తిరుగుతూ నా సమస్యను పార్టీ దగ్గరే పరిష్కరించు కుంటానని చెప్పడంతో గ్రామపెద్దలు పట్టించుకోలేదు. ఈ సమస్య మన పార్టీ దృష్టికి రావడంతో వెంటనే పెద్దమనుషుల తీర్పును అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఏరియావ్యాప్తంగా పోస్టర్స్ వేసి ప్రచారం చేశారు.

### జనశక్తి కార్యకర్త కుత్తుం ధర్మారావు అరాచకాలకు వ్యతిరేకంగా

ఇదే ఏరియాలోని పలాస మండలం పల్లిమాకనపల్లి గ్రామంలో జనశక్తి కార్యకర్త కుత్తుం ధర్మారావు పెత్తందారీతనంతో వ్యవహరిస్తూ, గూండాగిరీ చలాయిస్తున్నాడు. 'పల్లికులం అమ్మాయి, గొల్లకులం అబ్బాయి ప్రేమించి పెళ్ళి చేసుకుంటే' కుల ఫీలింగ్‌తో గ్రామంలో తక్కువ ఇండ్లున్న యాదవ కులస్తులపైన వారితో మాట్లాడు తున్నారనే నెపంతో పల్లికులంలో కొందరిపైన, గ్రామంలోని కొంతమంది మద్దతుతో దాడిచేసి నానా భీభత్సం సృష్టించాడు. ఇంకా వీడు గ్రామంలో వివాహేతర సంబంధాలు పెట్టుకోవడం, తనకు వ్యతిరేకంగా ఉన్న వారికి కుల బహిష్కరణ చేయటం, పెద్ద మొత్తాలలో దండుగలు వసూలు చేయటం, వ్యవసాయ పంటలు నాశనం చేయడం లాంటి అనేక అరాచకాలు చేస్తున్నాడు. ధర్మారావు అరాచకాలకు వ్యతిరేకంగా ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో పోస్టర్స్ ద్వారా, వాయిస్ ద్వారా, పత్రికాముఖంగా విస్తృతంగా ప్రచారం చేశారు.

## నిర్బంధం - ప్రతిఘటన

విశాఖజిల్లా చింతపల్లి మండలం చినకొత్తూరు గ్రామస్థులిద్దరిని పార్టీ కరపత్రాలు పంచుతున్నారనే నెపంతో చింతపల్లి పోలీసులు అరెస్ట్‌చేసి అక్రమంగా విశాఖ సెంట్రల్ జైల్లో పెట్టి నిర్బంధించారు. గూడెం మండలం కొండపల్లి గ్రామ ఏ.ఆర్.సి.యస్. సంఘ నాయకుడైన క్రిష్ణ గతంలో సంఘంలో పనిచేస్తున్నాడని గూడెం పోలీసులు అరెస్టుచేసి సెంట్రల్ జైలులో నిర్బంధించగా బెయిల్‌పై విడుదల అయ్యాడు కానీ తిరిగి పోలీసులు అరెస్ట్‌చేసి అన్నలకు అన్నం పెట్టావని, మీటింగ్‌లకు వెళ్తున్నావని అక్రమ కేసులు బనాయించి మళ్ళీ జైలుకు పంపారు.

ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్ పరిధిలోని దాగుడుపల్లిలో, ఆంధ్రాకు చెందిన అన్నవరం స్పెషల్ పోలీసులు గాలింపు చర్యల్లో భాగంగా గ్రామానికి వచ్చి మీరు అన్నలకు సహకరిస్తూ అన్నం పెడ్తున్నారని గ్రామస్థులపై దౌర్జన్యం చేయబోగా ప్రజానీకం ఏకమై కర్రలు, చీపుర్లు పట్టుకొని పోలీసులపై తిరగబడి కొట్టి గ్రామం నుంచి తరిమారు. ఈ సంఘటనతో రెచ్చిపోయిన స్పెషల్ పోలీసులు కోరుకొండ అనే సంతకు వచ్చి దాగుపల్లి గ్రామస్థులను పట్టుకోడానికి సంతదారిలో షావుకార్ల వేషంలో వుండి ఆ గ్రామస్థులు రావడాన్ని గమనించి 8 మందిని అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు తమ వారిని విడిపించు కోవడానికి అన్నవరం ఏడుగురిని పంపగా వారిని కూడా అక్రమంగా అరెస్ట్‌చేసి మొత్తం 15 మందిని కూడా విశాఖ సెంట్రల్ జైలులో నిర్బంధించారు.

పై విషయాలు గ్రామ ప్రజలు తెలుసుకుని తమ వాళ్ళను ఎలాగైనా విడిపించుకోవాలని చుట్టప్రక్కల గ్రామాల ప్రజలను కలుపుకుని అలాగే పంచాయితీ సర్పంచును కూడా వెంటబెట్టుకుని మల్కన్‌గిరి జిల్లా కలెక్టరు, సబ్ కలెక్టరు, ఐ.ఐ.డి.ఎ. ప్రాజెక్టు అధికార్ల వద్ద ధర్నా నిర్వహిస్తూ తమ గ్రామస్థులను ఆంధ్రాకు చెందిన అన్నవరం స్పెషల్ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసారనీ, తమవారిని విడిపించవలసిన

# దక్షిణ తెలంగాణా జె.యన్.యమ్. రిపోర్టు

## నల్లగొండలో మా మొదటి నడక

'96 అక్టోబరు'లో దక్షిణ తెలంగాణా, ఆర్.సి. సమావేశంలో ''నేటి సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా కళారూపాల ద్వారా అభివృద్ధి చేస్తూ ప్రజల్ని ఉద్యమం వైపు నిలబెట్టడానికి సాయుధంగా ఉండే జననాట్యమండలి బృందాలను ఏర్పాటు చేయాలని'' తీర్మానం చేయడం జరిగింది. ప్రస్తుత పరిస్థితిలో జె.యన్.యమ్. బృందాలను ఏర్పాటు చేయడానికి సాధ్యంకాదు కనుక (దళాలలోని వ్యక్తులను తీయడానికున్న సమస్య వలన) మొదట ముగ్గురితో కూడిన రీజినల్ జె.యన్.యమ్. కమిటీని ఏర్పరచటం జరిగింది. వీరు ఆయా దళాల్లో వుంటూనే సమావేశాల ద్వారా కార్యక్రమాల్ని రూపొందించుకొని సాంస్కృతిక రంగాన్ని గైడ్ చేయాలను కోవడం జరిగింది. తీర్మానం వెలుగులో జె.యన్.యమ్. కమిటీ వ్యక్తులను కలపడం కూడా జరగకముందే తీర్మానాల్లో ముఖ్య భూమిక పోషించిన కా॥మహేందరన్న (ఒరుగంటి సుదర్శన్) మొదట, ఆ తర్వాత కొద్ది రోజులకే సంజీవన్న (మేకల దామోదర్) అమరత్వంతో నిర్బంధపు నీలినీడ మొత్తం దక్షిణ తెలంగాణానే కమ్మేసింది. నిర్బంధం కారణంగా రీజనల్ కమిటీ తెగిపోయిన లింకులను కలుపుకోవడానికి చాలా సమయం పట్టడంతో జె.యన్.యమ్. కమిటీ ఫంక్షనింగ్ లోకి రావడానికి గ్యాప్ వచ్చింది. 97 ఆగస్టులో జరిగిన ఆర్.సి సమావేశంలో నూతన కర్తవ్యాలు నిర్దేశించుకున్నపుడు జె.యన్.యమ్.ను కమిటీగానే గాక జె.యన్.యమ్. దళంగా నిర్మాణం చేయాలనుకోవడం జరిగింది. కానీ ఆ తర్వాత జరిగిన పావురాలగట్టు సంఘటనలో కా॥ పల్లెర్ల స్వామి అమరుడు కాగా మళ్ళీ కొందరు వ్యక్తులను కేటాయించి అయిదుగురితో కూడిన జె.యన్.యమ్. దళాన్ని ఏర్పరచడానికి 98 జూన్ నాటికి కానీ సాధ్యం కాలేదు.

ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో సరికొత్త దాడి ప్రారంభం కాగా ఆ నిర్బంధ కాలంలో జె.యన్.యమ్. కండ్లు తెరిచింది. ఏ మాత్రం దళాల అలికిడి విన్పించినా, కన్పించినా పెద్ద ఎత్తున శత్రు గాలింపు చర్యలు జరుగుతున్న నేపథ్యంలో, దళాల కదిలికలే కష్టం అయినపుడు, శబ్దంతో కూడుకున్న జె.యన్.యమ్. ప్రదర్శనలయినా, కార్యక్రమాలయినా మరీ కష్టమైంది. మనది సాయుధ పోరాటం కొనసాగించే పార్టీ యొక్క సాంస్కృతిక సంస్థ కనుక, పార్టీ మీద ఉన్న నిర్బంధం జె.యన్.యమ్. మీద కూడా వుంటుంది కనుక ఒక లీగల్ సాంస్కృతిక సంస్థలాగా కానీ, జె.యన్.యమ్ లీగల్‌గా వున్నప్పటిలాగా కానీ కార్యక్రమాలు నిర్వహించడం సాధ్యం కాదు కనుక నిర్బంధ పరిస్థితిలో వున్న తీవ్రత కనుగుణంగా జననాట్యమండలి పనివిధానం రూపొందించుకున్నాము. జరిగింది. నిర్బంధం సీరియస్‌గా వున్నపుడు శబ్దంతో కూడిన ప్రదర్శనలు కాకుండా సాపేక్షికంగా నిశ్శబ్దంగా జరిగే రచనా కార్యక్రమం మీద, ప్రజల జీవితాన్ని మన రాజకీయాల్ని అధ్యయనం చేయడం మీద కేంద్రీకరిస్తూ, వీలైన చోట్ల వీలైన పరిమితుల్లో ప్రదర్శనలు ఇస్తూ పాటలు పాడాలనుకున్నాము. అప్పటినుండి ఇప్పటివరకూ నిర్బంధ పరిస్థితి కారణంగా మన ప్రదర్శనలు ప్రధానంగా క్యాంపులకు, మన క్యాడర్‌కు పరిమితమైనాయి. అట్లే కవితలు, పాటలు, స్పందనలు, స్ట్రీట్ ప్లేలు, కథలు జె.యన్.యమ్. ఏర్పడినప్పటినుండీ ఇప్పటి వరకూ ఎన్నో వచ్చాయి. ఈ విధంగా జిల్లా దళాల్లో సాంస్కృతిక వాతావరణం అలుముకుంది.

ఈ ఉత్తేజంతో ఆయా సందర్భాల్లో దళాలు కలుస్తున్నపుడు, సమావేశాలపుడు, క్యాంపులపుడు నిర్వహించిన వేదికలమీద జె.యన్.యమ్. దళం ఇచ్చిన ప్రోత్సాహంతో గన్నుతో పాటు పెన్నుల్ని ఎక్కుపెట్టి కవితలల్లారు, పాటలు కట్టే ప్రయత్నం చేశారు. ఈలోగా '98 అక్టోబర్‌లో జరిగిన కిరణన్న అమరత్వం ప్రతి ఒక్కరినీ కలం పట్టే విధంగా ప్రేరేపించింది. ముగ్దుంపల్లి అమరులు కా॥ కిరణ్, ప్రభాకర్‌ల స్మృతిలో దాదాపు 40 కవితలు, 7 పాటలు, 2 స్పందనలు, స్మృతి ఒకటి వచ్చాయి. వీటిని ఎల్లాగైనా ప్రచారంలోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో చేతిరాతతోనే ఒక పుస్తకంలాగా తయారుచేసి వాటిని జిరాక్స్‌చేసి జిల్లాలోని అన్ని దళాలకు, ప్రజా సంఘాలకు పంపిణీ

***(తరువాయి 36వ పేజీలో...)***

---

బాధ్యత మీకు ఉంది కాబట్టివిడుదల చేయించాలని అధికార్లను గ్రామస్థులు గట్టిగా నిలదీశారు. అయితే అధికార్లు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది ప్రజలు పాల్గొన్నారు. దీనికంతటికీ గ్రామ ఏ.ఆర్.సి.యస్. నాయకత్వం వహించింది.

విశాఖ జిల్లా గూడెం మండలంలో బోనంగిపల్లి వద్ద గతంలో ప్రతిఘటనలో భాగంగా దళం మందుపాతర పేల్చి 6గురు పోలీసులను తీవ్రంగా గాయపర్చిన సంఘటనతో సంబంధం వుందని గూడెం పోలీసులు బోనంగిపెల్లి గ్రామస్థులనిద్దరిని అక్రమంగా అరెస్టే చేసి తీవ్రంగా కొట్టి కేసు బనాయించి విశాఖ సెంట్రల్ జైల్లో నిర్బంధించారు.

ఇదే జిల్లా చింతపల్లి మండలం మెరెకెల గ్రామస్థులను సంఘంలో పనిచేస్తున్నారనే నెపంతో గతంలో పోలీసులకు లొంగిపోయిన దళసభ్యుడు ఇచ్చిన సమాచారంతో అన్నవరం స్పెషల్ పోలీసులు ఆ గ్రామస్థులిద్దరిపై దౌర్జన్యంచేసి డబ్బులు గుంజుకోవడానికి అక్రమంగా అరెస్ట్ చేశారు.

ఇదే మండలంలోని గిల్లెలబంద గ్రామానికి చెందిన వారిని పోలీసులు మీరు అన్నల సంఘంలో పనిచేస్తూ, వారికి సహకరిస్తూ భోజనాలు పెడ్తూ ఆశ్రయం కల్పిస్తున్నారని వారిని మానసికంగా ఒత్తిడికి గురిచేస్తూ లొంగి పోవాల్సిందిగా హెచ్చరికలు చేస్తూ నిత్యం బెదిరిస్తూ వున్నారు. ❑

*(35వ పేజీ తరువాయి...)*

చేయడం జరిగింది. దీనితో దళాల్లో ఒకరిద్దరు కామ్రేడ్స్ తప్ప దాదాపుగా అందరూ కాగితం మీద కలంపెట్టిన వారే అయ్యారు. దీనికంతా కిరణన్న అమరత్వం ఒక కారణంకాగా జిల్లాను అలుముకున్న సాంస్కృతిక వాతావరణం కూడా ప్రధాన పాత్ర పోషించింది. కిరణన్న మీద వచ్చిన కవితలు కాక, దళాల్లోని కామ్రేడ్స్ కలాల నుండి ఇతర అమరుల గురించి, వివిధ సంఘటనలు, సమస్యలపై 52 కవితలు, 55 పాటలు, 4 స్పందనలు, 2 స్ట్రీట్ ప్లేలు, 2 కథలు వచ్చాయి. మెజారిటీ కామ్రేడ్స్ కొత్తగా కలం పట్టిన వారు కావడం, పార్టీ చదువులతో అక్షరాలను పేర్చిన వారు కావడం వలన అన్ని కవితలు హత్తుకొనే విధంగా లేకపోయినప్పటికీ కవితలతో అక్కడక్కడా చోటు చేసుకున్న బలమైన ఫీలింగ్స్ ఇట్టే ఆకట్టుకుంటాయి. కొన్ని కవితలు మొట్టమొదటిసారి రాసినప్పటికీ చాలా ఎఫెక్టివ్‌గా వుండటం గమనార్హం. ఇక రచనాకాలం విషయానికొస్తే ఇవన్నీ 98 సెప్టెంబర్ నుండి 99 ఫిబ్రవరి వరకు వచ్చినవే.

ఇక ప్రదర్శనల విషయానికొస్తే ఉన్న పరిమితుల మధ్యనే ప్రధానంగా క్యాంపులలో క్యాడర్‌కు, అక్కడక్కడా ప్రజలలో ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది.

98లో జరిగిన నల్లగొండ జిల్లా ప్లీనం సందర్భంగా గొట్ట అమరుల సాహితీ సాంస్కృతిక వేదిక మీద ''రాజ్యహింస-ప్రైవేట్‌హింస'',''నిర్బంధం-దళాల్లో కొనసాగుతున్న నిర్లక్ష్యం'' లపై స్ట్రీట్‌ప్లేలు, ఎర్రసేన దళందే జయం, వర్కాట్‌పల్లి అమరులపై నృత్యాలు ప్రదర్శించడం జరిగింది. సెప్టెంబర్‌లో డి.సి., సాక్‌లకు నిర్వహించిన రాజకీయ తరగతుల సందర్భంగా 1. వ్యసనాలు, 2. వరకట్నం, 3. సామ్రాజ్యవాద సంస్కృతి లపై స్ట్రీట్‌ప్లేలు రేలారే నృత్యాన్ని కా॥ స్వామి సాహితీ, సాంస్కృతిక వేదికపై ప్రదర్శించడం జరిగింది. దళ సభ్యులకు రాజకీయ తరగతుల సందర్భంగా శబ్దాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితుల వలన ప్రదర్శనలు కాకుండా జిల్లాలో వచ్చిన పాటలు, కవితలు, స్పందనలను విన్పించడం జరిగింది. ప్రదర్శనల్లో పొందిన ప్రేరణతో కామ్రేడ్స్ ప్రదర్శనల్లో పాల్గొనడానికి ముందుకొచ్చారు.

జె.యన్.యమ్. దళం ఏర్పడినప్పటినుండి సాంస్కృతిక తరగతులు నిర్వహించాలనుకున్నప్పటికీ నిర్బంధం వల్ల, ఇతర పనుల వలన సాధ్యం కాలేదు. జె.యన్.యమ్. దళంకు కళ - రచనల పట్ల వున్న పరిమిత పరిజ్ఞానాన్ని పెంచడానికి 5 రోజులు క్లాస్‌లు నిర్వహించాం. మైదాన ప్రాంత దళం ఏరియా కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తక్కువ శబ్దాలతో పాట, రచన, పాడే విధానం, డ్యాన్సులోని ప్రాథమిక స్టెప్స్‌ను నేర్పించటం జరిగింది. ఈ క్లాసుల తర్వాత నేర్చిన డ్యాన్సును రోజూ కొనసాగించే డ్యాన్సు మాదిరిగా అవకాశాలున్న దగ్గర డ్యాన్సు ప్రాక్టీస్ కొనసాగించాం.

మైదానం నుండి అడవికి పోతే శత్రు నిర్బంధం తక్కువ వుంటూన్న దానితో అక్కడ కెళ్ళి కొన్ని కార్యక్రమాలు చేద్దామనుకుంటే అక్కడా అంతే. అయినా జాగ్రత్తలు తీసుకుంటూ కార్యక్రమాలు ఎంచుకున్నాం. పోరాటాల్లో కళలకున్న ప్రాధాన్యత దృష్ట్యా మన మిలిటెంట్ శక్తులకు వాటిని నేర్పించాలన్న అవగాహనతో రాచకొండ దళం పంపిన 9 మంది మిలిటెంట్లకు లో గొంతులో పాట రచన, పాట పాడే విధానం, డ్యాన్స్, స్ట్రీట్ ప్లేలు నేర్పించగా పోరాటంలో కళల అవసరం తెల్సిందనీ సంతోషపడుతూ ఇలాంటి క్యాంపులు ఇంకా జరుపాలని స్టూడెంట్స్ కోరినారు.

వచ్చిన పాటల్ని క్యాసెట్స్‌గా చేసి ప్రచారంలోకి తీసుకెళ్ళాలనుకున్నా టెక్ సమస్య వలన పాడటం సాధ్యం కాలేదు. దానితో అవసరమైతే రోజూ షెల్టర్స్ మార్చుకుంటూ పాటలు రికార్డు చేయాలనుకొని తక్కువ ప్రాక్టీస్‌తో రెండు క్యాసెట్లలో 26 పాటలు రికార్డు చేసి జిల్లా దళాలకు, ప్రజా సంఘాలకు ఆ జిల్లాకమిటీ పంపిణీ చేయడం జరిగింది.

ఆర్.సి. కామ్రేడ్స్ జె.యన్.యమ్. దళంకు 'జె.యన్.యమ్. స్వరూపం, మూసపద్ధతి - రచనా విధానంను వ్యతిరేకించండి, అధ్యయన పద్ధతులు సంస్కరించుకుందాం' అనే అంశాల్ని సమిష్టి అధ్యయనం చేయించారు.

ఈ విధంగా శత్రువు కొనసాగించే కూంబింగ్‌లో, నిరంతర దాడులలో, నిత్య నిర్బంధంలో నివురు గప్పిన నిప్పులా పరిస్థితులకు తగ్గ పనుల్ని ఎంచుకొని జె.యన్.యమ్. దళం కవాతు చేస్తూ నల్లగొండలో మా మొదటి పయనం ముగిసింది. ❐

## నలుగురు మవాబ్ అమరవీరులకు విప్లవ జోహార్లు

1999 ఆగస్ట్ 2న ఫిలిప్పైన్స్ ఎస్ట్రాడా ప్రభుత్వానికి చెందిన ప్రగతి నిరోధక సాయుధ బలగాలు నలుగురు నూతన ప్రజాసైన్య పోరాట యోధులను కిరాతకంగా హింసించి, అటు తర్వాత కాల్చిచంపాయి. ఫిలిప్పైన్స్‌లో ప్రజాసైన్యం పురోగమిస్తున్నందువల్ల పాలకవర్గాలు ప్రతినిత్యం మరింత పాశవిక నిర్బంధాన్ని ఆశ్రయిస్తున్నాయి.


నూతన ప్రజాసైన్యపు (యన్.పి.ఎ.) నలుగురు వీరులలో కా॥ కాపాకింగ్ ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన బాధ్యతాయుత కార్యకర్త, మిండనావో ప్రాంతంలోని నూతన ప్రజాసైన్యపు విలువైన కమాండర్ కూడా. తాను బాధ్యత వహిస్తున్న ఏరియాలో అతడు దిద్దుబాటు ఉద్యమాన్ని నడిపాడు. రెండు సంవత్సరాలలోపే, కోల్పోయిన ప్రాంతాన్ని తిరిగి చేజిక్కించుకోవటంలో, నూతన ప్రాంతాలకు విస్తరించటంలో గణనీయ విజయాలు సాధించాడు.

ఎస్ట్రాడా పాలన ద్వారా జరుపబడిన మవాబ్‌లోని నలుగురి క్రూర హత్య ప్రజావిప్లవ బలగాల పెరుగుతున్న శక్తిపట్ల శత్రువు ద్వేషాన్ని, శాశ్వతమైన భయాన్ని, మానవహక్కుల పట్ల వాడికున్న ఏవగింపును ప్రదర్శిస్తోంది. పిరికితనంతో కూడిన ఈ దాడిని క్రాంతి పత్రిక తీవ్రంగా ఖండిస్తూ ఫిలిప్పైన్స్ విప్లవానికి చెందిన ఈ అమరులకు విప్లవ జోహార్లర్పిస్తోంది. వారి సహచర కామ్రేడ్లకు, కుటుంబ సభ్యులకు క్రాంతి ప్రగాఢ సంతాపాన్ని అందజేస్తోంది.

**(యన్.డి.ఎఫ్.పి. కార్యాలయం నుండి గ్రహించిన రిపోర్టు)** ❐

# అమరుడు కామ్రేడ్ గెల్లి రాజలింగం (సురేష్)కు అరుణారుణ జోహార్లు!


సింగరేణి బెల్ట్ కమిటీ కార్యదర్శి, సింగరేణి కార్మిక సమాఖ్య కార్యదర్శి, సింగరేణి పారిశ్రామిక ప్రాంత కార్మికోద్యమ నాయకుడైన కా॥ గెల్లి రాజలింగంను శ్రీరాంపూర్ నస్పూర్ కాలనీలో 10-4-99న ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు కాల్చి చంపారు. సుదీర్ఘమైన విప్లవజీవితం కలిగిన విప్లవ నాయకున్ని అనతికాలంలోనే తిరిగి కోల్పోయి సింగరేణి పారిశ్రామిక ప్రాంత విప్లవోద్యమం ప్రధానంగా కార్మికోద్యమం తీవ్రమైన నష్టాన్ని పొందింది. నెత్తుటి తడి ఆరకుండా సింగరేణిలో పోలీసుల హత్యలు సాగుతూ 1996లో సింగరేణి బెల్ట్ కమిటీ సభ్యుడైన కామ్రేడ్ సమ్మిరెడ్డిని హతమార్చిన పోలీసుల కిరాతక చర్య ప్రజల మనస్సుల్లో ఇంకా మెదులుతున్న పరిస్థితుల్లోనే శ్రీరాంపూర్‌లోని అదే కాలనీలో అనతి కాలంలోనే కా॥ రాజలింగం అమరుడు కావడం విప్లవోద్యమానికి ఎంతో నష్ట దాయకం.



సింగరేణి కార్మికోద్యమ నాయకుడైన కామ్రేడ్ రాజలింగం బెల్లంపల్లి శాంతిఖనికి చెందిన సింగరేణి కార్మిక కుటుంబంలో 35 సం॥ క్రితం జన్మించాడు. 1985 నాటికి ఇంటర్‌మీడియట్ విద్య నభ్యసించాడు. పోరాటాల ఖని, వీరులగన్న సింగరేణిలోని బెల్లంపల్లిలో పుట్టి పెరిగి, విద్యనభ్యసించిన రాజలింగం నిత్యం రగులుతూనే వుండే విప్లవ కార్యకలాపాలకు ఉత్తేజితుడవుతూ విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి సంఘ కార్యకలాపాల్లో పాల్గొంటూ వచ్చాడు. పై చదువులు చదువుకునే అవకాశం వున్నప్పటికీ పూర్తికాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో కొనసాగాలనే ఆశయంతో 1985లో పార్టీలోకి పూర్తికాలం వచ్చాడు. సురేష్ పేరుతో కొనసాగుతూ బెల్లంపల్లి పట్టణ విద్యార్థి యువజనుల్లో పి.ఆర్.గా బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చాడు. నిర్బంధం తీవ్రతరమవుతూ నాయకులు అరెస్టు అయినా, దిగజారిపోవడాలు జరిగినా పట్టుసడలని దీక్షతో పార్టీలో నిలదొక్కుకుంటూ బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చాడు. 1986 చివరి నాటికల్లా ఆర్గనైజర్ (పి.ఓ.) స్థాయికి ఎదిగి 1988లో సింగరేణి బెల్ట్ కమిటీ (జిల్లా కమిటీ)లోకి ఎంపిక కాబడ్డాడు. ఆర్గనైజర్‌గానూ, జిల్లాకమిటీ సభ్యునిగానూ 1992 చివరి వరకు బెల్లంపల్లి, మాదారం, మందమర్రి సెంటర్లను గైడ్ చేస్తూ వచ్చాడు. 1996 జూన్‌లో బెల్ట్‌కమిటీ సభ్యుడైన కా॥ సమ్మిరెడ్డి అమరుడైన అనంతరం కమిటీలో ఇద్దరే కొనసాగిన కాలంలో ఎక్కువ మేరకు సింగరేణిలో తాను ఒక్కడే కేంద్రీకరించి పనిచేస్తూ గోదావరి ఖని నుండి మాదారం వరకు ఆర్గనైజర్లను అందరిని, సింగరేణి సమ్మెలను గైడ్‌చేస్తూ వచ్చాడు. చాలాకాలం పాటుగా నిర్మాణం దెబ్బతినిపోయివున్న సి.కా.స. కేంద్రబాడి (జిల్లా బాడి)ని పునర్నిర్మాణం చేసేటందుకు కృషి సల్పి తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో సైతం 1996లో తిరిగి సి.కా.స. కాన్ఫరెన్స్‌ను జరిపి బాడీని నిర్మించి అప్పటినుండి సి.కా.స.కు తానే కార్యదర్శిగా శేషగిరి పేరుతో కొనసాగాడు. అమరుడు కామ్రేడ్ నారాయణ (వినోద్) సింగరేణి బెల్ట్ కమిటీలోకి కో-ఆప్ట్ అయి బాధ్యతలు చేపట్టిన అనంతరం 1997 నుండి కామ్రేడ్ రాజలింగం శ్రీరాంపూర్, ఇందారం, గోదావరి ఖని సెంటర్లను గైడ్ చేస్తూ వచ్చాడు. సురేష్ పేరుతో జిల్లాకమిటీ సభ్యునిగా, శేషగిరి పేరుతో సి.కా.స. కార్యదర్శిగా సింగరేణి ఉద్యమాన్ని గైడ్‌చేస్తూ 1998 డిసెంబర్ చివరిలో జిల్లాకమిటీ (సింగరేణి బెల్ట్ కమిటీ) కార్యదర్శిగా బాధ్యతల్లోకి వచ్చాడు. జిల్లాకమిటీ కార్యదర్శిగా తనవంతు బాధ్యతల్ని సమర్థ వంతంగా నిర్వర్తించగలిగేందుకు 99 జనవరిలో ఉత్తర తెలంగాణా ప్లీనానికి హాజరై, ఫిబ్రవరిలో రాజకీయ తరగతుల్లో పాల్గొని ఏరియాకు చేరుకున్న కొన్ని రోజుల్లోనే ఏప్రిల్ 10 నాడు శ్రీరాంపూర్ నస్పూర్ కాలనీలో పోలీసులు జరిపిన హత్యాకాండలో కామ్రేడ్ రాజలింగం అమరుడయ్యాడు. సింగరేణిలో అమలవుతున్న తీవ్ర నిర్బంధంలో అడుగడుగునా ఎదురయ్యే పోలీసు చక్రబంధాలను ఎదుర్కొంటూ 15 సంవత్సరాల రహస్య విప్లవ జీవితంతో సింగరేణి విప్లవోద్యమ పురోభివృద్ధికి పట్టుదలతో కృషి చేస్తూ వచ్చాడు. కామ్రేడ్ రాజలింగంను అంతమొందించేందుకు పోలీసులు తీవ్రమైన వేట సాగిస్తూ రాగా అనేకమార్లు పోలీసుల బారినుండి చాకచక్యంగా, ధైర్యంగా తప్పుకోగల్గుతూ వచ్చిన కా॥ రాజలింగం ఫాసిస్టు నిర్బంధ కాండలో పోలీసులకు చిక్కి హత్యకు గురైనాడు. నాటి నైజాం కాలనీలో సింగరేణి కార్మికోద్యమ నేత, కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన కా॥ శేషగిరిరావును నైజాం ప్రభుత్వం కాల్చిచంపగా, శేషగిరిరావు వారసుడుగా, పీపుల్స్‌వార్ పార్టీ జిల్లాకమిటీ నాయకుడు, సింగరేణి కార్మికోద్యమ నేత అయిన కా॥ రాజలింగం (సురేష్, శేషగిరి) ను నైజాం వారసుడైన నారా చంద్రబాబు ప్రభుత్వం హతమార్చింది. కార్మికులకు, కార్మికుల పుత్రులకు, విప్లవ ప్రజానీకానికి కా॥ రాజలింగం విప్లవ జీవితం ఆదర్శవంతమైంది. ❑

# శ్రీకాకుళం నుంచి రాయచూర్ దాకా పోరుబాటలల్లుతూ అమరుడయిన కా॥ భాస్కర్ (బాలక్రిష్ణ)కి అరుణారుణ జోహార్లు!!

ఆంధ్రా పోలీసుల దారినే ఎంచుకున్న కర్నాటక పోలీసులు 1999 ఆగస్ట్ 27న కర్నాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాలోని గంజల్లి గ్రామ సమీపంలో జరిపిన ఒక 'ఎన్‌కౌంటర్'లో కా॥ భాస్కర్‌ని చంపేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా నుండి వచ్చిన 28 సం॥ల కా॥ భాస్కర్ (బాలక్రిష్ణ, బాలరాజు) కర్నాటకకి చెందిన ప్రత్యేక కమాండో శిక్షణ పొందిన నక్సల్ వ్యతిరేక పోలీస్ యూనిట్ చేత చిక్కిన తరువాత చంపబడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీస్ దృక్కోణాన్ని అతి నమ్మకంతో తలకెత్తుకున్న ప్రచార సాధనాలు దాన్ని నిజమైన ఎన్‌కౌంటర్‌గా చిత్రించడానికిప్రయాసపడినాయి. తాము దళానికి తారసిల్లి పడినపుడు తమపై వారు కాల్పులు జరిపారని ప్రతిగా తాము గంటసేపు జరిపిన ఎదురు కాల్పుల్లో ఒక నక్సలైటు చనిపోయాడని పోలీసులు యధాలాపంగా కథ అల్లినారు. కాని వాస్తవం ఏమిటి?



దళం గురించి ఉప్పందుకున్న పోలీసులు పొదలమధ్య విశ్రాంతి తీసుకుంటున్న నలుగురు సభ్యులున్న దళంపై వున్నట్లుండి దాడి చేశారు. దళసభ్యులు తప్పుకునేందుకు మొదలెట్టినపుడు పోలీసులు వారిని ఒక కిలోమీటర్ దాకా వెంటాడి, కాలికి రాయి తగిలి కిందపడిన కా॥ భాస్కర్‌ని, అలసిపోయిన అతడి సహచరి కా॥ సునీతను (కవితక్క) పట్టుకున్నారు. కా॥ భాస్కర్‌ని చేతులు విరిచికట్టి చిత్రహింసల పాలుచేసి నుదుటికి తుపాకి గురిపెట్టి మూడుసార్లు కాల్చారు. కర్నాటక పోలీసులు జరిపిన 'సాహసోపేతమైన' ఎన్‌కౌంటర్ ఇదే మరి. రాయచూర్‌లో సంవత్సర కాలంపైగా నడుస్తున్న రాజ్య నిర్బంధం, బీభత్సాల పరాకాష్టగా ఈ సంఘటన జరిగింది.

ఈ సం॥రం జూలై-ఆగస్టు నెలల్లో విరుచుకుపడిన నిర్బంధమే 'ఎన్‌కౌంటర్'కి తగిన వాతావరణాన్ని ముందుగానే సృష్టించింది. కర్నాటక రైతుకూలీ సంఘానికి చెందిన 8మంది సభ్యులను (వీరిలో ఫుల్‌టైమర్స్ కూడా వున్నారు) జైలుకి పంపడంతో సంతృప్తి చెందని పోలీసులు, రాయచూర్ నగరంలోని ప్రగతిపర యువజన కేంద్రం, ప్రగతిపర విద్యార్థి కేంద్రం ముఖ్య కేడర్లందరినీ (పి.వి.కె. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కా॥ కుమార్‌తో సహా) అరెస్టు చేశారు. అప్పటికీ సంతృప్తి చెందని పోలీసులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాడనే ఆరోపణలతో దుర్మార్గపు గూండా వ్యతిరేక చట్టం కింద ఇతర ప్రజాస్వామిక సంస్థల సభ్యులను కూడా అరెస్ట్ చేశారు. దీంతో 14 మందికి పైగానే జైలులో వున్నట్లు లెక్క. వీరిలో సగంమంది పైగా గత సం॥ర కాలంగా జైలులోనే వున్నారు.

కార్యకర్తల కోసం పోలీసులు వేటాడుతున్నారు. విప్లవకారుల భార్యా, పిల్లలను రహస్యంగా నీడలాగా వెంటాడుతున్నారు. మహిళా సభ్యులను అత్యాచారం, బెదిరింపు, చిత్రహింసలు, కేసులు వంటి వాటితో భయపెడుతున్నారు. లంచాలను ఎరగా వేస్తున్నారు. తెల్లవారు జామున దాడులు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కోర్టు ఉదాసీనంగానే వుంది. అన్ని బెయిల్ పిటీషన్లనూ అది మొరటుగా తోసిపుచ్చుతూనే వుంది. ఈ 'ప్రజాస్వామ్యం'లోని అతి గొప్ప (ఎన్నికల) ప్రయోగం నడుస్తూండగా, మాడిపోతున్న రాయచూర్ పొలాల్లోని నగ్న సత్యాలు మరో విభిన్న వాస్తవాన్ని తెలియ జేస్తున్నాయి. కర్నాటక పోలీసులు విప్లవ రైతాంగోద్యమాన్ని నిర్మూలించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్షీణమవుతున్న ప్రగతి నిరోధక వ్యవస్థను నిలబెట్టుకునేందుకై వారు మృతుల శవాల మీదుగా నడుస్తూ అమాయకులను నలిచివేస్తున్నారు.

రాయచూర్ ఆంధ్ర సరిహద్దుకు ఆనుకుని వుంది. అందువల్ల నిర్బంధపు అంటురోగం కర్నాటక పోలీసులకు సులభంగానే సోకుతుంది. తామూ ఆంధ్రా పోలీసుల దారికి మళ్లిన తీరును ఈ ఎన్‌కౌంటర్ ద్వారా కర్నాటక పోలీసులు క్రూరమైన రీతిలోనే ప్రదర్శించారు. అయితే రాయ్‌చూర్ ఆంధ్ర సరిహద్దులకానుకునే వుంది కాబట్టి రాయచూర్ పీడిత ప్రజానీకానికి సాయుధ విప్లవమనే అంశం కూడా సులభంగానే సోకుతుంది. తమ ముందున్న దారులన్నీ మూసుకుపోవడంతో కర్నాటక రైతాంగం సైతం ఆంధ్ర రైతాంగం దారిలోనే ముందుకు పోతున్నారు. ఇందుకు సంబంధించి తన అమరత్వానికి ముందు కా॥ భాస్కర్ రగుల్కొల్పిన దారికన్నా మించిన చక్కటి నిదర్శనం మరొకటి లేదు.

## కా॥ బాలక్రిష్ణ

శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారధి గ్రామానికి చెందిన కా॥ బాలక్రిష్ణ ఒక పేద రైతు కుటుంబంలో జన్మించాడు. చిన్న వయస్సులోనే కుటుంబ భారం తనపై పడటంతో తన హైస్కూలు చదువును మధ్యలోనే విరమించి కుటుంబ బాధ్యతలు నిర్వర్తించాడు. శ్రీకాకుళ సాయుధ పోరాటానికి, విప్లవ రాజకీయాలకు నిలయమైన పల్లిసారధి లోని ప్రజలువిప్లవ రాజకీయాలవైపే మొగ్గు చూపారు. వివిధ విప్లవ గ్రూపులకు ప్రాతినిధ్యం వున్న ఈ గ్రామంలో కా॥ బాలక్రిష్ణ గ్రామ యువజన సంఘం నాయకునిగా పీపుల్స్‌వార్ రాజకీయాలనే అనుసరించాడు. గ్రామంలో కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాలలో కూడా రాడికల్ కార్యకర్తగా ప్రజానాయకుడిగా గుర్తింపు పొందిన బాలక్రిష్ణ ప్రజలకు తలలో నాలుకగా మెదిలాడు. ఉద్దాన దళంతో నిరంతర సంబంధాలలో వుంటూ దళం అప్పగించిన పనులను అత్యంత క్రమ శిక్షణతో అనులు పరిచేవాడు. పార్టీ పిలుపునందుకొని వృద్ధులైన తన తల్లిదండ్రులకు చిన్నపాటి జీవనాధారాన్ని కల్పించి కా॥ బాలక్రిష్ణ విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా పని చేయటానికి సిద్ధ పడ్డాడు. 1991లో శ్రీకాకుళం జిల్లా దళాల్లో దళసభ్యునిగా కొంతకాలం పనిచేసిన కా॥ బాలక్రిష్ణ జిల్లా పార్టీ అవసరాలపై టెక్ బాధ్యతలు చేపట్టాడు. చాకచక్యంగా తన విధులు నిర్వర్తించడంలో మెళకువను ప్రదర్శించిన కా॥

# తెలంగాణ జనసభపై చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధాన్ని ఖండించండి!

తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభ దశలోనె తొక్కివేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉక్కుపాదంమోపి సంస్థ కార్యకర్తలను, నాయకులను అక్రమంగా అరెస్టుచేసి చిత్రహింసలకు గురిచేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నిషిద్ధ సంస్థలతో సంబంధాలున్నాయనే సాకుతో రాష్ట్రప్రభుత్వం తెలంగాణ జనసభ కార్యక్రమాలపై నిర్బంధాన్ని ఉధృతం చేసింది. తెలంగాణ కళాసమితి నాయకురాలు బెల్లి లలితను పాశవికంగా హత్యచేయించి ఇతర జనసభ నాయకులను చంపడానికి పథకాలు రచిస్తున్నది.

1998 జూలై 5, 6 తేదీలలో ఏర్పడిన తెలంగాణ జనసభ గత పదినెలలుగా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో విస్తరించి తెలంగాణ వెనుకబాటు తనానికి కారణమైన ఆంధ్ర వలస పాలకుల దోపిడి విధానాన్ని బట్టబయలు చేస్తున్నది. తెలంగాణ ప్రాంత ప్రజల కష్టాలు తీరాలంటే ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే తప్ప వేరే మార్గం లేదని తెలంగాణ ప్రజలను వలస పాలకులతో పోరుకు సన్నద్ధం చేస్తున్నది. తెలంగాణ ఉద్యమం బలపడితే తమ పీఠాలు కదులుతాయనే భయంతో ఆంధ్ర వలస పెట్టుబడిదార్ల తాబేదారులైన ఆంధ్ర పాలకవర్గాలతో మిలాఖత్తై ఉద్దేశ్యపూర్వకంగా ఒక పథకం ప్రకారం తెలంగాణ జనసభ దాని అనుబంధ సంస్థలైన తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్, తెలంగాణ కళాసమితిపై తప్పుడు ప్రచారానికి, భౌతిక దాడులకు, అక్రమ అరెస్టులకు పూనుకొని తెలంగాణ ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

వరంగల్ జిల్లా హన్మకొండ పట్టణంలోని 'జనసభ' కార్యాలయంపై రెండుసార్లు దాడిచేసి, మొదటిసారి జనసభ జిల్లాకమిటీ సభ్యుడు మాదిరి రామయ్య, కొత్త రామిరెడ్డిలను జనసభ సిటీకమిటీ సభ్యుడు మోహన్, తెలంగాణ కళాసమితి జిల్లా కమిటీ సభ్యుడు కేతిరి శ్రీకాంత్‌లను నవంబర్ 23న అరెస్టుచేసి, చిత్రహింసలు పెట్టి తప్పుడు కేసులు బనాయించారు. జనసభ కార్యాలయంపై రెండవసారి దాడిచేసి ఏప్రిల్ 3న తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్రకమిటీ కన్వీనర్ నాగరాజును మఫ్టీలోవున్న పోలీసులు అందరు చూస్తుండగా కొట్టుకుంటూ తీసుకెళ్ళి మూడురోజులు అక్రమంగా నిర్బంధించి ఎం.ఆర్.ఓ ముందు హాజరుపర్చారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఫిబ్రవరి 20న కల్వకుర్తిలో టి.ఎస్.ఎఫ్ నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌పై ఎ.బి.వి.పి మతోన్మాద గుండాలతో మఫ్టీలోవున్న పోలీసులు మిలాఖత్తై టి.ఎస్.ఎఫ్ రాష్ట్రకమిటీ సభ్యుడు కాశిమ్‌ను, జనసభ రాష్ట్రకమిటీ సభ్యుడు మద్దిలేటిని తీవ్రంగా గాయపరిచి హత్యా ప్రయత్నం చేశారు.

మెదక్ జిల్లాలో వృత్తిరీత్యా టీచరైన టి.కె.ఎస్ రాష్ట్రకమిటీ సభ్యుడు, మెదక్ జిల్లా కన్వీనర్ అయిన సత్తయ్యను ఏప్రిల్ 7న అక్రమంగా అరెస్టుచేసి తప్పుడు కేసులు బనాయించారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంత జనసభ కన్వీనర్ పెంటయ్యను ఏప్రిల్ 18న అక్రమంగా అరెస్టుచేసిన పోలీసులు పలుమార్లు స్టేషనుకు పిలిపించి శారీరక, మానసికి వేధింపులకు గురిచేసి అతనితోపాటు ఆప్రాంత టి.జె.ఎస్ కార్యకర్తలపైన తప్పుడు కేసులు బనాయించారు. నల్గొండ జిల్లాలో టి.కె.ఎస్ రాష్ట్రకమిటీ కన్వీనర్ జహంగీర్‌ను, టి.కె.ఎస్ రాష్ట్రకమిటీ నాయకురాలు లలితను నల్గొండ పోలీసులు పలుమార్లు స్టేషనుకు పిలిపించి అసభ్యకర మాటలతో మానసికంగా హింసిస్తూ తెలంగాణ జనసభలో పనిచేయవద్దని బెదిరించారు. లలితను పాట మానకపోతే శవంగా మారాల్సివస్తుందని భువనగిరి సబ్‌ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి హెచ్చరించాడు. నల్గొండ ఎస్.పి రాంనారాయణ లలితతో స్వయంగా ఆమెను చంపి శవాన్ని పార్శిల్ చేయిస్తానని, డి.ఎస్.పి రవీందర్‌రెడ్డి లలిత అందాన్ని వ్యాపార సరుకుగా మార్చుకొమ్మని నీచపదజాలంతో ఎన్నోమార్లు బెదిరించారు. తుదకు ముఖ్యమంత్రి, హోంమంత్రి,పోలీసు అధికారులు కిరాయి హంతకులతో ఆమెను కిరాతకంగా హత్యచేయించి శవానికి సైతం అక్రమ సంబంధాల కథ నంటగట్టారు. మహిళా జన్మభూమి, మహిళలకు సమాన హక్కులు అని మహిళలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్న చంద్రబాబు మహిళల శీలాన్ని నిందిస్తూ, ప్రజాస్వామిక ఉద్యమాలలోకి మహిళలు రాకుండా చేసిన హెచ్చరికే లలిత హత్య. తెలంగాణ ఉద్యమంలో పనిచేసే నాయకులను చంపించాలని ఒక జాబితాను పోలీసు అధికారులు నయీమ్‌కు అందజేశారు. అందులో భాగంగానే లలితను చంపారు. ఇంకా తెలంగాణ జనసభ రాష్ట్ర కన్వీనర్ ఆకుల భూమయ్య, నల్గొండ జిల్లా తెలంగాణ జనసభ కన్వీనర్ రమణాచారి,

*(తరువాయి 40వ పేజీలో...)*

---

బాలక్రిష్ణను రాష్ట్రకమిటి తన అవసరాల రీత్యా టెక్ స్టాఫ్‌లోకి తీసుకున్నది. 1993లో రాష్ట్రకమిటి టెక్ స్టాఫ్‌లోకి వచ్చిన కా॥ బాలక్రిష్ణ 1999 జనవరి వరకు, రాష్ట్ర కమిటీకి సంబంధించిన వివిధ టెక్ పనుల్లో అనేక బాధ్యతలు నిర్వర్తించాడు. మొదటి నుండి గ్రామీణ ప్రాంతంలో పనిచేయాలని, ఫీల్డ్‌ను అంటిపెట్టుకొని వుండాలని కోరుకునే కా॥ బాలక్రిష్ణకు 1999 జనవరి వరకు ఆ అవకాశం లభించలేదు. కర్ణాటక రాష్ట్ర గ్రామీణ ప్రాంతంలో రైతాంగ వుద్యమ నిర్మాణాన్ని బలోపేతం చేయడం కోసం పట్టుదలతో పని చేయగల్గే కామ్రేడ్‌ని ఆంధ్రరాష్ట్రం నుండి పంపే క్రమంలో కా॥ బాలక్రిష్ణను ఎంపిక చేయడం జరిగింది. తనకు ఈస్ట్ రీజియన్‌లో పనిచేయాలనే బలమైన కోరిక వున్నప్పటికీ పార్టీ నిర్ణయానికి అనుగుణ్యంగా కర్ణాటక ప్రాంతానికి వెళ్ళటానికి కా॥ బాలక్రిష్ణ సంసిద్ధమైనాడు. కర్ణాటక పీడిత రైతాంగంలో పనిచేస్తున్న ఆరు నెలల కాలంలోనే పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో కా॥ బాలక్రిష్ణ అమరుడైనాడు. నిత్యం రాజకీయ అధ్యయనం చేస్తూ విప్లవోద్యమాన్ని ఆసక్తిగా పరిశీలిస్తూ, వుద్యమానికి సంబంధించిన పలు విషయాలను గ్రహించటానికి నిరంతర కృషి జరిపేవాడు. తనను కలిసే బాధ్యులను వుద్యమంలోని లోటుపాట్లపై, రాజకీయ విషయాలపై ప్రశ్నలతో ముంచెత్తేవాడు. టెక్ పనుల్లో చాకచాక్యం, గుండెనిబ్బరం, ఎంత క్లిష్టమైన పనులనైనా సునాయసంగా, క్రమబద్ధంగా నిర్వహించడం కా॥ బాలక్రిష్ణ ప్రత్యేకత. టెక్ పనుల్లో భాగంగా ఎంతో- రిస్క్- వుండే పనుల్ని సైతం అతి సింపుల్‌గా నిర్వహించిన కా॥ బాలక్రిష్ణ టెక్ పనులకే వన్నె తెచ్చాడు. మూడు పదుల వయసు కూడా పూర్తిగా నిండని కా॥ బాలక్రిష్ణ దశాబ్ద కాలం పాటు విప్లవోద్యమంలో తనను తాను సంపూర్ణంగా అర్పించుకున్నాడు. ❑

# ఉత్తర తెలంగాణలో పెచ్చరిల్లిపోతున్న ప్రభుత్వ ఫాసిస్టు దమనకాండను ఎదిరిద్దాం!

గతంలోని సి.పి.ఐ.(ఎం.ఎల్)(పీపుల్స్‌వార్), పార్టీ యూనిటీలు ఒకే పీపుల్స్‌వార్ పార్టీగా విలీనం అయిన తర్వాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ సారధ్యంలో ఏర్పడిన నాలుగు రాష్ట్రాల సంయుక్త సమన్వయ కేంద్రంలో ఇప్పుడు బీహార్ రాష్ట్రాన్ని కూడా చేర్చారు. ఈ సమన్వయ కేంద్రం రాష్ట్రాల మధ్య, కేంద్ర రాష్ట్రాల మధ్య ప్రతి రాష్ట్రంలోని వివిధప్రాంతాల మధ్య రాజకీయంగా, మిలటరీ పరంగా సమన్వయం చేస్తూ మన పార్టీ నాయకత్వాన్ని, గెరిల్లా దళాలను, స్థానిక నాయకత్వాన్ని నిర్మూలించడం, సప్లైలను దెబ్బతీయడం, ఉద్యమ విస్తరణను అరికట్టడం, ఉద్యమ సమన్వయాన్ని విచ్ఛిన్నం చేయడం, తద్వారా విప్లవోద్యమాన్ని పూర్తిగా అణచివేయడం తన లక్ష్యంగా పెట్టుకున్నది. అలాగే ఇది దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరిస్తున్న మన పార్టీని నాశనం చేయాలనే జనరల్ లక్ష్యంతో కూడా పనిచేస్తున్నది. పార్టీని ఇతర రాష్ట్రాలలో కూడా నిషేధించడానికి ప్రయత్నిస్తున్నారు. సమాచార సేకరణ, తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్ల నిర్వహణకు శిక్షణనివ్వడానికి ఆంధ్రప్రదేశ్‌లో స్పెషల్ సెక్యూరిటీ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పర్చపూనుకున్నారు. రోడ్లు, సమాచార వ్యవస్థల అభివృద్ధిపై కేంద్రీకరిస్తూ ఐదు రాష్ట్రాల మధ్య సమాచార నెట్‌వర్క్‌ను ఏర్పర్చుతున్నారు. ఉద్యమంలో జరిగే తప్పుల్ని ఎత్తిచూపడానికి పకడ్బందీ ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నారు. సాయుధశక్తుల్నీ, ఆయుధాల్నీ, కదలికలను మెరుగుపరుచుకోవడానికి మరియు జిల్లా స్థాయిలో నోడల్ ఏజెన్సీల ద్వారా సమాచార (ఇంటలిజెన్స్)సేకరణను పెంపొందించడానికి మిలిటెంట్లను, సాయుధ దళాలను నిర్మూలించడానికి తక్షణ, స్వల్ప వ్యవధి, దీర్ఘకాల యాక్షన్ ప్లాన్‌లను రూపొందించినారు.

ఉద్యమాన్ని అధ్యయనం చేసి నిర్మూలించడానికి సుశిక్షితమైన ఇంటలిజెన్స్ యంత్రాంగాన్ని నిర్మించుకున్నారు. సమాచార సేకరణ, బలగాల మోహరింపు, దాడి సమన్వయానికి శత్రువులు అత్యాధునిక సమాచార వ్యవస్థ, నైట్ విజన్స్‌ను, భారీ సంఖ్యలో వాహనాలను ఉపయోగిస్తున్నారు. బలగాల తరలింపుకు, సర్వేలలో, కూంబింగ్‌లలో గ్రౌండ్ ఫోర్స్‌ను సమన్వయించడానికి హెలికాప్టర్లు ఉపయోగిస్తున్నారు. సామ్రాజ్యవాద దేశాలలో పోలీసు ఉన్నతాధికారులకు శిక్షణ ఇప్పించి, ప్రత్యేక పోలీసు (కమెండో) బలగాలను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. సమాచార సేకరణకు, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ తయారుచేసుకోవడానికి, స్థానిక నాయకత్వాన్ని చంపటానికి ముగ్గురినుండి ఐదుగురు పోలీసులతో కూడిన హంతక దళాలను నిర్మించారు. వీరు నిరాయుధమైన ప్రజాసంఘనాయకులను బూటకపు ఎదురుకాల్పులలో చంపుతున్నారు. అరాచకులను, ప్రజా శత్రువులను, నేరస్థులను, ఉద్యమం నుండి దిగజారిన వారిని ఇన్‌ఫార్మర్లుగా మార్చుకోవడానికి, రహస్య ఏజెంట్లచే దళాలకు విషం పెట్టి చంపించటానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నరు. దళాలను వెంటాడటానికి, మాటు గాయటానికి ప్రతి దళం ఏరియాలో రెండు నుండి ఐదు ప్రత్యేక పోలీసు బ్యాచీలను వినియోగిస్తున్నారు. ఇదే సమయంలో వందలాది మందితో కూడిన ప్రత్యేక బలగాలు ఒకే ఏరియాపై కేంద్రీకరించి గాలింపు చర్యలు సాగిస్తున్నాయి.

1998 నుండి కొనసాగుతున్న మూడవ అణిచివేత క్యాంపెయిన్‌ను ప్రపంచబ్యాంకు ఏజెంట్ చంద్రబాబు ప్రభుత్వం ఈ సంవత్సరం మార్చినుండి జూలై దాకా ఉధృతంగా కొనసాగించింది. ఉత్తర తెలంగాణలో ఎక్కడ చూసినా ఎన్‌కౌంటర్ హత్యలు, దళాలపై దాడులు, ముమ్మరంగా కొనసాగిన గాలింపు చర్యలతో గ్రామాలలో పోలీసు బూట్ల చప్పుళ్ళే వినిపించాయి. ఈ సంవత్సరంలో జులై 31 వరకు 73 మంది కామ్రేడ్స్ నరహంతక ప్రభుత్వపు ప్రత్యేక పోలీసు బలగాలతో పోరాడుతూ ప్రాణాలర్పించారు. వీరిలో సింగరేణి బెల్ట్ కార్యదర్శి గెల్లి రాజలింగు (సురేష్), కరీంనగర్ వెస్ట్ డివిజన్ కమిటీ సభ్యుడు రాంచందర్, ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు బడె నాగేశ్వరరావు (ప్రభాకర్), సాక్ సభ్యులు మహేశ్, ఇందిరక్క, లక్ష్మణ్‌లు, దళ సభ్యులు తిరుపతి, దుర్గారెడ్డి, శంకర్, వనశంకర్, కవిత, సంధ్య, భాగ్యక్క, సుజాత, శ్యాం, లింబన్న, యాకన్న, స్వరూప, జగన్, నవీన్, పి.ఆర్.లు రామస్వామి, మధునయ్య మరియు 38 మంది సంఘ సభ్యులు, సానుభూతిపరులు, సాధారణ ప్రజలు అమరులైనారు. నేలతల్లి విముక్తికోసం ప్రాణాలొడ్డిన కామ్రేడ్స్ త్యాగాలను ఎత్తిపడుతూ ఏటూరునాగారం, మంగపేట, గోవిందరావుపేట మండలాల నుండి జీపులు ఇతర వాహనాలలో సదస్సుకు వస్తున్న ప్రజలను ఆపి వెనుకకు తిప్పి పంపించారు. నిషిద్ధ సంస్థలతో సంబంధం వున్నదనే నెపంతో ఉద్యమాన్ని మొగ్గలోనే తుంచివేయాలని చూస్తున్నారు. తెలంగాణపై వివక్షత కొనసాగినంతకాలం ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఉధృతమవుతుందనేది చారిత్రక సత్యం.

తెలంగాణ వనరులు తెలంగాణకే దక్కేంతవరకు పోరాడాలని, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ సాధించాలని, తెలంగాణ జనసభపై నిర్బంధాన్ని నిలదీయాలని జూన్ 3వ తేదీన తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ర్యాలీ, బహిరంగసభ జరిగినవి. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణను మొగ్గలోనే తుంచివేయాలని జనసభ నాయకులను హత్య చేయిస్తూ దాని అనుబంధ సంస్థలపై చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫాసిస్టు నిర్బంధాన్ని 'క్రాంతి' తీవ్రంగా ఖండిస్తోంది. ❑

*(39వ పేజీ తరువాయి...)*

డోల్‌దెబ్బ నాయకుడు లలిత అన్న బెల్లి కృష్ణయాదవ్‌ల హత్యలకు కుట్రలు పన్నుతున్నారు.

ఈ విధంగా తెలంగాణలోని అన్ని జిల్లాలలో నిరాధారమైన ఆరోపణలతో నాయకులను, కార్యకర్తలను అరెస్టుచేస్తూ పరమ కిరాతకంగా హత్యలు చేయించి కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి తెలంగాణ ఉద్యమాన్ని ఆపాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. కనీస ప్రజాస్వామిక రాజ్యాంగబద్ధ ప్రాథమిక హక్కైన సభలు నిర్వహించుకునే హక్కును కాలరాస్తూ కల్వకుర్తి, ఏటురునాగారంలలో బహిరంగసభలకు అనుమతినివ్వకుండా పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించారు. ఏప్రిల్ 4, 5 తేదీలలో ఏటూరునాగారంలో తలపెట్టిన ప్రాంతీయ సదస్సు, ర్యాలీ, బహిరంగసభలను పోలీసులు చివరిక్షణంలో భగ్నం చేశారు. అనుమతి ఇస్తామని హామీయిచ్చి చివరికి పోలీసు అధికారుల నుండి అనుమతి లేదని ఒక పథకం ప్రకారం సభను విచ్ఛిన్నం చేయటానికి తెలుగుదేశం ప్రభుత్వం కుట్ర పన్నింది. తాడ్వాయి,

వారి స్మృతికి విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి ఆశయ సాధనకై పురోగమించుదాం.

మార్చినుండి జులైదాక ఉధృతంగా కొనసాగిన ఈ దాడిలో శత్రువు 1. సంఘ కార్యకర్తలను కాల్చి చంపటం 2. దళాలను నిర్మూలించడం 3. విప్లవకారుల తల్లిదండ్రులతో, మాజీలతో సమావేశాలు (కౌన్సిలింగ్) నిర్వహించి సరెండర్లను ప్రోత్సహించడం అనే మూడంచెల కార్యక్రమాన్ని ఎంచుకున్నాడు. ఖమ్మం మినహా మిగతా అన్నిజిల్లాలలో బూటకపు ఎదురుకాల్పులలో 53 మంది సంఘ సభ్యులను, సానుభూతిపరులను హత్య చేశారు. నిజామాబాద్‌లో రెండు దళాలపై, కరీంనగర్ ఈస్ట్ వెస్ట్‌లలో ఒక్కొక్క దళంపై, వరంగల్‌లో రెండు దళాలలపై, ఖమ్మంలో ఒక దళంపై దాడులు జరిగి 22 మంది కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ శత్రు బుల్లెట్లకు నేలకొరిగారు. బెల్లంపల్లిలో మొదలైన కౌన్సిలింగ్ ఇతర ప్రాంతాలలో అంతగా సాగలేదు. కాని సంఘనాయకులనుండి, దళ సభ్యుల, నాయకులదాకా ఏరియా వారిగా పేపర్లలో తలలకు వెలలు ప్రకటించి సరెండర్ల ప్రచారం కొనసాగింది.

ఒక్కొక్క దళం పరిధిలో 20-30మందితో కూడిన 5 పోలీసు బ్యాచ్‌లు కూంబింగ్‌లు నిర్వహించాయి. ఒకేసారి అన్ని దళాల మీద కాకుండా, కేంద్రీకరించి గాలింపులు జరిపారు. ఈ పోలీసు బ్యాచీలు కాలినడకన అడవిలో నీటి తావుల వద్ద, దళం ప్రయాణించే దారులలో, ఊరిబయట జనానికి కనపడకుండా మూటు వేయడం, వండుకుని తింటూ అడవిలోనే మకాం చేస్తూ తిరిగాయి. దళం కదలికలు వెల్లడైన చోట, ప్రజలను కలిసిన చోట, సమావేశాలు, పంచాయితీలు నిర్వహించిన చోట వెంటనే లారీలలో పెద్ద ఎత్తున దిగుతున్నారు. ఈ మేడే సందర్భంగా రెండు పోలీసు దాడులు జరిగినవి. స్పెషల్ పోలీసులు ఒకసారి వచ్చిన రూటులో తిరిగి పోవడంలేదు రింగు రూట్లను ఉపయోగిస్తున్నారు.

అదిలాబాద్ జిల్లా చెన్నూరులో ఫిబ్రవరి 2న ఇద్దరిని కాల్చివేసిన సంఘటన ఈ సంవత్సరపు జిల్లాలో మొదటి ఎన్‌కౌంటర్. ఫిబ్రవరి 2న చెన్నూరు మండలం అస్నాద్ అడవిలో తాళ్ళపెల్లి శ్రీనివాసగౌడ్, కర్రు గట్టయ్యలను ఎన్‌కౌంటర్ చేశారు. దీనిని నిరసిస్తూ బెల్లంపల్లి, మంచిర్యాలలో అఖిలపక్షకమిటీకి చెందిన నాయకులు ధర్నా చేశారు. ఒకవైపు ఇక్కడ నిరసన జరుగుతుండగానే కోటపల్లి ప్రాంతంలో ఆత్కూరి శ్రీనివాస్‌ను ఎన్‌కౌంటర్ చేశారు. ప్రజలు శ్రీనివాస్ శవాన్ని ఊరేగిస్తూ కోటపల్లి సబ్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. చెన్నూరు ఏరియాలో ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఫిబ్రవరి 10,11 తేదీలలో చెన్నూరు, నెన్నెల, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమిని మండలాలలో బంద్ జరిగింది. మంచిర్యాలలో ఫిబ్రవరి 11న రాత్రి 8 గంటలనుండి 11 గంటల వరకు సికాస నాయకులు ఆశ్రయం పొందారనే సమాచారంతో పెద్ద ఎత్తున గాలించారు.

మార్చి 12న సారంగపూర్ అటవీ ప్రాంతంలో జిల్లా కమిటీ సమావేశమవుతున్నదనే సమాచారంతో నిర్మల్ డివిజన్ పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. డిఎస్పీ ఆధ్వర్యంలో, నిర్మల్ సి.ఐ. భాస్కర్, ఎస్.ఐ . తాజుద్దీన్ అహ్మద్, రాంగోపాల్‌రావు, సీతారాములుతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు మండలంలోని సిర్‌పల్లి, కుప్టి, పొట్యాతండా సమీపంలోని అడవిలో వెదికి ఈ తండాలనుండి బోథ్ ప్రాంతం అడవి వరకు కూంబింగ్ జరిపినా ఎవరు తారస పడలేదు. మార్చి 13న సిర్పూరు(టి) మండలం ఇటిక్యాల పహాడ్ గ్రామం అడవిలో దళం డెన్ మీదికి స్పెషల్‌పోలీసులు పోయారు. సెంట్రీ కాల్చడంతో గోవిందు అనే కానిస్టేబుల్ చావడంతో మిగతా పోలీసులు వూర్లోకి వురికి తెల్లారినంక మళ్ళీ వచ్చారు. మార్చి 14నుండి బెజ్జూరు, కౌటాల, సిర్పూరు(టి) మండలాల అడవిలో తీవ్రంగా గాలించారు. మార్చి 27న బోథ్‌పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్‌ను సినిమాటాకీసు వద్ద గెరిల్లా దళం కాల్చి చంపటం జరిగింది. మార్చి 31న ఆసిఫాబాదు నుండి బయలు దేరిన స్పెషల్ పార్టీ పోలీసులు మొర్లిగూడెం మీదదాడి చేసి జొన్నచేనులో నిద్రిస్తున్న కామ్రేడ్స్ అశోక్, చిన్ను, పొర్తటి సాంబయ్య, మడే హన్మంతులను పట్టుకొచ్చి సిర్పూర్ కాగజ్‌నగర్ మండలం కడంబ దగ్గరి ఆడవిలో ఎన్‌కౌంటర్‌పేర కాల్చి చంపారు. మే 6న ఖానాపూర్ నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని పేల్చివేయటం జరిగింది. మే 11వ తేదీన శ్రీరాంపూర్ సిసిసి లోని నస్పూర్ కాలనీ గ్రౌండ్‌లో సింగరేణి కోల్‌బెల్ట్ కార్యదర్శి గెల్ల రాజలింగును కిరాతకంగా కాల్చి చంపారు. జులై 14న కడెం మండలం కల్లెడ అడవుల్లో గండిగోపాల్‌పూర్‌కు చెందిన యం.శంకర్‌ను ఎదురుకాల్పుల పేర చంపివేశారు. మార్చి 16న బెల్లంపల్లి రైల్వే పోలీసుల మీద ప్లాటూన్ దాడి చేసి మూడు రివాల్వర్లు, 2రైఫిల్లు స్వాధీనం చేసుకొన్న సంఘటనలో ఎస్సైతో జరిగిన ఘర్షణలో క్రాస్ ఫైరింగ్ జరిగి ప్లాటూన్ సభ్యుడు కామ్రేడ్ వీరన్న అమరుడైనాడు.

కరీంనగర్ పశ్చిమ డివిజన్ రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో మే 1వ తేదీన ప్రజలతో మేడే జరుపుతున్న స్పెషల్ దళంపై జరిగిన దాడిలో దళ సభ్యులు కామ్రేడ్స్ తిరుపతి, దుర్గారెడ్డి, శంకర్‌లు అమరులైనారు. అంతకు ముందు వారం రోజులుగా కట్కాపూర్, దావన్‌పల్లి, ధర్మాజిపేట, తాట్లవాయి. ఒడ్డెలింగాపూర్, కొత్తపేట గ్రామాలలో తీవ్రంగా కూంబింగ్ నిర్వహించారు. మేడే సందర్భంగా దళం ప్రజలతో సమావేశమవుతుందనే అంచనాతో పోలీసులు కొత్తపేటలో దళంపై దాడి చేయగలిగారు. మే 6న ఎల్లారెడ్డిపేట మండలం, వన్‌పల్లి గ్రామశివారు ఎదురుకొండల్లో పకడ్బందీ సమాచారంతో దళాన్ని చుట్టుముట్టి స్పెషల్ పోలీసులు జరిపిన కాల్పులలో కరీంనగర్ పశ్చిమ డివిజన్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాంచందర్, సాక్ సభ్యురాలు ఇందిరక్క, దళ సభ్యుడు వనశంకర్ మరణించారు. సిరిసిల్ల దళాన్ని నిర్మూలించామని పోలీసులు కలలు కంటుండగా తెల్లవారే దళం ఏరియాలోని ఒక మారుమూల గ్రామంలో వందలాది మంది ప్రజలు తరలి రాగా 4 గంటల పాటు ప్రజలతో సమావేశం నిర్వహించి వన్‌పల్లి అమరులకు జోహార్లు అర్పించింది. మే 12న ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామ శివారులో ఎనుగంటి శ్రీహరి, నర్సాగౌడ్‌లను ఎన్‌కౌంటర్ చేశారు. లోతుగడ్డలో జరిపిన ఎన్‌కౌంటర్లో భూక్యా దేవరాజును చంపివేశారు. జూన్ 3న సిరిసిల్ల పట్టణంలో బావుసాయిపేట శంకర్‌తో పాటు ఇంకొక కామ్రేడ్‌ను కాల్చి చంపారు.

కరీంనగర్ తూర్పుడివిజన్‌లో ఏప్రిల్ 3వ తేదీన కమాన్‌పూర్ మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన మడిపెల్లి నర్సన్న, ఆరుమల్ల శంకర్‌లు పనిమీద స్కూటర్‌పై మందమర్రి పోయివస్తుంటే గోదావరిఖని ఎయిత్ ఇంక్లెయిన్  కాలనీ వద్ద అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళాదినం రోజు గాలింపు జరుపుతూ వచ్చిన పోలీసులు ఏరియా విప్లవరైతుకూలీ సంఘం సెక్రటరీ కామ్రేడ్ రామస్వామిని, కనగర్తి సంఘనాయకుడు పెండ్లి మల్లారెడ్డిని మొక్కజొన్న చేనులో వుండగా కాల్చిచంపారు. పార్టీతో సంబంధం వుందని, పార్టీ సమాచారం చెప్పమని భర్తను తీవ్రంగా హింసిస్తూ తనను బండబూతులు తిట్టడంతో అవమానం భరించలేక హుస్నాబాద్ ఏరియా కట్కూరుకు చెందిన గర్భవతి అయిన లక్ష్మి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. అదే రోజు సాయంత్రం ఆమె భర్త లింగయ్య కూడా పురుగుమందు తాగి మరణించాడు. మే 1న ఎ.వి.ఆర్.సి.యస్ సభ్యుడు మచ్చుపేట గ్రామానికి

చెందిన కా.పులిపాక కొమురయ్యను ఇంటివద్దనుండి తీసుకుపోయి ముత్తారం మండలం ఆదివారంపేట గ్రామ శివారులో కాల్చిచంపారు. మే 17న మణుగూరు దళం మాజీ దళ సభ్యుడు క్రిష్ణను అయనతో వున్న నాగమణిని మహదేవ్‌పూర్ ఏరియా పెగడపల్లినుండి పట్టుకొనిపోయి పెద్దపల్లి ఏరియాలో ఎన్‌కౌంటర్ పేర కాల్చిచంపారు. మే 22న మంథని ఏరియా విప్లవ రైతుకూలీ సంఘం సెక్రటరీ కామ్రేడ్ వేల్పుల మధునయ్య (సాగర్)ను తాడిచర్ల గ్రామ శివార్లలో ఎన్‌కౌంటర్ చేశారు. మే 24న దళం కదలికలను స్పెషల్ పోలీసులకు అందజేసే మంథని పోలీస్‌స్టేషన్ హోంగార్డు శంకర్‌ను దళం పట్టుకొని ఖమ్మంపల్లిలో కాల్చి చంపింది. మహదేవ్‌దేవ్‌పూర్ దళం కొన్ని వేల మందితో ముత్తారంలో బహిరంగ సభ నిర్వహించిన తర్వాత అనారోగ్యంతో ఉన్న దళ సభ్యురాలు కవితను ఊట్లపల్లిలో షెల్టర్‌లో వుంచి పోయింది. మీటింగ్ తర్వాత జరిగిన కూంబింగ్‌లో సమాచారం తెలియటంతో కవితతో పాటు ఆజమ్‌నగర్‌కు చెందిన సంఘకార్యకర్తను ఎన్‌కౌంటర్ పేర హత్య చేశారు.

కరీంనగర్ తూర్పు డివిజన్‌లో మాజీ అసెంబ్లీ స్పీకర్ శ్రీపాదరావు పొలిటికల్ యాక్షన్ చేసిన తర్వాత ప్రభుత్వం చాలెంజ్‌గా తీసుకొని పెద్ద ఎత్తున పోలీసు బలగాలను రంగంలోకి దించింది. మంథని దళాన్ని పట్టించినవారికి 25 లక్షల రివార్డు ప్రకటించింది. అన్నారం అడవులలో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించింది. బసవపురం నుండి కొయ్యూరు వరకు అడివిని ఆనుకొని వున్న రోడ్డుకు పోలీసులు మాటువేశారు. ఏరియా వ్యాప్తంగా 20-30మందితో కూడిన స్పెషల్ బ్యాచ్‌లు తిరిగినాయి. శత్రువు ఎంతగాలింపు చేసినప్పటికీ ప్రజల సహకారంతో దళం కూంబింగ్‌లకు చిక్కకుండా ప్రజల మధ్యనే వుంటూ నిర్బంధాన్ని గేలిచేసింది.

పెద్దపెల్లి ఏరియాలో మార్చి 8 సందర్భంగా మొదలైన కూంబింగ్‌లు జులై మధ్యవరకూ కొనసాగినవి. ఎండాకాలంలో దళాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో పెద్దపల్లి, రామగుండం, కాల్వశ్రీరాంపూర్ పోలీసులతో పాటు సి.ఆర్.పి.యఫ్. జవానులు ఏరియా వ్యాప్తంగా 6,7 బ్యాచ్‌లుగా విడిపోయి తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. రామగుండం మండలం మొరుమూరు గ్రామ ప్రజలను 40 మందిని అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేసి దళాన్ని గ్రామంలోకి రానివ్వమని వారిచేత బలవంతంగా విలేకరుల ముందు మాట్లాడించారు. కుక్కల గూడూరులో 8 మంది, పొట్లాలలో కొంతమంది యువకులను అరెస్టు చేసి రెండు రోజులు తీవ్రంగా చిత్రహింసలు పెట్టి, మానసికంగా హింసించారు. పెద్ద పల్లి మండలం కనగర్తి, రాగినేడు గ్రామాల ప్రజలు భూస్వామి కిషన్‌రావు తోటలలోని మామిడి కాయలు వి.ఆర్.సి.యస్ నాయకత్వంలో స్వాధీనం చేసుకోవటంతో రెచ్చిపోయి ఈ గ్రామాలపై దాడులు చేసి ప్రజలపై కేసులు పెట్టారు. కనగర్తి గ్రామానికి ప్రతి ఐదు - పదిరోజులకొసారి వచ్చి సంఘనాయకుల కోసం, దళం కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వెల్గటూరు మండలంలోని ఉండెడ, కొత్తపేట గ్రామాల ప్రజలను అన్నలకు సహకరిస్తున్నారని 30మందిని అరెస్టు చేసి కండిషన్‌కు నడిపిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్‌మండలం రాతుపల్లిలో ప్రతి ఐదు పది రోజులకు స్కూటర్లపై గ్రామంలోని వాడలలో పగలు తిరుగుతున్నారు. రాత్రిపూట 13 నుండి 20 మంది బ్యాచీలుగా వచ్చి గ్రామ చివర్లో బిల్డింగులపై మాటుగాస్తున్నారు. కాల్వ శ్రీరాంపూర్‌లో 15 మంది యువకులను అరెస్టు చేసి కేసులు బనాయించి లంచాలు గుంజారు. పెద్దరాతుపల్లి గ్రామంలో 30మంది పోలీసులు తప్పతాగి వర్ధంతి సందర్భంగా కథ చూస్తున్న ప్రజలను ముసలి, ముతక, స్త్రీలు, పిల్లలు అనే తేడా లేకుండా నానాబూతులు తిడుతూ దాడిచేసి 10 మందిని గాయపరిచారు. రామగిరిని ఆనుకొని వున్న కమాన్‌పూర్, పెద్దపల్లి మండలాలలలోని గుట్టలను, రామగుండం గుట్టలను ప్రతి పదిపదిహేను రోజులకు ఒకసారి ఎక్కి తిరుగుతున్నారు. ధర్మారం మండలంలోని బొట్లకనపర్తి, పైడిపెల్లి, వెల్గటూరు మండలంలోని ముంజంపల్లి రామగుండం మండలం కుక్కల గూడూరు గ్రామాలను ఆనుకొని త్రిభుజాకారంలో చెట్లతో కూడుకొని వున్న గుట్టలో దళం వుందనే సమాచారంతో మే 13న 6 బ్యాచీలుగా పోలీసులు గుట్టను చుట్టు ముట్టారు. మే 20న 8బ్యాచీలు దళం వుందనే సమాచారంతో పెద్దపల్లి మండలంలోని రంగాపూర్, కమాన్‌పూర్ పండలంలోని రాణాపూర్, కన్నాల గ్రామాలను ఆనుకొని వున్న గుట్టలను చుట్టుముట్టారు. మళ్ళీ 3 రోజుల తర్వాత కుక్కలగూడూరు గుట్టను చుట్టుముట్టి అన్ని చోట్ల తిరిగినప్పటికీ దళం సురక్షితంగా తప్పుకుంది. ఏరియాలో గతంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు జరిగి భూములు ఆక్రమించుకున్న మొరుమూర్, కుక్కల గూడూరు, రాణాపూర్, కనగర్తి, భోంపల్లి, రాతిపల్లి గ్రామాలలో పోలీసు బ్యాచ్‌లు నిత్యం తిరుగుతూ ఈ గ్రామాల చుట్టూ మాటువేస్తున్నారు.

మహదేవపూర్ ఏరియాలో శ్రీపాద రావు యాక్షన్ తర్వాత నుండీ ఇప్పటికీ అనేక పోలీసు బ్యాచ్‌లు తిరుగుతున్నాయి. సమాచారం లేకున్నా అడవిలోనే మకాం చేస్తూ విస్తృతంగా తిరుగుతున్నారు.

నిజామాబాద్ జిల్లాలో మార్చి 21వ తేదీన గాంధారి మండలం సీతాయి పల్లి వద్ద చెంచోల్ల సత్తయ్యను, ఏప్రిల్ 18న ఇసాయి పేట గ్రామంలో రాజయ్యను, మే 21న ధర్పల్లి మండలం లింగాపూర్ వద్ద మాజీ దళ సభ్యుడు సాగర్‌ను, మే 27న ఎల్లారెడ్డి వి.ఆర్.సి.యస్ సభ్యుడు కొండాపూర్‌కు చెందిన విఠల్ ను ఎన్‌కౌంటర్లపేర కాల్చిచంపారు. మే 9న లింగంపేట మండలం కంచుమల్-కొండాపూర్ అడవిలో స్పెషల్ పోలీసులు ఎల్లారెడ్డి దళంపై పెద్ద ఎత్తున దాడి జరిపారు. ఈ దాడిలో దళ సభ్యురాలు సంధ్య, ఆమెను చూడవచ్చిన తల్లి రుక్మవ్వ, మరొక దళ సభ్యురాలు అక్కడికక్కడే మరణించారు. వీరితో పాటు వాటర్ మెన్ గౌరారం బాలకిషన్ పోలీసుల కాల్పులలో మరణించాడు. తరువాత పోలీసులు దారిలో పోతున్న కంచుమల్ గ్రామ సేవకులు భూమయ్య, బాలయ్యలను కూడా కిరాతకంగా కాల్చిచంపి ఎన్‌కౌంటర్‌లో మరణించారని ప్రకటించారు.

ఉత్తర తెలంగాణలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లకు, ఫాసిస్టు హత్యాకాండకు, పార్టీమీద కొనసాగుతున్న నిషేధానికి నిరసనగా మే 22 నుండి 28వరకు నిరసన వారంగా పాటించాలని ఎస్.జడ్.సి. ఇచ్చిన పిలుపు అలాగే తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడులో పాల్గొనవద్దని మే 27, 28 తేదీలలో బంద్ పాటించాలని ఇచ్చిన పిలుపు జిల్లాలో విజయవంతమైనది. నిరసన వారమంతా జిల్లాలో పెద్ద ఎత్తున ప్రతిఘటనా చర్యలు కొనసాగినవి. అందులో భాగంగా పిట్ల గంగాధర్ యాక్షన్ జరిగింది. రెంజర్ల టెలిఫోన్ ఎక్స్చేంజ్, మోర్తాడ్ లో వైన్‌షాపును, వేల్పూరులో మండల ప్రజా పరిషత్ కార్యాలయం మరియు నిర్మాణంలో వున్న పోలీస్ క్వార్టర్లు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గంగాధర్ గౌడ్ ఇల్లు, ఇందల్‌వాయి ఫారెస్టు రెస్ట్ హౌజ్‌లను పేల్చివేయడం జరిగింది.

బంద్ తర్వాత జూన్ 1న గాంధారి మండలం ఒంట్రికల్ గ్రామ మాజీ కార్యకర్త కిషన్ రావును ప్రైవేటు ముఠా ముసుగులో పోలీసులు హత్య చేశారు. జూన్ 6న మాచారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన బెస్త స్వామి, బెస్త రవిలను సరిహద్దు అడవిలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథ అల్లారు. ఇదేరోజు ధర్పల్లి మండలం అన్సాన్ పల్లి క్రాస్ రోడ్డుపై సిర్నాపల్లి మిలిటెంట్ చందర్ (డాక్యా)ను కాల్చిచంపారు.

జూన్ 4 న వేల్పూరు మండలం మోతె గ్రామానికి చెందిన కలమోహన్‌ను ఇంటి నుండి తీసుకు వచ్చి భీంగర్ పట్టణ సమీపంలో ఎన్‌కౌంటర్ చేశారు. జూన్ 25న ధర్పల్లి మండలం రామడుగు బోలం మధ్య అడివిలో సిర్నాపల్లి దళంపై దాడి జరిగింది. ఈ దాడిలో నలుగురు దళ సభ్యులు కామ్రేడ్స్ స్వర్ణ, సుజాత, శ్యాం, లింబన్నలు అమరులైనారు.

వరంగల్ జిల్లాలో మార్చి 2న పాలకుర్తి దళ సభ్యుడు కామ్రేడ్ యాకన్న పనుల నిమిత్తం సివిల్‌లో బయటికి పోయినప్పుడు పట్టుకొని కాల్చిచంపి ఎప్పటిమాదిరిగానే దళంతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించాడని ప్రకటించారు. మార్చి 27న కృష్ణాజీగూడెంకు చెందిన సంగి వెంకటయ్యను, మల్కాపూర్‌కు చెందిన కొమ్మురాజు వెంకటేశ్వర్లును స్టేషన్ ఘన్‌పూర్ లింగంపెల్లి గ్రామ సమీపాన సమ్మక్క సారక్క గద్దె దగ్గర కాల్చి పడవేసి ఎన్‌కౌంటర్ కథ చెప్పారు. ఏప్రిల్ 4న గూడూరు మండలం నేలవంచ గ్రామంలో దళంపై జరిగిన దాడిలో సాక్‌సభ్యుడు కా.మహేశ్, దళ సభ్యురాలు కా. బండెల స్వరూప అమరులైనారు. మే 2వ తేదీ ఉదయం కర్లపల్లి వాగువెంట నీటితావులలో కూంబింగ్ జరుపుతూ పోతున్న స్పెషల్ పోలీస్ బ్యాచ్‌లకు క్లాసుల క్యాంపు నుండి నీటికోసం వస్తున్న టీం తారసపడింది. పోలీసు కాల్పులలో ఒక సాక్ సభ్యుడు, దళ సభ్యురాలు మరణించారు. పోలీసులు క్యాంపుమీదికి దాడికి వెళ్ళడంతో క్యాంపులో వున్న కామ్రేడ్స్ ప్రతిఘటిస్తూ క్షేమంగా రిట్రీట్ అయినారు. ఈ దాడి తర్వాత వరంగల్, ఖమ్మం బార్డర్ వరకు అడివి అంతా కూంబింగ్ చేసినా దళాలు సురక్షితంగా తప్పుకున్నాయి. మే 16న స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎస్కార్టు పోలీసులపై దాడి చేయగా ఒక హెడ్‌కానిస్టేబుల్ మరణించాడు. మే 18న గూడూరు మండలం గాజుల గుట్ట శివారులో మహబూబాబాద్ మండలం రేగడిగూడెంకు చెందిన గుండెబోయిన శ్రీనును ఎన్‌కౌంటర్ పేర హత్య చేశారు.

ఖమ్మంజిల్లా కిన్నెర ఏరియాలో శత్రువు బాగా కేంద్రీకరించి తిరిగాడు. కొత్తగూడెం పట్టణం నుంచి స్పెషల్ బ్యాచి పోలీసులు దినం తప్పి దినం రావడం జరుగుతున్నది. మైలారం కంచుబావి ప్రాంతమంతా కూంబింగ్ చేశారు. సంపత్‌నగర్‌లో విద్యార్థులను కలిసిన విషయం తెలిసి తెల్లారే సంపత్‌నగర్ ఇరుప్రక్కల చింతోని చెలక, వజ్జోనిగూడెం, ఉల్వాచలక, కిష్టారం గ్రామాలవైపు మూడు బ్యాచ్‌లు పోయి సంపత్‌నగర్‌లో కలుసుకున్నవి. సారకల్లు, క్యారగట్టు గ్రామాలలో దళం కదలికలు వెల్లడై మూడు లారీల నిండా వచ్చిన పోలీసులు, ఒక లారీ మామిళ్ళవాయి, ఒక లారీ సారకల్లు, ఒకలారీ ఉల్వానూరు గ్రామాలకు పోయారు. సారకల్లు బయట అడివిలో లారీ పెట్టి ఊరి కంచెపొంటి తిరిగి అడివిలో మకాం వేశారు. పార్టీకి సహకరిస్తున్నారని ఈ గ్రామం నుండి నలుగురు యువకులను, క్యారగట్టు నుండి కొంత మంది యువకులను అరెస్టు చేశారు. జిన్నలగూడెం నుండి రామ్మూర్తి, వెంకటేశ్వర్లును, రాఘవపురం నుండి ఒకరిని, సుద్దరేవు నుండి ఇద్దరిని అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారు.

బంగారు చెలక ఆంబుష్ తర్వాత చింతోని చెలక గ్రామానికి చెందిన 10 మందిని ఆంబుష్ కేసులో ఇరికించి మూడునెలలు జైలు పాలు చేశారు. బంగారు చెలక, మైలారంలకు చెందిన వారిని ఆంబుష్‌లోవున్నారని ఆరోపించి ముడ్డిలో సీసాలు పెట్టి తీవ్రంగా హింసించారు. అనంతోగు, మామిడి గూడెంలకు చెందిన తుడుందెబ్బ నాయకులకు పార్టీతో సంబంధం వుందని ఆరోపించి అరెస్టు చేశారు. పోలీసులు కొనసాగిస్తున్న అక్రమ అరెస్టులు, వేధింపులు, చిత్రహింసలకు వ్యతిరేకంగా మర్కోడు గ్రామ పంచాయితీ పరిధిలో అన్ని పార్టీల వాళ్ళు కలిసి 'అఖిల పక్ష కమిటీ' ఏర్పర్చారు. పోలీసులు గ్రామాలనుండి ఎవరిని పట్టుకపోయినా ఈ కమిటీ వాళ్లు విడిపించుకుంటున్నారు. ఈ కమిటీకి తెలియకుండా ఎవరినైనా అరెస్టుచేస్తే ఎందుకు చేశారని పోలీసులను ప్రశ్నిస్తున్నారు.

పెట్రోలింగ్ బ్యాచ్‌లకు దళం రెండుసార్లు ఎదురై ఫైరింగ్ జరిగింది. చింతోనిచెలక నుండి పునుకుడుచెలకకు వచ్చే అడివిదారిలో టేకుముక్కల వాళ్ళు కలిస్తే దళం ఆగి వాళ్ళతో మాట్లాడుతుండగా అదే దారిలో పోలీసులు వచ్చారు. పైలట్ కామ్రేడ్ పై ఫైరింగ్ చేస్తూనే దళం మీదికి మిగతా పోలీసులొచ్చారు. మధ్యన టేకు ముక్కల వాళ్ళుండటంతో దళం ప్రక్క నుండి ఫైర్ చేస్తూ క్షేమగా రిట్రీట్ అయింది. పునుకుడుచెలక మర్రిగూడెం మధ్యలో రెండవసారి ఫైరింగ్ జరిగింది. అల్లిపొదల్లో రెస్ట్ తీసుకుంటున్న పోలీసులు తమ ముందునుండే పోతున్న దళాన్ని గమనించి ఆపర్చునిటీ ఆంబుష్ చేశారు. పోలీసుల రాపిడ్ ఫైరింగ్ నుండి స్పీడ్‌రన్ చేసి దళం క్షేమంగా బయటబడింది. కొత్త గూడెం చుట్టూరా ఉన్న గ్రామాలలో మరియు కొత్తగూడెం పట్టణంలో ఉద్యమం బలపడనీయకుండా చేయడానికి -కిన్నెర మరియు యం.జి.యస్ దళాలను నిర్మూలించటానికి ఏరియాలో స్పెషల్ బ్యాచీలు విపరీతంగా పెట్రోలింగ్ చేస్తున్నాయి.

కొత్తగూడెం టౌన్ చుట్టూ యం.జి.యస్ తిరిగే గ్రామాలలో పోలీసులు కవాతులు చేస్తూ ప్రజలను భయకంపితులు గావిస్తున్నారు. ఎవరు అన్నం పెట్టినా, ఏవిధంగా సహకరించినా తమ తూటాలకు బలికాక తప్పదని బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. అరెస్టైన వాళ్ళలో ఒకరిద్దరిపై ప్రజల ముందే థర్డ్ డిగ్రీ పద్ధతులను అమలు చేసి ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయ చూస్తున్నారు. అరెస్టయిన వాళ్ళను చీకటి గదుల్లో రోజులకొద్దీ పెట్టి తిండిపెట్టకుండా హింసిస్తున్నారు. స్త్రీ, పురుష భేదం లేకుండా వెంట్రుకలు పీకడం, గోళ్ళలో సూదులు గుచ్చటం, పంగలు జాపి రోకలి బండలు ఎక్కించడం లాంటి వికృత హింసా పద్ధతులు అమలు చేస్తున్నారు. జైళ్ళకు పోయిన తర్వాత బెయిల్లు రాకుండా చేస్తామని, ష్యూరిటీలు ఎవరూ పడకుండా చూస్తామని, కుటుంబాలను కనపడకుండా చేస్తామని, ఆస్థులు ధ్వంసం చేస్తామని, మిగతా కుంటుంబ సభ్యుల పని కూడా చూస్తామని, మానసికంగా వేధిస్తున్నారు. కరెంట్ షాకులు ఇస్తూ మొదటి దశలోనే పార్టీనుండి దూరం చేయటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

పాల్వంచ సమీపంలోని గద్దల మడుగు అనే గ్రామంపై గొడ్డు మీద పులి పడ్డట్లు పడి చిన్నా, పెద్దా, స్త్రీ, పురుష బేధం లేకుండా లాఠీలతో, తుపాకి మడమలతో కొట్టారు. అనాదిగా అక్కడే బతుకుతూ వస్తున్న ఆ గిరిజనులు తమ ఇల్లువాకిలి, గొడ్డూగోదా వదిలి ఇప్పుడు పట్టణాలకు వలస పోయి అత్యంత దయనీయంగా బతుకుతున్నారు. ఇప్పటికీ పోలీసులు నిర్మానుష్యంగా వున్న ఆ గ్రామంపై నిఘాపెట్టి వచ్చిపోతున్నారు. పాల్వంచ దగర జగుతండకు చెందిన నాగమణి అనే మహిళ నవభారత్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ తన నలుగురు పిల్లలను పోషిస్తున్నది. ఆమె పనిచేస్తేనే వారికి పూట గడుస్తుంది. ఆమెకు పీపుల్స్‌వార్ పార్టీతో సంబంధాలున్నాయని, కార్మికులను కూడగడుతున్నదని ఆరోపిస్తూ పాల్వంచ పోలీసులు ఇంటినుండే విపరీతంగా కొడుతూ తీసుకుపోయారు. అన్నలజాడ చెప్పమని వివస్త్రను చేసి రోకలి బండలు ఎక్కించారు. గదిలో బంధించి 6 సార్లు కరెంట్ షాకు ఇవ్వడంతో నరాలు దెబ్బతిని ఆమె మెదడు పనిచేయని స్థితిలో వుంది.

యం.జి.యస్ ఏరియాలో 18 గ్రామాల నుండి 89 మందిని అరెస్టు చేశారు. లైన్ తండాలో ఒకరిని, సింగభూపాలెంలో 11 మందిని, సుజాత నగర్‌లో ముగ్గురిని, మర్రితండాలో ముగ్గురిని, సీతంపేటలో ఏడుగురిని, రెడ్డిపాలెంలో 8 మందిని, పెనుగడపలో 9 మందిని, మాదిగగూడెంలో ఏడుగురిని మొలుగుగూడెంలో ముగ్గురిని, సంద్రుకుంటలో ముగ్గురు యువకులను ఇద్దరు మహిళలను, ఉల్లివాగులో ముగ్గురిని, కొత్తూరులో ముగ్గురిని, త్రీ ఇన్‌క్లైన్‌లో ముగ్గురిని, ఆన్‌సెట్టిపల్లిలోఐదుగురిని అరెస్టు చేశారు. పైగ్రామాల సంఘనాయకులను,

సానుభూతిపరులు, సాధారణ ప్రజలనందరినీ ఒకదగ్గర చేర్చి కొత్త పోలీసు స్టేషన్‌ను, సెంట్రీపోస్టులను నిర్మించడం, స్టేషన్‌చుట్టూ, పోలీసు వాళ్ళ ఇండ్లలో శుభ్రం చేయించడం లాంటి పనులు చేయిస్తున్నారు. గ్రామాలకు గాలింపుకు పోయినప్పుడు కొంతమందిని తీసుకుపోతూ, అనుమానం వస్తే ముందు ప్రజలను పంపి చెక్ చేయిస్తున్నారు. తిండిపెట్టకుండా ఇంటిపనులకు దూరంగా వుంచుతూ వెట్టిచేయించుకుంటున్నారు.

పాండవ ఏరియాలో జనవరి 4వ తేదీ రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పర్యటన సందర్భంగా ఇల్లందు డి.యస్.పి రామస్వామి గుండాల వచ్చి దామెరతోగు గ్రామంపై దాడి చేసి ఆ గ్రామ సంఘనాయకులను నలుగురిని చంపండి లేదా మీరైనా చావండి అని గుండాల పోలీసులను హెచ్చరించాడు. గుండాల ఎస్.ఐ ఫోర్సు తక్కువగా వుందని ఆ రోజు దాడి ఆపుకొని జనవరి 10న వందమంది పోలీసులతో వాహనాలలో రాత్రిబయలు దేరి దారిలో వాహనం చెడిపోతే రిపేరుచేసుకొని గ్రామం చేరేసరికి తెల్లారి 7గంటలైంది. ప్రజలు పోలీసులను గమనించి సంఘనాయకులకు చెప్పడంతో వారు తప్పుకున్నారు. పోలీసులు సంఘనాయకుల ఇండ్లు సోదా చేసి కొన్ని సామాన్లు తీసుకొని పోయారు.

ఏప్రిల్ నెలలో బయ్యారం మండలం చర్లపల్లి గ్రామ మాజీ మిలిటెంట్ వట్టం సారన్నను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. పందిపంపుల గ్రామానికి చెందిన తాటిస్వామిని అరెస్టు చేసి వెంటతిప్పుకుంటూ గురిజల మోడు వాగు చెక్‌చేసినారు. వరంగల్ జిల్లా నేలవంచ వద్ద నెక్కొండ దళానికి ఫైరింగ్ జరిగిన తర్వాత ఖమ్మం జిల్లాలోని గురిజల మోడు గ్రామంలో పోలీసులు రెండు రోజులు క్యాంపువేసి చుట్టుప్రక్కల నీళ్ళ తావులను చెక్ చేసినారు. వరంగల్, ఖమ్మం బార్డర్‌నుండి దళాలు రిట్రీట్ అవుతారనే అంచనాతో పోలీస్ బ్యాచ్‌లు బార్డర్ గ్రామాలపై కేంద్రీకరించాయి. బయ్యారం మండలం కొత్తగూడెం గ్రామం వద్ద తాటిస్వామి తిప్పుతున్న పెట్రోలింగ్ బ్యాచ్ దళం రాత్రిపూట బోరింగ్ కొడుతుండగా బోరింగ్ శబ్దంవిని అక్కడికి బయలుదేరినారు. దళం నీళ్ళు దోడుకొని గుట్టబోడు ఎక్కి పడుకున్నది. బోరింగ్ వద్దకు వచ్చిన పోలీసులు అడుగులు పరిశీలించుకుంటూ డెన్ మీదికి వస్తుంటే దళం గమనించి డెన్ మార్చింది.

గుండాల మండలంలో దళం కోసం కాలినడకన పోలీసులు రాత్రివేళలో ప్రజలకు కనపడకుండా గ్రామాల పొలిమేరల్లో తిరుగుతున్నారు. ఒకే రాత్రి మూడు నుండి నాలుగు దగ్గరి గ్రామాలు తిరిగి రాత్రికి రాత్రి గుండాలకు తిరిగి పోతున్నారు. లారీలో వచ్చే పోలీసులు ముత్తపురంలో దిగి నాగారం, పాలగూడెం, కొడవటంచ, జామలగూడెం తిరిగి గుండాల పోతున్నారు. కొసపురం గ్రామంలో మే 1వ తేదీన మేడే జరిపి వర్షం రావడంతో దళం వూర్లోనే బసచేసింది. 2వ తేదీ ఉదయం దళం ఏ.వి.ఆర్.సి.యస్ సభ్యులు బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా ఊరుబయటకు పోతుండగా స్పెషల్‌బ్యాచ్ పోలీసులు చాలా దగ్గరి నుండి ఫైరింగ్ జరిపారు. వారిలో ఒకరిద్దరు నిలబడే (బుల్లెట్‌ప్రూఫ్‌లు ధరించినవాళ్ళు)మీదికి వురికి వచ్చారు. దళం వాగులోకి వేగంగా పరుగెత్తి అక్కడినుండి ఫైరింగ్ జరుపుతూ క్షేమంగా రిట్రీట్ అయింది.

మణుగూరు ఏరియాలో మే చివర్లో పోలీసు బ్యాచ్‌లు తిరిగినవి. బీరెల్లి, రంగపురంలలో దళం సమాచారం తెలిసి 70 మంది పోలీసులు గుట్టకు వస్తుంటే దళం తప్పుకున్నది. దళాన్ని కలవటానికి వస్తున్న టీముకు పోలీసులు ఎదురుపడ్డారు. బుల్లెట్ ప్రూఫ్‌లు ధరించిన వాళ్లు టీంను పట్టుకోవడానికి మీదికే వురికి వచ్చారు. టీం ఫైరింగ్ చేస్తూ తప్పించుకొని దళాన్ని కలిసింది.

ఏటూరునాగారం ఏరియాలో జూన్‌లో పోలీస్ బ్యాచ్‌లు తిరగటం మొదలైంది. దళంనుండి ఇంటికి పోతున్న క్రమంలో ఒక దళసభ్యుడ్ని మంగపేటలో, యుగంధర్ అనే ఇంకో కామ్రేడ్‌ను షాపెల్లిలో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జూన్‌లో అడివిలో కాలినడకన వచ్చి కూంబింగ్ నిర్వహించిన బ్యాచీలు మూడుసార్లు కంతనపల్లికి చేరుకొని అక్కడినుండి ట్రాక్టర్లలో ఏటూరునాగారం పోయినవి. జూలై 12న ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో మూడు లారీల పోలీసులు, స్పెషల్ పార్టీ వాల్లు తాడ్వాయి మండలం నర్సాపూర్ సమీప అడవిలో లింగరాజు గుట్టపై పనుల వత్తిడిలో అలిసిపోయి నిద్రిస్తున్న బ్యాచ్‌ను చుట్టుముట్టి కాల్చిచంపారు. ఈ కాల్పులలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు బడె నాగేశ్వర్‌రావు (ప్రభాకర్), మణుగూరు డిప్యూటీ కమాండర్ కౌటంరాజు (లక్ష్మణ్), కిన్నెర దళ సభ్యుడు కోటె బాలయ్య (జగన్), ప్లాటూన్ సభ్యుడు నవీన్ అమరులైనారు.

షాపెల్లి గ్రామంలో లక్ష్మణ్ శవం ఊరేగింపులో వేయి మంది ప్రజలు పాల్గొన్నారు. అంత్యక్రియల్లో గ్రామస్తులంతా పాల్గొని పెద్ద ఎత్తున జరిపారు. ప్రభాకర్ మృతదేహాన్ని ములుగులో పోస్టుమార్టమ్ జరిపి మంగళవారం ఉదయం పస్రాలో ఊరేగించారు. తమ నాయకుడిని చివరిసారిగా చూసుకోవడానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. అదే రోజు సాయంత్రం కామ్రేడ్ ప్రభాకర్ స్వంత గ్రామమైన కాల్వపల్లిలో అంత్యక్రియలు జరిగాయి. మంగళవారం ఎజెన్సీ ఏరియా వ్యాప్త ప్రజలు ప్రవాహంలా కాల్వపల్లికి తరలివచ్చారు. అంత్యక్రియలు ముగిసే సమయంలో ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు మిన్నుముట్టాయి.

నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు దెబ్బతినిపోయిన తర్వాత మన పార్టీ నాయకత్వంలో తిరిగి 1978లో తెలంగాణలోని మారుమూల పల్లెల్లో చెలరేగిన రైతాంగ పోరాటాలు అనతికాలంలోనే ఆంధ్రరాష్ట్రంలోని నలుమూలలకు, నాలుగు రాష్ట్రాల సరిహద్దులతో కూడిన దండకారణ్యానికి విస్తరించాయి. మొదటినుండి ఈ పోరాటాలు శత్రునిర్బంధాన్ని ఎదిరిస్తూనే పురోగమించాయి. ఇందులో భాగంగా 1985-89; 1991-97ల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన రెండు పెద్ద అణచివేత క్యాంపెయిన్‌లను మనం వీరోచితంగా ఎదిరించి అడుగడుగునా రక్తతర్పణచేసి విజయం సాధించాము. ఈ రోజు విప్లవోద్యమం శ్రీకాకుళ, నక్సల్బరీ పోరాటాలతో పోల్చితే విస్తృతిలో చూసినా, నిర్మాణపరంగా చూసినా విశాల ప్రాంతాలలో సంఘటిత పడింది. శత్రువుకూడా ఉద్యమం యొక్క దీర్ఘకాల స్వభావాన్ని గ్రహించి వెంటనే అణచివేయటం సాధ్యం కాదని దీర్ఘకాలిక పథకాలతో, గెరిల్లా ఎత్తుగడలతో ముందుకువస్తున్నాడు. శత్రువు అవలంబించే నూతన ఎత్తుగడలను సరిగా అర్థం చేసుకొని పని విధానంలో అందుకు తగిన నూతన పద్ధతులను రూపొందించుకోవడం ద్వారా పోరాటక్రమంలో జరుగుతున్న నష్టాలను అధిగమించి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోగలుగుతాం. శత్రువు మిలిటరీ, ఆర్థిక బలాధిక్యతను వినియోగించుకొని మనపై చేసే దాడిని దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో భాగంగా ఆత్మరక్షణా యుద్ధం కొనసాగించడం ద్వారా ఓడించడమూ, ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవటమూ సాధ్యమేనని గతంలో రుజువైంది.

ప్రపంచబ్యాంకు దేశాన్ని మొత్తం తన కబంధ హస్తాలలోకి తీసుకోవడానికి, తన పథకాలను సమర్ధవంతంగా అమలు జరిపే చంద్రబాబు నాయుడు లాంటి వ్యక్తులను ముందుకుతీసుకువస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని సామ్రాజ్యవాదులకు తెగనమ్మటానికి పోటీపడుతూ దేశాన్ని ఆర్థిక రాజకీయ సుడిగుండంలోకి నెట్టివేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తిరగబడుతున్న ప్రజలను ప్రభుత్వాలు క్రూరంగా అణచివేస్తున్నాయి. ఈ పరిస్థితిని ప్రజల ముందుంచి, పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాలు బహిర్గతం చేసి శత్రువు నూతన అణచివేత క్యాంపెయిన్‌ను ప్రజాప్రతిఘటన వెల్లువతో ఎదిరిద్దాం. అనన్య త్యాగాలకు సిద్ధపడుదాం. సాహసంగా పోరాడుదాం. అంతిమవిజయం మనదే. ❑

# విజయవంతమైన ఉత్తర తెలంగాణా ఆర్.టి.సి.ఉద్యోగుల, కార్మికుల చారిత్రాత్మక సమ్మె

1999 జూన్ నెలలో 10 రోజుల పాటు సాగిన కరీంనగర్ జోన్ ఆర్.టి.సి కార్మికుల సమ్మె వివిధ ట్రేడ్‌యూనియన్లలోని కార్మిక వర్గాన్ని ఐక్యపరచడంలో ఒక నూతన ధోరణిని, దేశంలోని కార్మికోద్యమంలో పెరుగుతున్న మిలిటెన్సీని సూచిస్తున్నది. ఉత్తర తెలంగాంణాలోని 5 జిల్లాలు- కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మంలు కరీంనగర్ జోన్ పరిధిలోకే వస్తాయి.

జూన్ 4 అర్ధరాత్రి మొదలైన సమ్మె ఉత్తరతెలంగాణలోని బస్ సర్వీస్‌లనన్నింటినీ 10 రోజుల పాటు స్థంభింప జేసింది. దాదాపు 2700 బస్సులు రోడ్డెక్కకపోవడంతో రోజుకు దాదాపు 1 కోటి రూపాయల నష్టం వాటిల్లినట్లు అంచనా. కరీంనగర్ జోన్‌లోని 22 వేల మంది కార్మికులంతా సమ్మెలో పాల్గొన్నారు. నాలుగు ప్రధాన ట్రేడ్ యూనియన్లు జాయింట్ ఆక్షన్ కమిటీగా రూపొంది సమ్మెకు నాయకత్వం వహించాయి.

ప్రపంచబ్యాంకు ఏజెంట్ చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్రప్రభుత్వం సమ్మె మొదలైన రెండవ రోజునుండే సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి అన్ని విధాల ప్రయత్నించింది. సమ్మె చట్టవిరుద్ధమైనదని, కార్మికులు సమ్మె విరమించకుంటే వారిపై వెంటనే చర్య తీసుకోబడుతుందని రవాణా శాఖామంత్రి హెచ్చరించాడు. క్యాజువల్ కార్మికులు వెంటనే విధులలో చేరకపోతే వారిని ఉద్యోగాలనుండి తొలగిస్తామని భయపెట్టాడు. సమ్మె పీపుల్స్‌వార్ దళాల వత్తిడితో నడుస్తున్నదని, ఈ



కారణం చేతనే సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవడం లేదని ప్రకటించాడు. యూనియన్ యొక్క ఏ ఒక్క డిమాండ్ కూడా లెక్కలోకి తీసుకోబడదని కార్మికులు విధుల్లో చేరటం తప్ప వారికి వేరే ప్రత్యామ్నాయం లేదని ప్రభుత్వ ప్రతినిధి బడాయిలు కొట్టాడు. స్థానిక పత్రికలు సమ్మెను కొనసాగించటానికి వివిధ ట్రేడ్‌యూనియన్ల నాయకులు పీపుల్స్‌వార్ సాయుధ దళాలచే ఏవిధంగా వత్తిడి చేయబడుతున్నారో కథలు కథలుగా రాసినాయి. నిషేధించబడిన పార్టీతో కార్మికులకు సంబంధం అంటగట్టడం వల్ల కార్మిక నాయకుల మధ్య భయం రేకెత్తించబడుతుందని, ఉద్యమంపై చట్ట వ్యతిరేక ముద్ర పడుతుందని ప్రభుత్వం ఊహించింది. ఇతర జిల్లాల నుండి బస్‌లు తేవాలనే, ప్రైవేటు బస్సులను కిరాయికి తీసుకురావాలనే ప్రయత్నాలు జరిగినవి. కానీ, ఇవన్నీ ఘోరంగా విఫలమైనాయి. ప్రభుత్వ ఎత్తుగడ తనకే బెడిసికొట్టింది. సమ్మెను పార్టీ బలపరుస్తున్నదనే ప్రచారం కార్మికులను మరింత ఉత్సాహపరిచింది. పీపుల్స్‌వార్ పార్టీ సమ్మెను బలపర్చడంతో, ఇతర విశాల సెక్షన్ల ప్రజల మద్దతు సమ్మెకు చేకూరుతుంది కాబట్టి అది వారిలో మానసిక స్థైర్యాన్ని దృఢ నమ్మకాన్ని కలుగజేసింది. సమ్మె 10వ రోజుకు చేరగానే పీపుల్స్‌వార్ పార్టీ సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్లకు మద్దతుగా ఉత్తర తెలంగాణ బంద్ పిలుపునివ్వటం జరిగింది. రాష్ట్రస్థాయిలో వివిధ ట్రేడ్‌యూనియన్ల నాయకులుకూడా సమ్మెకు మద్దతు ప్రకటించి దానిని రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు విస్తరింపజేస్తామని హెచ్చరించారు. ఈ పరిస్థితిలో సమ్మె మరింత మిలిటెంట్ రూపం తీసుకోబోతున్నదని గ్రహించి, అప్పటిదాకా ఏ మాత్రం ఖాతరు చేయకుండా అతి కఠినంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి అకస్మాత్తుగా తోకముడిచి సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్లలో చాలా వాటిని పరిష్కరించడానికి ఒప్పుకున్నాడు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు:** ప్రయాణీకుల రద్దీని తగ్గించటానికి జోన్‌లో దూరప్రయాణాల బస్‌సర్వీసులను ఇంకొక వెయ్యికి పెంచడం; అనధికార (చట్టవ్యతిరేక)రవాణాను, కాంట్రాక్టు పద్ధతిలో బస్‌లను కిరాయికి తేవడాన్ని ఆపడం; గ్యారేజీలలో, ఇతర డిపార్టుమెంట్లలో వున్న ఖాళీలను భర్తీ చేయటం; క్వార్టర్ల నిర్మాణానికి లోన్లు మరియు కార్మికులకు ద్విచక్రవాహనాలను ఖరీదు చేయటం; జోనల్ హెడ్ క్వార్టర్‌లో అన్ని వసతులతో కూడిన 50పడకల ఆసుపత్రి నిర్మాణం; ఒకే వ్యక్తిచే నడపబడే బస్ సర్వీస్‌ల విధానాన్ని పునరుద్దరించడం, నిజామాబాద్ రీజియన్‌లో జనవరి 1999 లో జరిగిన ఒప్పందాలను అమలులోకి తేవడం; నకిలీ సర్టిఫికెట్ల పేర తొలగించబడిన డ్రైవర్ల, కండక్టర్ల పునర్నియామకం; ఉద్యోగస్తుల పిల్లలకు సంబంధించిన ఉద్యోగ ఒప్పందం మొదలయినవి. చివరి రెండు తప్ప దాదాపు అన్ని డిమాండ్లను ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించింది. నకిలీ సర్టిఫికెట్ల పేర తొలగించబడిన ఉద్యోగుల పునర్నియామకానికి సంబంధించిన డిమాండ్‌ను ఒప్పుకోనప్పటికీ, యాజమాన్యం ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన ఒప్పందానికి రావటానికి కృషిచేస్తామని హామీ ఇచ్చింది.

డిమాండ్లలో చాలావరకు నెరవేర్చబడడం కరీంనగర్ జోన్‌లోని ఆర్టీసి కార్మికులనేకాక ఆంధ్రప్రదేశ్‌లోని యావత్ కార్మిక వర్గాన్ని ఉత్సాహపరిచింది. ఈ సమ్మెలోని ప్రత్యేకత ఏమిటంటే 10 రోజుల పాటు బస్సులు నడవక తాము అసౌకర్యానికి గురైనప్పటికీ ప్రజలు, కార్మికులకు మద్దతు పొందనివ్వటం. బస్సులు పెంచాలనే డిమాండ్ లేవనెత్తడం వలన, అది ప్రజలందరికి సంబంధించిన డిమాండ్ కావటం మూలంగా, సమ్మె చేస్తున్న కార్మికులు ప్రజలను కూడా ప్రభావితం చేసి వారి సానుభూతి పొందగలిగారు.

కార్మికులు ఏ ట్రేడ్ యూనియన్‌కు చెందినవారైనప్పటికీ, వారు వర్గ ఐక్యత ప్రదర్శిస్తే, ఎంతటి నిర్బంధాన్ని ప్రయోగించే ప్రభుత్వాన్నైనా, మొండిగా వ్యవహరించే యాజమాన్యాన్నైనా ఏవిధంగా లొంగదీసుకోవచ్చుననడానికి, ఉత్తరతెలంగాణా ఆర్టీసి కార్మికుల సమ్మె ఒక ఉదాహరణ.

# చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ వలన మహిళలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం సిద్ధించదు!

## నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వామ్యం కావటమే అందుకు సరైన మార్గం!!

1996 సెప్టెంబర్‌లో రాజ్యాంగానికి 81వ సవరణ చేయటం ద్వారా, పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ సీట్లలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును జనతాదళ్ (దేవేగౌడ) ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

మహిళలకు చట్టసభల్లో (పార్లమెంట్, అసెంబ్లీలో) అతి తక్కువ ప్రాతినిధ్యం ఉంటుంది. పార్లమెంట్‌లో ఇప్పటిదాకా, ఏనాడూ మహిళల ప్రాతినిధ్యం 8.1శాతానికి మించలేదు. అంటే 544 మంది పార్లమెంట్ సభ్యుల్లో నలభై ముగ్గురు మాత్రమే మహిళలు. మిగిలిన 500, ఆ పైచిలుకు పురుషులే! రాష్ట్రాలలోని అసెంబ్లీలలోనూ అదే పరిస్థితి కొనసాగుతున్నది. దేశ జనాభాలో, ఓటర్లలో సగభాగంగా ఉన్న మహిళల స్థితి అది. అందువలన, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి, రాజకీయాధికారంలో వాళ్ళని భాగస్వాములను చెయ్యటానికి, సామాజిక న్యాయం చేయటానికి ఈ బిల్లు ఉద్దేశించబడిందని చెప్పింది.

ప్రస్తుతం చట్టసభల్లో షెడ్యూల్ కులాలకు (ఎస్.సి.), షెడ్యూల్ తెగలకు (ఎస్.టి.) మాత్రమే రిజర్వేషన్లు వున్నాయి. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టంద్వారా, విధిగా పార్లమెంట్లో 180 మంది మహిళలకు సీట్లు దక్కుతాయి. అదే విధంగా అసెంబ్లీలో కూడా. మన రాష్ట్రంలో అయితే 98 మంది మహిళలకు అసెంబ్లీ సీట్లు దక్కుతాయి.

అయితే, రాజ్యాంగంలో మహిళలకు 33శాతం సీట్లు ఇవ్వాలని రాసి లేదు కాబట్టి, ఇది చట్టం కావాలంటే మహిళలకు 33శాతం సీట్లు రిజర్వ్ చేస్తున్నట్లుగా, రాజ్యాంగానికి సవరణ చేయవలసిన అవసరం వుంది. అటువంటి అధికారం పార్లమెంట్‌కే ఉంది కాబట్టి, 81వ సవరణ బిల్లు (ఇప్పటిదాకా 80సార్లు రాజ్యాంగానికి సవరణలు చేశారు) ద్వారా, చట్టం చేయ సంకల్పించింది. అలా చట్టం కావాలంటే, పార్లమెంట్‌లోని సభ్యులలో 2వంతుల మంది బిల్లుకు అనుకూలంగా ఓటు వేయవలసి వుంది.

### బిల్లుపట్ల పార్లమెంటరీ పార్టీల దొంగనాటకం!

1996 సెప్టెంబర్‌లో పార్లమెంట్‌లో మొదట బిల్లును ప్రవేశపెట్టిన దగ్గరనుండీ, అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఆమోదం తెల్పుతాం అంటూనే వున్నాయి. బిల్లును ప్రవేశపెట్టిన జనతాదళ్ (దేవేగౌడ) ప్రభుత్వం పోయి, జనతాదళ్ గుజ్రాల్ ప్రభుత్వమొచ్చింది. అదిపోయి, బి.జె.పి. వాజ్‌పేయి ప్రభుత్వమొచ్చి, 99 ఏప్రిల్‌లో పడిపోయింది. కానీ, నేటికీ ఆ బిల్లు ఆమోదం పొందలేదు. దానికి కారణం రాజకీయ పార్టీలన్నీ కలసి ఆడుతున్న దొంగ నాటకం తప్ప మరేమీ కాదు.

బిల్లు ప్రవేశపెట్టగానే, అంతా ఆమోదిస్తామన్నారు, కానీ, పార్లమెంట్‌లో బిల్లు చర్చకొచ్చినపుడు, బిల్లు ప్రవేశపెట్టిన జనతాదళ్ పార్టీకే చెందిన శరద్‌యాదవ్ ప్రభృతులు, బి.జె.పి.కి చెందిన ఉమాభారతి 33 శాతం రిజర్వేషన్లలో జనాభా ప్రాతిపదికమీద ఓ.బి.సి. (ఇతర వెనుకబడిన కులాలకు చెందిన) మహిళలకు సబ్‌కోటా ఉండాలని డిమాండ్ చేశారు. అలా లేకపోతే, ఉన్నతవర్గాలు అంటే ముఖ్యంగా అగ్ర కులాలకు చెందిన మహిళలే ఈ రిజర్వేషన్ల సౌకర్యాన్ని కొల్లగొడ్తారని చర్చలేవనెత్తారు.

దీనిపైన పార్లమెంట్‌లో చర్చ జరిగి, సి.పి.ఐ.కి చెందిన పార్లమెంట్ సభ్యురాలు గీతాముఖర్జి నాయకత్వాన పార్లమెంటరీ జాయింట్ కమిటీని వేశారు. ఈ బిల్లును పరిశీలించి ఒక నివేదిక ఇవ్వమనగా, గీతా ముఖర్జీ కమిటీ తన నివేదికను 96 డిసెంబర్‌లో ఇచ్చింది. ఓ.బి.సి. మహిళలకు రిజర్వేషన్ (సబ్‌కోటా) ఇవ్వవలసిన అవసరం లేదని చెప్పింది. వెంటనే బిల్లు ఆమోదించాలని చెప్పింది.

ఈసారి పార్లమెంట్ సమావేశాల్లో తప్పక ఆమోదింపజేస్తామని దేవేగౌడ హామీ ఇచ్చాడు. బిల్లును గాని పార్లమెంట్‌లో ఆమోదానికి పెడ్తే, వ్యతిరేకంగా ఓటు వేస్తామని జనతాదళ్ సభ్యులే మాట్లాడారు. కానీ, మరో సమావేశానికి దేవేగౌడ దిగిపోయి, ఆ స్థానంలో గుజ్రాల్ వచ్చాడు. గుజ్రాల్ కూడా అదే చెప్పాడు. బిల్లుపై ఏకాభిప్రాయం

---

సామ్రాజ్యవాదుల ఆదేశానుసారం వారి బంటులైన భారత పాలక వర్గాలు ఈ రోజు ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలను దూకుడుగా ముందుకు తెస్తున్న దీన్లో భాగంగా, ఈ రోడ్లు, ఓడరేవులు, రైల్వేలను కూడా సామ్రాజ్యవాదులకు, దళారీ బడా పారిశ్రామిక వేత్తలకు అమ్మివేస్తున్నారు, అంతేగాక, లాభదాయకంగా నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలలోని అత్యధిక వాటాలను బడా పారిశ్రామిక వేత్తలకు విదేశీప్రత్యక్షపెట్టుబడికి కారుచౌకగా అమ్మివేస్తున్న ఈ సమయంలో విజయవంతమైన ఉత్తర తెలంగాణ ఆర్టీసి కార్మికుల పోరాటం ప్రభుత్వం అనుసరిస్తున్న పాలసీలను ప్రశ్నిస్తూ, అత్యంత రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది.

విజయవంతమైన ఉత్తర తెలంగాణా ఆర్టీసి కార్మికుల సమ్మె దేశంలోని ఇతర ప్రాంతాలలోని కార్మిక వర్గాన్ని, వ్యక్తిగతంగా వారే రాజకీయాలకు అనుబంధంగా ఉన్నవారైనా, ఐక్య పోరాటంలోకి రావటానికి ప్రభావితం చేస్తుంది. యావత్ కార్మిక వర్గం యొక్క ఐక్యత సాధించకుండా, సామ్రాజ్యవాదుల అడుగుజాడలతో భారత పాలకవర్గాలచే అమలు జరుపబడుతున్న కార్మికవర్గ వ్యతిరేక విధానాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఓడించడం సాధ్యం కాదు. కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితే ఎంతటి నిరంకుశ ప్రభుత్వాలనైనా, వారి బాబులు సామ్రాజ్యవాదులనైనా ఓడించగలదని ఈ సమ్మె రుజువు చేస్తున్నది. ❑

సాధించేందుకని. అఖిలపక్ష సమావేశం జరిపాడు. కానీ సబ్‌కోటా విషయమై వివాదం తెగలేదు. ఈ చర్చల సందర్భంగా, ముస్లిం మహిళలకు కూడా సబ్‌కోటాలో రిజర్వేషన్ ఇవ్వాలని, ముస్లిం సభ్యులు డిమాండ్ చేశారు. అలా బిల్లును పార్లమెంట్‌లో చర్చకు పెట్టకుండానే, 97 వర్షాకాల సమావేశాలు ముగిసినాయి. ఆ తర్వాత కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకోవటంతో, గుజ్రాల్ ప్రభుత్వం పడిపోయింది. అధికారంలోకి వస్తే, 33శాతం రిజర్వేషన్ చట్టం చేస్తామని ఎన్నికల వాగ్దానంతో బి.జె.పి. 98 ఫిబ్రవరిలో అధికారానికి వచ్చి, 13 నెలలుంది కానీ, చట్టం తేలేదు.

పైకి అన్ని పార్టీలు 33శాతం రిజర్వేషన్‌కు అంగీకరించినట్లు చెప్పుకుంటున్నా, బిల్లును ప్రవేశపెట్టిన జనతాదళ్‌లోగానీ, బి.జె.పి., కాంగ్రెస్‌లలోగానీ, తమ సభ్యులతో బిల్లును ఆమోదింపజేసే చిత్తశుద్ధిలేదు. 1998 జూలై 13న పార్లమెంట్‌లో జరిగిన సంఘటనే అందుకు ప్రబల నిదర్శనం. ఆరోజు న్యాయశాఖామంత్రి తంబిదురై బిల్లు ప్రవేశపెడ్తుండగా, 50 మంది ఓ.బి.సి. యం.పి.లు మూకుమ్మడిగా దాడిచేసి మంత్రి చేతుల్లోనే కాకుండా, స్పీకర్ చేతుల్లో వున్న బిల్లు కాగితాలు కూడా లాక్కొని చింపి పోగులుపెట్టారు. దీంట్లో లాలూ, ములాయంల మనుషులు ముందున్నా, అన్ని పార్టీలకు చెందిన యం.పి.ల ప్రత్యక్ష, పరోక్ష మద్దతు వుంది. ఈ గొడవ జరిగిన దగ్గరనుండీ పార్లమెంట్‌లో ఈ బిల్లు ఊసేలేదు. ప్రస్తుతం బిల్లును అటకెక్కించి, బిల్లు చట్టం కాకపోవడానికి ఒకరిమీద ఒకరు నిందారోపణలు చేసుకుంటున్నారు.

ఓ.బి.సి. మహిళలకు సబ్‌కోటా ఉండాలని పట్టుబడుతున్న జనతాదళ్ శరద్‌యాదవ్, సమతాపార్టీ నితీష్ కుమార్, లాలూ ఆర్.జె.డి., ములాయం సమాజ్‌వాదీ పార్టీలు ఓ.బి.సి. వర్గాల రక్షకులుగా, ఛాంపియన్‌లుగా చలామణి కావటానికే కానీ, మరొకందుకు కాదు. ఇప్పుడు అధికారంలో ఏదో రూపంలో పాలుపంచుకుంటూ, ఓ.బి.సి.లకు వాళ్ళు కల్పించిన సామాజిక న్యాయ అధికారంలో భాగస్వామ్యం ఏమిటి? ఇక ముస్లిం మహిళలకు అన్యాయం జరుగుతుందని బాధపడ్తున్న ముస్లిం ఎం.పీ.లు ఆ మహిళలకే తీరని అన్యాయం చేసిన 1986 ముస్లిం బిల్లును (షాబానో మనోవర్తి సందర్భంగా) తీసుకువచ్చిన వాళ్ళే.

చూడటానికి, సబ్‌కోటా విషయమై ఏకాభిప్రాయం కుదరక బిల్లు ఆమోదం పొందలేదు అన్నట్లుగా కన్పడుతుంది గానీ, పైకి కనపడని అసలు అంశం ఒకటి గమనించాలి. ఈ బిల్లుగాని ఆమోదం పొందితే, పార్లమెంట్‌లోని 180 మంది పురుష ఎం.పీ.లు విధిగా తమ సీట్లు వదులుకోవలసి వుంటుంది. పితృస్వామిక భావజాలం నరనాన నిండి, అధికార లాలసకు, అక్రమ సంపాదనకు ఆలవాలంగా మారిన ఎం.పీ. పదవులను వదులుకోవటమంటే మాటలా? అందువలన, రాజకీయ పార్టీలు, ఆ పార్టీల ప్రతినిధులుగా పార్లమెంట్‌లో ఉన్న పురుష పుంగవులు (ఇక్కడ ఆపార్టీ, ఈ పార్టీ అన్న తేడానే లేరు) అంత తేలిగ్గా ఈ'చర్చ'ను తేలుస్తారని, చట్టం చేస్తారని అనుకోవటం భ్రమే అవుతుంది. కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా అన్నది సామెత కదా!

వీళ్ల దొంగ నాటకానికి, ఇంకో నిదర్శనం కూడా చూడండి. బిల్లు ఆమోదం పొందక పోవటానికి కారణమంటూ ఒకరిమీద ఒకరు ఆరోపణలు చేసుకుంటున్న రాజకీయ పార్టీలు, మొన్న జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో తమ తమ పార్టీల తరపున మహిళలకు 33శాతం సీట్లు ఇవ్వవచ్చు కదా! ఎవరు అడ్డుపడ్డారు?

భారతీయ జనతాపార్టీ దేశ వ్యాప్తంగా 28 మంది మహిళలకు మాత్రమే సీట్లు ఇచ్చింది. అంటే 5శాతం. ఇక, పంచ్‌మడీలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పార్టీలో అన్నింటా మహిళలకు 33శాతం పదవులు అని ఘనంగా తీర్మానం చేసారుగానీ, ఇచ్చిన టికెట్లు 45 మాత్రమే అంటే 8శాతం.

1999 పార్లమెంటరీ ఎన్నికల్లో మొత్తం పోటీచేసిన అభ్యర్థులు 4,648 ఉండగా అందులో మహిళలు మొత్తం 277 మంది మాత్రమే. అంటే కేవలం 0.6 శాతం!

ఒక్కొక్క పార్టీ 33శాతం సీట్లు కేటాయించటం కాదు, అన్ని పార్టీలు, ఇండిపెండెంట్లతో కలిపి 0.6 శాతానికి మించలేదంటే, మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం 'కల్పిస్తామనే' హామీల పేరుతో పార్లమెంటరీ పార్టీలు ఎంత బ్రహ్మాండంగా దొంగ నాటకం ఆడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

మహిళలను 'ఓటు బ్యాంక్'గా మార్చుకోవడానికి, ఇక ''రిజర్వేషన్స్'' తప్పనిసరి అవసరం అనుకున్నపుడు, 'ఓటు బాంక్' రాజకీయాల్లో భాగంగా, అప్పుడు చట్టం చేస్తారు. అప్పటిదాకా, ఈ రిజర్వేషన్ కల్పిస్తామనే దొంగ నాటకం ఆడుతూనే వుంటారు. ఎందుకంటే దాదాపు పాలకవర్గ పార్టీలన్నీ మహిళలు వంటింటికి, పిల్లల పెంపకానికి పరిమితమవ్వాలని విశ్వసించేవే. బి.జె.పి., వి.హెచ్.పి., ఆర్.యస్.యస్., భజరంగ్‌దళ్‌లు ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించాయి. బి.జె.పి. అధికారంలో ఉన్న రాష్ట్రాలలో 'హోమ్ కీపింగ్' [ఇల్లు చక్కదిద్దుకోవడం] కోర్సులను మహిళల కోసం ప్రవేశపెట్టింది. అంటే వారిని ఇంటి పనులకు పరిమితం చేయాలని వారి ఉద్దేశ్యం. దళితులను, బహుజనులను ఉద్ధరించడానికే తాను అవతరించానని చెప్పుకునే బి.ఎస్.పి. అధినేత కాన్షీరాం కూడా మహిళలు ఇంటికి పరిమితమవ్వాలని ప్రకటించాడు. అన్ని దోపిడీవర్గ పార్టీలు ఈ ఫ్యూడల్ భావజాలాన్నే తమ ప్రచార సాధనాల ద్వారా ఊదరగొడ్తున్నాయి.

### 33 శాతం రిజర్వేషన్లు మహిళలకి నిజంగా రాజకీయాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తాయా? వాళ్ళ సమస్యలు పరిష్కరిస్తాయా?

బూర్జువా పాలక పార్టీలు అనేక సందర్భాలలో, వివిధ సెక్షన్ల ప్రజలని తమ వెనుక నిలబెట్టుకోవడానికి, లేదా వాళ్ళ అసంతృప్తులు తాత్కాలికంగానైనా చల్లార్చడానికి, వాళ్ళని మౌలిక సమస్యల నుండి పక్కదోవలు పట్టించటానికి సంస్కరణలు తేవటం చరిత్రలో కొత్త కాదు.

అయితే, ఈ 33శాతం రిజర్వేషన్లు పాలకపార్టీలు చెప్తున్నట్లు మహిళలకు రాజకీయాధికారంలో భాగం కల్పిస్తాయా? ఇతర సమస్యలు తీరుస్తాయా? అన్న విషయం చూడాలి. ఈ రిజర్వేషన్ బిల్లు చట్టమైతే, చట్టసభల్లో 'విధిగా' మహిళలకు 33శాతం సీట్లుదక్కి, ప్రాతినిధ్యం వస్తుంది కాబట్టి, పైకి చూసినపుడు బాగానే ఉన్నట్లు కన్పడుతుంది.

ఇంతకీ, మహిళలకు అధికారంలో భాగస్వామ్యం, తగిన ప్రాతినిధ్యం కల్పించటమంటే, వాళ్ళ సమస్యలు పరిష్కారానికి ఉపయోగపడటం అంటే ఏమిటి?

దేశంలోని మహిళల్లో నూటికి 90 మందిగా ఉన్న సామాన్య, మధ్యతరగతి మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక దోపిడీని, కుటుంబ హింసను, రాజ్య హింసను పరిష్కరించగలగాలి. ఈ వర్గాల మహిళలకు అవసరమైన చట్టాలు చేయగలిగేలా వుండాలి.

కానీ, ఈ సందర్భంగా మన పార్లమెంటరీ వ్యవస్థను ఒకసారి పరికించి చూడాల్సిన అవసరం వుంది. పార్లమెంట్, అసెంబ్లీలలో వున్న ఎం.పీ.లు, ఎం.ఎల్.ఏ.లు, వాళ్ళతో ఏర్పడిన ప్రభుత్వాలు 'ప్రజాస్వామ్య' పరిపాలన రాజ్యాంగబద్ధ పరిపాలన, పేరుతో చేస్తున్నది దోపిడీ వ్యవస్థను కాపాడటమే. దోపిడీవర్గాల ప్రతినిధులుగా వ్యవహరించటమే. ప్రజా వ్యతిరేక చట్టాలు చేస్తూ, విధానాలు అవలంభిస్తూ, నిరంకుశ పరిపాలనలో భాగం అవుతున్నారు. 33శాతం సీట్లతో రేపు మహిళలు చట్టసభల్లో ప్రవేశించినా, వీళ్ళు నిర్వర్తించాల్సిన కర్తవ్యమూ, నిర్వర్తించేదీ ఇదే! ఎందుకంటే, వీళ్ళు ఆయా పాలక పార్టీల తరఫున ఎన్నికయి, పాలకపార్టీలు చేస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలకు, అమలు చేస్తున్న విధానాలకు వత్తాసుగానే నిలుస్తారు.

ఇపుడు, ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్‌లో చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధులే అందుకు పెద్ద నిదర్శనం. సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణబడుతున్న దళితులు, గిరిజనులు ఇవాళ అనేక పోరాటాలు చేస్తున్నారు. విప్లవోద్యమంలో భాగంగానూ, విడిగానూ గ్రామాల్లో భూస్వామ్య శక్తుల ఆధిపత్యాన్ని కూలదోసి, ప్రజల ఆధిపత్యం నెలకొల్పి దానిలో ముందుపీఠీన నిలుస్తున్నారు. ఈ పోరాటాలన్నిటిపైన పాలకవర్గాలు క్రూర నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయి. అన్ని పాలకపార్టీలది ఈ విషయంలో ఏకాభిప్రాయమే. కేవలం అధికార పార్టీలో వున్న వాళ్లే కాకుండా, 'ప్రతిపక్షాల'లో ఉన్న ఈ సెక్షన్ల సభ్యులు కూడా ఈ దమనకాండను వ్యతిరేకించడం లేదు. ఆమోదం తెలిపి, అందులో భాగస్వాములవుతున్నారు. ఇక 33 శాతం రిజర్వేషన్‌లో ఓ.బి.సి.ల మహిళలకు, ముస్లిం మహిళలకు, ఎస్.సి., ఎస్.టి. మహిళలకు సబ్‌కోటా ఇచ్చినా జరిగేది ఇదే!

## నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములు కావటం ద్వారానే, మహిళలకు రాజకీయాధికారంలో భాగం వస్తుంది

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, వెంటనే చట్టం తేవాలని అనేక మహిళా సంఘాలు, ఫెమినిస్టులు, మేధావులు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఇది తరతరాలుగా, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అణచివేయబడుతున్న మహిళలకు సంబంధించిన 'ప్రజాస్వామిక హక్కు'గా, డిమాండ్‌గా మన ముందు కన్పడుతుంది. ఈ డిమాండ్ పట్ల మనం స్పష్టమైన వైఖరి కల్గి వుండాలి.

ఎందుకంటే, మహిళలకు, ఎస్.సి.లకు, ఎస్.టి.లకు, ఒ.బి.సి.లకు, దళిత క్రిస్టియన్లకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఒక ప్రజాస్వామిక హక్కుగానే డిమాండ్ చేస్తున్నాం మనం. కానీ, దీనిని, -చట్టసభల్లో రిజర్వేషన్‌ని ఒకే గాటన కట్టడం పొరపాటు.

చట్టసభల్లో రిజర్వేషన్ల పేరుమీద అతికొద్దిమందికి (అది ప్రధానంగా ధనిక వర్గాలకు చెందిన స్త్రీలకు)ప్రాతినిధ్యం లభించటం ఒకటైతే, అంతకుమించి ఆ ప్రాతినిధ్యం వహించేవాళ్ళు 'ప్రజావ్యతిరేక చట్టాలు'చేసే పాలకవర్గంలో భాగస్వాములవుతారు. ఈ తేడాను చూడాలి.

ఇంతేగాక, ఇంకో ముఖ్య విషయం కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

ఒకప్పుడు, అంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం తొలిరోజుల్లో స్త్రీలకు ఓటు హక్కు లేదు. ఆ వేళ 'తమకూ ఓటు హక్కు కావాలని' అది తమ 'ప్రజాస్వామ్య హక్కు'ని డిమాండ్ చేసి సాధించుకున్నారు. చారిత్రకంగా చూసినపుడు, ఆనాడు బూర్జువా ప్రజాస్వామ్యం అభ్యుదయకర పాత్ర పోషిస్తున్న స్థితిలో వుంది. అప్పుడు మహిళలకు ఓటుహక్కు డిమాండ్ ప్రజాస్వామిక స్వభావం కలిగి వుంది. ఆనాడది మహిళలకు ఉపయోగకరమైనదే! ఇపుడు స్థితి అది కాదు. 'స్వేచ్ఛాయుత పోటీ' దశ నుండి పెట్టుబడిదారీ విధానం గుత్త పెట్టుబడిదారీ విధానంగా సామ్రాజ్యవాదంగా మారిపోవడంతో అది ప్రజాస్వామ్య స్వభావాన్ని కోల్పోయి అభివృద్ధి నిరోధక స్వభావాన్ని సంతరించుకుంది. వలస, అర్ధ వలస దేశాలకు పెట్టుబడులు ఎగుమతి చేస్తూ, ఆ దేశాల్లోని వనరులను కొల్లగొడ్తూ సామ్రాజ్యవాద దోపిడీని కొనసాగిస్తున్నది. అప్పటినుండీ పెట్టుబడిదారీ వర్గం తాము వల్లించిన బూర్జువా ప్రజాస్వామిక సూత్రాలను (స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం) తుంగలో తొక్కి, తమ దోపిడీని కొనసాగించటానికి అవసరమైతే ఫాసిజాన్ని కూడా అమలు చేస్తున్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా బూర్జువా ప్రజాస్వామిక దేశాలుగా చలామణి అవుతున్న వాటన్నింటిలోను అమలులో ఉన్నది వాస్తవానికి బూర్జువా నియంతృత్వమే. మన దేశంలోనూ ప్రజాస్వామికం పేరుతో అమలవుతున్నది బూర్జువా భూస్వామ్య వర్గాల నియంతృత్వమే!

అందువలన, ఇప్పుడు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించమని డిమాండ్ చేయడమంటే, ఈ నియంతృత్వ పాలనలో వీళ్ళకీ భాగస్వామ్యం కల్పించమని డిమాండ్ చేయటమే అవుతుంది. ఇది గమనంలో వుంచుకోవటం ఎంతో అవసరం. లేకపోతే, ఒక 'ప్రజాస్వామిక' హక్కు కొరకు ఎందుకు డిమాండ్ చేయవద్దు అన్న ప్రశ్న ఉదయిస్తుంది.

మహిళల్ని వాస్తవ సమస్యల నుండి మళ్ళపెట్టడానికి ఉద్దేశించిందే ఈ సంస్కరణ. మహిళలను 'ఓటు బాంక్'లుగా మార్చుకునే రాజకీయాల్లో భాగంగా తెస్తున్నదే ఈ బిల్లు. దినదినం మహిళల్లో పెరుగుతున్న చైతన్యాన్ని నీరుగార్చి, వారి పోరాటాలను పక్కదోవ పట్టించడానికి వారిలో ఈ వ్యవస్థపై భ్రమలు కల్పించి వారిని పోరాటాలలోకి రాకుండా చేయడానికే ఈ ప్రయత్నం. ***ఈ బిల్లు రావడానికి నేపథ్యం ఇదే.*** దోపిడీ పాలకవర్గాలు ఈ బిల్లును ప్రతిపాదించవలసి రావడం మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి, పోరాటపటిమకు

***(తరువాయి 50వ పేజీలో...)***

### రాబోయే సరికొత్త కార్మిక పోరాట తరంగాల ప్రారంభ సూచకంగా

# ప్రైవేటీకరణ మరియు ప్రభుత్వరంగ సంస్థల మూసివేతకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సదస్సు

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బర్ధమాన్ జిల్లా ఆశిశ్-జబ్బార్ (అసన్సాల్)లోని సుకుమార్ హాల్‌లో 'న్యూకోల్ పాలసీ వ్యతిరేక వేదిక' (నూతన బొగ్గు విధానం) నాయకత్వాన ప్రైవేటీకరణ మరియు ప్రభుత్వరంగ సంస్థల మూసివేతకు వ్యతిరేకంగా 1999 ఫిబ్రవరి 6 మరియు 7 తేదీల్లో ఒక సెమినార్ నిర్వహించబడింది. పశ్చిమబెంగాల్ రాష్ట్రం దుర్గాపూర్ నుండి బీహార్ రాష్ట్రంలోని ధన్‌బాద్ వరకూ వ్యాపించివున్న పారిశ్రామిక ప్రాంతంలోని మొట్టమొదటి అమరుడు కా॥ సుకుమార్. 1937లో అతను కార్మికునిగా పనిచేస్తున్న కాలంలో కార్మికులనందరినీ కూడగట్టి రాణిగంజ్ పేపర్‌మిల్లు గేటును దిగ్బంధనం చేసే సమ్మె పోరాటానికి నాయకత్వం వహిస్తున్నపుడు ఒక యూరోపియన్ అధికారి తన ట్రక్కు కార్మికులపైకి నడిపించగా అందులో సుకుమార్ అమరుడైనాడు. ఇదే పారిశ్రామిక బెల్టులో పశ్చిమ బెంగాల్‌నే కుదిపేస్తూ 1966లో జరిగిన ప్రఖ్యాతిగాంచిన 'అహార ఉద్యమం' సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆశిశ్ మరియు జబ్బార్‌లు అమరులైనారు. ఈ ఆహార ఉద్యమమే ఒక సం॥రం తరువాత వచ్చిన నక్సల్బరీ రైతాంగం వెల్లువకు ప్రాతిపదిక య్యింది.

ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ పరిధిలోని 64 కాలరీలను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి వ్యతిరేకంగా ఈ పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికవర్గం ప్రస్తుతం మరో దశ చారిత్రక పోరాటాలు చేపట్టడానికి సంసిద్ధమవుతున్నది. ప్రభుత్వం మూసి వేయాలనుకున్న 64 కాలరీలలో ఈ పారిశ్రామిక బెల్టుకు చెందిన దాదాపు అన్ని కాలరీలు వుండగా, మూసివేయాలని నిర్ణయించిన 8 ప్రభుత్వరంగ సంస్థల్లో 5 పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందగా అందులో మూడు ఈ బెల్టు పరిధిలోకి వచ్చేవే. కేవలం ఈ ఒక్క బెల్టులోనే ఇన్ని యూనిట్లను మూసివేయాలనే ప్రభుత్వ నిర్ణయం ఈ ప్రాంతంలోని లక్షమంది కార్మికులు, దాదాపు 5 లక్షలుగా వున్న వారి కుటుంబ సభ్యులపై మాత్రమేగాక, ఈ ప్రాంత పరిశ్రమలతో ఆర్థిక వ్యవస్థతో ముడిపడివున్న పదుల, లక్షల ప్రజానీకం యొక్క పొట్టమీద కొడుతున్నది. వారి జీవితాలపై పెనుదాడి చేస్తున్నది.

1991లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానంలో భాగంగా బొగ్గు రంగంలో అమలు కాబడుతున్న న్యూకోల్ పాలసీని అతని తర్వాత అధికారంలోకి వచ్చిన రెండు యునైటెడ్ ఫ్రంటు ప్రభుత్వాలు, ప్రస్తుతం బి.జె.పి. సంకీర్ణ ప్రభుత్వం కూడా ఈ విధానాన్నే కొనసాగిస్తూ వస్తున్నాయి. న్యూకోల్ పాలసీద్వారా కార్మికులపై జరుగుతున్న దాడిని ప్రతిఘటించడానికే న్యూకోల్ పాలసీ వ్యతిరేక వేదిక ఏర్పాటై కార్మికులను పోరాటాల్లోకి కదిలించే ప్రయత్నాలు గావిస్తున్నది. నష్టాలు తెస్తున్నాయనే పేరుమీద కాలరీలను మూసివేస్తూ కోల్ ఇండియా లిమిటెడ్ క్రింద పనిచేసే మొత్తం 6 లక్షల 76వేల మంది కార్మికుల్లో రెండులక్షల మందిని ఉద్యోగాల్లోంచి గెంటేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మహారాష్ట్రకు చెందిన ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్, పశ్చిమ బెంగాల్-బీహార్‌కు చెందిన ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సింగరేణి కాలరీస్ కార్మికులందరూ సమీకృతమై 1998 జూన్ నెలలో మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో ఒక సమావేశాన్ని నిర్వహించి 'న్యూకోల్ పాలసీ వ్యతిరేక వేదిక'ను ఏర్పరచుకున్నారు.

పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఈ సెమినార్‌ను ఢిల్లీ నుండి వచ్చిన ఏ.ఐ.ఎల్.ఆర్.సి. సభ్యుడు కంచన్‌కుమార్ ప్రారంభించాడు. అనంతరం వివిధ వక్తలు ప్రైవేటీకరణ మరియు ప్రభుత్వరంగ సంస్థల మూసివేతల గురించి ప్రసంగించాడు. ప్రభుత్వం మూసివేయడానికి నిర్ణయించిన కాలరీల్లో ఒకటైన అసన్‌సోల్‌ను సందర్శించిన ఎ.పి.డి.ఆర్. (అసోసియేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ డెమాక్రటిక్ రైట్స్) టీం సభ్యుడు ఒకరు మాట్లాడుతూ లోపభూయిష్టమైన ప్రణాళిక, అవినీతి మరియు నిర్వహణా లోపాలు ఆ కాలరీ నష్టాలు పొందడానికి దారితీసాయనే విషయాన్ని సోదాహరణంగా వివరించాడు. తరువాత ప్రసంగించిన వక్తలు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం చేత నియంత్రించబడుతున్న రాష్ట్ర విద్యుత్ సంస్థ దినం దినం ఏవిధంగా నష్టాల్లో కూరుకుపోతున్నదో వివరించారు.

ఐ.యం.యఫ్.-ప్రపంచబ్యాంకు-ప్రపంచ వాణిజ్య సంస్థలే ప్రత్యక్షంగా నిర్దేశిస్తూ, నియంత్రిస్తున్న ఫలితంగానే ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణకు, మూసివేతకు లోనవుతున్నాయని సామ్రాజ్యవాద దేశాల, యం.ఎన్.సి./టి.యన్.సి.ల ప్రయోజనాల కోసమే ఈ విధంగా ప్రైవేటీకరణ జరుగుతున్నదని ఇంకొక వక్త ప్రసంగించాడు. తరువాత ఢిల్లీకి చెందిన ట్రేడ్ యూనియన్ నాయకుడు, 'యం.ఏ.యం.సి. బచావో కమిటీ' (మైనింగ్ అండ్ అల్లైడ్ మెషినరీ కార్పోరేషన్) నాయకుడు ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ మరియు మూసివేతకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మికుల పోరాటాలను వివరించాడు. దాదాపు 5వేల మంది కార్మికులు పనిచేసే దుర్గాపూర్‌లోని యం.ఏ.యం.సి.ని మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించగా దీనిని రక్షించుకోవడానికి 'యం.ఏ.యం.సి. బచావో కమిటీ' ఏర్పడింది. మూసివేత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న కార్మికులు సి.ఐ.టి.యు. మరియు ఐ.యన్.టి.యు.సి. మొదలైన జాతీయ ట్రేడ్ యూనియన్ల నుండి బయటికి వచ్చి తమవైన ట్రేడ్ యూనియన్లను ఏర్పర్చుకుని ఫిబ్రవరి

8వ తేదీన 'రైల్ రోకో' పోరాటం చేపట్టారు. (అదే రోజున బంగ్లా బంద్ జరుగడం వలన ఈ కార్యక్రమం వాయిదా వేయబడింది.)

పై రిపోర్టులు మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో మొదటి రోజు కార్యక్రమాలు ముగిసాయి. రెండవ రోజైన ఫిబ్రవరి 7నాటి మొదటి సెషన్‌లో వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్‌కు చెందిన కామ్రేడ్స్ న్యూకోల్ పాలసీ-కార్మికులపైన దాని ప్రభావం అనే పత్రాన్ని సమర్పించగా, 64 కాలరీల మూసివేతకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో 'ఇ.సి.యల్. (ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్) ప్రస్తుత పరిస్థితి' అనే అంశంపై ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. అసన్‌సోల్ శాఖ తన అవగాహన పత్రాన్ని ప్రవేశపెట్టింది. దాంతర్వాత బొంబాయికి చెందిన న్యాయవాది సూసాన్ ఇబ్రహీం 'సరళీకరణ అనంతర కాలంలో కార్మిక చట్టాల్లో వస్తున్న మార్పులు' అనే అంశంపై తన పత్రాన్ని సమర్పించాడు. ఆయా కాలరీలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు మరియు యువకులు దాదాపు 300 మంది ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. దాదాపు 50 మంది వాలంటీర్లు తమ శక్తినంతా వెచ్చించి ఈ సెమినార్ జయప్రదం కావడానికి ఎంతో సహకరించారు.

సెమినార్ చివరగా జరిగిన సెషన్‌లో భాగంగా అసన్‌సోల్ మున్సిపల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించబడింది. ఈ సభలో ప్రభుత్వం అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిజాయితీతో కూడిన కార్మిక సంఘాలను ఏర్పర్చుకుంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు, మూసివేతలకు నిరసనగా ధీటైన పోరాటాలను నిర్మించాలని పలువురు వక్తలు కార్మికులకు పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 'నిశాంతిక', బీహార్‌కు చెందిన 'అభివ్యక్తి' అనే సాంస్కృతిక సంస్థలు ఇచ్చిన సాంస్కృతిక కార్యక్రమాలు బహిరంగ సభకు హాజరైన ప్రజానీకాన్ని ఎంతో ఉత్తేజపరిచాయి.

ప్రభుత్వం మూసివేయడానికి నిర్ణయించిన దాదాపు అన్ని కాలరీల్లోనూ దాదాపు నెలరోజులపాటుగా విద్యార్థులు మరియు యువకులు కలిసి రెండు దఫాలుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమం ఈ మొత్తం కార్యక్రమంలో ఒక ప్రధానమైన భాగం. ప్రచారం కోసం వెళ్ళిన విద్యార్థులు యువకులతో బీహార్ మరియు బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎంతో ప్రతిస్పందించారు. జాతీయ ట్రేడ్ యూనియన్ల నాయకులు మరియు కాలరీ మేనేజిమెంటు కలిసి కార్మికులను వేధించడమే కాకుండా ప్రచార దళాలు చేసే కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తూ ఈ సెమినార్ జరగకుండా చేయటానికి ఎన్నో ఆటంకాలు కల్పించారు. యాజమాన్యం, ట్రేడ్ యూనియన్ నాయకులు కన్నెర్రజేస్తూ ఆటంకాలు కల్పించడానికి ప్రయత్నించిన ప్రతిసారీ కార్మికులంతా కలిసి ప్రచార టీములకు అండగా నిలిచారు. 200-250 మంది కార్మికులు కూడా వివిధ కాలరీలలో జరిగిన ప్రచార కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. అవసరమైనచోట అవసరమైన మేరకు ప్రచార టీములకు కార్మికులు భోజన, వసతి సౌకర్యాలను కల్పించారు. స్త్రీలు, పురుషులు దాదాపు 40 మంది రెండు దఫాలుగా జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మికుల నుండి వచ్చిన ప్రతిస్పందన చూసిన ప్రచార టీముల సభ్యులు కూడా ఎంతో ఉత్సాహపడ్డారు.

పాతను తోసివేసి కొత్తది ఉద్భవిస్తుందన్నట్లుగా పనికిరాకుండా పోయిన జాతీయ కార్మిక సంఘాలను తోసివేసి తమవైన నిర్మాణాలను ఏర్పరచుకోడానికి కార్మికులు ఎంతో ఉత్సుకతను ప్రదర్శించారు. 'న్యూకోల్ పాలసీ వ్యతిరేక వేదిక' ఏర్పర్చుకుని ప్రభుత్వ నిర్ణయాలను ఎదుర్కోవడానికి సంసిద్ధమవుతున్నారు. పై విధంగా దుర్గాపూర్-రాణిగంజ్-అసన్‌సోల్-ధన్‌బాద్ పారిశ్రామిక బెల్టులో కొనసాగుతున్న కార్యక్రమాలు చావో రేవో తేల్చుకునే పోరాటాలవైపు కార్మికులను సంసిద్ధం చేస్తున్నాయి. వీరు జరిపే పోరాటాలు భారతదేశ వ్యాప్తంగా వున్న కార్మికులను కదనరంగానికీడుస్తూ ఒక కొత్త ప్రపంచ నిర్మాణానికి దారితీస్తాయి. ❑

---

*(48వ పేజీ తరువాయి...)*

నిదర్శనమన్న విషయాన్ని గుర్తిస్తూనే అదే సమయంలో ఈ బిల్లు ద్వారా మహిళలకు న్యాయం చేకూరుతుందనుకోవడం నేతి బీరకాయలో నెయ్యి చందం లాంటిదే అని మనం ఎలుగెత్తి చాటాలి. ఈ బిల్లును పార్లమెంటుచే ఆమోదింప చేయాలనీ, అమలు చేయించాలనీ, తద్వారా మహిళల స్థితిగతులు బాగుపడతాయని భ్రమిస్తున్న మహిళా సంస్థల కార్యకర్తలలో పై విషయాన్ని ప్రచారం చేయాలి.

నేడు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకి కనీస ఉపశమనం కూడా ఈ బిల్లు కల్పించదు. స్త్రీలమీద అన్నిరకాల అణచివేతలకు కారణభూతమై, సామ్రాజ్యవాద భూస్వామ్య దోపిడీకి ఆలవాలంగా, ఇక్కడున్న వ్యవస్థ ఇలా ఉన్నంత కాలం ఎంతమంది స్త్రీలు చట్టసభల్లో ఉన్నా, ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు అయినా, స్త్రీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేనట్లే. మహిళలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం అంటే, మహిళలపై జరుగుతున్న అన్ని రకాల అణచివేతలు, దోపిడీ అంతం కావటమే. అందుకు ఈ వ్యవస్థ అంతం కొరకు పోరాటం తప్ప మరో దగ్గర దారి లేదు. దాని కొరకు నేడు దేశంలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో మహిళలందరూ భాగస్వాములు కావలసిన అవసరముంది. ఆ విధంగా భాగస్వాములను చేయటం విప్లవకారుల ముఖ్య కర్తవ్యాల్లో ఒకటి.

నేడు ఈ దిశగా కొనసాగుతున్న మన ఉద్యమం మరింతగా మహిళలను భాగస్వాములను చేయవలసి వుంది. ❑

# ఒరిస్సాలో ముందంజ వేస్తున్న ఆదివాసీ ఉద్యమం

భారతదేశంలోని అత్యంత వెనుకబడిన రాష్ట్రాలలో ఒరిస్సా ఒకటి. లెక్కకు మిక్కుటంగా ఖనిజాలూ, అరణ్యాలు, నీరు, సారవంతమైన భూమి వంటి సహజ వనరులు, విస్తారమైన సముద్రతీర ప్రాంతం వుండి కూడా 50 సంవత్సరాల 'స్వాతంత్ర్యం' తరువాత సైతం ఒరిస్సా వెనుకబాటు ప్రాంతంగా వుంటూ కరువుబారిన పడుతూనే వుంది.

ఒరిస్సాలో 62 తెగలుగా విభజింపబడిన విస్తృతమైన ఆదివాసీ జనాభా వుంది. ఆదివాసీయేతరుల ద్వారా ఒరిస్సా జాతిలోకి ఆదివాసులను బలవంతంగా కలిపివేసే ప్రయత్నాలు ఈరోజు రాష్ట్రమంతటా సర్వసాధారణంగా జరుగుతున్నాయి. ఆదివాసీ ప్రాంతాల్లోకి ఆదివాసీయేతరుల వలస, భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతీ విలువల ప్రభావం, ఆదివాసీ ప్రాంతాల్లో సరుకు సంబంధాల పెరుగుదల, అనియత, కాంట్రాక్టు వేతన కూలీలుగా వీరిని మార్చటం, ఆదివాసీ ఆర్థిక వ్యవస్థను భారీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోకి కలిపేయటం వంటివి ఆదివాసీ జీవన విధానాన్ని క్రమంగా విచ్ఛిన్నం చేసే క్రమానికి దారితీస్తూ వారిని ఒరియా సమాజంలో కలిపేయడానికి తహతహలాడుతున్నాయి. బొగ్గు, బాక్సైట్ గనులు, విద్యుత్ ప్రాజెక్టులు, రూర్కెలా ఉక్కు కర్మాగారం వంటి భారీ పరిశ్రమల స్థాపన ఫలితంగా లక్షలాదిమంది ఆదివాసీలు తమ సాంప్రదాయక నివాస ప్రాంతాల నుండి తరిమేయబడుతున్నారు. ఇలా తమ మూలం నుంచి పెళ్ళగింపబడిన ఆదివాసులను వేతన బానిసలుగా, పేద రైతాంగంగా ఒరియా సమాజం కలుపుకుంటోంది. వడ్డీ వ్యాపారస్థులు, భూస్వాములు, వర్తకులు, అటవీ అధికారులు, టింబర్ కాంట్రాక్టర్లు, పోలీసులు మున్నగువారు ఆదివాసీలను జలగలుగా పీల్చేస్తున్నారు.

ఒరిస్సాలో మొదట్లో బలహీనంగా వున్న విప్లవోద్యమం ప్రస్తుతం సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] నాయకత్వాన వేగంగా పుంజుకుంటున్నది. గత కొన్నేళ్ళుగా విప్లవోద్యమం పెనుగంతు వేస్తున్న కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలు, దండకారణ్య గెరిల్లాజోన్‌లో భాగమయినాయి. ఇక రాయగడ, గజపతి, గంజాం జిల్లాలు గెరిల్లాజోన్ సన్నాహక దశనుండి గెరిల్లాజోన్ ప్రాథమిక దశకు రూపాంతరం చెందిన తూర్పు రీజియన్ పరిధిలోకి వచ్చాయి.

ఈ నేపథ్యాన్ని పక్కనబెట్టి ఇప్పుడు మనం మల్కన్‌గిరి జిల్లాలో పెరుగుతున్న వర్గపోరాటాలను, ఈ పోరాటాలలో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యాన్నీ క్లుప్తంగా పరిశీలిద్దాం.

మల్కన్‌గిరి జిల్లా 7 బ్లాక్‌లతో కూడి వుంది. జనాభా 3,20,000. వీరిలో సగం మంది బంగ్లాదేశం నుంచి వలస వచ్చిన వారే. కోయా, పూజా, దోర్ల, కొందు, కొండారెడ్డి, మటియా, రానా, భూమియా, దిడోరా, బందా, తదితర తెగలు ఈ జిల్లాలోని ముఖ్యమైన తెగలు. వీటిలో తొలి మూడు తెగల జనాభాయే ఎక్కువ. 200 గ్రామాలలో విప్లవోద్యమం విస్తరించింది. వీటిలో మూడోవంతు బెంగాల్ గ్రామాలే. ఆదివాసీలు, బెంగాలీలతో పాటు, ఆదివాసీయేతరులు కూడా విప్లవ కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు.

మల్కన్‌గిరి జిల్లా కలిమెల రీజియన్‌లో ప్రజాసమీకరణ ప్రత్యేకించి గణనీయంగా వుంది. అయితే ప్రజాసమీకరణలో ఇక్కడ పలు సమస్యలున్నాయి. వీటిలో మొట్టమొదట ఎదురైన సమస్య భాషా సమస్య. ఒరియా, బెంగాలీ, తెలుగుతోపాటు ఆదివాసీ ప్రధాన భాషలు ఈ చిన్న ప్రాంతంలో వునికిలో వున్నవి. వివిధ భాషా బృందాల సమస్య స్వభావం పెద్దగా భిన్నంగా లేకున్నా, జాతి భేదం, తెగభేదం, భాషాభేదం వల్ల ఒక ఉమ్మడి అవగాహనను తీసుకోవడంలో మరింత సహనాన్ని, కష్టించి పనిచేయాల్సిన అవసరాన్ని ముందుకు నెడుతున్నాయి. వ్యతిరేకాంశాలను పరిష్కరించి స్వీయాత్మక లోపాలను సరిదిద్దుకోవటం ద్వారా 1996 చివర నుండి అటువంటి జాగరూకతలతో కూడిన పనిని చేపట్టి, వర్గపోరాటాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఉద్యమం కృతకృత్యం కాగలిగింది.

## ప్రజల పాక్షిక పోరాటాలలో విజయాలు

ఒరిస్సాలోని అనేక వెనుకబడిన ప్రాంతాల్లాగే మల్కన్‌గిరి జిల్లా కలిమెల ప్రాంతంలో ప్రతి బ్లాకులో కూడా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరే (బి.డి.ఓ.) ప్రభుత్వాధికారానికి ప్రాతినిధ్యం వహిస్తుంటారు. ఆదివాసీల దృష్టిలో బి.డి.ఓ.లు ప్రభుత్వం నుంచి విడదీసి చూడలేని వారుగా కన్పిస్తారు. ఇక దాదాపుగా బి.డి.ఓ. లందరూ ఏ మినహాయింపులు లేకుండా, ఆదివాసులను దోపిడీ చేస్తున్న ప్రగతి నిరోధకులుగా వుంటున్నారు. బి.డి.ఓ.లను లక్ష్యాలుగా ఎంచుకుని మెమోరాండం ఇవ్వటం, బి.డి.ఓ. ఆఫీసుల వద్ద ధర్నాలు చేయడం, అధికారులను హెచ్చరించడం వంటి పలు పోరాటాలను బ్లాక్ కేంద్రాల వద్ద చేపట్టారు. సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఘెరావ్‌లు, బంద్‌లు, ఖతం కార్యక్రమాలు, స్వల్పస్థాయి దండనా చర్యలు వంటివి ఇక్కడ ప్రజలు చేపట్టిన పోరాట రూపాలుగా ముందుకు వచ్చాయి.

ప్రభుత్వం ప్రకటించిన వివిధ పథకాల అమలు, గ్రామాలకు నిధుల విడుదల, గ్రామాలలో రోడ్లు, పాఠశాలలు, బస్సులు, ఆసుపత్రులు, బోర్‌వెల్స్ వంటి వాటి నిర్మాణం, మరమ్మత్తులు, సౌకర్యాల కల్పనలు, పోలేరు నది ఆనకట్టు నుండి సకాలంలో నీటి విడుదల, వంటి ప్రభుత్వానికి సంబంధించిన డిమాండ్లు కావడం వల్ల ఈ ప్రాంత ప్రజల పాక్షిక పోరాటాలు ప్రభుత్వ వ్యతిరేక స్వభావాన్ని సంతరించుకున్నాయి. తమ వ్యవసాయ, అటవీ ఉత్పత్తులలో అధిక గిట్టుబాటు ధరలను కోరుతూ వ్యాపారులకు వ్యతిరేకంగా నిత్యావసర వస్తువులకు స్థానిక షావుకార్లు విధిస్తున్న అత్యధిక ధరలకు వ్యతిరేకంగా పోరాటాలను చేపట్టారు.

ప్రతి సంవత్సరం కూలీరేట్లు పెంపుదల పోరాటాలు తప్పనిసరిగా బద్దలవుతున్నాయి. 1996-97లో వెదురు డిపోలలో వేతనాలు 35 నుండి 40 రూ॥లకు, ఇతర పనులకు 10 నుంచి 15శాతం దాకా వేతనాలు ప్రజా పోరాటాల ద్వారా పెరిగాయి. 1997 మార్చి 20న ప్రజాసంఘాలైన డి.కె.కె.ఎం.ఎస్. గణ ఆందోళన్ జక్తో (యువజన) ఫ్రంట్ (జి.ఎ.జె.ఎఫ్.)లు బి.డి.ఓ. ఆఫీసు ముందు 8 వేల మంది ప్రజలతో, భారీ ప్రదర్శన జరిపాయి. తిరిగి 1997 మార్చి 27 న 10వేల మంది ప్రజలు పెండింగ్‌లో వున్న తమ సమస్యల

పరిష్కారానికి డిమాండ్‌చేస్తూ ప్రదర్శన చేశారు. మల్కన్‌గిరి కరువుబారిన పడిన జిల్లా కావడంతో డి.కె.కె.ఎం.ఎస్., జి.ఎ.జె.ఎఫ్.ల నాయకత్వం కింద ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను చేపట్టారు. పలు హెచ్చరికల తరువాత కూడా తమ సమస్యలను పరిష్కరించని కలిమెల బి.డి.ఒ.ని విద్యార్థులు చావగొట్టారు. అట్లే గూండాలను, అమ్మాయిలను పీడించేవారిని ప్రజలు దండించారు. చట్టవిరుద్ధంగా అడవి నరికేస్తున్న కలప స్మగ్లర్లకు అటవీ అధికార్లకు, వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి. థాపర్ల 'బి.ఐ.ఎల్.టి.' స్వాధీనమయిన మల్కన్‌గిరిలోని ఓరియంట్ పేపర్ మిల్‌లో సం॥లుగా పనిచేస్తున్నా పర్మనెంట్ కాలేకపోతున్న సూపర్వైజరీ స్టాఫ్ సమ్మెకు దిగి వెదురు రవాణాకు తిరస్కరించి ఏడు సం॥లకు పైగా పనిచేస్తున్న వారందరినీ పర్మనెంట్ చేసేలా యాజమాన్యం మెడలు వంచారు. సం॥ల నుండి పనిచేస్తున్న వారికి సంబంధించి పని జరుగుతున్న 8 నెలల కాలానికి జీతాలు ఇచ్చేటట్లు (ఇలా మామూలుగా జరుగుతోంది.) మాత్రమేగాక సంబంధిత సభ్యుల సీనియారిటీని బట్టి వివిధ నిష్పత్తులలో తక్కిన నాలుగు నెలలలో కూడా జీతాలు ఇచ్చే ఒప్పందం కుదుర్చుకున్నారు.

## పోరాటరూపంగా బంద్‌లు

సాధారణ వూరేగింపులు, ధర్నాలతో ఆశించిన ఫలితాలు అందనపుడు డిమాండ్ల సాధనకై సాధారణ సమ్మెలు, బంద్‌లు వంటి ఉన్నత పోరాట రూపాలు నిర్వహించబడినాయి. సుదీర్ఘంగా పెండింగులో పడివున్న ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకుగానూ, 1997 మార్చి 28న, 1998 జనవరి లోనూ జిల్లా వ్యాప్తంగా బంద్‌లు జరిగాయి. తునికాకు సేకరణ ధరలను పెంచమని డిమాండ్ చేస్తూ 98 ఏప్రిల్ 7న విజయవంతంగా జిల్లా బంద్ జరిగింది.

విప్లవ రైతాంగోద్యమంపై రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసన తెలుపడానికిగానూ 1997 జనవరి 28న, జూన్ 4, 5 తేదీల్లో, 1998 మార్చి 28న బంద్‌లు జరిగాయి. దండకారణ్య స్పెషల్ జోనల్‌కమిటీ పిలుపుకు స్పందనగా జిల్లాలో విజయవంతంగా బంద్‌లు జరిగాయి.

మొత్తంగా చూస్తే ఈ బంద్‌లన్నింటిలోనూ ప్రజలు ప్రేక్షక పాత్ర వహించకుండా రోడ్ల దిగ్బంధనాలు, ప్రదర్శనలు, సమావేశాలు వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. బంద్ పిలుపును విజయవంతం చేసేందుకుగాను బంద్ రోజులలో విస్తృత సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ప్రజలను డిమాండ్లపై ఎడ్యుకేట్ చేస్తూ బంద్‌కు ముందు విస్తృత ప్రచార కార్యక్రమాలు జరిగాయి.

ఆర్థికపర డిమాండ్లతో పాటు పలు రాజకీయ కార్యక్రమాలలో కూడా ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. నక్సల్బరీ 30 సం॥ల సందర్భంగా దాని ప్రాధాన్యతను వివరిస్తూ 97 మే నెలలో విస్తృత ప్రచారం జరిగింది. పలు గ్రామాలలో సమావేశాలు జరిగాయి. మే 23న కలకత్తాలో జరిగిన ర్యాలీలో ఈ గ్రామాలకు చెందిన 600 మంది ప్రజలు హాజరయ్యారు. 97 సం॥లో జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారంలో పలు గ్రామాల్లో అమరవీరుల సంస్మరణ సభలు జరిగాయి. ఈ సం॥రం ఫిబ్రవరిలో జరిగిన 12వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల బహిష్కరణ ప్రచార కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. గ్రామరాజ్య కమిటీలు, గ్రామాభివృద్ధి కమిటీలు, న్యాయకమిటీలు వంటి ప్రజాధికారపు ప్రత్యామ్నాయ సంస్థల అవసరం గురించి ఏరియా మొత్తంగా విస్తృతంగా ప్రచారం జరిగింది. పలు బూర్జువా, భూస్వామ్య పార్లమెంటరీ పార్టీలు మన పార్టీ, ప్రజాసంఘాలు ఉనికిలో వున్న గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేపట్టే సాహసం కూడా చేయలేక పోయాయి.

పార్టీకి పెరుగుతున్న అవసరాల రీత్యా నిధులందించేందుకై ప్రజలు 'వర్క్ డే' నిర్వహించారు. పార్టీకి ఒకరోజు వేతనాలను ఇచ్చేందుకుగానూ ఒక నిర్దిష్ట ప్రాంతంలోని ప్రజలు పనుల్లో విస్తృతంగా పాల్గొనడమే వర్క్ డే. 1996-97లో వెదురు పనుల్లో మునిగిన కూలీలు వర్క్‌డే ద్వారా 95,000 రూ॥ల పార్టీ ఫండ్‌ను సమిష్టిగా అందించారు.

## ప్రజాసంఘాలను సంఘటితం చేయడం

విప్లవ పార్టీకి ఆర్థిక, రాజకీయ డిమాండ్లపై ప్రజలను సమీకరించడం ఎంత ముఖ్యమో, వారిని వివిధ సంఘాల్లో సంఘటితం చేసి సైద్ధాంతిక రాజకీయ చైతన్యాన్ని అందించడం కూడా అంతే ముఖ్యం. రాజకీయ, సంస్థాపరమైన సంఘటిత స్థాయిని బట్టి నూతన ఉన్నత పోరాట రూపాలు పుంజుకుంటాయి. సంవత్సరం పొడవునా పలు పోరాటాలలో ముందుకు వచ్చిన ప్రజలను సంఘటితం చేసేందుకై కలిమెల ప్రాంతంలో 6 ఏరియా వ్యాప్త డి.ఎం.కె.ఎస్. కాన్ఫరెన్స్‌లు జరిగాయి.

నిజమైన ఏ సంఘటితత్వానికైనా కింది స్థాయిలో అటువంటి సంఘాలనేర్పర్చకుండా, ప్రజారాసులకు కార్మికులకు నాయకత్వాన్ని ఏర్పర్చడంగాని, ప్రజలు క్రియాత్మక పోరాటాల్లోకి దింపి వర్గ పోరాటాన్ని మరింతగా ముందుకు తీసుకు పోవడం గాని విప్లవ పార్టీకి సాధ్యం కాదు. నిర్బంధంలో ఇది మరింత ప్రధానమైనది. అందుచేత గ్రామాలలో మొదట ప్రజాసంఘాలు ఏర్పడిన తరువాత 25, 30 గ్రామాల పరిధిలో ఏరియాస్థాయి కమిటీలు ఏర్పడినాయి. గ్రామ యూనిట్లలో పాల్గొన్న క్రియాశీలక యువత నుండి ఎంపికయిన ప్రతినిధులతో 2, 3 రోజుల పాటు ఏరియా కాన్ఫరెన్స్ జరిగింది. 97 అక్టోబర్ 1998 జనవరి మధ్యన ఏరియా కాన్ఫరెన్స్‌లు జరిగి ఆదివాసీ గ్రామాలలో సెలిమెర కొండ, వెంకట పాలెం, టేకుగూడ, పాటేరు ఏరియా కమిటీలు ఏర్పడినాయి. బెంగాల్ వలస ప్రజలున్న గ్రామాలలో రెండు ఏరియా కమిటీలు ఏర్పడినాయి. ఈ కాన్ఫరెన్స్‌లన్నీ ప్రతినిధుల రాజకీయ చైతన్యం పెరగడానికి తోడ్పడినాయి. ప్రభుత్వం ద్వారా అమలు కావాల్సిన వివిధ పాక్షిక డిమాండ్లు, స్థానిక దోపిడీదారులకు వ్యతిరేకంగా ప్రజల సమస్యపైనా, సమిష్టిగా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ అభివృద్ధి పథకాలపై, ప్రజల మధ్య బలంగా వున్న మూఢనమ్మకాలపై పోరాడాల్సిన అవసరంపై కాన్ఫరెన్స్ పలు తీర్మానాలను ఆమోదించింది.

## ప్రజల మధ్య వైరుధ్యాలను పరిష్కరించటం

మల్కన్‌గిరి జిల్లా జనాభాలో సగభాగం మంది బెంగాలీ వలస ప్రజలే. కేంద్ర ప్రభుత్వం, మరియు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఈ బంగ్లాదేశ్ వలస ప్రజలు ఒరిస్సా మల్కన్‌గిరిలో మధ్యప్రదేశ్ ఉత్తర బస్తర్‌లో, మహారాష్ట్ర గడ్‌చిరోలిలో పునరావాసం పొందారు. మల్కన్‌గిరిలో ఇలా 257 నూతన పునరావాస కేంద్రాలున్నాయి. వీటిని గ్రామాలని పిలవరు. క్యాంప్‌లుగా పిలుస్తూ, వాటికి ఆయా నెంబర్లను ఇస్తారు (ఉదా: యం.వి.20-అంటే మల్కన్‌గిరీ గ్రామం 20 అని అర్థం) ఒక్కో క్యాంపులో 300 నుంచి 500 కుటుంబాల

దాకా వుంటాయి. వీటిలో 80 క్యాంపులు చిన్నవి ఒక్కో క్యాంప్‌లో 40 నుండి 60 కుటుంబాలు మాత్రమే వుంటాయి. ఈ కుటుంబాలలో చాలావరకు పేద, దళిత రైతాంగ కుటుంబాలు కాగా కొన్ని మధ్య తరగతి రైతాంగానికి చెందినవి. ప్రారంభంలో ఇక్కడ స్థిరపడిన కుటుంబాలకు ప్రభుత్వం తలా ఒక అయిదు ఎకరాలను ఇచ్చింది. ఆ తర్వాత్తరువాత వచ్చిన వారికి 3 ఎకరాల చొప్పున మాత్రమే దక్కింది. లోతట్టు ప్రాంతాలలో అడవిని చదునుచేసి ఆదివాసీ గ్రామాల చుట్టూ ఈ గ్రామాలను నిర్మించటం వల్ల వారికి, ఆదివాసీలకూ మధ్య వైరుధ్యాలూ, సంఘర్షణలకు పునాది సృష్టించబడింది.

బెంగాలీ వలస ప్రజలు స్థానిక ఆదివాసీ ప్రజలను దోపిడీ చేయడం మొదలెట్టి వారిపై ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ఆధిపత్యం చెలాయించసాగారు. స్థానిక మార్కెట్ కొద్దిమంది బెంగాలీ వ్యాపారుల ఆధిపత్యంలోకి వచ్చింది. వీరిలో కొంతమంది భూస్వాములుగా, వడ్డీ వ్యాపారులుగా మారిపోగా మరికొందరు నల్లమందు స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలలో మునిగి స్థానిక మాఫియాలుగా మారినారు.

అయితే అనేక చిన్న గ్రామాలలో బెంగాలీ ప్రజల పరిస్థితి దారుణంగా వుండి వారు దాదాపు ఆకలి దప్పికలకు గురయిన స్థితిలో జీవిస్తున్నారు. రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యం, ఆదివాసీ స్త్రీలను రెండో భార్యలుగా వుంచుకోవడం, ఆదివాసీల భూమిని ఆక్రమించే ప్రయత్నాలు, స్థానిక సంతలలో ఆదివాసీలను వారి ఉత్పత్తులకిచ్చే ధరలలో మోసం చేయటం, బెంగాల్ వ్యాపారులు ఆదివాసీలకిచ్చిన రుణాలపై భారీ వడ్డీరేట్లను వసూలు చేయడం, వంటి అంశాలపై ఆదివాసీలకు బెంగాలీలకు మధ్య వైరుధ్యాలూ, సంఘర్షణలూ బయలుదేరుతున్నాయి.

అనేక బెంగాలీ కుటుంబాలు గత రెండు, మూడు దశాబ్దాలుగా ఏర్పడుతూ వస్తున్నందువల్ల జీవితాన్వేషణలో వారు ఆదివాసీ ప్రాంతాల్లోకి మరింత లోతుగా చొచ్చుకుని వస్తున్నారు. చాలామంది ఆదివాసీ గ్రామాలలో స్థిరపడిపోయి వారిని మరింతగా దోపిడీ చేయటం ఆధిపత్యం చెలాయించడం మొదలు పెట్టారు. చివరకు పెళ్ళయిన ఆదివాసీ మహిళలు సైతం బెంగాలీల రెండో భార్యలుగా మారేందుకు ఆకర్షింపబడుతూ తద్వారా ఆదాయానికి వనరులుగా ఉపయోగపడుతున్నారు. ఆదివాసీలకు అతి తక్కువ మొత్తం ముందే చెల్లిస్తూ అడవి ఉత్పత్తులను, వ్యవసాయ ఉత్పత్తులను వారినుంచి సేకరించి, అవి అమ్ముడయిపోయిన తర్వాత కూడా ఆదివాసీలకు మిగిలిన మొత్తాన్ని చెల్లించకుండా పోతున్నారు. గ్రామపంచాయితీలు వంటి స్థానిక ప్రభుత్వ సంస్థలపై తమ ఆధిపత్యాన్ని ఉపయోగించుకుంటూ (స్థానిక ఎం.ఎల్.ఏ. బెంగాలీ వాడైన బి.జె.పి. అభ్యర్థి) బెంగాలీలలోని ఒక చిన్న విభాగం కాంట్రాక్టర్లుగా, రాజకీయ బ్రోకర్లుగా ఆవిర్భవిస్తుంటే అనేకమంది లంపెన్ శక్తులు పోలీసులతో కుమ్మక్కవడం కూడా పెరుగుతూంది.

ఈ నేపధ్యానికి వ్యతిరేకంగా పార్టీ, సాయుధ దళాలూ, ప్రజాసంఘాలూ ఆదివాసీలకూ, బెంగాలీలకూ మధ్యగల వైరుధ్యాలను పరిష్కరించేందుకై తీవ్ర ప్రయత్నాలనుప్రారంభించాయి. బెంగాలీలలోని దోపిడీదారులనూ దుష్టశక్తులను, భూస్వాములూ, వడ్డీ వ్యాపారులూ, స్మగ్లర్లూ, కాంట్రాక్టర్లూ, ఇన్ఫార్మర్లనూ, ఎంచుకొని బెంగాలీ క్యాంపుల్లోని ప్రజలమధ్యే వారిని దండించటం జరిగింది. అది కూడా ఇటువంటి దండనలు ఎందుకవసరమో బెంగాలీ ప్రజలలో వివరించి వారికి నచ్చజెప్పిన తర్వాతే ఆ చర్యకు పూనుకోవడం జరిగింది.

1997 డిసెంబర్ 4న డి.కె.ఎం.ఎస్. నాయకత్వంలో 450 మంది ఆదివాసులు, సాంప్రదాయక ఆయుధాలతో పాల్గొని చేసిన ఒక దాడిలో మొత్తం బెంగాలీ క్యాంపు ఎదుట భూస్వాములను, దోపిడీ దారులనూ దేహశుద్ధి చేశారు. దోపిడీదారులను దండించటంలో బెంగాలీ పేద ప్రజలు మాత్రం ఆదివాసీల పక్షం వహించారు.

ఆదివాసీ మహిళలను రెండో భార్యలుగా వుంచుకోవడం తగనిపని అంటూ బెంగాలీ యువతలో ఎడ్యుకేషన్ క్యాంపెయిన్ కూడా నిర్వహించబడింది. అయితే ఏ బెంగాలీ అవివాహితుడూ, ఆదివాసీ మహిళ అయినా పరస్పర అంగీకారంతో వివాహం చేసుకోవాలనుకున్నట్లయితే ఆ ఆదివాసీ మహిళను బెంగాలీ ఇంటికి తీసుకుపోయి బెంగాలీ స్త్రీకిచ్చే సమాన గౌరవాన్ని ఆమె పట్ల కూడా ప్రదర్శించాలి. ఆ విధంగా బెంగాలీలు ఆదివాసీలను అంటరానివారుగా చూసే ప్రవృత్తిని వదలి పెట్టాల్సి వుంటుంది.

క్రమంగా బెంగాలీ పేదలలో చాలామంది పార్టీ, డి.ఎ.కె.యం.ఎస్. చుట్టూ సమీకరింపబడినారు. అట్లే ఆదివాసీలకూ, బెంగాలీలకు మధ్య ఐక్యత కూడా బలపడి వుమ్మడి సమస్యలపై పోరాటాలలో కలిసి ముందుకు వస్తున్నారు.

ఈ సం॥రం ఫిబ్రవరి లోక్‌సభ ఎన్నికల కాలంలో దేశంలోని మిగతా ప్రాంతాల్లో వలెనే ఒరిస్సాలో వర్గపోరాటం తీవ్రంగా వున్న ప్రాంతాలన్నిటా అదనపు పోలీస్ బలగాలను దింపారు. మల్కన్‌గిరి జిల్లాలలోనూ ప్రజలను భీతావహులను చేసి తుపాకీ మొనచూపి బలవంతంగా వారిచేత ఓట్లు వేయించడానికి భారీ పోలీస్ బలగాలు వచ్చాయి. అయినా పార్టీ ప్రత్యక్ష పలుకుబడి గల గ్రామలన్నింటా ఎన్నికల బహిష్కరణ కార్యక్రమం విజయవంతమైంది.

అయితే ముఖ్యమైన వ్యత్యాసమేదంటే పార్లమెంటరీ ఎన్నికలకు ముందు తరలింపబడిన అదనపు పోలీసు బలగాలు ఎన్నికల తర్వాత కూడా వుండిపోయాయి. గత రెండు నెలలుగా ఈ బలగాలు గ్రామాలలో నిత్యం గస్తీ తిరుగుతూ ప్రజలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇంతవరకు డి.ఎం.కె.కె.యం.ఎస్.కి చెందిన 68 మంది కార్యకర్తలు, నాయకులూ అరెస్ట్ కాబడి నిర్బంధంలో వున్నారు.

మల్కన్‌గిరిలోనూ కోరాపుట్, గంజాం, గజపతి, రాయగడ జిల్లాల్లోనూ విప్లవ రైతాంగోద్యమంపై దాడిని తీవ్రతరం చేసేందుకు భువనేశ్వర్‌లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నాయన్నది స్పష్టం. నిజానికి 97 అక్టోబర్‌లో భువనేశ్వర్‌లో ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులు అణచివేత కేంపెయిన్ కొనసాగించేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగినా బి.జె.పి., జనతాదళ్, నవీన్ పట్నాయక్ అధికారం చేపట్టినా, బి.జె.పి. కేంద్రంలో అధికారంలో కొనసాగినా, కాంగ్రెస్, యునైటెడ్ ఫ్రంట్ కూటమి దాన్ని తొలగించినా ప్రభుత్వం అణచివేత విధానం కొనసాగుతుంది.

కాబట్టి భారతీయ రాజ్యం పథకమేస్తున్న, భారీ దాడిని ఎదుర్కొనేందుకై తమకు తాము సన్నద్ధులు కావడమే మల్కన్‌గిరి, ఒరిస్సాలోని ఇతర విప్లవకర వర్గ పోరాటాల ప్రాంతాల్లోని పార్టీ, ప్రజల కర్తవ్యం. ఇది శత్రు దాడిని ఓడించి తదుపరి ఉన్నత దశకు పోరాటాన్ని తీసుకుపోయి ఒరిస్సాలోని అధిక భాగానికి విస్తరించడానికి పార్టీ తగిన సన్నాహక చర్యలు తీసుకోవడంలోనూ, తగిన పోరాట రూపాలను చేపట్టడంలోనూ ముడిపడివుంది. ❑

# ప్రజా శత్రువులకు భూమ్మీద ఎక్కడా రక్షణ వుండదు!
# గెరిల్లాల చేతుల్లో కిరాతక పోలీస్ అధికారి ఉమేష్‌చంద్ర ఖతం

ఉమేష్ చంద్ర హతమయ్యాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి, ప్రత్యేకించి ఉత్తర తెలంగాణా ప్రజలకు, సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి, మొత్తం విప్లవోద్యమానికే అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఎ.ఐ.జి.) ఉమేష్‌చంద్ర పెద్ద మొత్తంలో బాకీపడ్డ నెత్తుటి అప్పు తీరిపోయింది. ఈ సంవత్సరం సెప్టెంబర్ 4న ఆంధ్రప్రదేశ్ విప్లవ ప్రజల ఆకాంక్షల, డిమాండ్ల మేరకు పనిచేసిన సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి చెందిన ఒక స్పెషల్ గెరిల్లాదళం సంవత్సరాలుగా పేరుకుపోయిన ఈ నెత్తుటి రుణాన్ని తీర్చుకుంది.

రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ నగరం నడిబొడ్డున సెప్టెంబర్ 4వ తేదీ 11 గంటల వేళ పట్టపగలు అత్యంత సాహసోపేతమైన వీరోచిత గెరిల్లా చర్య జరిగింది. ఎ.ఐ.జి. ఉమేష్‌చంద్ర తన బాడీగార్డుతో పాటు ప్రయాణిస్తున్న కారు రద్దీగా వుండే ట్రాఫిక్ కేంద్రంలో సిగ్నల్ కోసం ఆగిపోయి వున్నపుడు గెరిల్లాలు మెరుపువేగంతో దాడిచేసి కారులో వున్న ఇద్దరిని అక్కడికక్కడే చంపేశారు. కాల్పుల్లో గాయపడ్డ పోలీస్ అధికారి తప్పించుకోవాలని పరుగెత్తాడు కాని గెరిల్లాలు జనసమ్మర్దంగా వుండే రోడ్డుపై వెంటాడి అతగాడిని కాల్చి చంపారు. తరువాత గెరిల్లాలు క్షేమంగా వెనుదిరిగారు. పిచ్చెత్తిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రమంత్రటా 'రెడ్ అలెర్ట్' ప్రకటించింది. నగర సరిహద్దులను మూసివేసి నగరం నుండి వెలుపలకు పోతున్న వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేసింది. పలు నివాస ప్రాంతాలలో తనిఖీ చర్యలు చేపట్టింది. కాని గెరిల్లాల జాడల్ని సైతం పసిగట్టలేక పోయింది. గత రెండు సం॥లుగా నగరంలో వరుస నష్టాలతో పార్టీ దెబ్బతిన్నప్పటికీ హైద్రాబాద్‌లో సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్]కి ప్రజల్లో ఎంత పట్టు వుందో ఈ సంఘటన చాటిచెప్పింది.

1993-94లో వరంగల్‌లో అసిస్టెంట్ పోలీస్ సూపరిండెంట్‌గా వుండిన ఉమేష్‌చంద్ర ఉత్తర తెలంగాణాలో తన దుర్మార్గపు రికార్డును మొదలెట్టాడు. అదే జిల్లాలో విప్లవోద్యమ వ్యతిరేక చర్యల అడిషనల్ ఎస్పీగా తన దుష్ట చరిత్రను కొనసాగించాడు. ఈ కాలంలో వరంగల్‌లో విప్లవోద్యమంలోని పలువురు కార్యకర్తలు, కేడర్లూ చంపబడినారు. తర్వాత ఇతగాడు రాయలసీమ రీజియన్ కడపజిల్లా ఎస్పీగా పనిచేశాడు. తిరిగి ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ ఎస్పీగా 1997 జూన్‌లో 'బాధ్యతలు' చేపట్టాడు. 98 ఏప్రిల్‌లో ఇతగాడి ట్రాన్స్‌ఫర్ సందర్భంగా కరీంనగర్ టౌన్‌లో పోలీసులు జరిపిన భయంకర హింసను అదుపు చేయడంలో విఫలమయినందుకుగాను పదవినుంచి సస్పెండ్ అయినాడు. (నిజానికి పోలీస్‌శాఖలోని తన అనుయాయుల ద్వారా కరీంనగర్ పట్టణంలో గూండాగిరీని, లూటీని, విధ్వంసకర చర్యలను ఇతడే రెచ్చగొట్టాడు) కరీంనగర్ పట్టణంలో పోలీసుల విశృంఖలత్వం ఎంత తీవ్రస్థాయికి చేరుకుని ప్రజలకు దిగ్భ్రాంతి కల్గించిందంటే, కరీంనగర్ ఎస్పీతో సన్నిహిత సంబంధాలు కల్గిన చంద్రబాబు నాయుడు సైతం అతగాడిపై సస్పెన్షన్ ఉత్తర్వులను ఆపలేక పోయాడు. అయితే త్వరలోనే 1998 నవంబర్‌లో హైదరాబాద్ డి.జి.పి. ఆఫీసులో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఇతగాడిని తిరిగి నియమించారు.

ఎక్కడి నియమింపబడినా ఇతగాడు బడా భూస్వాములకు, దళారీ బూర్జువా వర్గానికి అతి విశ్వాసపాత్రుడైన కుక్కలాగా సేవ చేశాడు. పీపుల్స్‌వార్ సాయుధ గెరిల్లా దళాలను నిర్మూలించే కేంపెయిన్‌కి నేతృత్వం వహించాడు. వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలను, చివరకు పార్టీ కేడర్లకు తిండి, ఆశ్రయం కల్పించిన సానుభూతిపరులను సైతం చంపివేశాడు. ప్రత్యేకించి పీపుల్స్‌వార్ నాయకత్వాన్నే లక్ష్యంగా చేసుకున్నాడు.

ఇతగాడు కడపజిల్లా ఎస్పీగా వుంటున్నపుడే 'గుట్టపల్లి' ఎన్‌కౌంటర్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥ రెడ్డెప్ప, దక్షిణకోస్తా, రాయలసీమ రీజినల్ కమిటీ సభ్యుడు కా॥ వెంకటస్వామితో పాటు నలుగురు పీపుల్స్‌వార్ ముఖ్య కామ్రేడ్స్‌ను అంతకు ముందు వివిధ ప్రదేశాలలో అరెస్ట్ చేసిన తర్వాత 1998 ఏప్రిల్ 14న గుట్టపల్లెలోనే ఇతడి ఆధ్వర్యంలో కాల్చిచంపారు.

తరువాత కరీంనగర్ ఎస్పీగా పనిచేసిన సం॥రం కంటే తక్కువ కాలంలోనే ఉమేష్ చంద్ర మరింత క్రూరమైన, అసహ్యకరమైన పాత్రను నిర్వహించాడు. ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడైన కా॥ మల్కాపురం భాస్కర్ (రమేష్, విజయ్) హత్యకు దారితీసిన 1998 ఏప్రిల్ నాటి కోవర్ట్ ఆపరేషన్ వెనుక పూర్తిగా పథకమల్లిందీ ఇతగాడే. ఎస్పీ ఆదేశానుసారం, పీపుల్స్‌వార్ మాజీ దళసభ్యుడు జడల నాగరాజు (గతంలో పోలీసులకు లొంగిపోయి జైలునుండి విడుదలయినాడు) తన మునుపటి లొంగుబాటుకుగాను స్వీయవిమర్శ చేసుకున్నట్లుగా నటించి దళంలో చేరాలని గెరిల్లా ఏరియాలలో పనిమీద వచ్చిన వున్నత నాయకత్వంలో ఎవరినయినా సరే ఇతగాడు చంపివేసేటట్లుగా పోలీసులు వీడితో ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారమే ద్రోహి నాగరాజు తన పాత బలహీనతలపై 'పశ్చాత్తాపం' వ్యక్తం చేసిన అనంతరం పీపుల్స్‌వార్ దళంలో తిరిగి చేరాడు. ఏప్రిల్ 11న గెరిల్లాలందరూ గాఢంగా నిద్రపోతున్నపుడు వేకువజామున సెంట్రీ బాధ్యతలోవున్న ఈ కుక్క కా॥ భాస్కర్ ఆయుధాన్ని తీసుకుని గాఢనిద్రలో వున్న అతడిని కాల్చిచంపాడు. తర్వాత ఈ విశ్వాసపాత్ర కుక్క తన యజమాని ఉమేష్‌చంద్రను కలిసేందుకు చీకట్లోనే పరుగుతీశాడు. ఈ 'సాహస' కృత్యానికిగాను ఈ ద్రోహి భారీ మొత్తంలో నగదు బహుమతిని, పోలీస్ రక్షణను, లైసెన్సుగల రివాల్వర్‌ని, హైద్రాబాద్ పోలీస్ క్వార్టర్‌లో షెల్టర్‌ని పొందాడు. ఇదంతా ఉమేష్‌చంద్ర అల్లిన పథకం ప్రకారమే జరిగింది. ఇలాంటి ప్రోత్సహకాల ద్వారా పోలీస్ రక్షణను, చివరకు పోలీస్‌శాఖలో ఉద్యోగాలను కూడా కల్పించటం ద్వారా తాము విప్లవోద్యమం నుండి మరింత మందిని బయటకు లాగగలమని, పీపుల్స్‌వార్ పార్టీ ఉన్నత నాయకత్వాన్ని నిర్మూలించే లక్ష్యంతో కోవర్ట్ ఆపరేషన్‌ను కొనసాగించడానికి వారిని తమ రహస్య ఏజెంట్లుగా నియమించ గలమని ఉమేష్‌చంద్ర, గ్రేహౌండ్స్ బలగాలు, లేక స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు భావించాయి. పదవీకాలంలో ఉమేష్‌చంద్ర రెండు డజన్లకు పైగా పీపుల్స్‌వార్ కేడర్లను, సానుభూతిపరులను 'ఎన్‌కౌంటర్'లలో చంపేశాడు.

రాష్ట్ర రాజధాని నగరం నడిబొడ్డున పీపుల్స్‌వార్ గెరిల్లాలు పట్టపగలు జరిపిన సాహసోపేత చర్య ఉత్తర తెలంగాణాలో, ఆంధ్రప్రదేశ్ ఇతర ప్రాంతాలలో అమరుల రక్తంలో చేతులు ముంచిన క్రూర పోలీస్ అధికార్ల, ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల వెన్నులో వణుకు పుట్టించింది. డి.జి.పి. దొర, అతడి యజమానులైన ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి మాధవ రెడ్డిలు ఒక సం॥రం పైకాలంగా, తాము పీపుల్స్‌వార్ పార్టీకి, ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టాలు కల్గించటం ద్వారా పీపుల్స్‌వార్‌కున్న ఎదురు దెబ్బతీసే శక్తి సామర్థ్యాలను దాదాపు ''తుడిచిపెట్టేశామని'', 60ల చివర్లో శ్రీకాకుళంలో జరిగినట్లుగానే ఇప్పుడు ఉద్యమం తుడిచిపెట్టుకు పోవడానికి మరెంతోకాలం పట్టదని ఇంకా ఇదనీ, అదనీ ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో వర్ణింపనలవికాని అత్యాచారాలు గావించిన తమకు హైద్రాబాద్ ఒక సురక్షిత స్వర్గమని భావిస్తున్న శత్రువు, పోలీస్ ఏజెంట్ల ఆత్మస్థైర్యాన్ని, గత రెండు సంవత్సరాలుగా హైద్రాబాద్ నగరంలో పీపుల్స్‌వార్‌కి జరిగిన వరుస నష్టాలు తాత్కాలికంగా పెంచాయి.

సెప్టెంబర్ 4న గెరిల్లాలకు ఎలాంటి గాయాలు తగలకుండా, చివరకు ఒక్క ఆధారాన్నయినా వదలకుండా అత్యంత జాగరూకతతో, పథకం వేసి అమలు చేయబడిన గెరిల్లా చర్య శత్రువు పెంచుకున్న భ్రమలను పటాపంచలు చేసింది. పలు దినపత్రికలలోని అసంఖ్యాక రిపోర్టులలో, సంపాదకీయాలలో శత్రు శిబిరం నైతిక ధృతి కోల్పోవటం స్పష్టంగా కనిపించింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ విప్లవ ప్రజానీకంలో, ప్రత్యేకించి తన స్వల్ప పదవీకాలంలో ఈ పోలీస్ నియంత పాశవికమైన కేంపెయిన్‌కి గురయిన ఉత్తర తెలంగాణాలో ఈ చర్య ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కల్గించింది.

ఈ సాహసోపేతమైన నగర గెరిల్లా చర్య నిజానికి వర్గ శత్రువులకు, దుర్మార్గులైన పోలీస్ అధికారులకు, పోలీస్ ఏజెంట్లకు సురక్షిత స్థలం ఎక్కడా వుండదని; X, Y, Z కేటగిరీలకు చెందిన ఏ అంగరక్షకులూ వారిని శాశ్వతంగా కాపాడలేరని తేల్చి చెప్పింది. ఎన్ని చిక్కులెదురైనా ప్రజాగెరిల్లాలు శత్రువుల నెత్తుటి అప్పును తీర్చుకోడానికి కృత నిశ్చయులై వున్నారు. సెప్టెంబర్ 4 నాటి యాక్షన్ గెరిల్లాల ఈ కష్ట సహిష్ణుతని, కృతనిశ్చయాన్ని అతి స్పష్టంగా ప్రదర్శించింది. ❑

---

(56వ పేజీ తరువాయి...)

వెయ్యకుండానే వెనక్కి వెళ్ళారు. ఈ విధంగా వేలం వేయించాలని శివయ్య ముఠా 3 సార్లు ప్రయత్నించినా ప్రజలు అడ్డుకున్నారు. ఎలాగైనా వేలం వేయించి, తాము స్వాధీనం చేసుకుందామన్న కుటిల ప్రయత్నాన్ని ప్రజలు అడ్డుకోవడంతో, ప్రభుత్వాధికారులచేత ఆ భూముల్లోకి ఎవరూ దిగవద్దు అని ప్రకటింప చేసారు. అంతేగాకుండా, ఆ భూముల్లోకి ఎవరు దిగినా సహించం అని హెచ్చరించారు. ఆ తర్వాత, మన సంఘనాయకుడు మాల జాన్ ఆ భూమిని దున్నుతుంటే, ప్రతిఘటన పేరుతో ఉన్న శివయ్య ముఠా పట్టుకెళ్ళి, దారుణంగా హింసించి, పోలీసులకు అప్పగించారు. పోలీసులు కూడా జాన్‌ను అక్రమ కేసు క్రింద అరెస్టు చేసారు. గ్రామంలో ఆక్రమించిన భూమిని సాగు చేసుకోవటానికి ఎవరు భూమిలో దిగినా ఇదే జరుగుతుందని హెచ్చరించటానికే శివయ్యముఠా జాన్‌ను ఈపని చేసింది. గ్రామంలో మన సంఘం పేరెత్తితేనే ఏం చేస్తారో అన్న భయానక వాతావరణం నెలకొల్పారు.

ఈ స్థితిలో, గ్రామంలో తన ఆధిపత్యం నిలుపుకోవటం కోసం బుడ్డా అండదండలతో నీచమైన కుట్రలుచేస్తూ, క్రూరంగా దాడిచేయిస్తూ, మన భూపోరాటాన్ని, సంఘాన్ని దెబ్బతీయటం కోసం ప్రయత్నిస్తున్న గాండ్ల శివయ్యను ప్రతిఘటనలో భాగంగా 1998 జూలై 16న మనం చంపాము.

వేంపెంటలో మన నాయకత్వాన జరుగుతున్న పోరాటం, ప్రతిఘటన అది కేవలం వేంపెంటకే పరిమితం కాదని, మిగతా గ్రామాల మీద ఆ ప్రభావం పడి అది ఏరియా మొత్తంమీద తన ఆధిపత్యాన్ని దెబ్బకొడ్తుందని, శివయ్య చావుతో కంగుతిన్న వెంగళరెడ్డి, శివయ్య చావును సాకుగా తీసుకుని అదేరోజు వేంపెంటలో మారణహోమం జరిపించాడు. కొత్త మాదిగపేటను తగులబెట్టించాడు. 9 మందిని అతి దారుణంగా హత్య చేయించాడు. అందులో 5గురు దళితులు, 4గురు బి.సి.లు. వాళ్ళందరినీ మంటల్లో వేసి కాల్చి, కనీసం శవాల ఆనవాలు కూడా లేకుండా చేసారు. గ్రామంలోని మాదిగలు మొత్తంగానూ, మన పార్టీ వాళ్ళుగా గుర్తింపు పొందిన మాలలు, బి.సి.లు. అందరి మీద దాడులు చేసారు. కట్టుబట్టలతో అంతా గ్రామం వదలి పారిపోవలసి వచ్చింది. వాళ్ళ ఇళ్ళు లూటీ చేసారు.

ఈ మారణకాండ ద్వారా ఏరియాలో ప్రజలందరినీ భయకంపితులను చేసి, గ్రామాల్లోని తన ముఠా ఆధిపత్యానికి ఎదురు నిలిస్తే, ప్రతిఘటిస్తే, 'ఇదే గతి' పడ్తుందని ప్రజల్ని హెచ్చరించటానికే, తద్వారా ఏరియాలో తన ఆధిపత్యం నిలుపుకోవటానికే ఇది చేసాడు. ఈ దాడికి ప్రభుత్వం నుండి అన్నిరకాల అండదండలున్నాయి. మన ఉద్యమాన్ని దెబ్బతీయటం కోసం కోవర్టు ఆపరేషన్లు మొదలైన అనేక నీచమైన ఎత్తుగడలు పన్నుతున్న ప్రభుత్వం, అతి నగ్నంగా బుడ్డా వెంగళరెడ్డినే సపోర్టు చేసింది. వేంపెంటలో దాడికి గురైన బాధితులు, అనేక ప్రజాసంఘాలు ఈ మారణకాండకు బాధ్యుడైన వెంగళరెడ్డిని అరెస్టుచేసి శిక్షించాలని ఎంత డిమాండ్ చేసినా, ఉద్యమం నడిపినా కనీసం అరెస్టు చేయలేదు. పైగా వాడి రక్షణకు 4గురు గన్‌మెన్‌లను నియమించింది.

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయడానికి చంద్రబాబు టిక్కెట్టు కూడా ఇచ్చాడు. ఇలా ప్రజా ఉద్యమాలను అణచటానికి కంకణం కట్టుకుని, వేంపెంట మారణకాండ జరిపించటమే కాక, అనేక ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న వీడిని ఈ ప్రాంతంలో ప్రజా ఉద్యమాల అభివృద్ధికి ఒక అవసరంగా దానికనుగుణంగా, ఆత్మకూరు డి.యస్.పి. ఆఫీసుకు ఆనుకుని వుండే ఆర్.అండ్.బి. గెస్టుహౌస్‌లో తన మందీమార్భలంతో, సెంట్రీల పహారా మధ్య వున్న వీడిని పోలీసు దుస్తులలో వెళ్ళిన మన యాక్షన్ దళం ఆగస్టు 11న కాల్చిచంపింది. ఆ సమయంలో, డి.యస్.పి.తో పాటు ఆత్మకూరు డివిజన్‌లోని సి.ఐ.లందరూ పక్కనే వున్న డి.యస్.పి. ఆఫీసులో సమావేశమై వున్నారు. రెండే రెండు నిముషాల్లో ముగిసిన ఈ యాక్షన్ శత్రువును దిమ్మెరపోయేటట్లు చేసింది. వాడు ఎంతటి బలవంతుడైనా, ప్రభుత్వ అండదండలు ఎంతగా వున్నా, ఎన్ని విచ్చుకత్తుల పహారా మధ్య 'రక్షణ'లో వున్నా, ప్రజలు విధించే శిక్ష నుండి ఎవడూ తప్పించుకోలేడని, బుడ్డా వెంగళరెడ్డి చావు మరో మారు రుజువు చేసింది. సాయుధ భూస్వామ్య ముఠాలకి వ్యతిరేకంగా మరింత సమరశీలంగా వర్గపోరాటం తీవ్రతరం చేయటానికి ప్రజలను ఉత్తేజపరచింది. ❑

# వేంపెంటలో దళిత, బలహీన వర్గాలపై జరిగిన మారణకాండకు బాధ్యుడైన బుడ్డా వెంగళరెడ్డి ఖతం!

కర్నూలు జిల్లా ఆత్మకూరు ప్రాంతంలో సాయుధ, భూస్వామ్య ముఠా నాయకుడుగా ఆధిపత్యం చలాయించేవాడు బుడ్డా వెంగళరెడ్డి. వీడు తెలుగుదేశం నాయకుడు కూడా. తన ఆధిపత్యం నిలుపుకోవటం కోసం ఎదుటి ముఠావాళ్ళను చంపటమే కాదు, తన ఆధిపత్యానికి ఏ మాత్రం భంగం కలిగినా సహించడు వీడు. అలా, సారా వేలంపాటలో తనకి పోటీగా పాడాడని గతంలో ఆత్మకూరు సర్పంచ్ హుసేన్ సాహెబ్‌ను చంపాడు. ఇంతకంటే దారుణంగా, తన కారుకు సైడ్ ఇవ్వలేదని, ఇతర కారణాలేమీ లేకుండానే, ఒక లారీ డ్రైవర్‌ను వీడూ, వీడి కొడుకు కాల్చిచంపారు. ఇలా ఎదురులేని సాయుధ భూస్వామ్య ముఠా నాయకుడుగా వున్న వీడికి, ఆత్మకూరు ప్రాంతంలో జరుగుతున్న ప్రజాపోరాటాలు, ముఖ్యంగా భూపోరాటాలు సవాల్‌గా మారాయి. అప్పటిదాకా, గ్రామాలలోని దేవాలయ భూములు, ఇతర ప్రభుత్వ భూములు తమ గుప్పిట్లో పెట్టుకుని అనుభవిస్తున్నారు భూస్వాములు. మన రైతుకూలీ సంఘం ఆధ్వర్యాన కొన్ని గ్రామాల్లో, జనశక్తి (రాజన్న) వాళ్ళ ఆధ్వర్యాన కొన్ని గ్రామాల్లో దళితులు, బలహీన వర్గాలు, ఇతరులు కదలి భూములు ఆక్రమించారు. భూపోరాటం జరిగిన ఎక్కువ గ్రామాల్లో ఆధిపత్యం వెంగళరెడ్డి ముఠాది కావటంతో, భూపోరాటాలు, వీడి ముఠా ఆధిపత్యానికే గండి కొట్టాయి. దీంతో, ఈ భూపోరాటాల్ని దెబ్బతీయటానికి వెంగళరెడ్డి తన ముఠాలోని భూస్వాములతో 'రైతు రక్షణ కమిటీ' ఏర్పాటు చేసాడు. దాని నాయకత్వంలో జనశక్తి వాళ్ళు నడిపిన రేగడి గూడూరు భూపోరాటంలో పాల్గొంటున్న ప్రజలపై దాడి చేయటమేగాక, పోలీసులతో తీవ్ర నిర్బంధం ప్రయోగింపజేసి, ఆ పోరాటాన్ని దెబ్బతీసాడు. వాళ్ళు ఎటువంటి ప్రతిఘటనా చర్యలు చేపట్టక పోవడంతో, అది రేగడి గూడూరు భూపోరాటాన్నే గాక, ఏరియాలో జనశక్తి ఉద్యమాన్నే నీరు కార్చింది. ఇక మన ఉద్యమమే వాడికి అసలు సవాల్‌గా మిగిలింది. వాడి ముఠాలోని భూస్వాములు, పెత్తందార్ల ఆధిపత్యంలో వున్న గ్రామాల్లో మన సంఘాలు ఆ ఆధిపత్యాల్ని ప్రశ్నించటంతో, గ్రామాల్లో వాడి ముఠాలోని నాయకుల ఆధిపత్యం దెబ్బతినటం మొదలైంది. అలా వేంపెంటలో కూడా మొదలైంది.

పాములపాడు మండలంలోని వేంపెంటలో అధికారం (సర్పంచ్ పదవి), ఆధిపత్యం వెంగళరెడ్డి ముఠాదే. మాజీ సర్పంచ్ గాండ్ల శివయ్య ఇక్కడ నాయకుడు. సర్పంచ్ పదవి 'రిజర్వుడు' కావటంతో, 'మాజీగా' ఉన్నా, గ్రామంలో అన్నింటా అసలు ఆధిపత్యం వీడిదే! ఈ గ్రామంలో మనం రైతుకూలీ సంఘం ఆధ్వర్యాన గ్రామంలోని భూమిలేని పేదలను సంఘటితం చేసి, 140 ఎకరాలు దేవాలయం భూమిని ఆక్రమించి, సంఘనాయకత్వాన కుటుంబానికి అర ఎకరం చొప్పున భూమిలేని పేదలకు పంచాము. ఈ భూములన్నీ అప్పటిదాకా శివయ్య ముఠాలోని భూస్వాములు, పెత్తందార్లు అనుభవిస్తున్నవే! ఈ క్రమంలో సంఘం ప్రజల సమస్యలను పంచాయితీల ద్వారా పరిష్కరించుతూ గ్రామంలో బలపడి శివయ్య రాజకీయ ఆధిపత్యానికి గండికొట్టింది. అదేగాక, ప్రతి ఏటా 'కాటా రుసుంగా' వసూలవుతున్న డబ్బుకు లెక్కలు చెప్పమని డిమాండ్ చేసింది. దీనితో తన ఆధిపత్యం నిలుపుకోవటం కోసం, వెంగళరెడ్డి అండదండలతో, గ్రామంలో మన ఉద్యమాన్ని దెబ్బతీయటం కోసం శివయ్య అనేక కుట్రలు చేసాడు. మాల-మాదిగల మధ్య కొట్లాట పెట్టటానికి, మన పార్టీకి వ్యతిరేకంగా మాలల్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించాడు. దాన్లో భాగంగా తన ముఠాకి చెందిన మాల దేవరాజ్‌ను తానే చంపించి, అది మన సంఘంమీదికి, మాదిగలమీదికి తోసి, అక్రమ కేసులు పెట్టించాడు. ఆ హత్య గాండ్ల శివయ్యవాళ్లే చేసి పార్టీమీద, మాదిగల మీద పెట్టారన్న నిజాన్ని అందులో పాల్గొన్న ఒక ముఖ్యమైన వాడి ద్వారానే, విలేఖరుల ముందు, గ్రామంలో ప్రజల ముందు మనం బహిరంగపర్చటంతో ఆ కుట్ర వమ్మయిపోయింది. అప్పుడే, మన నాయకత్వంలో ఆక్రమించి సాగు చేసుకుంటున్న భూములను, పోలీసు నిర్బంధం ద్వారా వేలం వేయించి, తిరిగి తమ స్వాధీనం చేసుకోదలచుకుంటే, పోలీసులకు వెరవకుండా, వేలంపాటలను అడ్డుకుని, ఆక్రమించినవాళ్ళే సాగుచేసుకున్నారు.

దీని తరువాత, వేంపెంటే గాక, ఇంకా కొన్ని గ్రామాల్లో మన సంఘాల్ని, భూ పోరాటాలను దెబ్బతీయటానికి మరింత కుట్ర చేసారు. దాన్లో భాగంగా, ఏదోరకంగా ఈ ప్రాంతంలో తమ ఉనికి చాటుకోవాలనుకుంటున్న జనశక్తి (ప్రతిఘటన) వాళ్ళను చేరదీసి, ముఖ్యంగా వేంపెంటలో శివయ్య తాలూకు గూండాలందరికీ 'ప్రతిఘటనవాళ్ళ రైతుకూలీ సంఘం' వేషం వేశారు. అంటే, సాయుధశక్తి బుడ్డా-శివయ్యలది. మేలి ముసుగు ప్రతిఘటనది. అప్పటినుండీ మన పోరాటాల్ని ప్రతిఘటన 'సంఘం' పేరుతో అడ్డుకునే ప్రయత్నం చేసారు. రైతురక్షణ కమిటీ అంటే భూస్వాములది అని ముద్ర పడింది కనుక, దానికంటే ఇదే ఎక్కువ ఉపయోగపడుతుందని. ఎందుకంటే, బయటినుండి చూచేవాళ్ళకు ఇది రెండు నక్సలైట్ పార్టీలమధ్య గొడవగా కనపడేటట్లు ప్లాన్ చేసారు. అంతేగాక, ఆ సంఘం పేరుతో, మాలకులంలోని 'తన గూండాలనే' ముందుపెట్టి, మన సానుభూతిపరులమీద, ఇతరుల మీద దాడులు మొదలుపెట్టారు. ప్రధానంగా మాదిగల మీద. దీని ఉద్దేశం కూడా, మాల-మాదిగల మధ్య కులఘర్షణగా చిత్రించటానికే! గ్రామంలో జరుగుతున్న పోరాటాన్ని, ఈ విధంగా పక్కదోవలు పట్టించి, నిర్వీర్యపరచటానికే కుట్ర అంతా. ప్రతిఘటన సంఘం ఏర్పాటు చేయించిన దగ్గరనుండీ వాళ్ళచేత ఒక నినాదం ఇప్పించారు. అది పీపుల్స్‌వార్ నాయకత్వంలో ఆక్రమించిన భూముల్ని తాము ఆక్రమించి, పంచుతామని. దీని లక్ష్యం మన భూపోరాటాన్ని, తద్వారా మన ఉద్యమాన్ని దెబ్బతీయటం తప్ప మరేమీ కాదనేది స్పష్టమే! ఘర్షణ వాతావరణమంతా అందుకోసం సృష్టిస్తున్నదే వాళ్ళు. అయినా సమస్య పక్కదోవ పట్టకుండా సంఘం తగిన సంయమనం పాటించింది.

98లో తిరిగి భూములు వేలం వేయటానికి పోలీసులను తీసుకుని అధికార్లు వచ్చారు. ఇప్పుడుకూడా, ప్రజలు సంఘటితంగా నిలబడి, వేలంపాటలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిఘటన సంఘం పేరుతో ఉన్న శివయ్య మనుషులు, డైరెక్టుగా శివయ్య మనుషులు కొందరు వేలంపాటలు జరపాలని డిమాండ్ చేసారు. కానీ, దాన్ని మన సంఘ నాయకత్వంలో ప్రజలు ప్రతిఘటించడంతో, అధికారులు వేలం

***(తరువాయి 55వ పేజీలో...)***

*(60వ పేజీ తరువాయి...)*

బట్ట, గూడు సమస్యలనేగాక, తాగటానికి నీరులాంటి కనీస సౌకర్యాలు కూడా తీర్చకుండా, ప్రజల్ని దగా చేసిన కాంగ్రెస్ 'రైతులకు ఉచిత విద్యుత్ హామీ' పథకంతో ముందుకొచ్చింది. తాము అమలు చేస్తున్న 'దీపం' పథకం (గాస్ స్టౌల పంపిణీ)ను కాంగ్రెస్ వాళ్ళు ఆపేయించారని, అందువలన 'దీపాలార్పే' కాంగ్రెస్‌ను ఓడించి, తమకు ఓట్లేయాలని ప్రచారం చేస్తూ, 'తెలుగుదేశం' దీపంను అడ్డంపెట్టుకుని అప్పటికే 'డ్వాక్రా' పథకం రద్దయిందన్న వాస్తవాన్ని పక్కనబెట్టి, మహిళా ఓటుబ్యాంకును కొల్లగొట్టి గట్టెక్కాలనే ప్రయత్నం ఆరంభించింది.

మహిళల్నొకరు, రైతాంగానొకరు 'ప్రలోభపెట్టి' అధికార పీఠమెక్కాలనే ప్రయత్నమే! వ్యాపారస్తులు రకరకాల ప్రచారాలతో, రకరకాల స్కీములతో (ఒక సబ్బు కొంటే ఒక జేబుగుడ్డ ఉచితం అని) తమ సరుకును చలామణీ చేసుకుని, లాభాలు గడించటానికి ప్రజలకి ఎలాంటి ఆశలు, భ్రమలు కల్పిస్తారో, ఇవాళ ప్రజల్ని 'ఉద్ధరిస్తామనే' పేరుతో రాజకీయ పార్టీలు అలాంటి వ్యాపారమే చేస్తున్నాయి.

ఒక్క ప్రక్క ప్రజలను బిచ్చగాళ్ళుగా చేసే ఆర్థిక విధానాలు అవలంభిస్తూ, ఇంకోప్రక్క ఇటువంటి ఓట్ల పథకాలు ముందుకు తెస్తున్నారు. 50 సంవత్సరాలుగా ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించని పాలకులు, ఇప్పటిదాకా వాగ్దానాల మీద వాగ్దానాలు చేస్తున్న పాలకులు, ఇంకా మౌలిక సమస్యల గురించి చెప్పినా ప్రజల్ని ఆకర్షించటం సాధ్యం కాని పరిస్థితి వచ్చింది గనుక 'దీపాలు, ఉచిత విద్యుత్'లే ప్రధానం చేస్తున్నారు. పార్లమెంటరీ పార్టీల దివాళాకోరు రాజకీయాల ప్రతిబింబమే ఇది.

## పాలకపార్టీల 'శాంతికాముత్వానికి'- 'ప్రజాస్వామ్య ప్రియత్వానికి చిహ్నం'- మూడంచెల పోలింగ్

సాధారణంగా ఎన్నికలు ఒక రోజులో జరిగే ప్రక్రియ. కానీ, 50 సంవత్సరాల ప్రజాస్వామ్య పరిపాలనలో, 12సార్లు లోక్‌సభకు 'ప్రజాస్వామ్య'బద్ధంగా ఎన్నికలు జరుపుకుని, ప్రపంచంలోనే అతిపెద్ద 'ప్రజాస్వామిక దేశం'గా కొనియాడబడుతూ 13వ సారి ఎన్నికలు జరుపుకోబోతున్న మన దేశంలో, పాలకపార్టీలకు శాంతికాముకత్వం, 'ప్రజాస్వామ్య ప్రియత్వం' పెరిగి పెరిగి, విస్తృత 'పోలీసు' బందోబస్తు లేనిదే ఎన్నికలు జరుపుకోలేని స్థాయికి చేరింది. ఈసారి ఎన్నికల కమీషన్ ఎన్నికలను దేశంలో 5 విడతలుగా , రాష్ట్రంలో 3 విడతలుగా నిర్వహించింది. ఒకేసారి నిర్వహిస్తే, 'బందోబస్తు' చాలదనీ, సక్రమంగా ఎన్నికలు నిర్వహించలేమని.

విప్లవకారులు, జాతి పోరాటాలు చేస్తున్న వాళ్ళ ప్రమాదం నుండి 'ఎన్నికలు సజావుగా' జరిపించటానికి కాదు. ప్రజాస్వామికంగా 'పోటీచేసి', ప్రజాస్వామికంగా 'ఎన్నికలలో' మెజారిటీ ఓట్లు సంపాదించి, ప్రజాస్వామికంగా, చట్టబద్ధంగా ఎన్నికవుతున్నాం, అధికారంలో కొస్తున్నాం మీరూ ఇలా రండి అని, 'ఎన్నికలు బూటకం-ప్రజాస్వామ్యం బూటకం' అని చెప్పే విప్లవకారులకి పిలుపులిస్తున్న ప్రజాస్వామ్య ప్రియులైన పాలక పార్టీల బారినుండి, ప్రజాస్వామ్య ప్రక్రియగా చెప్పబడుతున్న 'ఎన్నికల తంతు'ను సక్రమంగా నిర్వహించటానికే.

ఎన్నికల చట్టంలో ఏవైతే చట్టవిరుద్ధం అని రాశారో, ఏవైతే అప్రజాస్వామికం అని చెప్పారో, అవన్నీ, కులమతాల్ని రెచ్చగొట్టడం, డబ్బు వెదజల్లి ఓట్లు కొనడం, సారా ప్రవహింపజేయటం, అన్నిటికీ పరాకాష్టగా దొంగ ఓట్లు వేసుకోవటం, బూత్‌లను ఆక్రమించి రిగ్గింగ్ చేసుకోవటం, ఈ సందర్భంగా ప్రత్యర్థులమీద బాంబుదాడులు చేయటం, హత్యలు చేయటం, అన్నీ ఎన్నికలలో పాల్గొంటున్న పార్టీలన్నీ శక్తి మేరకు చేస్తూ, ఎన్నికల మేడిపండుతనాన్ని చూపిస్తున్నాయి. ఆ మేడిపండుతనాన్ని కప్పిపుచ్చి, అవకతవకలు లేకుండా ఎన్నికల (ప్రజాస్వామ్య) ప్రక్రియను సజావుగా నిర్వహించడానికి, విస్తృత పోలీసు బందోబస్తు అవసరమయి, అలా బందోబస్తు, ఒకే రోజు అన్నిచోట్ల చేయటానికి తగిన సంఖ్య లేదు కాబట్టి, 3 విడతలుగా జరిపి, ఒక చోట నుండి ఇంకొకచోటికి 'బందోబస్తు'ను తరలించే వుంటుందని భావించింది. అయితే, 'తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లుగా' రాజకీయ పార్టీలన్నీ ఈ వెసులుబాటును తమ గూండాలని, రౌడీలను ఒక ప్రాంతం నుండి ఇంకో ప్రాంతం తరలించటానికి చక్కగా వినియోగించుకున్నాయి.

రాష్ట్రంలో మొదటి విడత పోలింగ్‌కు 4 రోజుల ముందుగా, ఒక ప్రక్క హైటెక్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు 'బాంబుల సంస్కృతి'ని వ్యతిరేకించండి అని, తనకూ, తన పార్టీకి బాంబులంటేే తెలియదని, 'రాముడు మంచి బాలుడు' ఫోజులో ఉపన్యాసాలిస్తూ, ఇంకొక ప్రక్క తన పార్టీ యంత్రాంగాన్ని మొత్తం 'ఓట్లు వేయించే' కార్యక్రమానికి సన్నద్ధం చేస్తున్న దశలో, మంత్రి కోడెల ఇంట్లో తెలుగుదేశం వారి బాంబులే పేలి, కోడెల ఇల్లు ధ్వంసం అవటమేకాక, 4 గురు టి.డి.పి. కార్యకర్తలు మరణించారు. ఆ విధంగా రాష్ట్రంలో ఎన్నికల ఆఖరు అంకానికి తెరలేచింది. నరసరావుపేటతో మొదలై, నరసరావు పేటతోనే ముగిసింది. మూడు విడతలుగా కాదు, నర్సరావుపేటతో 4 విడతలుగా ఎన్నికలు జరిగాయి.

ఎన్నికలయిపోగానే, ఎన్నికల కమీషన్ మొదలైన ప్రభుత్వ యంత్రాంగాలన్నీ ఎన్నికలు సజావుగా జరిగాయని, ప్రకటించారు. కానీ, వాస్తవం ఏమిటి? దేశం మొత్తంమీద మన రాష్ట్రంలోనే ఎన్నికలకు డబ్బు విపరీతంగా ఖర్చు పెట్టారని ఒక్క అసెంబ్లీ నియోజకవర్గానికి 50 లక్షల నుండి కొందరు 2 కోట్లు కూడా ఖర్చు పెట్టారని 'లోక్‌సత్తా' వాళ్ళు ప్రకటించారు.

ఓటర్లకు పంచటానికి లక్షల డబ్బులు తీసుకెళ్తున్న కార్లు కొన్ని పోలీసులకు దొరికినాయి. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి వై.వి. రావుకు సంబంధించిన కారు, మంత్రి తుమ్మలకు సంబంధించిన కారు, హైద్రాబాద్ నుండి మహబూబ్‌నగర్ వెళ్తున్న బి.జె.పి. వాళ్ళ కారు. ఎప్పుడూ 'విలువల' గురించి మాట్లాడే బి.జె.పి. వాళ్ళు, పోలీసులు తమ కారును పట్టుకున్నారని తెలియటంతో, ఆ పార్టీ నాయకుడు దత్తాత్రేయ పోలీసులకు సంబంధం లేని దాంట్లో తలదూర్చి, అతిగా వ్యవహరిస్తున్నారని చిందులు తొక్కాడు. ఓట్ల

*(57వ పేజీ తరువాయి...)*

కొరకు నోట్లు పంచటతోపాటు, చీరెలు, రవికెలు, బిందెలు, కొన్ని చోట్ల క్రికెట్ కిట్లు, మొదలైన రకరకాల వస్తువులు పంచారు. ఎన్నికల కమీషన్, ఎన్నికలకు ముందే బ్రాందీషాప్‌లకు సీల్ వేసినా, ఎన్నికల రోజు, ముందురోజులూ రోజుటి కంటె ఎక్కువగా మద్యం పారింది. రాష్ట్రవ్యాప్తంగా దొంగ ఓట్లు పడని పోలింగ్ బూత్ లేదు. 10-12 సంవత్సరాల పిల్లలు కూడా, దొంగ ఓట్లు వేసిన వైనాన్ని పత్రికా విలేఖర్లు రాశారు. హైదరాబాదులో దొంగ ఓట్లు వేసే వాళ్ళని ఒక చోటనుండి ఇంకో చోటుకి పంపించటానికి సెల్‌ఫోన్‌లు, వాకీటాకీలు, పేజర్లు విస్తృతంగా ఉపయోగించారు. దొంగ ఓట్లు వేయించడానికి బి.జె.పి.పార్టీ వాళ్ళు హైద్రాబాద్ నుండి తరలిస్తున్న ఒక మహిళా బృందాన్ని కాంగ్రెస్ వాళ్ళు పోలీసులకు పట్టించారు. 3 విడతలుగా జరిగిన పోలింగ్‌లో, దొంగ ఓట్లు వేసేవాళ్ళని, రిగ్గింగ్ వీరులైన గూండాలని ఒక నియోజకవర్గం నుండి ఇంకో నియోజక వర్గానికి ఒక ప్రాంతం నుండి ఇంకో ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలించారనటానికి ఇది ఒక నిదర్శనం మాత్రమే. రాజకీయ పార్టీలన్నీ, గురివింద గింజల్లాగా, పరస్పరం ఈ ఆరోపణలు చేసుకున్నాయి. ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేకుండా ఏ పార్టికి ప్రాబల్యం వున్నచోట ఆ పార్టీ రిగ్గింగ్‌లు చేసుకుంది. ఎన్నికల కమీషన్ అత్యంత ప్రజాస్వామికంగా సజావుగా ఎన్నికలు జరపటానికి ఐ.జి.లను, ఎస్.పి.లను, డి.యస్.పి.లను, సి.ఐ., ఎస్.ఐ.లను, వేలాదిమంది పోలీసు, పారా మిలటరీ బలగాలను నియమించినా, అక్టోబర్ 3న జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు ఎవరికి ప్రాబల్యం వున్నచోట, అధికారులను ఏదో ఒక విధంగా ప్రభావితం చేయగలిగిన చోట ఎదుటిపార్టీ పోలింగ్ ఏజెంట్లను బయటకు లాగి, శక్తిమేరకు రిగ్గింగ్ చేసుకున్నారు. ప్రత్యేకంగా, బలగాల్ని కేంద్రీకరించి ఎన్నికలు జరిపిన చోటే పరిస్థితి ఇలాగుంటే, బలగాల కేటాయింపు ఇంతగాలేని మిగతా నియోజక వర్గాలలో దొంగఓట్లు, రిగ్గింగ్ ఏవిధంగా జరిగి వుంటుందో వూహించవచ్చు.

బ్యాలెట్ బాక్సులు ఎత్తుకు వెళ్ళటానికి ప్రయత్నించిన కమలాపురం నియోజకవర్గ ఎం.ఎల్.ఏ. వీరశివారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. పర్చూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో, పోలింగ్ బూత్‌లపై 200 మంది అనుచరులతో, ఒంగోలు తెలుగుదేశం ఎం.పి. అభ్యర్థి కరణం బలరాం దాడిచేసి బ్యాలెట్ బాక్సులు ధ్వంసం చేసాడు. బ్యాలెట్ బాక్సుల్లో నీళ్ళు పోయటం, ఇంక్ పోయటం అనేక చోట్ల జరిగాయి. వీటికి పరాకాష్టగా, కడప జిల్లా పోరుమామిళ్ళలో 'రిగ్గింగ్' చేసుకునే విషయమై తెలుగుదేశం, కాంగ్రెస్‌లు గొడవ పడటంతో, పోలీసులు జరిపిన కాల్పుల్లో 4గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ జిల్లాలోనే చలంనాయునిపల్లెలో కాంగ్రెస్‌వాళ్ళు జరిపిన బాంబుదాడిలో తెలుగుదేశం పోలింగ్ ఏజెంట్ చనిపోయాడు. వరంగల్ జిల్లాలో ఎన్నికల సందర్భంగా, కాంగీ కార్యకర్తను తె.దే. వాళ్ళు హత్య చేశారు.

ఈ విధంగా, రాష్ట్రంలో ఎన్నికల్లో పాల్గొన్న పార్టీలన్నీ అత్యంత 'ప్రజాస్వామిక' పద్ధతులను అవలంభించినాయి. ఇటువంటి తప్పుడు పద్ధతులు అవలంభించని పార్టీ, అభ్యర్థి ఒక్కరూ లేరంటే అతిశయోక్తి కాదు. కానీ, రేపు గెలిచిన వాళ్ళంతా చెప్పేది ఒకేమాట, ''మేం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయ్యాం. ప్రజలు మమ్మల్ని ఓట్లేసి గెలిపించారు. ఎన్నుకున్నారు. మాది చట్టబద్ధంగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం'' అని.

ఎన్నికలు జరగటమే ప్రజాస్వామ్యంగా చెప్తూ, ఆ తంతు పేరుతో అధికారంలోకి రావటానికి పాలకవర్గాలు ఎటువంటి పద్ధతులకు పాల్పడుతున్నారో పై విషయాలు తెల్పితే-ప్రజాస్వామ్య ప్రక్రియ జరిపించాం అనిపించుకోవటానికి పాలకవర్గాలు ఎంతటి ఘాతుకాలకి, అప్రజాస్వామిక, ఫాసిస్టు పద్ధతులకైనా సిద్ధపడతాయి అని, 'ప్రజాస్వామికం' అన్న ముసుగును చీల్చుకుని, అతి నగ్నంగా ఫాసిస్టు పద్ధతులు అవలంభిస్తారు అనే విషయం ఉద్యమ ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తర తెలంగాణా, దక్షిణ తెలంగాణా దృశ్యాలు కళ్ళకు కట్టినట్లు చూపుతాయి.

మన పార్టీ ఇచ్చిన ఎన్నికల బహిష్కరణ పిలుపును విఫలం చేయటానికి, ఉత్తర తెలంగాణా, దక్షిణ తెలంగాణాలలో ప్రభుత్వం తీవ్ర నిర్బంధం అమలు చేసింది. మన ఎన్నికల బహిష్కరణ ప్రచారాన్ని కూడా తీవ్ర నిర్బంధం ద్వారా అడ్డుకునే ప్రయత్నంచేస్తూ, వేరొక వంక, 'ఎన్నికలలో ప్రజలచేత ఓట్లు వేయించే బాధ్యత కూడా పోలీసులే' చేపట్టారు. తెలంగాణాలో ప్రజలకు అనేక హక్కులు హరించబడ్డట్లే, ఎన్నికలలో ఓటు వెయ్యాలా? వద్దా? అని తేల్చుకునే ప్రజాస్వామిక హక్కు కూడా హరించబడింది.

మన దళాలు, క్యాంపెయిన్ టీములు ఎన్నికల బహిష్కరణ కార్యక్రమంలో భాగంగా, క్యాంపెయిన్‌లు, గోడరాతలు, పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తే, పోలీసులు పెద్ద ఎత్తున పోలీసు దర్బారులు జరిపారు. ఎన్నికలు బహిష్కరిస్తే, ఆ గ్రామాలకు విద్యుత్, రేషన్, బస్ మొ॥న సౌకర్యాలన్నీ నిలిపివేస్తాం అని ప్రజల్ని బెదిరించారు. వరంగల్ జిల్లాలో యస్.పి. ఠాకూర్, మాజీలు, సంఘ సభ్యులుగా, సానుభూతిపరులుగా పోలీసుల రికార్డుల్లో నమోదై వున్న 300 మందితో, బలవంతంగా హసన్‌పర్తి మండల కేంద్రంలో 'నక్సలిజం నశించాలి-ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి' అని మన పార్టీకి వ్యతిరేకంగా 'నినాదాలు గుప్పిస్తూ, ఊరేగింపులు' తీయించాడు. ఎన్నికలలో పాల్గొంటే, పోలీస్ రికార్డుల్లో వున్న పేర్లు తొలగిస్తాం అని అక్కడి యస్.పి.లు ప్రకటించారు. పాల్గొనమంటే, కేవలం వాళ్ళు ఓట్లు వేయటం కాదు. గ్రామంలో ప్రజలచేత ఓట్లు వేయించడం. ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌లకు సామాగ్రి చేర్చటం దగ్గరినుండి, పోలింగ్ బాక్స్‌లను అవి నిల్వచేసే దగ్గరకు తీసుకుపోవటం వరకు మాజీలు, మిగిలిన యువకుల మీద పెట్టారు. వాళ్ళు ఉంటే మనం దాడి చేయమని, 'వాళ్ళని మానవ కవచాల్లాగ' వాడుకున్నారు.

## మరో విచిత్రం...

ఈ ఎన్నికల్లో అసత్యం అవకాశవాదాల రంగరింపుతో అధికార తెలుగుదేశం కాంగ్రెస్‌పార్టీ మనపార్టీతో రహస్యంగా కుమ్మక్కు

*(58వ పేజీ తరువాయి...)*

అయిందని నేలబారు ఆరోపణలతో ప్రచారానికి లంకించుకొంది. పోలీసుల సహకారంతో కిరాయి హంతకుడు నయీంచేత క్రూరంగా హత్యచేయబడిన బెల్లిలలిత హత్యకి వ్యతిరేకంగా జరిగిన ప్రజాందోళనలో ఆ ప్రాంతపు కాంగ్రెస్‌వారు సైతం గొంతుకలపడం అనేది పెద్ద నేరచర్యలాగా చిత్రిస్తూ కాంగ్రెస్ మన పార్టీతో చేతులు కలిపిందని ఆరోపించాడు చంద్రబాబు. వేంపెంట మారణకాండలో ప్రధాన నేరస్తుడైన బుడ్డా వెంగళరెడ్డిని మనం హతం చేస్తే, మన సహకారంతో కాంగ్రెస్ వాళ్ళే ఆ హత్య చేసారని ఆరోపిస్తూ వెంగళరెడ్డి కొడుకు తదితర తెలుగుదేశీయులు వెంగళరెడ్డి శవంపై ఓట్లు రాజకీయాలు నడిపారు. కరడుగట్టిన నక్సలైట్ వ్యతిరేకి, నరహంతక ఐ.పి.యస్. అధికారి ఉమేష్‌చంద్రని, తెలుగుదేశం సిర్పూర్ శాసనసభ్యుడు పురుషోత్తమరావుని మనం హతం చేయడం; అటుపై పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి, స్టేషన్‌ని ధ్వంసంచేసి, ఐదుగురు పోలీసుల్ని హతం చేసి, తుపాకులు గుంజుకుపోవడం-లాంటి విప్లవ సాహసిక చర్యలను కూడా సందట్లో సడేమియా లాగ ఓట్ల రాజకీయాల్లోకి మలచుకోవడానికి ఈ రెండు పార్టీలు ప్రయత్నించాయి. తామధికారంలోకి వస్తే పీపుల్స్‌వార్ పార్టీపై నిషేధాన్ని పరిశీలిస్తామని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కేంద్ర పరిశీలకురాలు కుముద్‌బెన్‌జోషి (ఆంధ్రరాష్ట్ర మాజీ గవర్నర్) చేసిన ప్రకటనను పురస్కరించుకుని ఎన్నికల్లో గెలవడానికి మన పార్టీతో కాంగ్రెస్ రహస్యంగా కుమ్మక్కయిపోయిందని ఆరోపిస్తూ స్వయానా చంద్రబాబే ప్రచారాన్ని లంకించుకున్నాడు. అబ్బెబ్బే అదేం లేదంటూ వై.యస్. రాజశేఖరరెడ్డి తత్తరపాటు సంజాయిషీలు, వివరణలు ఇచ్చుకున్నాడు.

## ప్రజలకు దూరం అయిపోయిన పాలకులు-వారి ఎన్నికలు

పై ముఖ్య విప్లవ చర్యలతో పాటు వరంగల్‌లో ఒక పోలీసు, ఈస్ట్ డివిజన్‌లో ఒక ఎస్.ఐ. మన చేతుల్లో హతమైపోవడం ప్రభుత్వానికి గుక్కతిప్పుకోనివ్వకుండా చేసినాయి. నిర్బంధం అమలు చేస్తున్న పోలీసులు, విధానాలు రూపొందిస్తున్న నాయకులు బెంబేలెత్తారు. హడావిడిగా, చివరి క్షణాల్లో ఉత్తర తెలంగాణాలో అభ్యర్థులకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ఇచ్చారు. అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారానికి వెళ్తే, 'రక్షణ' కల్పించలేం అని చేతులెత్తేశారు. చివరి క్షణాల్లో ఇది జరగగా, దాదాపు అభ్యర్థులెవ్వరూ ఉద్యమ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేయలేదు. పట్టణాలకి, మండల కేంద్రాలకే పరిమితమయ్యారు. ప్రజలమీద అమలవుతున్న నిర్బంధాన్ని గురించి ఇప్పటిదాకా ఏం మాట్లాడకుండా, ఇప్పుడు ఎన్నికల్లో ఓట్లు వెయ్యమని గ్రామాలకొస్తే, ప్రజలు నిలదీయటమేగాక, తగిన బుద్ధి చెప్తారు అన్న భయంతోటే!

పాలక పార్టీ అభ్యర్థులు గ్రామాలలోకి వెళ్ళి ప్రచారం చేసుకోవటం, వాళ్ళ ప్రజాస్వామిక హక్కని, దానికి పీపుల్స్‌వార్ భంగం కల్గించినట్లుగా, అది అప్రజాస్వామికమని మానవహక్కుల సంఘం వాళ్ళు మాట్లాడారు. ప్రజల పౌరహక్కులు కాలరాస్తున్న పాలకులు, మరల అదే ప్రజలదగ్గరకొచ్చి, మయామాటలు చెప్పే అవకాశం లేకపోవటాన్ని, వాళ్ళ ప్రజాస్వామిక హక్కుకు భంగంగా భావిస్తున్న మేధావుల్ని ఏమనుకోవాలి? పులికీ-మేకకీ ఒకే నీతి సూత్రం చెప్తున్న మహర్షులనుకోవలసిందే!

70 వేలమంది పోలీసులను మోహరించి ఎన్నికలరోజున ప్రజల గుండెలకి తుపాకులు గురిపెట్టి, ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు తెలంగాణాలో. ఈ విధంగా, దేశంలో అసలు సిసలు, ప్రజాస్వామ్యవాదులు, రక్షకులు పోలీసులేనని మరోసారి చాటి చెప్పారు.

రాష్ట్రంలో పీపుల్స్‌వార్ ఎన్నికల బహిష్కరణ పిలుపు విఫలమైందని, ప్రజలు వాళ్ళ పిలుపును ఖాతరు చేయలేదని, 'భయ'పడకుండా ఓటింగ్‌లో పాల్గొని 'ప్రజాస్వామ్యం' పట్ల తమ విశ్వాసం ప్రకటించారని, బుల్లెట్‌పై బ్యాలెట్ విజయం సాధించిందని, డి.ఐ.జి. దొర గొప్పలు చెప్పుకోగా, రాజకీయ పార్టీలు వీపుచరుచుకున్నాయి. కొందరు పత్రికా సంపాదక 'మేధావులు' కూడా సంతసిస్తూ, వ్యాఖ్యానాలు, ఎడిటోరియల్స్ రాసి, సంతృప్తి ప్రకటించారు.

వాస్తవానికి, బుల్లెట్‌మీద బ్యాలెట్ విజయం సాధించిందని వెన్ను చరుచుకుంటున్న వాళ్ళందరూ, ప్రజలకు ఎన్నికలపై భ్రమలు, విశ్వాసం పెంచవలసిన దుస్థితిలోకి నెట్టబడి ఉన్నారు. ఎందుకంటే, దాదాపు 40-50 శాతం మంది ప్రజలు ఎన్నికలలో పాల్గొనటం లేదు. అంతేకాకుండా, ప్రజలు ఎన్నికల పట్ల, ఈ వ్యవస్థపట్ల విశ్వాసం కోల్పోతున్నారు. దానికితోడు ఇవాళ దేశవ్యాప్తంగా విప్లవ పోరాటాలు లేకపోయినా, ఆంధ్ర, బీహార్, దండకారణ్య పోరాటాలు ప్రజల్ని ప్రత్యామ్నాయ వ్యవస్థవైపు ఆలోచింప చేస్తున్నాయి. ఎవరికిష్టమున్నా లేకపోయినా, గుర్తించ వలసిన చేదు నిజం ఇది. ఈ 'చేదు' నిజాన్ని గుర్తించారు కాబట్టే, ఈసారి ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగానూ, రాష్ట్రంలోనూ, ప్రజలందర్నీ ఓటింగ్‌లో పాల్గొనమని లోక్‌సత్తా సంస్థ మొదలు, బూర్జువా మేధావులు, బూర్జువా ప్రసార సాధనాలు, కార్పొరేట్ సంస్థలు పెద్దఎత్తున ప్రచారం చేసినాయి. ఎన్నికల సంస్కరణలు కావాలని లోక్‌సత్తా కొట్లాడినా, ఎన్నికల కమీషన్ మాట్లాడినా, ఎన్నికల ప్రక్రియ పట్ల విశ్వసనీయత పెంచటానికే. అత్యంత అవినీతికర, అప్రజాస్వామిక పద్ధతులలో జరిగిన ఎన్నికలు, అదీ పోలీసు పహారా లేనిదే ఎన్నికల ప్రక్రియ నిర్వహించలేని స్థితిలో ఉన్న పరిస్థితి, ప్రజాస్వామ్య విజయాన్ని చాటుతుందని ఆత్మసంతృప్తి ప్రకటిస్తూ, ఆత్మవంచన చేసుకుంటున్నారు. ప్రజలపై ధనస్వామ్యం, దోపిడీస్వామ్యం గెలిచిందన్న విషయాన్ని మరుగుపరుస్తూ!

కానీ నిత్యం శ్రమచేస్తూ, ఈతి బాధలు పడే ప్రజలకు, పోరాటాలలో పాల్గొంటున్న ప్రజలకు ఇది ఏ 'స్వామ్యమో' తెలియంది కాదు. నిజమైన ప్రజాస్వామికం కొరకు జరిగే పోరాటంలో పాల్గొనకుండా ప్రజల్ని ఎవరూ ఆపలేరు! పోరాట క్రమంలోనే ప్రజలు సాయుధ శక్తులను పెంచుకుని, ఈ ఎన్నికల ప్రజాస్వామ్య ప్రహసనానికి బుద్ధి చెప్పగలరు. ❑

# రాష్ట్ర ప్రజల పాలిట పెద్ద వంచనగానే ముగిసిన ఎన్నికల తీరుతెన్నులు!
## మహిళలను మరింతగా మోసగించడమే ఈ ఎన్నికల ప్రత్యేకత!!

దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలతో పాటు, మరోసారి రాష్ట్రంలో కూడా ఎన్నికల ప్రహసనం ముగిసింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, ఎన్నికల ద్వారా ప్రజలు తమ సేవకులని ఎన్నుకుంటారని, ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గీటురాయి అని, అలా ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య బద్ధంగా, చట్టబద్ధంగా ప్రభుత్వాలను ఎన్నుకుంటున్న మనది అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని హోరెత్తిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన తీరును చూస్తే, ఈ ఎన్నికలు ఎంత ప్రహసనమో, 'ప్రజాస్వామ్యం' ఎంత బూటకమో మరోసారి తేటతెల్లం అవుతుంది.

పార్లమెంట్‌కి అర్ధాంతరంగా ఎన్నికలు రావటంతో, రాష్ట్ర అసెంబ్లీకి కూడా, గడువుకుంటే ముందే (నవంబర్ వరకు అసెంబ్లీకి గడువుంది) సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో ఎన్నికలు జరిగాయి. రాజకీయ పార్టీలన్నీ అధికారం కోసం పెనుగులాటలో భాగంగా, యధావిధిగా 'ప్రజాస్వామ్యాన్ని' నిలబెట్టేందుకు అత్యంత 'ప్రజాస్వామ్యబద్ధంగా' ఎన్నికల పోరాటం చేశారు.

రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో, ప్రధానంగా తెలుగుదేశం-బి.జె.పి. ఫ్రంట్-కాంగ్రేస్ పార్టీలే పోటీపడ్డాయి. ఎన్నికల ముందు మూడవ ప్రత్యామ్నాయం కోసం పెద్ద ఆర్భాటం చేసిన మహాజన ఫ్రంట్ నామినేషన్ల నాటికే ఉనికి కోల్పోయింది. చంద్రబాబుతో పొసగక బయటికి వచ్చి, హరికృష్ణ స్థాపించిన 'అన్న తెలుగుదేశం' కూడా నామమాత్రమే అయింది. ఇక తెలుగుదేశంతో చెడిన సి.పి.ఐ., సి.పి.యం.లు తమ ఉనికిని నిలబెట్టుకోడానికి 'వామపక్ష ఐక్యత' పల్లవి మరోమారు అందుకుని, నాలుగుసీట్లు దక్కించుకునే మార్గాల వేటలో పడ్డారు.

1998 ఫిబ్రవరి పార్లమెంట్ ఎన్నికలపుడు, ఒకరిమీద ఒకరు కత్తులు దూసుకుని, ఒకర్నొకరు తిట్టిన తిట్టు తిట్టుకోకుండా తిట్టుకున్న తెలుగుదేశం-బి.జె.పి. పార్టీలు ఫ్రంట్ కట్టినాయి. అప్పుడు చంద్రబాబును శిశుపాలుడుగా వర్ణిస్తూ, తెలుగుదేశం ప్రభుత్వంపై 'నూరు తప్పుల' చార్జిషీట్ పెట్టిన బి.జె.పి. ఎన్నిరకాల గడ్డినా కరచి, కేంద్రంలో అధికారంలోకి రావాలన్న 'ఏకైక కార్యక్రమంతో' పచ్చి అవకాశవాదంతో చంద్రబాబుతో పొత్తు పెట్టుకుంది. చంద్రబాబుని ఇంద్రుడని, చంద్రుడని పొగడటం మొదలుపెట్టింది.

చంద్రబాబు కూడా 'హైటెక్ ప్రభుత్వం, 'స్వర్ణాంధ్రప్రదేశ్, విజన్ 2020' అని ఎంత ప్రచారం చేసుకున్నా, రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంక్‌కు తాకట్టుపెట్టి, ప్రపంచబ్యాంక్ నంబర్‌వన్ ఏజెంటుగా చంద్రబాబు ఇక్కడ అమలు చేస్తున్న పథకాల దుష్ఫలితాలు (ప్రభుత్వ కంపెనీల మూసివేత, రైతుల ఆత్మహత్యలు మొ॥నవి), ప్రజా వ్యతిరేక విధానాలు (పన్నుల పెంపు, నిర్బంధం) వలన ప్రజలు తిరిగి ఓట్లేస్తారన్న నమ్మకంలేక, 98 పార్లమెంట్ ఎన్నికలలో 12 సీట్లు మాత్రమే రావటాన్ని, దృష్టిలో పెట్టుకుని, ఎన్నికల కొరకు ఆదరణ, రోష్ని మొదలైన పథకాలు మొదలుపెట్టాడు. ఆదరణ పథకం అమలులోనే విఫలం కాగా, మిగిలిన పథకాలు గట్టెక్కిస్తాయనే ధైర్యం చిక్కక, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల తేదీ ప్రకటించబోయే ముందు, హడావిడిగా 'పదిలక్షల గ్యాస్ స్టౌల' పంపిణీ పేరుతో, మహిళా ఓటుబాంక్ కోసం గాలం వేశాడు. అయినా గాని, అప్పటిదాకా మిత్రపక్షాలుగా వ్యవహరించిన సి.పి.ఐ., సి.పి.యం.లు దూరంకాగా, ఒంటరిగా పోటీచేసి నెగ్గుకొస్తాననే విశ్వాసం సడలి, బి.జె.పి.తో పొత్తు పెట్టుకోవలసిన స్థితిలో పడ్డాడు. 1998 పార్లమెంట్ ఎన్నికల ముందు, బి.జె.పి.ని. మతతత్వ శక్తిగా వర్ణించి, ఎన్నికలవగానే, ఆ ప్రభుత్వానికి మద్ధతు పలికిన చంద్రబాబును 'కుటిల రాజనీతి'కి నిదర్శనమే ఈ పొత్తు.

తెలుగుదేశం పార్టీమీద వ్యతిరేకతతో ప్రజలు తమకే ఓట్లు వేస్తారనే ఆశతో గుంటకాడి నక్కలా కాంగ్రేస్ ఎన్నికలకు సిద్ధపడింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, వాళ్ళకి సేవచేయటానికే ఎం.ఎల్.ఏ.లు, ఎం.పీ.లు, రాజకీయ పార్టీలు అని ఎవరికైనా భ్రమలో, నమ్మకాలో ఉంటే అది ఎంత అమాయకత్వమో, లేక ఆత్మవంచనో అభ్యర్థుల ఎంపిక 'కసరత్తులు' ప్రబల నిదర్శనం.

ప్రజాస్వామ్యం పేరుతో అధికారంలోకి రావటం, ఆ అధికారాన్ని ఉపయోగించుకుని ప్రజల్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని అందినకాడికి దోచుకోవటం, ఇంకోమాటలో చెప్పాలంటే, 'చట్టబద్ధంగా' ప్రజల్ని, ఎవరు దోచుకోవాలో తేల్చుకోవటానికే ఎన్నికలు కాబట్టి, గెలిచే గుర్రాలను పందేలలో దించినట్లుగా, ఎన్నికల్లో కూడా గెలుపు గుర్రాలనే రాజకీయ పార్టీలు రంగంలోకి దించాయి. గెలుపే ప్రధానం కాబట్టి, గెలవటానికి వున్న, ఉండాల్సిన అర్హతలున్న వాళ్ళకే టికెట్లు దక్కినాయి. కులాన్ని, మతాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకో గలగటం,-దొంగ ఓట్లు పోల్ చేయించుకోవటం, రిగ్గింగ్ చేయించటం-లక్షలు, కోట్లు డబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెట్టగలగటం-ఓట్లు కొనడం, సారాయి పారించడం మొ॥నవి చేయగలిగిన సత్తా వుందా లేదా అన్నదే గీటురాయి.

### ప్రజల సమస్యలు గాలికి...

ఎన్నికల ప్రచారపర్వం మొత్తం చూస్తే, రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల ఊసే లేదు. రాష్ట్రాన్ని 35 ఏళ్ళు ఏకఛత్రాధిపత్యంగా పాలించి, ప్రజల మౌలిక సమస్యలైన తిండి,

***(తరువాయి 57వ పేజీలో....)***